
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 289

మంగళవారం 9-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సత్తా సరిపోలేదు

దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో భారత్ 72 పరుగుల తేడాతో ఓటమి -స్పోర్ట్స్‌లో



'ఆన్‌లైన్'పై పతంజలి దృష్టి

8 ఈ-కామర్స్ కంపెనీలతో జట్టు. లిస్టులో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, బిగ్ బాస్కెట్ - 14లో

కేంద్రం - రాష్ట్రాల్లో ముందస్తు ఎన్నికలకు ముహూర్తం?

నవంబర్‌లో నగారా!

పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తున్న సీఎం కేసీఆర్

- 'బడ్జెట్' తర్వాత నియోజకవర్గాలపై దృష్టి పెట్టాలని నిర్దేశం
- ఆర్నెల్ల ముందే లోక్‌సభ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో బీజేపీ?
- ఈ ఏడాది ఐదు రాష్ట్రాల అసెంబ్లీ కాలపరిమితి పూర్తి
- ఎనిమిది రాష్ట్రాలకు వచ్చే ఏడాది జూన్‌లోగా ఎన్నికలు

వచ్చే ఏడాది అసెంబ్లీ కాల పరిమితి ముగియనున్న రాష్ట్రాలివీ..

	కాల పరిమితి	ఎన్నికలు జరగాల్సిన సమయం
1. రాజస్తాన్	20.1.2019	డిసెంబర్ 2018-జనవరి 2019
2. ఛత్తీస్‌గఢ్	5.1.2019	డిసెంబర్ 2018-జనవరి 2019
3. మధ్యప్రదేశ్	7.1.2019	డిసెంబర్ 2018-జనవరి 2019
4. సిక్కిం	27.5.2019	ఏప్రిల్-మే- 2019
5. అరుణాచల్ ప్రదేశ్	1.6.2019	ఏప్రిల్ -మే- 2019
6. తెలంగాణ	2.6.2019	మే-జూన్- 2019
7.ఆంధ్రప్రదేశ్	8.6.2019	మే-జూన్- 2019
8. ఒడిశా	11.6.2019	మే-జూన్-2019



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల వేడి రాజుకుంటోంది! కేంద్రంలోని మోదీ సర్కారు ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచన చేస్తోందన్న సమాచారంతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. నవంబర్‌లోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉందంటూ పార్టీ ముఖ్యులను ఇప్పటికే అప్రమత్తం చేసినట్లు తెలిసింది. ''ఈ ఏడాది నవంబర్‌లోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. కేంద్రం ముందస్తు ఎన్నికలకు వెళ్తే అనివార్యంగా మనమూ వెళ్లక తప్పదు. బడ్జెట్ సమావేశాల తర్వాత పూర్తిగా నియోజకవర్గాలపైనే దృష్టి పెట్టండి. ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొందాం. వివిధ సర్వేల్లో మనకు అంతా అనుకూలంగానే ఫలితం వస్తోంది. అక్కడక్కడా చిన్న చిన్న లోపాలున్నా ఈలోగా సర్దుకుందాం. నవంబర్‌లో ఎన్నికలు జరుగుతాయన్న స్పృహతోనే ఉండాలి. అంతా అప్రమత్తంగా పనిచేయాలి..'' అని సీఎం కేసీఆర్ పార్టీ నేతలకు చెబుతున్నట్లు టీఆర్‌ఎస్‌లోని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలు, కులాలు, వర్గాల వారీగా ప్రకటిస్తున్న వరాలు, పార్టీలోకి జరుగుతున్న చేరికలు వంటి అంశాలన్నీ ముందస్తు ఎన్నికల సంకేతాలను చూపుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే వివిధ సర్వేల ద్వారా

మిగతా 5వ పేజీలో ▶

సోమవారం కరీంనగర్ జిల్లా ఎల్‌ఎండీ సమీపంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న కేటీఆర్



ఐటీ@ కరీంనగర్

హైదరాబాద్‌కు దీటుగా తీర్చిదిద్దుతాం: కేటీఆర్

- కరీంనగర్‌లో ఐటీ టవర్‌కు శంకుస్థాపన
- శంకుస్థాపన రోజే 8 కంపెనీల ఒప్పందం
- వెయ్యి మంది యువతకు ఉద్యోగావకాశం

ఒప్పందం చేసుకున్న సంస్థలివే..

- ➤ నివి ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, ఆస్ట్రేలియా
- ➤ ఎస్-2 ఐటీ గ్రూప్ అల్‌పరేటా, అట్లాంటా, అమెరికా
- ➤ టెక్నిక్స్ ఇంటిగ్రేషన్ టెక్నాలజీస్ లిమిటెడ్, అమెరికా
- ➤ వే ఐటీ సొల్యూషన్స్, కరీంనగర్ ➤ డిజిటల్ సర్వీసెస్, కరీంనగర్
- ➤ సంస్కృతి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్
- ➤ టీజే నోవండీ ఎల్‌ఎల్‌పీ, హైదరాబాద్
- ➤ పీఎస్‌ఆర్ సర్వీసెస్, హైదరాబాద్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

రాష్ట్రంలో ఐటీ రంగాన్ని మరింతగా విస్తరిస్తున్నామని, కరీంనగర్‌ను ఐటీకి కేరాఫ్‌గా మార్చుతామని ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు చదువుకున్న చోటే ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. మంత్రి కేటీఆర్ సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని లోయర్ మానేరు డ్యాం (ఎల్‌ఎండీ) సమీపంలో

మిగతా 2వ పేజీలో ▶

'క్యాట్' ఫలితాల వెల్లడి

- వివరాలు 11లో

'ట్రంప'రితనం... మానసిక వ్యాధా?

- అవునంటున్న సైకియాట్రిస్టులు
- ఆయన ట్వీట్లపై ఓ పుస్తకం రాసి విశ్లేషించిన రాచెల్

- వివరాలు 11లో



'పెట్టుబడి'పై ప్రతిపాదనలు 5

పథకం అమలుపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

- కుదరని ఏకాభిప్రాయం.. ప్రతిపాదనలపై నేరుగా రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలని నిర్ణయం
- నేడు జిల్లాకో గ్రామంలో రైతు అభిప్రాయ సేకరణ
- రేపు మళ్లీ భేటీ కానున్న ఉపసంఘం
- మెజారిటీ అభిప్రాయాలనుబట్టి నిర్ణయం
- చెక్కులివ్వడమే మేలంటున్న వ్యవసాయశాఖ
- నేడు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి అత్యవసర భేటీ

సాక్షి, హైదరాబాద్



రాష్ట్రంలోని రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ నుంచి ఎకరానికి రూ. 4 వేల చొప్పున అందించే పెట్టుబడి సాయం పథకం అమలుపై వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఐదు ప్రతిపాదనలను తెరపైకి తెచ్చింది. సోమవారం సచివాలయంలో తొలిసారి జరిగిన ఈ సమావేశంలో రైతులకు చెక్కులివ్వడం, నేరుగా డబ్బులివ్వడం, టీ వ్యాలెట్ ద్వారా అందజేయడం, ఆర్‌టీజీఎస్ ద్వారా ఖాతాల్లో వేయడం, పోస్టాఫీసుల ద్వారా పంపిణీ చేయడం అనే ప్రతిపాదనలను పరిశీలించింది. అయితే వీటిపై మంత్రుల మధ్య ఏకాభిప్రాయం కుదరనందున నేరుగా రైతుల అభిప్రాయాలనే తీసుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం మంగళవారం

మిగతా 6వ పేజీలో ▶

ఏ భాయ్ జర దేఖ్‌కే చలో

- ప్రమాద ప్రాంతాలపై జీపీఎస్ అలర్ట్
- నూతన సాఫ్ట్‌వేర్‌కు పోలీస్ శాఖ యత్నాలు
- ప్రతి వాహనానికీ 'విధిగా జీపీఎస్'దిశగా కసరత్తు
- గూగుల్‌కు 600కుపైగా బ్లాక్ స్పాట్స్..
- 200 మీటర్ల నుంచే అలారంతో అప్రమత్తం

- వివరాలు 5లో

సైబర్ నేరాలు పెరుగుతున్నాయ్!

- రాష్ట్రాల మధ్య సమన్వయం ముఖ్యం
- పోలీసు ఉన్నతాధికారుల సదస్సులో మోదీ -11లో



'స్వలింగ సంపర్కం' నేరమా?

■ స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి సుప్రీంకోర్టు సిఫార్సు చేసింది. దీనిపై విస్తృత ధర్మాసనం చర్చించాల్సిన అవసరముందని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. - వివరాలు 11లో



12 నుంచి 16 దాకా సంక్రాంతి సెలవులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పాఠశాలలకు జనవరి 12 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులుంటాయని పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. జనవరి 17న తిరిగి ప్రారంభమవుతాయని పేర్కొంది. ఈ మేరకు జిల్లాల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

✦ డీఈడీ అభ్యర్థులకు ఊరట

టీఆర్‌టీ పరీక్షకు అనుమతించాలని హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: డిగ్రీలో కనీస అర్హత మార్కులు లేవన్న కారణంతో ఉపాధ్యాయ నియామకపు పరీక్ష(టీఆర్‌టీ)కు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేసిన పలువురు డీఈడీ అభ్యర్థులకు ఊరట లభించింది. వారి పిటిషన్లపై ఉమ్మడి హైకోర్టు సానుకూలంగా స్పందించింది. డిగ్రీలో 45 శాతం మార్కులు సాధించిన ఓసీ, 40 శాతం మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ వర్గాలకు చెందిన డీఈడీ అభ్యర్థుల దరఖాస్తులను స్వీకరించి, టీఆర్‌టీ పరీక్షకు అనుమతించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. డీఈడీ చేసిన అభ్యర్థుల్లో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు డిగ్రీలో 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ అభ్యర్థులు 45 శాతం మార్కులు సాధించి ఉంటేనే టీచర్ పోస్టులకు అర్హులని అధికారులు నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. అయితే, టీఆర్‌టీకి దరఖాస్తు చేసుకున్న పలువురి దరఖాస్తులను, డిగ్రీలో కనీస మార్కులు లేవన్న కారణంతో అధికారులు తిరస్కరించారు. దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించగా ఊరట లభించింది.

✦ 16 నుంచి సర్టిఫికెట్ల తనిఖీ

హైదరాబాద్: టీఎస్‌సెట్–2017లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 16 నుంచి 21 వరకు సర్టిఫికెట్ల తనిఖీ చేపట్టనున్నట్లు సెట్ సభ్యకార్యదర్శి యాదగిరిస్వామి సోమవారం తెలిపారు. ఓయూ దూరవిద్య కేంద్రంలోని సెట్ కార్యాలయంలో వెరిఫికేషన్ జరగనున్నట్లు వెల్లడించారు.

✦ నేడు సీడీపీవో/ఏసీడీపీవో ప్రాథమిక కీ

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 4న నిర్వహించిన సీడీపీవో/ఏసీడీపీవో పోస్టుల రాత పరీక్ష ప్రాథమిక కీని మంగళవారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు టీఎస్‌పీఎస్సీ సోమవారం తెలిపింది. ఈ నెల 11 నుంచి 17 వరకు కీ పై అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు పేర్కొంది.

✦ పండుగ తర్వాత నోటిఫికేషన్లు

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీల్లో 1,061 అధ్యాపక పోస్టులకు సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్లు జారీ చేసే అవకాశం ఉందని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు అవసరమైన చర్యలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

✦ 12 నుంచి ఎన్‌ఐవోఎస్ కాంటాక్టు తరగతులు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 24 వరకు దూరవిద్య డీఎడ్ కోర్సు చదువుతున్న అభ్యర్థులకు కాంటాక్టు తరగతులు నిర్వహించనున్నట్లు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్‌ఐవోఎస్) రాష్ట్ర కో–ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు సోమవారం తెలిపారు. తరగతులు సెలవు దినాల్లో ఉంటాయని పేర్కొన్నారు. శిక్షణ పొందే అభ్యర్థులు స్వయం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

✦ తెలంగాణ భవన్ ఆర్సీగా అశోక్‌కుమార్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ (ఆర్సీ)గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి.అశోక్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భవన్ అదనపు ఆర్సీ వేదాంతం గిరి, సహాయ కమిషనర్ రామ్మోహన్, భవన్ అధికారులు, సిబ్బంది అశోక్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జయేశ్ రంజన్


✦ పీపీపీపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో కొత్త కోర్సు

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్‌ఎస్) అధికారుల కోసం పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంపై ప్రత్యేక కోర్సును సోమవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) ప్రారంభించింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కోర్సుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఎఫ్‌ఎస్ అధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పీపీపీ విధానం ద్వారా నాణ్యమైన సేవలు లభిస్తాయని, భారీ రాబడులు వస్తాయన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి పీపీపీ విధానం ఎంతో ఉపయోగకరమన్నారు. టీఎస్‌ఎఫ్‌డీసీ సీఎండీ చందన్ మిత్ర, ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డీన్ డాక్టర్ గౌతం పింగిల్, అసోసియేట్ ప్రొఫెసర్ గోవింద్‌రాజులు పాల్గొన్నారు.

దళితులంటే చంద్రబాబుకు ఎలాంటి అభిప్రాయం ఉందో అందరికీ తెలుసు

56వ రోజు

08–01–2018, సోమవారం
పూతలపట్టు శివారు, చిత్తూరు జిల్లా.



ఈ రోజు తేనెపల్లి దగ్గర 108 అంబులెన్స్ కనిపించింది. వెంటనే నాన్నగారు గుర్తుకొచ్చారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా అందరి మన్ననలు పొందిన అతిగొప్ప పథకమది. కానీ నేడు పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపిస్తోంది. ఆ అంబులెన్స్ పక్కనే ఆ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు నిలుచున్నారు. వారు నా దగ్గరకు వచ్చి 'సార్.. మీ నాన్నగారి వల్లే మాకు ఉద్యోగాలొచ్చాయి. అప్పట్లో మాకు ఏ ఇబ్బందీ ఉండేది కాదు. కానీ ఇప్పుడు మా పరిస్థితి చాలా దారుణంగా ఉంది. కొద్ది సంవత్సరాలుగా జీతాలు పెంచడం లేదు. మూడు నెలలుగా అసలు జీతాలే ఇవ్వడంలేదు. చాలా అంబులెన్స్‌లు మూలనపడ్డాయి. ఉన్నవాటిలో సౌకర్యాలు కూడా సరిగా లేవు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండానే చాలా వాహనాలను నడిపిస్తున్నారు. ఉద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయి. దాదాపు పది సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్నాం. ఇప్పుడు వేరే ఉద్యోగాలకు వెళ్లలేము. ఇలాంటి పరిస్థితులొస్తాయని కలలో కూడా ఊహించలేదు. మీ నాన్నగారి మీద అభిమానంతో, మీమీద నమ్మకంతో.. మిమ్మల్ని కలవడానికి వచ్చాం'అన్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రజలకు అత్యవసర సేవలందిస్తూ.. ఎన్నో ప్రాణాలను కాపాడుతూ.. పేదల పాలిట సంజీవనిగా పేరొందిన పథకం ఈ స్థితికి చేరుకోవడం చాలా బాధనిపించింది. నాన్నగారు ఈ పథకాన్ని ప్రారంభించి అద్భుతంగా సేవలందించడం చూసి.. దానిని ఆదర్శంగా తీసుకుని దేశంలోని దాదాపు 20కి పైగా రాష్ట్రాల్లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ఈ పథకం ప్రారంభమైన మన రాష్ట్రంలో తప్ప, మిగతా అన్ని చోట్లా విజయవంతంగా నిర్వహింపబడటం.

దీనికి కారణం.. ఎంతో పవిత్రమైన ఆశయంతో, సేవా దృక్పథంతో ప్రారంభమైన ఈ పథకాన్ని కూడా నేటి మన పాలకులు వ్యాపారమయం చేసి అవినీతి ఆదాయ మార్గంగా మలచుకోవడం ఒకటైతే, 108 అనగానే రాష్ట్ర ప్రజలందరికీ నాన్నగారే గుర్తొస్తారు కాబట్టి ఈ పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం మరొకటి.

యాత్ర ముగిసే సమయంలో కుప్పం నియోజకవర్గానికి చెందిన దళితులు కలిశారు.'సార్.. మాది గుడిపల్లి మండలం సోడిగానిపల్లి గ్రామం. మా దళితవాడలో మాల గెరిగమ్మ, సూద్ర గెరిగమ్మ అనే దేవాలయాలున్నాయి. ఆ గుడులకు చెందిన విలువైన భూములను టీడీపీ వాళ్లు కబ్జా చేసి, ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. అధికారుల చుట్టూ, కలెక్టర్ చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోవడంలేదు'అన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి నియోజకవర్గంలో.. దళితులు ఎంతో భక్తితో కొలిచే దేవాలయాలకు చెందిన భూముల్ని ఆయన అనుచరులే ఆక్రమించుకుని అమ్ముతుంటే.. ముఖ్యమంత్రిగారు దానిపై చర్యలు తీసుకోకపోవడం అత్యంత శోచనీయం. అయినా దళితులంటే ఆయనకు ఎలాంటి అభిప్రాయముందో అందరికీ తెలిసిందే. మొన్నటికి మొన్న జెర్రిపోతులపాలెంలో దళిత మహిళపై జరిగిన దాష్టీకాన్ని ఇంకా ప్రజలెవరూ మరువలేదు. ఆఖరికి 'అవినీతికి కాదేదీ అనర్హం'.. అన్నట్లుగా గుడి భూములను సైతం వదలడంలేదు. మొన్న సదావర్తి భూములను తన బినామీల ద్వారా మింగాలని చూశారు. చివరికి కనకదుర్గమ్మ గుడి భూములనూ వదల్లేదు. మీరే ఇలా ఉంటే.. ఇక మీ అనుచరులు ఎలా ఉంటారు?! ఆవు చేలో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా?

చివరిగా, ముఖ్యమంత్రి గారికి నాదో ప్రశ్న.. రాజధాని మొదలుకుని మీ బినామీలకు కట్టబెట్టిన అనేక ప్రాజెక్టులలో సరైన పరిహారం కూడా ఇవ్వకుండా దళితుల భూములను బలవంతంగా లాక్కోవడం నిజం కాదా? 'దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా..'అన్న మీ నుంచి ఇంతకన్నా ఏం ఆశిస్తారు..?

వై.యస్. జగన్.



కొండారెడ్డిపల్లె క్రాస్ వద్ద వైఎస్ జగన్‌కు నాగలిని బహూకరిస్తున్న అభిమాని

కరీంనగర్ @ ఐటీ

▶ మొదటి పేజీ తరువాయి

రూ.25 కోట్లతో చేపట్టిన ఐటీ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి ఐటీ ఎగుమతులు రూ.56 వేల కోట్ల మేర ఉండగా.. గతేడాది నాటికి రూ.87 వేల కోట్లకు చేరాయని కేటీఆర్ చెప్పారు. ఐటీ రంగంలో వేల సంఖ్యలో ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. తెలంగాణ యువతకు ఐటీ ఉద్యోగాలు కల్పించేందుకు కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్‌లలో ఐటీ టవర్లను నిర్మిస్తున్నామని తెలిపారు. కరీంనగర్‌లో ప్రస్తుతం నిర్మించనున్న టవర్‌తో పాటు మరో టవర్ కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఐటీ కంపెనీలను రాష్ట్రమంతటా విస్తరిస్తామన్నారు.

శంకుస్థాపనతోనే 8 కంపెనీల ఒప్పందాలు

కరీంనగర్ ఐటీ టవర్ పనులకు శంకుస్థాపన చేసిన రోజునే కాసర్ల నాగేందర్‌రెడ్డితోపాటు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు స్థాపించిన 8 విదేశీ కంపెనీలు ఒప్పందం చేసుకోవడం గర్వకారణమని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఐటీ టవర్‌ను ఏడాదిలో పూర్తిచేసి.. ప్రారంభం రోజే 1,000 మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. అమెరికాకు వెళ్లి అక్కడ స్థిరపడ్డ మన ప్రాంతానికి చెందిన వారితో మాట్లాడుతామని, మరిన్ని కంపెనీలు తీసుకొస్తామని తెలిపారు. అందుకోసమే మరో ఐటీ టవర్‌ను నిర్మించనున్నట్లు వెల్లడించారు. దేశంలో 50 శాతం జనాభా 27 ఏళ్లలోపు యువతేనని, 65 శాతం జనాభా 35 ఏళ్లలోపు వారేనని.. ప్రపంచంతో పోటీపడే పౌరులుగా మనం తయారుకావాలని పిలుపునిచ్చారు.

ఉపాధిని సృష్టించాలి

ప్రపంచంలో ప్రముఖమైన 100 కంపెనీలకు భారతీయులే నాయకత్వం వహిస్తున్నారని మంత్రి కేటీఆర్ చెప్పారు. వాటికి భారతీయులు మేధో సంపత్తిని, నైపుణ్యాన్ని ధారపోస్తున్నారన్నారు. విదేశాల్లో ఐటీ కంపెనీలను నెలకొల్పడంలో తెలంగాణ ఇంజనీర్ల పాత్ర కీలకమన్నారు. హైదరాబాద్ తర్వాత వరంగల్, కరీంనగర్‌లను అవకాశాలకు గమ్యంగా మార్చుతామని, అమెరికాలోని మనవాళ్లు ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా ప్రయత్నిస్తామని తెలిపారు. యువత ఉద్యోగం చేసేవారుగానే ఉండిపోకుండా.. ఉన్నతమైన, కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తూ ఉద్యోగాల సృష్టికర్తలుగా ఎదగాలని కేటీఆర్ ఆకాంక్షించారు. యువతకు నాణ్యమైన శిక్షణ కల్పిస్తే ఉపాధి కల్పన సాధ్యమవుతుందని.. ఇందుకోసం తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టాస్క్)ను, టీ–హబ్‌ను కొత్తగా నిర్మించే జరిగే ఐటీ టవర్‌లో నెలకొల్పుతామని తెలిపారు.



ఐటీ టవర్ నిర్మాణానికి భూమి పూజ చేసి గునపంతో మట్టి తవ్వుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి ఈటల, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల, రసమయి తదితరులు

ఆశయాలకు తగ్గట్టు పనిచేస్తున్నాం

రాష్ట్ర ప్రజల ఆశయాలకు తగినట్టుగా ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని కేటీఆర్ చెప్పారు. కరెంటు కష్టాలను జయించామని.. కేవలం మూడున్నరేళ్లలో దేశంలోనే సులభతర వాణిజ్య విధానమున్న రాష్ట్రంగా ఎదిగామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ శ్రమతో ఆర్థికవృద్ధి రేటు పెరిగిందని.. దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఆవిర్భవించిందని చెప్పారు. త్వరలోనే మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు, ప్రతీ ఎకరానికి సాగునీరు అందివ్వబోతున్నామని తెలిపారు.

ఐటీ, వాటర్‌హబ్‌గా కరీంనగర్: ఈటల

అభివృద్ధిలో కరీంనగర్ తెలంగాణకు ఆదర్శం కాబోతోందని మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఐటీ టవర్ల ఏర్పాటుతో హైదరాబాద్‌తో సమానంగా కరీంనగర్‌లో అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణ యావత్తుకు నీరందించే జిల్లాగా కరీంనగర్ ఉంటుందని పేర్కొన్నారు. కాగా సభలో ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్, సోమారపు సత్యనారాయణ, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, భానుప్రసాద్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందం చేసుకున్న సంస్థలివే

- ➢ నివి ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా
- ➢ ఎస్–2 ఐటీ గ్రూప్ అల్‌పరేటా, అట్లాంటా, అమెరికా
- ➢ టెక్నిక్స్ ఇంటిగ్రేషన్ టెక్నాలజీస్ లిమిటెడ్, టెక్సాస్, అమెరికా
- ➢ వే ఐటీ సొల్యూషన్స్, కరీంనగర్
- ➢ సంస్కృతి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్
- ➢ టీజే నోవండీ ఎల్‌ఎల్‌పి, హైదరాబాద్
- ➢ పీఎస్‌ఆర్ సర్వీసెస్, హైదరాబాద్
- ➢ డిజిటల్ సర్వీసెస్, కరీంనగర్

రిసోర్స్ పర్సన్స్‌కు వీఏవోలతో సమానంగా వేతనాలు

మహిళా సంఘాలను ముందుండి నడిపిస్తున్న రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)లకు వీఏవోలతో సమానంగా వేతనాలు అందిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. సోమవారం కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని రిసోర్స్ పర్సన్లందరికీ దీనిని వర్తింపజేయాలని, ఈ మేరకు ఫైలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక మెప్మా ఉద్యోగులకు ఇంటి అద్దె (హెచ్‌ఆర్) పాలసీని అమలు చేస్తామని ప్రకటించారు.

టీఆర్‌ఎస్ సర్కారును ఎండగడతాం

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర: ఉత్తమ్

- 40 రోజుల పాటు 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తాం
- కాంగ్రెస్‌లో చేరేందుకు సంప్రదింపులు జరుపుతున్నారు
- కేటీఆర్‌కు ఇసుక మాఫియా హత్యలు కనిపించవా?
- గవర్నర్ వంటివారూ ఈ చర్యలను సమర్థిస్తే ఎలా?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టీఆర్‌ఎస్ పాలనను ఎండగట్టేందుకు, కాంగ్రెస్ పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు త్వరలో బస్సు యాత్ర చేపట్టనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. 40 రోజుల పాటు రోజుకు 3 నియోజకవర్గాల్లో యాత్ర చేపడతామన్నారు. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాల్లో పర్యటించి.. ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళతామని చెప్పారు. టీఆర్‌ఎస్ మునిగిపోయే నావ అని, దాని నుంచి బయటపడటానికి చాలామంది ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తమ్ సోమవారం గాంధీభవన్‌లో ఇష్టాగోష్టిగా మీడియాతో మాట్లాడారు. సమష్టి కృషితో వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు.

కేసీఆర్‌పై ప్రజల్లో వ్యతిరేకత

టీఆర్‌ఎస్‌లో ఎక్కువ చెత్త నిండిపోయిందని, కేసీఆర్ పనితీరు బాగాలేదని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్‌తో పాటు పలు పార్టీలకు చెందిన ముఖ్య నేతలు చాలామంది కాంగ్రెస్‌లో చేరడానికి సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లోకి ఎవరు వచ్చినా షరతులు లేకుండానే చేరుతున్నారని.. తమతో మాట్లాడుతున్న నాయకులకు కూడా ఇదే విషయం చెబుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఏ సర్వే జరిగినా, ఎవరు మాట్లాడినా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్న విషయం తెలుస్తోందన్నారు.

నెలాఖరులో టీపీసీసీ, డీసీసీల పునర్వ్యవస్థీకరణ

టీపీసీసీ, డీసీసీల పునర్వ్యవస్థీకరణను ఈ నెలాఖరులో చేపడతామని, ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టీపీసీసీ ఏర్పాటు ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం కమిటీలో ఉన్న కొందరు పనిచేయడానికి ఇష్టపడటం లేదని, పార్టీలో మరికొందరు పనిచేయడానికి ఉత్సాహంగా ఉన్నారని చెప్పారు. పనిచేసేవారికి అవకాశాలు ఇస్తామని, పనిచేయలేని వారిని తొలగిస్తామని వెల్లడించారు. టీపీసీసీలో పాత జిల్లా యూనిట్‌గా జిల్లాకు ఒక ఉపాధ్యక్షుడు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, 12 మంది కార్యదర్శులకు అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలోకి, ఏఐసీసీలోకి రాష్ట్రం నుంచి పలువురికి అవకాశాలు ఉంటాయని చెప్పారు. వాటితోపాటు ఎన్నికల ప్రచార కమిటీ, మేనిఫెస్టో కమిటీలను కూడా ప్రకటిస్తారని వెల్లడించారు.

రాహుల్‌తో ప్రత్యేక సమావేశాలు

పార్టీపరంగా కార్యాచరణ ప్రణాళికపై భేటీ అయ్యేందుకు రాహుల్‌గాంధీ ఈ నెలాఖరులో సమయం ఇచ్చారని ఉత్తమ్ వెల్లడించారు. అయితే తాము మేడారం సమ్మక్క–సారక్క ఆలయానికి వెళ్లాలని అనుకుంటున్నామని.. అందువల్ల దానికన్నా ముందో, తర్వాతో భేటీ ఉండేలా యోచిస్తున్నామని తెలిపారు.

ఇసుక మాఫియా ఆగడాలు కనిపించడం లేదా?

సూటు బూటు వేసుకుని ఇవాంకాతో తిరగడం తప్ప మంత్రి కేటీఆర్‌కు రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు, హత్యలు కనిపించవా అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కామారెడ్డి జిల్లాలో ట్రాక్టర్ ఢీకొని మరణించిన సాయిలు కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం గాంధీభవన్‌లో ఉత్తమ్‌ను కలిశారు. వంతుల వారీగా సాయిలు వీఆర్‌ఏగా పనిచేస్తున్నాడంటూ.. సంబంధిత గుర్తింపు బిళ్ల, హాజరు పట్టికను వారు ఉత్తమ్‌కు, మీడియాకు చూపించారు. తమను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలకు హద్దులేకుండా పోయిందని ఈ సందర్భంగా ఉత్తమ్ మండిపడ్డారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం, పోలీసులు, అధికారులతో పాటు గవర్నర్ కూడా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు మద్దతు పలికేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. సాయిలు వీఆర్‌ఏ కాదంటూ గవర్నర్ కూడా మాట్లాడటం బాధాకరమని వ్యాఖ్యానించారు. మంత్రులు, అధికారులతో పాటు రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన వారు కుమ్మక్కైతే ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని పేర్కొన్నారు. సాయిలు మరణానికి కారణమైన ట్రాక్టర్ యాజమానిపై హత్య కేసు నమోదు చేయాలని.. సాయిలు కుటుంబ సభ్యులకు రూ.25 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ఉస్మానియాలో సభ నిర్వహిస్తాం

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సభకు అనుమతి అడుగుతున్నామని, ఇస్తే బహిరంగ సభ నిర్వహిస్తామని ఉత్తమ్ తెలిపారు. సర్పంచ్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలే మంచిదని, పరోక్ష ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ఉండకపోవచ్చని చెప్పారు. పునర్విభజన కోసం టీఆర్‌ఎస్ ఒత్తిడి తెస్తోందని, దానిపై పార్టీలో చర్చించాక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాగా ప్రస్తుతానికి టీపీసీసీ అధ్యక్షులను కొనసాగించాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో.. పలువురు పార్టీ నేతలు ఉత్తమ్‌కు శాలువాలు కప్పి సన్మానించారు. గాంధీభవన్‌లో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకొన్నారు.

మహిళలు లేని కేబినెట్ ఇదొక్కటే..

దేశంలో మహిళా మంత్రులు లేకుండా కొనసాగుతున్న కేబినెట్ తెలంగాణ ఒక్కటేనని ఉత్తమ్ విమర్శించారు. సోమవారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణలతో కలసి గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. మహిళలకు, సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని ఈ సందర్భంగా ఉత్తమ్ పేర్కొన్నారు. 15 రోజుల్లోగా మహిళా కాంగ్రెస్ కమిటీలను పూర్తిచేయాలని ఆదేశించారు. మహిళా సాధికారతపై టీఆర్‌ఎస్ మాట్లాడేది ఎక్కువని, చేసేది తక్కువని మండిపడ్డారు.

బీసీ ఐటీ వింగ్ అధ్యక్షుడిగా సంతోష్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ ఐటీ వింగ్ అధ్యక్షుడిగా సంతోష్ మేడిపల్లిని నియమించినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేత, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇదండీ సంగతి



...స్టేషన్‌తో పాటు వీళ్లకూ వేస్తున్నాం సార్!

'రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించండి'

హైదరాబాద్: జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజు తిరిగి చెల్లించాలని పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులు ఓయూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 3 నుంచి 7 వరకు జరగాల్సిన సైన్స్ కాంగ్రెస్ మణిపూర్‌కు తరలిపోవటంతో రూ.2000, రూ.1500, రూ.1000 చెల్లించిన వారు తిరిగివ్వాలని కోరారు. సుమారు 13,500 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు సమాచారం.

బిల్లు కట్టలేక.. ఏం చేయాలో పాలుపోక..

జూబ్లీహిల్స్ ప్రమాద బాధిత కుటుంబాల దయనీయ స్థితి

- రూ.వేలల్లో ఇద్దరు క్షతగాత్రుల హాస్పిటల్ బిల్లులు
- ఆ మొత్తం చెల్లిస్తే కానీ డిశ్చార్జ్ చేయని పరిస్థితి
- తమ వల్ల కాదంటున్న 'అనూష' కుటుంబీకులు
- తలలు పట్టుకుంటున్న పోలీసు అధికారులు



హైదరాబాద్

ఆ ముగ్గురూ దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే. వీరిలో ఇద్దరికి తల్లిదండ్రులు సైతం లేకపోవడంతో సంరక్షకులే దిక్కయ్యారు. వీరంతా బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చిన వారే. ఆదివారం జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లో జరిగిన ప్రమాదంలో మస్తానీ మరణించగా... అనూషరెడ్డి, అనూష ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆస్పత్రి బిల్లులు ఇప్పటికే రూ.వేలల్లో ఉండటంతో చెల్లించడం తమ వల్ల కాదంటూ క్షతగాత్రుల సంబంధీకులు వాపోతున్నారు. స్వస్థలాలకు తీసుకెళ్లి, తాహతుకు తగిన ఆస్పత్రిలో చేరుస్తామని వీరంటుంటే... బిల్లు కట్టనిదే డిశ్చార్జ్ చేయలేమని ఆస్పత్రి వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో పోలీసులు ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.

భర్తకు దూరమైన అనూషరెడ్డి...



కోమాలో ఉన్న అనూష రెడ్డి పరిస్థితి మరీ దారుణం. రాజమండ్రికి చెందిన ఈమె చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోగా... అన్న వరసయ్యే వ్యక్తి చేరదీశారు. కొన్నాళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది. తన ఇద్దరు పిల్లల్నీ సమీప బంధువుల వద్ద ఉంచి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జూనియర్ ఆర్టిస్టుగా పని చేస్తోంది. ఈమె చికిత్స ఖర్చు ఇప్పటికే రూ.లక్ష దాటిందని ఆస్పత్రి వర్గాలు చెప్తున్నాయి. సోమవారం సాయంత్రం వరకు సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో స్నేహితులే ఆమె దగ్గరున్నారు. దీంతో పోలీసులకు కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. సోమవారం సాయంత్రం ఆమె సమీప బంధువు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. రూ.లక్షల్లో బిల్లు చెల్లించలేనని, డిశ్చార్జ్ చేస్తే తమ స్వస్థలానికి తీసుకెళ్లి వైద్యం చేయించుకుంటామని చెప్తున్నారు.

ఉద్యోగం కోసం వచ్చిన అనూష...



రాజమండ్రికి చెందిన అనూష సైతం చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని కోల్పోయింది. పిన్ని వద్ద ఉంటూ ఇంటర్ వరకు చదివింది. ఉద్యోగం కోసం నగరానికి వచ్చి ప్రమాదానికి గురైంది. సోమవారం నాటికి ఈమె వైద్య ఖర్చుల బిల్లు రూ.40 వేలు అయింది. అతికష్టంమ్మీద ఆ బిల్లు చెల్లించిన ఆమె బంధువులు.. అనూషను తమ వెంట తీసుకువెళ్లారు.

'బీమా' కూడా రాదు...

బిల్లులపై పోలీసులు ఆస్పత్రి వర్గాలను సంప్రదించగా, కొంత మొత్తం తగ్గించగలమని, పూర్తిగా రద్దు చేయలేమన్నారు. ప్రమాదానికి కారకుడైన విష్ణువర్ధన్ జైల్లో ఉండటంతో అతడినీ సంప్రదించే ఆస్కారం లేకుండా పోయింది. మద్యం మత్తులో యాక్సిడెంట్ చేశారు కాబట్టి వాహన ఇన్సూరెన్స్ సైతం క్లైమ్ అయ్యే పరిస్థితి లేదని పోలీసులు పేర్కొంటున్నారు. అనూషరెడ్డి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని వైద్యులు వెల్లడించారు. విష్ణువర్ధన్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు సోమవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఆయనకు కోర్టు రెండు వారాల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. సిటీలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులుగా మారుతున్న అనేక మంది పరిస్థితులూ ఇలానే ఉంటున్నాయని, తమ తప్పు లేకపోయినా వారే శిక్ష అనుభవించాల్సి వస్తోందని పోలీసులు చెప్తున్నారు.

బిల్లు చేతిలో పెట్టారు...



జూనియర్ ఆర్టిస్ట్ మస్తానీ భర్త సురేశ్ తాడేపల్లిగూడెంలో ఓ చిన్న ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ నిర్వహిస్తున్నారు. భార్య మృతి విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం ఆస్పత్రికి చేరుకున్నారు. మస్తానీ ఆస్పత్రికి తరలించేలోపే చనిపోయినా, ఆస్పత్రి వర్గాలు మాత్రం రూ.9,800 చెల్లించమంటూ బిల్లు చేతిలో పెట్టారు. అతికష్టంమ్మీద సోమవారం సురేశ్ బిల్లు చెల్లించి మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లారు.

భద్రత, సమయపాలనపై దృష్టి సారించాలి

దక్షిణ మధ్య రైల్వే జీఎం



సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల భద్రత, సమయపాలనపై దృష్టి సారించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ అధికారులకు సూచించారు. రైళ్ల ఆలస్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం రైల్ నిలయంలో పలువురు ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. డివిజనల్ రైల్వే మేనేజర్లు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి ట్రాక్ నిర్వహణలో సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ఉద్యోగులకు సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. వృత్తిలో అంకిత భావంతో పనిచేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమయస్ఫూర్తి ప్రదర్శించిన ఏడుగురు సిబ్బందికి 'మ్యాన్ ఆఫ్ ద మంత్'అవార్డులను బహూకరించారు. కార్యక్రమంలో అదనపు జీఎం జాన్ థామస్, ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ పద్మినీ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా వైద్యాధికారుల్లో కదలిక

అత్యవసర సేవలపై సీఎంవో, ఆర్ఎంవోలతో చర్చ • ఇకపై పక్కాగా రౌండ్స్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, హైదరాబాద్: సిబ్బంది పనితీరుపై మరింత దృష్టి సారించాలని ఉస్మానియా ఆస్పత్రి ఉన్నతాధికారులు నిర్ణయించారు. మౌలిక సదుపాయాలు, సిబ్బంది రాకపోకలు, రోగులపట్ల అనుసరిస్తున్న తీరు, వార్డుల్లోని సేవలు, ఇతర సమస్యలపై ఎప్పటికప్పుడు ఓ అంచనాకు రావాలని యోచిస్తున్నారు. అత్యవసర విభాగంలో అర్ధరాత్రి సేవలు నిలిచిపోయిన ఘటనపై సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ స్పందించారు. సోమవారం క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు(సీఎంవో), డ్యూటీ ఆర్ఎంవోలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల అత్యవసర విభాగంలో సేవలు నిలిచిపోవడానికి గల కారణాలపై చర్చించారు. ఈ విభాగంలో మెరుగైన సేవలు అందించేందుకు మెడిసిన్, సర్జరీల నుంచి ఒక్కో పీజీని కేటాయించేందుకు అంగీకరించారు. ఆర్ఎంవోలతో రోజూ మధ్యాహ్నం సమావేశమై సమస్యలను పరిష్కరించుకోవాలని, సూపరింటెండెంట్ స్థాయిలో సాధ్యంకాకపోతే డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఔట్‌పేషెంట్ విభాగానికి రోజుకు సగటున 2,500 మంది రోగులు వస్తున్నారు. ఇన్‌పేషెంట్ వార్డుల్లో నిత్యం 1,500 మంది చికిత్స పొందుతుంటారు. రోగులకు సరిపడ సంఖ్యలో వైద్యులున్నా అత్యవసర పరిస్థితుల్లో ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం వల్ల డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది తరచూ విధులకు గైర్హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో పక్కా హాజరు నమోదు కోసం బయోమెట్రిక్ అటెండెన్స్‌ను వినియోగించుకోవడంతోపాటు సీసీ కెమెరాల ద్వారా వార్డులపై నిఘా పెంచాలని పరిపాలనా విభాగం నిర్ణయించింది.

ఇకపై మరింత కఠిన నిర్ణయాలు

నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠినంగా వ్యవహరిస్తాం. రోగులందరికీ సేవలు అందేవిధంగా చూస్తాం. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు, ఆర్ఎంవోలు, సిబ్బంది సమన్వయంతో పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ నాగేందర్, సూపరింటెండెంట్, ఉస్మానియా

సాక్షి
మంగళవారం, జనవరి, 9

అమ్మకానికి 'ఆధార్'

ఆధార్ కార్డు గురించి, పౌరుల వ్యక్తిగత గోప్యతకు దానివల్ల కలుగుతున్న నష్టం గురించి ప్రశ్నలు తలెత్తినప్పుడల్లా ఏదో ఒకటి చెప్పి తప్పించుకుంటున్న ప్రభుత్వ యంత్రాంగానికి తాజా పరిణామం మింగుడుపడటం లేదు. నాలుగురోజులక్రితం ఆంగ్ల దినపత్రిక ట్రిబ్యూన్ మహిళా జర్నలిస్టు ఒకరు రూ. 500 చెల్లించి కోట్లాది మంది పౌరుల సమస్త వివరాలూ పొందుపరిచిన ఆధార్ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ సంపాదించారు. ఆమె మరో రూ. 300 చెల్లించి కావలసిన ఆధార్ కార్డు వివరాల కాపీని పొందడానికి వీలయ్యే సాఫ్ట్‌వేర్‌ను రాబట్టారు. పంజాబ్ రాజధాని చండీగఢ్‌లో జరిగిన ఈ ఉదంతం గురించి అక్కడి ఆధార్ అధికారులకు ప్రస్తావిస్తే వారు విస్మయపడ్డారు. ఆంగ్ల చానెల్ 'ఇండియా టుడే' విలేకరులు రహస్య కెమెరాలతో స్టింగ్ ఆపరేషన్ నిర్వహిస్తే అందులో మరింత దిగ్భ్రాంతికరమైన వివరాలు వెల్లడయ్యాయి. రూ. 2 చొప్పున చెల్లిస్తే కావలసినంతమంది వివరాలు ఇవ్వడానికి అనేకులు సిద్ధపడ్డారు. ఆ విలేకరులు అలా చెల్లించి 15,000మంది వివరాలను పొందారు. ఇది వెల్లడైన వెంటనే అప్రమత్తమై ఎక్కడెక్కడ లోపాలున్నాయో వెదికి సరిదిద్దడానికి బదులు ప్రభుత్వ యంత్రాంగం విలేకరుల మీద కేసులతో విరుచుకుపడింది. ఆధార్ డేటా లీకైన విషయం బయటపడటం ఇది మొదటిసారి కాదు. నిరుడు మే నెలలో లీక్ సంగతిని సుప్రీంకోర్టు ముందు కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. అయితే ఇది ఆధార్ కార్డును రూపొందించే యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) సంస్థ లోపం కాదని, ఆ సమాచారాన్ని ఉపయోగించుకుంటున్న వివిధ ప్రభుత్వ విభాగాల అవగాహనలేమి కారణమని తెలిపింది. 210 ప్రభుత్వ విభాగాలు తమ తమ వెబ్‌సైట్లలో ఆధార్ వివరాలుంచాయని, దీన్ని గమనించి తొలగింపజేశామని వివరించింది. ఆ సమయంలో దాదాపు 10 కోట్లమంది పౌరుల వివరాలు బహిర్గతమయ్యాయని అంచనా వేశారు. అయితే పౌర సమాజ కార్యకర్తలు మాత్రం ఆధార్ డేటా 'బయటి వ్యక్తుల' చేతుల్లోకి పోయిందని ఎప్పటినుంచో చెబుతూ వస్తున్నారు. చివరకు అదే నిజమని తాజా ఉదంతాలు వెల్లడిస్తున్నాయి.

పౌరుల నుంచి వివరాలు సేకరించి ఆ డేటాను నిక్షిప్తం చేసేందుకు దేశ వ్యాప్తంగా 3 లక్షలమంది ఆపరేటర్లను కామన్ సర్వీస్ సెంటర్ స్కీం (సీఎస్ సీఎస్) కింద కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నియమించింది. ప్రస్తుతం ఆ పనిని చాలావరకూ పోస్టాఫీసులకూ, కొన్ని బ్యాంకు శాఖలకూ అప్పగించింది. పర్యవసానంగా రోడ్డునపడిన అనేకమంది ఆపరేటర్లను లక్ష్యంగా చేసుకుని వారి ద్వారా కొందరు 'గుర్తు తెలియని వ్యక్తులు' ఆధార్ సమాచారాన్ని అంగట్లో విక్రయిస్తున్నారని ట్రిబ్యూన్ పత్రిక అంటున్నది. ఇన్నాళ్లూ నిద్రపోయిందే చాలక ఇప్పుడు అప్రమత్తత చేసిన మీడియాపై ప్రభుత్వం విరుచుకుపడుతున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. సమస్య తలెత్తాక ప్రభుత్వమైనా, యూఐడీఏఐ బాధ్యులైనా చేయాల్సింది వెబ్‌సైట్ అన్యుల చేతుల్లోకి ఎలా పోయిందో ఆరా తీయడం. ఎందుకంటే ఆ వెబ్‌సైట్ కోసం వినియోగిస్తున్న సర్వర్లు, అందుకు ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ అసాంఘిక శక్తుల చేతుల్లో పడటం కోట్లాదిమంది పౌరుల భద్రతకు ముప్పు కలిగిస్తుంది. ఆ సర్వర్లు, సాఫ్ట్‌వేర్ దుర్భేద్యమైనవని ఇన్నాళ్లూ ప్రభుత్వం నమ్మబలుకుతోంది. కేవలం యూఐడీఏఐ డైరెక్టర్ జనరల్, రాష్ట్ర స్థాయిలో ఉండే ఆ సంస్థ ప్రాంతీయ కేంద్రాల అడిషనల్ డైరెక్టర్ జనరల్స్ మినహా మరెవరూ అధికారిక పోర్టల్‌ను తెరవలేరని అన్నది. కానీ రూ. 500 ఖర్చుపెడితే అది సంపాదించడం అత్యంత సులభమని ట్రిబ్యూన్ పత్రిక నిరూపించింది.

ఆధార్ వ్యవహారం 2009లో మొదలైనప్పుడు పలువురు సామాజిక కార్యకర్తలు ఇది ప్రమాదకరమైన చర్య అని హెచ్చరించారు. ఇలాంటి ప్రాజెక్టునే మొదలుపెట్టిన బ్రిటన్ ఆ డేటాను కాపాడటం అసాధ్యమని గుర్తించి మధ్యలోనే దాన్ని విరమించుకున్న సంగతిని గుర్తుచేశారు. అయినా ప్రభుత్వం వినలేదు. అప్పుడు విపక్షంలో ఉండి ఆధార్‌ను వ్యతిరేకించిన బీజేపీ అధికారంలోకొచ్చాక దాన్ని మరింత విస్తృతపరిచింది. డేటా లీకయ్యే ప్రమాదమున్నదని చెప్పినప్పుడే ప్రభుత్వం నిపుణుల సహాయసహకారాలతో అందులో వాస్తవమెంతో తెలుసుకోవడానికి ప్రయత్నించి ఉంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదు. కనీసం పౌరుల డేటా సేకరించిన బ్రిటన్ మధ్యలో ఎందుకు ఆపేసిందో, అందుకు గల కారణాలేమిటో తెలుసుకుని ఉంటే సమస్య తీవ్రత అర్థమయ్యేది. పౌరుల సమస్త అవసరాలకూ ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసినప్పుడు అనివార్యంగా ఏదో ఒక స్థాయిలో డేటా లీక్ కావడం తప్పదు. తాజా పరిణామం గమనిస్తే అసలు మూలంలోనే పెను లోపమున్నదని అర్థమవుతుంది. అరకొర పరిజ్ఞానంతో ఒక మూఢ విశ్వాసాన్ని ఏర్పరుచుకుని, దానికి భిన్నంగా ఎవరు ఏం చెప్పడానికి ప్రయత్నించినా మూర్ఖంగా కొట్టిపారేయడం వల్లే ఇప్పుడీ పరిస్థితి ఏర్పడింది. ఇన్నాళ్లూ తమ డేటా లీక్ కాదని, అసాధ్యమని వాదించినవారు ఇప్పుడు కొత్త వాదన లంకించుకుంటున్నారు. ఆధార్ సమాచారం బయటికొస్తే ఏం కొంప మునుగుతుందన్న తర్కం లేవదీస్తున్నారు. డేటా చౌర్యం చేసినవారు తప్పుడు పేర్లతో సిమ్ కార్డులు పొందడానికి, బ్యాంకు ఖాతాలు ప్రారంభించడానికి వాటిద్వారా అసాంఘిక కార్యకలాపాలు నిర్వర్తించడానికి అవకాశం ఉంటుంది. అసలు వ్యక్తికి సంబంధం లేకుండా, తెలియకుండా ఇవన్నీ జరిగిపోతుంటాయి. అమాయక పౌరులల్లో నమ్మకం కలిగించి వారిని ఎన్నో రకాలుగా మోసగించడానికి వీలుంటుంది. అన్నిటికీ ఆధార్ తప్పనిసరి చేయడాన్ని, దాని చెల్లుబాటును ప్రశ్నించే పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. అది తేలేలోగా కనీసం ఆధార్‌పై అధికార యంత్రాంగానికి జవాబుదారీతనాన్ని నిర్ణయించాలి. డేటా చౌర్యం జరిగినప్పుడు అందుకు బాధ్యత ఎవరిదో నిర్ధారించి చర్యలు తీసుకోవాలి. కళ్లు మూసుకు కూర్చుంటే, ప్రశ్నించినవారిని దబాయిస్తే సమస్య పరిష్కారం కాదని గ్రహించాలి.



వ్యక్తిగత జీవితంలోకి రాజ్యం తొంగి చూడడం అనేది తప్పనిసరి మూత్రపరీక్షలాగా మారడమే మన కాలపు అతిపెద్ద విషాదం.

– క్రిస్టోఫర్ హిచెన్స్
ఆంగ్లో–అమెరికన్ రచయిత

గ్రహం అనుగ్రహం


శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి బ.అష్టమి రా.8.50 వరకు, తదుపరి నవమి, నక్షత్రం హస్త ఉ.6.39 వరకు, తదుపరి చిత్త, వర్జ్యం ప.2.54 నుంచి 4.32 వరకు దుర్ముహూర్తం ఉ.8.46 నుంచి 9.32 వరకు, తదుపరి రా.10.47 నుంచి 11.39 వరకు, అమృతఘడియలు... రా.12.43 నుంచి 2.21 వరకు.

సూర్యోదయం	: 6.37	రాహుకాలం :	ప.3.00 నుంచి 4.30 వరకు
సూర్యాస్తమయం	: 5.37	యమగండం :	ఉ.9.00 నుంచి 10.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	: 5.32	మగ్రీబ్	: 5.58
జొహర్	: 12.23	ఇషా	: 7.15
అసర్	: 4.22		

భయపెడుతున్న 'భ్రష్టత్వం'



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

జస్టిస్ చలమేశ్వర్ తన పరిధిలో, ఉన్న అవకాశంలో న్యాయవ్యవస్థ పరువును కాపాడటానికి చేసిన ప్రయత్నం ధర్మబద్ధమే. ఇంతకుముందు కూడా జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి నాయకులపై అధికారుల దురుసు ప్రవర్తన, కోర్టు ఆవరణలోనే విద్యార్థి నాయకులపై జరిగిన దాడి ధోరణి పట్ల, వీరిపై 'దేశద్రోహం' ఆరోపణలను సంధించడానికి సిద్ధమైనప్పుడు కూడా జస్టిస్ చలమేశ్వర్ 'ఇంతకూ ఈ దేశంలో ఏం జరుగుతోందో తెలుసుకోగోరుతున్నాం' అని ధర్మాసనం తరపున పరోక్షంగా ఒక ప్రశ్న లేవనెత్తారు.

'ప్రజా బాహుళ్యానికి సామాజిక న్యాయం అందించడం అనే పదానికి ప్రకాశవంతమైన అర్థం ఉంది. కానీ ఆ అర్థాన్ని అవగతం చేసుకోలేని, రాజకీయ పరిజ్ఞానం లేని న్యాయమూర్తులు జీవితానికి అధికార వికేంద్రీకరణ ఎంత ప్రాథమిక అవసరమో గుర్తించలేరు. ప్రజలకు సన్నిహితం కాలేని ప్రజాస్వామ్యం ఒక పేరడీగా మిగిలిపోతుంది. న్యాయమూర్తులకు సామ్యవాద సామాజిక తాత్త్విక దృక్పథం కొరవడినా అది పరిహాసంగా మిగిలిపోక తప్పదు. కులీన వర్గ డంబాచారులైన ఇలాంటి న్యాయమూర్తులు, అధికారిక పదవుల కోసం, జీతానికి మించిన అదనపు సౌకర్యాల కోసం, అధికారిక జీతభత్యాల కోసం అవినీతి పాలైనప్పుడు తమను శాశ్వతంగా రక్షించగల ఏర్పాటు కోసం అంగలారుస్తారు.'

– జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్ (సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, లీగల్ స్పెక్ట్రమ్, 2011)

ప్రజాస్వామ్య వ్యవస్థకు చెందిన నాలుగు ప్రధాన అంగాలు– శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, పత్రికలు– గడచిన డెబ్బయ్ ఏళ్లలో భ్రష్టుపట్టిపోయాయి. దేశంలో సంభవిస్తున్న అనేక పరిణామాలే ఇందుకు నిదర్శనం.'

– జస్టిస్ చలమేశ్వర్ (సుప్రీంకోర్టు న్యాయమూర్తి, 20–12–2017)

జస్టిస్ చలమేశ్వర్ అభిప్రాయపడుతున్నట్టు ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు ఉద్దేశించిన ఆ నాలుగు స్తంభాలు 'భ్రష్టుపట్టిపోవడానికి' కారణాలు ఏమై ఉంటాయి? త్యాగాలతో, పోరాటాలతో భారత ప్రజానీకం స్వాతంత్ర్యం సాధించుకుంది. కానీ ఆ స్వరాజ్య లక్ష్యానికి అనుగుణమైన సాంఘిక, ఆర్థిక వ్యవస్థను ఏర్పరచుకోవడంలో పాలక వర్గాలు విఫలం కావడమే ఆ భ్రష్టత్వానికి వెనుక ఉన్న కారణాలలో ప్రధానమైనది. పాలకులు ధనిక వర్గానికి చెందినవారు కావడం, లేదా ధనికవర్గం నుంచి పాలకులు కొన్ని ప్రయోజనాలను ఆశించడం కూడా కారణమే. రాజకీయ పక్షాలను (ఏ బ్రాండ్ అయినా కూడా), శాసన వేదికలను, పత్రికలను, న్యాయ వ్యవస్థలను కూడా ధనికవర్గ పాలకులు తమ ప్రయోజనాలకు అనుకూలంగా మలుచుకుంటారు. దీని ఫలితమే జస్టిస్ చలమేశ్వర్ వ్యాఖ్య.

మూలాలలోకి వెళితే.....!

ఈ నాలుగు ముఖ్య వ్యవస్థల మీద జస్టిస్ చలమేశ్వర్ బాహాటంగా విమర్శనాస్త్రాలు సంధించడానికి ఇటీవల సంభవించిన పరిణామాలే కారణం. రెండు మూడే అయినా అత్యంత బాధాకరమైనవి. అధికార స్థాయిలోనే బరితెగించినవి. అవి– 1. ఒడిశాలోని ఒక వైద్య కళాశాల ప్రవేశాల విషయంలో జరిగిన అవకతవకల మీద సీబీఐ కేసు పెట్టింది. అందులో భాగంగానే ఈ అవకతవకలతో సంబంధం ఉందన్న ఆరోపణతో ఆ రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తిని అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో పదవీ విరమణ చేసిన ఆ న్యాయమూర్తికి అంటిన 'మకిలి' మొత్తం న్యాయవ్యవస్థకే అంటుకున్నదనీ, కాబట్టి క్షుణ్ణంగా విచారణ జరపవలసిందేనని సుప్రీంకోర్టు సుప్రసిద్ధ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్నే జస్టిస్ చలమేశ్వర్ పరిశీలించి, ఆరోపణ తీవ్రమైనది కాబట్టి ఐదుగురితో కూడిన ధర్మాసనం విచారించాలని నిర్ణయించారు. కానీ గౌరవ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఈ నిర్ణయాన్ని పక్కన పెట్టి వేరే ధర్మాసనాన్ని ఏర్పాటుచేశారు. అదే సమయంలో జస్టిస్ చలమేశ్వర్ సూచించిన ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి పేరు లేదు. ఈ పరిణామం మీద రకరకాల వ్యాఖ్యానాలు వెలువడినాయి.

రెండో మాట



జస్టిస్ చలమేశ్వర్ పేర్కొన్నట్టు ఆ నాలుగు వ్యవస్థల 'భ్రష్టత్వా'నికి కారణమైన 2వ అంశం– అరుణాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కలిఖోపుల్ (47) ఆకస్మిక మరణం, అనంతర పరిణామాలు. ఆధిపత్యం పోరులో అధికార, విపక్షాల కుట్రలకు బలైనవారు కలిఖోపుల్. దీని మీద ఏ వైపు నుంచీ ప్రతిస్పందన రాలేదు. రాజకీయ పార్టీల నుంచి, పత్రికల నుంచి, శాసనసభ్యుల నుంచి, పౌర సమాజం నుంచి కూడా స్పందన రాలేదు. ఆయన పేదరికం నుంచి స్వయంకృషితో ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగినవారు. తనకు వేదన కలిగించిన అంశాలను ఆత్మహత్య చేసుకోవడానికి ఒకరోజు (ఆగస్ట్ 8, 2016)ముందు 60 పేజీలలో రాసిపెట్టారు. ఏడు మాసాల తరువాత ఆయన భార్య ద్వారా అవి సాక్షాత్తు ఢిల్లీలో వెలుగు చూసినప్పటికీ స్పందించినవారే కరువయ్యారు. కనుకనే ఈ 'భ్రష్టాచార' వ్యవస్థలోని పరిణామాల నుంచి దేశానికీ, ప్రజాస్వామ్యానికీ ఇప్పట్లో మోక్షం ఉండకపోవచ్చుననిపిస్తుంది. కానీ అలాంటి ఒక కుదుపు కోసమే, పాలక వ్యవస్థకు ఒక గుణపాఠం నేర్పడానికే ప్రజా బాహుళ్యం ఎదురుతెన్నులు కాస్తోంది. కనుకనే జ్ఞాన సంపన్నులైన పలువురు మాజీ న్యాయమూర్తులు 'సామాజిక న్యాయం కలుగజేసేందుకు అధికార వికేంద్రీకరణ జరగడమే అత్యంత ప్రాధాన్యం గల ప్రాథమిక న్యాయం అవుతుంది. ఇందుకుగాను ప్రజాస్వామిక న్యాయవ్యవస్థ ఎలాంటి విభేదం లేకుండా ఏకవాక్యంతో, సాధికారికంగా, ఏకముఖంగా ముందడుగు వేయాల్సి ఉంద'ని అభిప్రాయపడ్డారు ('జడ్జెస్ ఆన్ ఏ సింగిల్ బెంచ్ ''ఏ హండ్రెడ్ మిలియన్ ఇండియన్స్ ఆస్కింగ్ ఫర్ జస్టిస్').

ఇందుకు సమర్థన అనిపించేటట్టు ఇటీవల రాజ్యసభలో ముగ్గురు (కాంగ్రెస్) సభ్యుల పదవీ విరమణ సందర్భంగా సీనియర్ సభ్యుడు కరణ్‌సింగ్ (మిగతా ఇద్దరు; జనార్దన్ ద్వివేది, పర్వెజ్ హష్మి) కొన్ని వాస్తవాలు వెల్లడించారు. 'ఇప్పుడు సభలో జరుగుతున్నవి చర్చలు కావు, తరచుగా అడ్డంకులు, అవరోధాలు, విచ్ఛిన్నతలూ. కానీ గతంలోనో! హిరేన్ ముఖర్జీ, మధులిమాయె, నాథ్‌పాయ్, వాజ్‌పేయి, భూపేష్ గుప్తా వంటి హేమాహేమీలు జరిపినవి ప్రతిభావంతమైన చర్చల'ని ఆయన గుర్తుచేసి వెళ్లారు.

ధర్మాసన చైతన్యం ప్రజానుకూలమే

న్యాయవ్యవస్థలో ధర్మాసన చైతన్యాన్ని ప్రదర్శించడంలో పతంజలి శాస్త్రి, గజేంద్ర గడ్కర్, వీఆర్ కృష్ణయ్యర్, భగవతి, రాజేంద్ర సచార్ లాంటి న్యాయమూర్తుల ప్రతిభా సంపన్నతను దేశం గుర్తించింది. నేటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా హయాంలో ధర్మాసన చైతన్యం ప్రజానుకూల దిశలోనే సాగుతోంది. ఆధార్, గోప్యత అంశమే అందుకు నిదర్శనం. పౌరులను 'కూపీ'లకు, నిఘాలకూ గురిచేస్తూ బీజేపీ పాలకులు 'ఆధార్'ను చూపాలన్న నిబంధన సుప్రీంకోర్టులో చర్చకు వచ్చినప్పుడు వ్యక్తి స్వేచ్ఛ 'గోప్యమైన' హక్కు అనీ, అది అనుల్లంఘనీయమనీ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కానీ పాలకవర్గ పరోక్ష జోక్యంవల్లగానీ, ధర్మాసన చైతన్యంలో వచ్చిన సడలింపుల వల్లగానీ ఆ దశ మసకబారుతున్న సూచనలూ కన్పిస్తున్నాయి. ఒడిశా వైద్య కళాశాల ప్రవేశాల కేసులో ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్ ఏర్పాటు కావాలన్న జస్టిస్ చలమేశ్వర్ ఆదేశం అమలు కాకపోవడానికి కారణం ఇంతవరకు తెలియదు. ఇదే కాదు, గతంలో కూడా సుప్రీంకోర్టులోని 16మంది ప్రధాన న్యాయమూర్తులలో 8 మందిపై అవినీతి ఆరోపణలతో ప్రశాంత్ భూషణ్ సమర్పించిన అఫిడవిట్ ఇప్పటికీ ఓ మూలన పడి ఉంది. ఈ విషయంలో జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని భూషణ్ సవాలు విసిరినా ధర్మాసన చైతన్యంలో మార్పులేదు. ఈ పరిణామం మీదనే జస్టిస్ కృష్ణయ్యర్ తన 'లీగల్ స్పెక్ట్రమ్'లో 'భూషణ్ బ్లాక్‌మెయిల్' అన్న వ్యంగ్య శీర్షికతో ప్రచురించారు. 'సుప్రీం న్యాయవ్యవస్థకు చెందిన తీవ్ర అవినీతి ఆరోపణలు నైతిక బలాన్ని దిగజార్చాయి. ప్రజలు నిర్ఘాంతపోయారు. ప్రశాంత్ భూషణ్ జ్యుడీషియరీపై చేసిన దాడిని పట్టించుకొనకపోతే అది అనైతికం. రాజ్యాంగ ఆదేశాలపట్ల అపచారం. బుద్ధుడు, గాంధీ మన సాంస్కృతిక మహనీయులయినప్పుడు మన సుప్రీం న్యాయమూర్తులకు అలాంటి నైతిక బలమే ఉండొద్దా? ఈ పరిణామం తన ప్రతిపత్తికి సిగ్గుచేటైనదిగా ఇప్పటికిప్పుడే– ఎప్పుడో రేపు కాదు, పార్లమెంటు భావించవద్దా? వెంటనే చర్యకు దిగవద్దా? భూషణ్ కోర్టుకు సవాలు విసిరారు సాహసంతో, ఆ సవాలును అందుకునే పక్షంలో ఆయనపై కోర్టు ధిక్కారం నేరాన్ని ప్రకటించాలి'అని జస్టిస్ కృష్ణయ్యర్ ప్రకటించాల్సి వచ్చింది.

మరో మంచి ప్రయత్నం

ఆ స్థాయిలో కాకపోయినా జస్టిస్ చలమేశ్వర్ తన పరిధిలో, ఉన్న అవకాశంలో న్యాయవ్యవస్థ పరువును కాపాడటానికి చేసిన ప్రయత్నం ధర్మబద్ధమే. ఇంతకుముందు కూడా జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి నాయకులపై అధికారుల దురుసు ప్రవర్తన, కోర్టు ఆవరణలోనే విద్యార్థి నాయకులపై జరిగిన దాడి ధోరణి పట్ల, వీరిపై 'దేశద్రోహం' ఆరోపణలను సంధించడానికి సిద్ధమైనప్పుడు కూడా జస్టిస్ చలమేశ్వర్ 'ఇంతకూ ఈ దేశంలో ఏం జరుగుతోందో తెలుసుకోగోరుతున్నాం' అని ధర్మాసనం తరపున పరోక్షంగా ఒక ప్రశ్న లేవనెత్తారు. ఇలాంటి చైతన్యాన్ని దృష్టిలో పెట్టుకొనబట్టే కాబోలు, జస్టిస్ కృష్ణయ్యర్ ఒక సందర్భంలో 'జడ్జీలయినంత మాత్రాన వారికి రాజకీయాలుండవా, పైకి కనపడని రాజకీయాలంటూ అసలుండవా?' అని ప్రశ్నించారు. చాలామంది న్యాయమూర్తులు 'తాము రాజకీయాలకు అతీతులమని చెప్పుకుంటారు. కానీ వారు రాజ్య పాలనలో మూడవశక్తి, రాజ్యాంగ రాజకీయాలు వారిని పాలిస్తూంటాయ'ని ఆయన గుర్తు చేశారు.

ఈ కారణం చేతనే ప్రపంచ ప్రఖ్యాత న్యాయమూర్తి లార్డ్ జస్టిస్ స్కార్మన్ కూడా 'జడ్జీలకు రాజకీయ తత్త్వశాస్త్ర పరిజ్ఞానం విధిగా ఉండాల'న్నారు. కనుకనే కృష్ణయ్యర్ ఉద్దేశంలో 'మనది సోషలిస్టు, సెక్యులర్ ప్రజాస్వామ్య గణతంత్ర రిపబ్లిక్ అని మన రాజ్యాంగం లక్ష్య నిర్దేశం చేసింది కాబట్టి, రాజ్యాంగ రాజకీయ తాత్వికతతో ఏకీభవించే జడ్జీలను మాత్రమే రిపబ్లిక్ నియమించుకోవాలి. ఎందుకని? అలా నిర్దేశించిన రాజ్యాంగం కిందనే జడ్జీలు నియమించబడ్డారు కాబట్టి'. కానీ రాజ్యాంగాన్ని మార్చడం కోసమే అధికారంలోకి వచ్చామని బీజేపీ ప్రకటించుకుంటున్నందునే ఏ నియమ నిబంధనలూ అది పాటించడం లేదు. ఇక్కడే పొంచి ఉంది అసలు ప్రమాదం. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ పోలీస్ స్టేషన్లు కాషాయం రంగు అద్దుకుంటున్నాయని, ముస్లిం హజ్ ఆఫీసుల మీద కాషాయం రంగులు బలవంతంగా పూస్తున్నారని వార్తలు విస్తారంగా (8.1.18) వెలువడుతున్నాయి. ఈ సందర్భంగా కథకుడు గోపీచంద్ ఒక రచనకు పెట్టిన పేరు గుర్తుకొస్తోంది: 'ఈ దేశం ఏమయ్యేట్టు?'!

abkprasad2006@yahoo.co.in

ఆ ఆగ్రహం సమర్థనీయం!

చీలికలు పేలికలుగా ఉన్నప్పటికీ మహారాష్ట్రలోని దళితులు కొత్త సంవత్సరం తొలిరోజున తమ శక్తి ఏమిటో చూపించారు. కోరెగాంలో జరిగిన ఘటనపై వారి అసంతృప్తిని, ఆగ్రహాన్ని చల్లార్చడం అంత సులభం కాదు.

విశ్లేషణ



మహేశ్ విజాపుర్కర్

రెండు వందల ఏళ్ల క్రితం, ఈస్ట్ ఇండియా కంపెనీ బలగాలు కోరెగాం వద్ద ఒక యుద్ధాన్ని గెలుచుకున్నాయి. దాంతో మూడో ఆంగ్లో–మరాఠా యుద్ధం ముగిసింది. ఈ విజయంతో భారత ఉపఖండ యజమానులుగా బ్రిటిష్‌వారు తమ స్థానాన్ని స్థిరపర్చుకున్నారు. పైగా, ఈ యుద్ధంతో పీష్వాల పాలనను సైనిక కమ్యూనిటీకి చెందిన మహర్‌లు ఖతం చేసినట్లుగా వ్యాఖ్యానాలు కూడా వచ్చాయి.

శివాజీ అనంతరం మరాఠా సామ్రాజ్యాన్ని పీష్వాలు నడిపారు. సమతకు పట్టం కట్టిన శివాజీ పాలనకు భిన్నంగా పీష్వాలు బ్రాహ్మణిజం సంప్రదాయాలతో కులతత్వం అద్దారు. బ్రిటిష్ సైన్యం స్థానికులు, ఇంగ్లిష్ వాళ్లు రెండింటితో కూడి ఉండేది. ఎక్కువమంది భారతీయులే. రెండు జాతులకు సంబంధించిన సైనికులను కలిపి రూపొందించిన బెటాలియన్లు లేదా ప్లటూన్‌లు చాలా తక్కువ. కానీ ఇరు జాతుల సైనికులను కలిపి విశాల ప్రాతిపదికన బ్రిటిష్ సైన్యం అనేవారు. బ్రిటిష్ సైన్యంలో స్థానికులు ఎందుకు చేరారంటే ఇక్కడి పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటులో భాగమై ఉండవచ్చు లేదా జీవిక కోసం అయినా అయి ఉండవచ్చు.

మెహర్లను సైన్యంలో చేర్చుకోవడానికి పీష్వా యంత్రాంగం తిరస్కరించడంతో, మరాఠాలను అణచివేయాలని చూస్తున్న బ్రిటిష్ వారితో చేతులు కలపాలని మెహర్లు నిర్ణయించుకున్నట్లు ప్రస్తుతం కథనాలు చెబుతున్నాయి. కోరెగాం స్థూపంలో పేర్కొన్న మృత సైనికులలో 22 మంది మెహర్లే అన్న వాస్తవం దీనికి సమర్థనగా కనిపిస్తోంది. ఆనాడు కోరెగాంకు వెళ్లిన సైనిక దళాల్లో ఎక్కువమంది మెహర్లే. బ్రిటిష్ వారు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి వ్యూహం పన్నారా? దీనిని చరిత్రకారులు అధ్యయనం చేయాల్సి ఉంది.

బీఆర్ అంబేడ్కర్ 1927 జనవరి 1న కోరెగాం స్మారకస్థూపాన్ని సందర్శించినప్పటి నుంచి, ఆ తర్వాత



జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులలో కూడా.. బ్రిటిష్ వారి తరపున జరిగిన యుద్ధాల్లో అస్పృశ్యులే గెలిచారని ప్రస్తావిస్తూ వచ్చారు. కానీ అంబేడ్కర్ కన్నా ముందు నుంచే దళితులు ఆ స్థూపాన్ని సందర్శించేవారు.

కానీ దళితులు వీధుల్లోకి వచ్చి హింసాత్మక చర్యలకు పాల్పడటంతో కొత్త సంవత్సరం మరాఠాలు కొత్త యుద్ధం ప్రారంభించినట్లయింది. జేమ్స్ లియన్ శివాజీపై రాసిన పుస్తకానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు మొదలెత్తినప్పటి నుంచి, దళిత ప్రజా సంఘాలు మహారాష్ట్రలో ప్రాధాన్యత సంతరించుకుంటూ వచ్చాయి. ఈ నేపథ్యంలో దళితులను కొట్టిన సంఘటన వారికి మరాఠాలపై అమిత ఆగ్రహం కలిగించింది.

పైగా ఒక దళితుడి స్మారక స్థూపాన్ని ధ్వంసం చేయడంతో మహారాష్ట్రలో దళితుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తాను వధించిన మరాఠా పాలకుడు శంభాజీ దేహాన్ని ఎవరైనా తాకితే తీవ్రపరిణామాలు ఉంటాయని ఔరంగజేబ్ చేసిన హెచ్చరికలు కూడా పట్టించుకోకుండా శంభాజీ అంత్యక్రియలను ఆ దళితుడు నిర్వహించాడు. దళితులు ఈ రెండు సంఘటనలలో తమ పాత్రకుగాను గర్వపడుతుంటారు. ఒకటి– మరాఠా పాలకుడి తరపున పాలించే పీష్వాలను ఓడించడం. రెండు– మరాఠాల పనుపున మొఘల్ రాజునే ధిక్కరించిన ఘటన. కాబట్టి ఇప్పుడు సమస్య సంక్లిష్టంగా తయారైంది.

దీని మొత్తం సారాంశం ఏమిటంటే, మహారాష్ట్ర ఇప్పుడు కులతత్వంతో ఉడికిపోతోంది. అస్పృశ్యతా నిరోధక చట్టాన్ని పలుచబారేలా చేసి, భూమిపై యాజమాన్యం కలిగి ఉన్నప్పటికీ తమకు కూడా కోటా వర్తింపు చేయాలని మరాఠాలు ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగాల కోటాలో తమకూ వాటా కావాలంటున్న మరాఠాల డిమాండ్లతో దళితులు చాలా అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పుడు మరాఠాలు, దళితులు ఇద్దరూ కూడా ప్రస్తుత బీజేపీ పాలనను పీష్వా పాలనగానే చూస్తున్నారు. పైగా ఇప్పుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి బ్రాహ్మణుడు కూడా. వీటి మధ్య ఇతర వెనుకబడిన కులాలు నిరాశకు గురవుతున్నాయి.

మహారాష్ట్రలో దళితులు ఒక రాజకీయ బృందంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన పలు చీలిక బృందాలుగా చెల్లాచెదురైపోయారు. దళితులు సంఘటితమైతే అది రాష్ట్ర సామాజిక, ఆర్థిక వేదికపై నిస్సందేహంగా కొత్త రేఖను ఏర్పరుస్తుంది. దళితుల్లోని ఒక వర్గం ప్రయోజనాలను ఇది తటస్థపరుస్తుంది. ఉదా. హిందూత్వ వాదులతో పొత్తు కుదుర్చుకుని మొదట శివసేనతో కలిసిన దళితనేత రామ్‌దాస్ అథవాలే తరువాత బీజేపీతో చేతులు కలపడానికి దాన్ని వదిలిపెట్టేశారు.

తమ సంఖ్యాపరమైన బలాన్ని సంఘటితం చేసుకోవాలంటే దళితులు తమదైన రాజకీయ వేదికను ఏర్పర్చుకోవాలి. కానీ ఇది సాధ్యం కాకపోవడంతో అథవాలే మాత్రమే దళిత రాజకీయాలనుంచి లబ్ధి పొందుతున్నారు. ఇప్పుడు ఈ కొత్త పరిణామం బీజేపీయేతర, శివసేనేతర కూటములను ఇంకా బలపరుస్తుంది. ఇదంతా గమనిస్తున్న కాంగ్రెస్ పార్టీ తదుపరి ఎన్నికలకు ఎన్సీపీతో పొత్తు పెట్టుకోవడం గురించి చర్చించింది కూడా.

అయితే ఈ సానుకూల ఫలితాలు ఎలా ఉన్నా, చీలికలు పేలికలుగా ఉన్నప్పటికీ మహారాష్ట్రలోని దళితులు కొత్త సంవత్సరం తొలి రోజున మొదటిసారిగా తమ శక్తి ఏమిటో చూపించారు. ఈ విషయమై దళితుల అసంతృప్తిని చల్లార్చడం అంత సులభం కాదు.

కోరెగాంకు 3 కిలోమీటర్ల దూరంలోని వధుబద్రక్‌లో గోవింద్ మెహర్ సమాధిని ధ్వంసం చేసి అగౌరవపర్చిన ఘటన పట్ల మీడియా మొదట్లో పరమ నిర్లక్ష్యం ప్రదర్శించింది. చివరకు కోరెగాంలో దళితులపై దాడులను కూడా పట్టించుకోకపోగా, ముంబై వంటి నగరాల్లో బంద్‌లు అనేవి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తాయని మీడియా చెప్పడంతో దళితులు కుపితులైపోయారు. మహారాష్ట్రలోని కుల నిర్మాణాల్లో భూకంపం వంటి పెను కదలిక చోటు చేసుకుంటోంది కానీ దాని రాజకీయ ప్రభావాలను మాత్రం ఎవరూ సరిగా అర్థం చేసుకోవడం లేదు. దీని పట్లే దళితులు అయిష్టత ప్రకటిస్తున్నారు. వారి ఆగ్రహ ప్రదర్శన అర్థం చేసుకోదగినదే.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com

తథాస్తు



తథాస్తు దేవతలుంటారు, జాగ్రత్తగా మాట్లాడమని చెపుతూ ఉంటారు. వాళ్లని ఎవరు చూశారు? ఎట్లా ఉంటారు? ఇవన్నీ అబద్ధాలు అంటారు చాలామంది, వాళ్లని చారణులు అంటారని, ఆకాశంలో తిరుగుతూ, ముఖ్యంగా అసురసంధ్య వేళ, ఎవరేమన్నా వెంటనే 'తథాస్తు' అంటే అట్లాగే జరుగుగాక అని అంటూ ఉంటారని పెద్దలు చెప్పిన మాట. కంటికి కనపడలేదు కనుక వీళ్లని నమ్మకపోవచ్చు. కానీ మనం తరచుగా అనే మాటలు మన భవిష్యత్తుని నిర్ణయిస్తాయని ఈ నాటి మనస్తత్వ శాస్త్రవేత్తలు చెప్పినదయినా నమ్మక తప్ప టం లేదు కదా! ఎందుకిట్లా జరుగుతుంది?

శబ్దానికి ఉన్న శక్తి గురించి అందరికీ తెలిసిందే. దానిని ఉపయోగించుకోమనే పై మాటలకి అర్థం. ఉచ్చరించే ప్రతి మాట మనోభావాలని వ్యక్తం చేస్తుంది. మనం దేని గురించి ఎక్కువగా ఆలోచిస్తామో దానిగానే తయారవుతామన్నది కాదనలేని సత్యం. ఎప్పుడు ఎదుటివాళ్లలో తప్పులు వెదుకుతూ,



విమర్శిస్తూ, తిడుతూ ఉండేవాళ్ల ముఖాలు చూడండి! సంతోషంగా ఉండవు. పక్కవాళ్లు బాగుంటే తట్టుకోలేని వాళ్ల ముఖాలు ఏదో కోల్పోయినట్టుగా కనపడతాయి. ఎవరికి మంచి జరిగినా సంతోషించే వాళ్ల ముఖాలు చూడటానికి హాయిగా అనిపిస్తాయి. భావాలకే ముఖంలో మార్పు వస్తుంటే అవి మాటలుగా రూపుకట్టి వ్యక్తం అయినాక ఎట్లా ఉంటుందో ఆలోచించండి.

సానుకూల భావాన్ని ప్రకటించే ధ్వనుల వల్ల కలిగిన ధ్వనితరంగాలు వాతావరణంలో ఒకరకమైన హాయిని కలిగిస్తాయి. అదే కోపాన్నో, ద్వేషాన్నో సూచించే మాటలు అంటున్న వారికే కాదు వింటున్న వారికి కూడా చికాకుని, అసహనాన్ని కలిగించటం చూస్తాం. అటువంటి మాటలని తరచూ అంటూ ఉంటే ఆ భావాలు ఘనీభవించి అమూర్త స్థితి నుంచి మూర్త స్థితికి వస్తాయి. ఉదాహరణకి ఒక పిల్లవాడిని అందరూ చేతకాని వాడివి అని అంటూ ఉంటే తన కేమీ చేత కాదనే భావం మనస్సులో నాటుకు పోయి, ప్రతి చేష్టలోను అది వ్యక్తమవుతూ ఉంటుంది. అదే, అతడిలో నేను ఏదైనా చేయగలను అనే భావనని మనసుకెక్కేట్టు చేస్తే.. చెయ్యటమే కాదు, నెగ్గుతాడు కూడా. వేగంగా పరుగెత్తలేడు అనిపించుకున్న పిల్లవాడు ఎదురుగా పాము కనపడితే పీటీ ఉష కంటే వేగంగా పరుగుపెడతాడు. అది మనస్సుకున్న శక్తి. ఆ మానసిక శక్తిని నిరంతరం గుర్తు చేసుకుంటూ ఉండటమే మంచి మాటల ఆంతర్యం.

తథాస్తు అంటే "అట్లే అగు గాక" అని అర్థం. తథాస్తు దేవతలు ఉన్నారో లేరో కానీ, అనుకున్నది లేదా అన్నది అవటం వెనుక ఉన్న విధానం మాత్రం ఇదే.

– డాక్టర్ ఎన్. అనంతలక్ష్మి

అమెరికా వైఖరి నిజంగా మారిందా?

కొత్త సంవత్సరం ప్రారంభంలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాకిస్తాన్ కు చేసిన సాయం (పదిహేను సంవత్సరాలు– 2లక్షల 10 వేల కోట్లు)పై చేసిన ప్రకటన రెండు దేశాల మధ్య సంబంధాలపై కమ్ముకున్న నీలి మేఘాలను బయటపెట్టింది. దానికి స్పందనగా పాకిస్తాన్ కూడా సైనిక స్థావరంగా అంతకు ఎక్కువే అమెరికాకు సాయపడ్డామని చెప్తూనే, అవసరమైతే సాయాన్ని తిరిగి ఇచ్చేస్తామని ప్రకటించింది. తిరిగి ఇవ్వడం అసంభవమే కాని అక్కడి పరిస్థితులకు అనుగుణంగా పాక్ చేసిన ప్రకటనగా దానిని భావించవచ్చు. పాక్ పరోక్ష మద్దతుతో పేట్రేగిపోతున్న ఉగ్రవాదులతో దశాబ్ద కాలంగా భారత్ బాధపడుతున్నా, పాక్ ద్వంద్వ వైఖరి ఎండగడుతున్నా పట్టించుకోకుండా వారికే మద్దతిస్తూ వచ్చిన అగ్రరాజ్యం అమెరికా ఒక్కసారిగా మారిపోవడం భారత అనుకూల అంశమే అయినప్పటికీ నూతనంగా ఏర్పడిన పరిస్థితులపై భారత్ మరింత ఆచితూచి వ్యవహరించవలసిన అవసరం ఎంతైనా ఉంది.


నిజం నిలకడమీద తెలుస్తుంది అన్న చందంగా, మారుతున్న అగ్రరాజ్య వైఖరి మంచిదే అయినప్పటికీ దాని పర్యవసానాలు ఉంటాయనేది భవిష్యత్తులో బోధపడుతుంది. ముఖ్యంగా ఉగ్రవాదులకు రక్షణ కవచంలా మారి అణ్వాయుధాలను కలిగివున్న ఆ దేశానికి మరింత ఆయుధబలాన్ని అందచేసి, ఆర్థిక తోడ్పాటు అందజేసినట్లయితే, 'అగ్గికి ఆజ్యంలా' అక్కడి పాలన ఎప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థలో నుండి సైనిక నియంతల చేతిలోకి మారుతుందో చెప్పలేని పరిస్థితిలో అణ్వాయుధాల భద్రత అనేది అయోమయమే. అంతే కాకుండా ఇప్పటికే నిత్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి మరీ దాడులు చేస్తున్న పాక్ మరింతగా కవ్వింపు చర్యలకు పాల్పడితే రెండు దేశాల సంబంధాలు మరింత దిగజారిపోవటం తథ్యం. కావున అగ్రరాజ్యం అమెరికా వైఖరి 'అటొచ్చి ఇటొచ్చి' అన్న మాదిరిగా మారే పరిస్థితి ఉన్నందున భారత్ మరింత జాగరూకతతో పాటు, అంతర్జాతీయ యవనికపై పాక్ దుందుడుకు వైఖరిని బట్టబయలు చేయవలసిన అవసరం మరింతగా ఉంది.

– వినోద్ కుమార్, రీసెర్చ్ స్కాలర్,
ఉస్మానియా యూనివర్సిటీ

ఏ భాయ్ జర దేఖ్‌కే చలో..

ప్రమాద ప్రాంతాలపై జీపీఎస్ అలర్ట్

- నూతన సాఫ్ట్‌వేర్‌కు పోలీస్ శాఖ యత్నాలు
- ప్రతి వాహనానికీ 'విధిగా జీపీఎస్' దిశగా కసరత్తు
- గూగుల్‌కు 600కుపైగా బ్లాక్‌స్పాట్స్..
- 200 మీటర్ల నుంచే అలారంతో అప్రమత్తం



సందేశం వస్తుందిలా..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది. క్షణక్షణం సోషల్ మీడియా అప్‌డేట్స్ తదితరాల కోసం ఇంటర్‌నెట్ వాడుతున్నారు. తెలియని ప్రాంతానికి వెళ్లాలన్నా గూగుల్ మ్యాప్ లేదా జీపీఎస్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కూడా స్మార్ట్‌ఫోన్ల ద్వారా అప్రమత్తం చేయాలని పోలీస్ శాఖ భావిస్తోంది. ప్రతి స్మార్ట్ ఫోన్‌లో లొకేషన్ సర్వీస్ అందుబాటులో ఉంటుంది. దీని ద్వారా గూగుల్ సంస్థ నుంచి నేరుగా వాహనదారును అప్రమత్తం చేసేందుకు పోలీస్ శాఖ ప్రయత్నిస్తోంది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు లొకేషన్ సర్వీస్ ఆన్‌లో ఉంటే బ్లాక్ స్పాట్స్‌కు 200 మీటర్ల ముందే ఆటోమేటిక్‌గా సందేశం వచ్చేలా లేదా అలారం మోగే సౌకర్యం అందుబాటులోకి తేనున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి.

సాక్షి, హైదరాబాద్

వాట్సాప్ మెసేజ్ రాగానే మన ఫోన్ అప్రమత్తం చేస్తుంది. మెయిల్, ఫేస్‌బుక్ పోస్టులు, షేర్, లైకులు వచ్చినా ఫోన్‌లో మెసేజ్ టోన్ వస్తుంది. వెంటనే ఆ సందేశాన్ని చూసుకుంటాం. మరి ప్రయాణం చేస్తున్నప్పుడు ప్రమాదకరమైన మూలమలుపో.. ప్రమాద స్థలమో వస్తే? మనకు ఎలా తెలుస్తుంది? ఎవరు చెబుతారు? ఎలా గుర్తు చేస్తారు? అందుకోసమే ప్రమాద స్థలాలు సమీపిస్తుంటే మనల్ని అప్రమత్తం చేసే కొత్త వ్యవస్థ అందుబాటులోకి రానుంది. సాంకేతికత వినియోగంతో మరో అద్భుతమైన సౌకర్యాన్ని వాహనదారులకు పోలీస్ శాఖ అందించబోతోంది.

అలర్ట్ చేసేస్తుంది..

రాష్ట్రంలోని జాతీయ రహదారులపై పదే పదే ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా పోలీస్ శాఖ గుర్తించింది. రాష్ట్ర రహదారులు, అర్బన్ ప్రాంతాల్లోని రోడ్డు ప్రమాదాల ప్రాంతాలను గుర్తించింది. వీటిలో 2 నుంచి 5 ప్రమాదాలు జరిగిన ప్రతి ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి అధికారులు జీపీఎస్ ట్యాగ్ చేశారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో ఇలాంటి 150 వరకు బ్లాక్ స్పాట్ల ట్యాగింగ్ పూర్తయ్యింది. జిల్లాల్లో జాతీయ, రాష్ట్ర రహదారులపై మొత్తం కలిపి 560 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. వీటికి కూడా త్వరలోనే జీపీఎస్ ట్యాగ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ జీపీఎస్ ట్యాగింగ్‌లను గూగుల్ సంస్థకు అందించనున్నారు. దీంతో ప్రమాద స్థలానికి 200 మీటర్ల ముందే జీపీఎస్ ద్వారా అలర్ట్ మెసేజ్ వచ్చేలా చూడాలని భావిస్తున్నారు. 'మెల్లగా వెళ్లి'లేదా 'ప్రమాదకరమైన మలుపు ఉంది'అని ఆటోమేటిక్‌గా గూగుల్ లేదా జీపీఎస్ యాప్ అప్రమత్తం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ప్రతి వాహనానికీ జీపీఎస్ తప్పనిసరి..

రాష్ట్రంలోని ప్రతి వాహనానికీ జీపీఎస్ కిట్ తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా పోలీస్, రవాణా శాఖ సంయుక్తంగా ప్రభుత్వానికి ప్రతిపాదించే యోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనివల్ల రోడ్డు ప్రమాదాల నియంత్రణతో పాటు చోరీ వాహనాల జాడ, నేరస్తుల గుర్తింపు సులువవుతుందని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వ్యక్తిగత వాహనాల విషయంలో కొంత ఇబ్బంది ఉన్నా.. ఆటోలు, బస్సులు, స్కూల్ బస్సులు, లారీలు వంటి కమర్షియల్ వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరనున్నట్లు సమాచారం.

ప్రమాదాల నియంత్రణలో కీలకం..

ఏటా రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల వల్ల 6 వేల మంది మృతి చెందుతున్నారు. అనేక సందర్భాల్లో అతివేగం, ప్రమాదకర మలుపులు, రోడ్ ఇంజనీరింగ్ సమస్యలే ఇందుకు కారణమవుతున్నాయి. ఈ అప్రమత్త వ్యవస్థ వల్ల ప్రమాదాలను చాలా వరకు నియంత్రించొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గణతంత్ర వేడుకలకు బందోబస్తు: సీఎస్



సాక్షి, హైదరాబాద్: గణతంత్ర వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 26న జరిగే వేడుకల ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో పలు శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వేడుకల్లో గవర్నర్ నరసింహన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్, విద్యుత్, మెట్రో వాటర్ వర్క్స్, సమాచార, ఉద్యానవన, రహదారులు, భవనాల శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టాలన్నారు. వేడుకలకు హాజరయ్యే విద్యార్థులకు బస్సులు ఏర్పాటు చేయాలన్నారు.

నవంబర్‌లో నగారా!

▶ మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరు, రాజకీయ పరిస్థితులపై ఓ అంచనాకు వచ్చిన కేసీఆర్.. అవసరమైన చోట మరమ్మతులు చేస్తున్నారని అంటున్నారు. ఇందులో భాగంగానే ఆయా నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నుంచి ముఖ్యులు అనుకున్న నేతలను పార్టీలోకి ఆహ్వానించే ప్రక్రియ వేగం పుంజుకుందని, ఇదంతా ముందస్తు కసరత్తులో భాగమేనని చెబుతున్నారు. ఈ నెల 15న నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంలోని బీజేపీ ఏదో ఒక నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు. ఆ రోజు బీజేపీ తన వైఖరిని ఖరారు చేస్తుందన్న సమాచారం ఉన్నట్టు టీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. తెలంగాణలో వచ్చే ఏడాది జూన్ 2వ తేదీతో శాసన సభ కాల పరిమితి పూర్తవుతోంది.

ఈ ఏడాది 5.. వచ్చే ఏడాది 8

దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఐదు, వచ్చే ఏడాది జూన్ కల్లా ఎనిమిది రాష్ట్రాలు కలుపుకొని మొత్తంగా 13 రాష్ట్రాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. లోక్‌సభ కాల పరిమితి కూడా వచ్చే ఏడాది జూన్ 3తో ముగియనుండటంతో ఏప్రిల్–మే మధ్య ఎన్నికలు జరపాలి. మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, కర్ణాటకలకు ఈ ఏడాది మేలో నిర్ణీత గడువులోగానే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. మిజోరాంలో ఈ ఏడాది నవంబర్‌లోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. వచ్చే ఏడాది జనవరిలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ కాల పరిమితి ముగియనుంది. వీటికి ఈ ఏడాది డిసెంబర్–వచ్చే ఏడాది జనవరిలోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో వీటి ఎన్నికలను ముందుకు జరిపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు వచ్చే ఏడాది ఏప్రిల్–మే నెలల మధ్య, తెలంగాణ, ఏపీ, ఒడిశాలకు వచ్చే ఏడాది మే–జూన్ మధ్య ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది. ఈ ఎనిమిది రాష్ట్రాలకు ఆర్నెళ్ల ముందుగా ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. జూన్ 3తో కాలపరిమితి ముగియనున్నందున లోక్‌సభకు కూడా ఆర్నెళ్ల ముందుగా ఎన్నికలు జరిగితే ఈ రాష్ట్రాలు కూడా ఎన్నికలకు వెళ్లడం అనివార్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని.. లోక్‌సభతోపాటే శాసన సభ ఎన్నికలకు వెళ్లక తప్పదని టీఆర్‌ఎస్ అధినేత ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ ముఖ్య నేతలు, ఎంపీల వద్ద ఈ అంశాన్ని ఇటీవల ప్రస్తావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

350 డిగ్రీ కాలేజీల మూసివేత!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 1,100 ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 350 వరకు మూతబడనున్నాయి. ప్రస్తుతమున్న 4 లక్షల సీట్లు 2.2 లక్షలకే పరిమితం కానున్నాయి. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల కమిటీ, వైస్ చాన్స్‌లర్లతో ఇటీవల ఉన్నత విద్యామండలి జరిపిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఐదేళ్లలో ఇంటర్ విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం లేనందున డిగ్రీ కాలేజీల తగ్గింపు చర్యలు చేపట్టాలని.. 2018–19లో కొత్త డిగ్రీ కాలేజీలు, కోర్సులకు అనుమతివ్వకూడదని నిర్ణయించారు. అవసరం లేని ప్రాంతాల్లో ఎక్కువ కాలేజీలుంటే విలీనానికి యాజమాన్యాలకు అవకాశం కల్పించాలని.. అలాకాకుండా ఎవరికివారే కొనసాగించాలనుకుంటే చర్యలు చేపట్టాలని నిర్ణయానికొచ్చారు. కార్యాచరణ సంక్రాంతి తర్వాత అమలు చేయనున్నారు.

నాణ్యమైన విద్యకు 'క్విప్'

- ఉన్నత విద్యా మండలి కసరత్తు
- త్వరలోనే ఇంక్యుబేటర్లను ప్రారంభించనున్న కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాల కోసం పక్కా చర్యలు చేపట్టాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ఉన్నత విద్య క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ది క్విప్) పేరుతో కార్యాచరణకు చర్యలు చేపట్టింది. ఇన్నాళ్లు సలహా సంస్థగానే పనిచేసిన ఉన్నత విద్యా మండలి ఇకపై వర్సిటీల్లో అంతర్గత నాణ్యత మెరుగుదలకు నిధులిచ్చేందుకు సిద్ధమైంది. ఇందుకు వీటి నుంచి ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయించింది. తద్వారా వాటిలో నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేయొచ్చని యోచిస్తోంది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షతన సోమవారం పాలక మండలి సమావేశమైంది. క్విప్‌తో పాటు అధ్యాపకుల్లో నైపుణ్యాలను పెంచే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనకు వచ్చారు. పరిశోధనలకు ప్రాధాన్యమిచ్చేందుకు ఏటా 10 నుంచి 12 మందికి రాష్ట్ర స్థాయి ఉత్తమ పరిశోధన అవార్డులివ్వాలని, ప్రొఫెషనల్ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఐటీ శాఖ ఆధ్వర్యంలో పారిశ్రామిక రంగాల వారితో త్వరలో సమావేశమై దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ఒక్కో ఇంక్యుబేటర్‌కు రూ.2 కోట్లు..

ఉస్మానియా, కాకతీయ, జేఎన్టీయూ, జేఎన్ఏఎఫ్ఏయూ, ఆర్‌జీయూకేటీలలో ఏర్పాటు చేయనున్న ఐదు ఇంక్యుబేటర్లకు రూ.2 కోట్ల చొప్పున ఇచ్చేందుకు ఐటీ శాఖ ఒప్పుకొందని పేర్కొన్నారు. త్వరలోనే వాటిని ఐటీ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారని చెప్పారు.

'అంగన్‌వాడీ'కి జియోట్యాగింగ్!

సాక్షి, హైదరాబాద్: మీ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రం చిరునామా దొరకట్లేదా..? అక్కడ మీ పిల్లల్ని చేర్చుకోవడం లేదా..? అంగన్‌వాడీ టీచర్, ఆయా దుమ్మాలు కొడుతున్నారా..? ఇక ఇలాంటి నిర్లక్ష్యానికి తావుండదు. ప్రతి కేంద్రం సమాచారం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానుంది. ఈ మేరకు ప్రతి కేంద్రానికి రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జియోట్యాగింగ్ చేస్తోంది. జియోట్యాగింగ్‌లో భాగంగా ప్రతి కేంద్రం నుంచి సమాచారాన్ని రాష్ట్ర కార్యాలయం తెప్పించుకుంది. అంగన్‌వాడీ టీచర్, ఆయా వివరాలతో పాటు కేంద్రంలో నమోదైన చిన్నారులతో కలసి కేంద్రం ఎదురుగా దిగిన ఫొటో/సెల్ఫీలను సేకరించింది. కేంద్రమున్న ప్రాంతాన్నీ సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచింది. ప్రస్తుతం జియోట్యాగింగ్ తుదిదశకు చేరింది. ట్యాగింగ్ పూర్తయితే అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలనుకున్న వారు గూగుల్ మ్యాప్‌తో నేరుగా చేరుకోవచ్చు. మ్యాప్‌లోని కేంద్రంపై క్లిక్ చేస్తే చిరునామా, పనిచేసే సిబ్బంది వివరాలు ప్రత్యక్షమవుతాయి.

రాష్ట్ర ఆదాయంలో 19 శాతం వృద్ధి

వ్యాట్‌ను దాటేసిన జీఎస్టీ ● నిరుటికంటే పెరిగిన ఆదాయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆదాయం నిరుటికంటే 19 శాతం వృద్ధి సాధించింది. క్రమంగా జీఎస్టీపై ఉన్న అనుమానాలు తొలగిపోయి రాబడి పుంజుకుంది. ఆర్థిక శాఖ వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం ఏప్రిల్ నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు గడిచిన తొమ్మిది నెలల్లో పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం రూ.29,811 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం 2016 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు తొమ్మిది నెలల వ్యవధిలో రాష్ట్రంలో వ్యాట్ ద్వారా రూ.24,977 ఆదాయం సమకూరింది. సరిగ్గా ఈ ఏడాది అదే వ్యవధిలో వచ్చిన ఆదాయం రూ.26,982 కోట్లకు చేరింది. పెట్రోలియం, ఎక్సైజ్ ద్వారా వచ్చే ఆదాయం జీఎస్టీ పరిధిలో లేదు. ఎక్సైజ్ ఆదాయం సైతం జోడిస్తే పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం రూ.29,811 కోట్లకు చేరింది. మొత్తంగా నిరుటితో పోలిస్తే సగటున 19 శాతం ఆదాయం పెరిగింది. దీంతో ప్రధానంగా జీఎస్టీ ద్వారా రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుందనే అపోహలు, అనుమానాలు తొలగిపోయాయి. జీఎస్టీతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులమీద వచ్చే ఐజీఎస్టీ, మద్యం, పెట్రోలియం ద్వారా వచ్చే ఆదాయం, కేంద్రం నుంచి వచ్చిన జీఎస్టీ పరిహారం ఆదాయ పెంపునకు దోహదపడ్డాయి. ఆశించినంత రాబడి పెరగటంతో ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌పై భారీగానే అంచనాలు వేసుకుంటోంది. గతఏడాది వ్యాట్ అమల్లో ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం జూలై నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. కొత్త విధానం కావటంతో తొలి మూడు నెలల్లో ఆదాయ వృద్ధిపై అనిశ్చితి నెలకొంది. కానీ క్రమంగా జీఎస్టీ ఆదాయం స్థిరపడింది. ఈ నేపథ్యంలో గతేడాది నెలాఖరు వరకు ఉన్న రాష్ట్ర ఆదాయం, ఇప్పుడున్న రాష్ట్ర ఆదాయాన్ని ఆర్థిక శాఖ విశ్లేషించుకుంది. ఇందులో 19 శాతం ఆదాయ వృద్ధి నమోదైంది.

పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం (ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు)

2016–17	రూ. 24,977.70 కోట్లు
2017–18	రూ. 29,811.30 కోట్లు

సిబ్బంది లేక ఇబ్బంది!

బాలారిష్టాల్లోనే 'ఉద్యోగుల' వైద్యం!

- ఖాళీల భర్తీకి మూడు నెలలుగా అనుమతివ్వని వైనం
- సేవల పర్యవేక్షణ, బిల్లుల తయారీ ఆలస్యం
- ఇప్పటికే వందల కోట్ల బకాయిలతో చికిత్సలకు ఆస్పత్రుల విముఖత
- ఇప్పుడు సిబ్బంది కూడా లేని దుస్థితి
- ఈహెచ్‌ఎస్/జేహెచ్‌ఎస్ ట్రస్టు ఉనికిపైనే సందేహాలు
- ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, పెన్షన్‌దారులు

సాక్షి, హైదరాబాద్:

ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్యం అందించే పథకం (ఈహెచ్‌ఎస్) మొదలై ఏడాది గడిచిపోయినా ఇంకా బాలారిష్టాల్లోనే కొట్టుమిట్టాడుతోంది. ఈ పథకంపై వైద్యారోగ్య శాఖ తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. ఇప్పటికే ఈ పథకం కింద వందల కోట్ల రూపాయల బకాయిలు పేరుకోవడంతో వైద్య సేవలు అందించేందుకు కార్పొరేట్ ఆస్పత్రులు విముఖత వ్యక్తం చేస్తుండగా.. పథకం అమలుకు అవసరమైన సిబ్బంది కూడా లేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈహెచ్‌ఎస్ మొత్తానికి ఒక ఉన్నతాధికారి, ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉన్నారు. వారిలోనూ ఒకరు ఆరోగ్యశ్రీ ట్రస్టులో కొన్ని రోజులు, ఈహెచ్‌ఎస్‌లో కొన్ని రోజుల చొప్పున పనిచేస్తున్నారు. ఫలితంగా ఉద్యోగుల వైద్యసేవల ప్రక్రియకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వైద్యసేవలు, శస్త్రచికిత్సలకు అనుమతి, బిల్లుల తయారీ ప్రక్రియ వెంటవెంటనే పూర్తి కావడం లేదు. ఉద్యోగుల ఓపీ (ఔట్ పేషెంట్) సేవలు, ఔషధాలు, వైద్య పరికరాల కొనుగోలు అంశాలు కూడా ఇబ్బందికరంగా తయారయ్యాయి.



పోస్టులు మంజూరు చేసినా..

ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, జర్నలిస్టులకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయీస్/జర్నలిస్ట్స్ ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్/జేహెచ్‌ఎస్)ను ప్రవేశపెట్టింది. ఈ పథకం పర్యవేక్షణ కోసం సీఈవో నేతృత్వంలో ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేసింది. 15 మంది రెగ్యులర్, 13 మంది ఔట్‌సోర్సింగ్ పోస్టులను మంజూరు చేసింది. రెగ్యులర్ పోస్టుల్లో కొత్తగా నియామకాలు చేపట్టకుండా.. వైద్యారోగ్య శాఖ అనుబంధ విభాగాల్లో పనిచేస్తున్న వారిని డిప్యుటేషన్‌పై నియమించాలని స్పష్టం చేసింది. సీఈవో ఒక్కరినే నియమించారు. పథకం మొదలై ఏడాది గడిచిపోయినా ఇతర అధికారులు, సిబ్బందిని నియమించలేదు. అసలు ప్రభుత్వం అనుమతి ఇచ్చాక ఆ పోస్టుల భర్తీకి వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇది మూడు నెలలుగా పెండింగ్‌లోనే ఉండడంతో ఉద్యోగులకు సేవలపై ప్రతికూల ప్రభావం పడుతోంది.

అంతా గందరగోళమే..

కీలకమైన ఈహెచ్‌ఎస్/జేహెచ్‌ఎస్ పథకం పర్యవేక్షణ విషయంలో గందరగోళం నెలకొంది. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టుకు ప్రత్యేకంగా సీఈవో ఉన్నారు. ఈహెచ్‌ఎస్/జేహెచ్‌ఎస్‌కు మరో సీఈవో ఉన్నారు. వీరిద్దరి విధుల విషయంలో ప్రభుత్వపరంగా స్పష్టత లేదని, ఈ కారణంగానే పరిపాలనా ఇబ్బందులు వస్తున్నాయని సచివాలయంలోని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఇద్దరు సీఈవోల స్థాయి అధికారులను నియమించినప్పుడు వారి విధుల విషయంలోనూ స్పష్టత ఇస్తే ఉద్యోగుల సేవల పథకం ప్రారంభించిన ప్రభుత్వ స్ఫూర్తి నెరవేరేదని అభిప్రాయపడుతున్నాయి. ఇక సిబ్బంది లేక మరిన్ని సమస్యలు తలెత్తుతున్నాయి.

లక్షల మందికి సేవలు..

ఈహెచ్‌ఎస్ సేవలు 2016 డిసెంబర్ 17న మొదలయ్యాయి. అదే నెల 19 నుంచి ప్రైవేటు ఆస్పత్రులతో ఒప్పందం అమల్లోకి వచ్చింది. పథకం కోసం వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం వాటి ద్వారా ఓపీ సేవలను, వైద్య పరీక్షలను, మందులను ఉచితంగా అందిస్తోంది. ఈహెచ్‌ఎస్/జేహెచ్‌ఎస్ సేవల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200 ఆస్పత్రులు ఒప్పందం చేసుకున్నాయి. ఈ పథకం కింద 8,32,085 మంది ఉద్యోగులు, 3,06,125 మంది పెన్షన్‌దారులు, 32,210 జర్నలిస్టులు నమోదయ్యారు. హైదరాబాద్‌లో రెండు చోట్ల, వరంగల్‌లో ఒక వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ మూడు సెంటర్లలో రోజూ సగటున 1,500 మంది సేవలను పొందుతున్నారు.



✦ అచీవర్స్ విద్యార్థుల ప్రపంచ రికార్డ్

111 మంది విద్యార్థులు 38 సెకన్లలో క్యూబ్ పరిష్కరణ

వండర్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో చోటు

సప్తగిరికాలనీ (కరీంనగర్): కరీంనగర్‌లోని అచీవర్స్ స్కూల్ విద్యార్థులు పిరామింక్స్ ర్యూబిక్ క్యూబ్‌లో రికార్డు సాధించారు. తొలిసారిగా పిరామింక్స్ ర్యూబిక్ క్యూబ్ విభాగంలో పాఠశాలకు చెందిన 111 మంది విద్యార్థులు ఒకేసారి కేవలం 38 సెకన్లలో పరిష్కరించి ప్రపంచ రికార్డ్‌ను సృష్టించారు. వండర్ బుక్ రికార్డ్స్ ఇండియా సమన్వయకర్త బింగి నరేందర్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సమన్వయకర్త స్వర్ణశ్రీ, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ హోల్డర్ విజయ భాస్కర్‌ల సమక్షంలో పిరామింక్స్ ర్యూబిక్ క్యూబ్‌ను 111 మంది విద్యార్థులు కేవలం 38 సెకన్లలో పూర్తి చేశారు. దీంతో వారు వండర్ బుక్ రికార్డ్‌లో పాఠశాల పేరు, పాఠశాల విద్యార్థులు చోటు సంపాదించారని ప్రకటించారు. అనంతరం వండర్ బుక్ రికార్డ్ సర్టిఫికెట్‌ను పాఠశాల డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ సీహెచ్ పల్లవిలకు ప్రదానం చేశారు.

✦ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు క్యాట్ నోటీసులు

కన్ఫర్డ్ ఐఏఎస్ పదోన్నతుల వివాదంలో..


సాక్షి, హైదరాబాద్: కన్ఫర్డ్ ఐఏఎస్ పదోన్నతుల వివాదం మరో మలుపు తిరిగింది. రాష్ట్ర సివిల్ సర్వీస్ అధికారులకు ఐఏఎస్ పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి వివరణ ఇవ్వాలని కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర సివిల్ సర్వీస్ అంటే నిర్వచించకుండా కేవలం డిప్యూటీ కలెక్టర్లనే ఐఏఎస్ పదోన్నతులకు పరిగణనలోకి తీసుకోవటంపై గ్రూప్–1 అధికారి పద్మజారాణి క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ కాంతారావు, మిన్నీ మాథ్యూ ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (టాస్) ఏర్పాటుకు ప్రభుత్వం నియమించిన కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. తెలంగాణ సివిల్ సర్వీస్ అంటే నిర్వచించకుండా పాత పద్ధతిలో రెవెన్యూ అధికారులకే పదోన్నతులను కట్టబెట్టడం అన్యాయమన్నారు. ఎన్నో ఏళ్లుగా రాష్ట్ర సర్వీస్ అంటే రెవెన్యూ సర్వీస్ మాత్రమే అన్నట్టుగా కన్ఫర్డ్ ఐఏఎస్ పదోన్నతులు చేపట్టడం చట్టవ్యతిరేకమని వాదించారు. సహజ న్యాయ సూత్రాలకు ఈ విధానం విరుద్ధమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

✦ డ్రైవింగ్ లైసెన్స్ రద్దుపై షోకాజ్

రాష్ట్రంలో 12 పాయింట్లు దాటిన మొదటి వ్యక్తిగా నమోదు

సాక్షి, మేడ్చల్ జిల్లా: హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడిపి 12 పాయింట్లు దాటిన ఓ వ్యక్తికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రవాణా శాఖ అధికారి పుప్పాల శ్రీనివాస్ సోమవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. 12 పాయింట్లు దాటిన ద్విచక్ర వాహనదారుడికి నోటీస్ జారీ చేయడం రాష్ట్రంలోనే మొదటిదని పేర్కొన్నారు. హైదరాబాద్ బర్కత్‌పురా ప్రాంతానికి చెందిన రుషబ్ మహేంద్ర హేనియా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడపడంతో 13 పాయింట్లు నమోదైనట్లు పేర్కొన్నారు. 2017 ఆగస్టు 18 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 12 సార్లు హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడపటంతోపాటు ఒకసారి సెల్‌ఫోన్‌లో మాట్లాడినట్లు సీసీ కెమెరాల్లో నమోదైందన్నారు. ఈ విషయమై లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో పేర్కొంటూ వారంరోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. ఆయన వివరణను బట్టి లైసెన్సు రద్దుపై నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

✦ తాత్కాలిక బెయిల్‌పై మంద కృష్ణ విడుదల



హైదరాబాద్: చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సోమవారం బెయిల్‌పై విడుదలయ్యారు. మంద కృష్ణ బావ మృతి చెందడంతో అంత్యక్రియలకు హాజరయ్యేందుకు కోర్టు షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్‌ను మంజూరు చేసింది. అంత్యక్రియలకు హాజరై తిరిగి మంగళవారం ఆయన జైలుకు రానున్నారు.

✦ టీచర్ పోస్టులకు 2.77 లక్షల దరఖాస్తులు


సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ పోస్టుల కోసం 2,77,574 మంది దరఖాస్తు చేసుకున్నారని టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అత్యధికంగా 1,45,158 దరఖాస్తులు వచ్చాయని పేర్కొంది. దరఖాస్తుల్లో పొరపాట్ల సవరణకు వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్ లింకు ఇస్తామని తెలిపింది. అభ్యర్థులు మంగళవారం(9న) నుంచి 11వ తేదీ వరకు సవరణలు చేసుకోవచ్చని సూచించింది. స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ ఎడ్యుకేషన్) పోస్టులకు అత్యధిక పోటీ నెలకొంది. ఇందులో 9 పోస్టులకు 2,177 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్కో పోస్టుకు 241.88 మంది పోటీ పడనున్నారు. ఒక్కో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకి 74.78 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుకి 16.46 మంది పోటీ పడనున్నారు. ఒక్కో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుకు 40.55 మంది, ఒక్కో లాంగ్వేజ్ పండిట్ పోస్టుకు 23.95 మంది పోటీ పడనున్నారు.

✦ 'ఆధార్' చర్యలను ఖండిస్తున్నాం: ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: పత్రికా స్వేచ్ఛను యూఐడీఏఐ (ఆధార్) హరిస్తున్నట్టుగా ఉందని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) అభిప్రాయపడింది. ఆధార్ డేటా వాట్సప్ ద్వారా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని చండీఘర్ పత్రిక ట్రిబ్యూన్ ప్రచురించినందుకు.. ఆ సంస్థతో పాటు ఓ జర్నలిస్టుపై యూఐడీఏఐ కేసు నమోదు చేయడాన్ని ఐజేయూ ఖండించింది. వెంటనే కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేసింది. యూఐడీఏఐలోని అక్రమార్కుల చర్యలపై స్పందించకుండా జర్నలిస్టులు, పత్రికలపై కేసులు పెట్టడంపై కేంద్రంప్రభుత్వం స్పందించాలని కోరింది. దీనిపై కేంద్రం చర్యలు చేపట్టి ప్రజల్లోని భయాన్ని పోగొట్టాలని ఐజేయూ అధ్యక్షుడు ఎస్.ఎన్ సిన్హా, సెక్రెటరీ జనరల్ దేవులపల్లి అమర్, కార్యదర్శి బల్వీందర్ డిమాండ్ చేశారు.

✦ నేడు బస్‌భవన్ ఎదుట ధర్నా

సాక్షి, హైదరాబాద్: డిమాండ్ల సాధనకు మంగళవారం బస్‌భవన్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ ఎస్ఎంయూ వెల్లడించింది. 62 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ, కార్మికులపై పని ఒత్తిడి తగ్గించటం, డ్రైవర్ల బలవంతపు టిమ్ డ్యూటీ తొలగించటం, కనీస పింఛన్‌ను రూ.10 వేలకు పెంపు తదితర డిమాండ్‌లతో ఈ ధర్నా చేపడుతున్నట్లు నేతలు నాగేశ్వరరావు, కమాల్‌రెడ్డి, మౌలానా పేర్కొన్నారు.



నవీన్ మిట్టల్‌కు సన్మానం

సాక్షి, హైదరాబాద్: సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌గా పనిచేసిన కాలం తనకు సంతృప్తిని ఇచ్చిందని కళాశాల విద్య, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. సోమవారం సమాచార భవన్‌లో సమాచార శాఖ అధికారులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫిలిం డెవలప్‌మెంట్ చైర్మన్ రాంమోహన్‌రావు, సమాచార శాఖ అదనపు సంచాలకుడు కె.నాగయ్య, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ కిషోర్‌బాబు, అధికారులు, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నవీన్‌మిట్టల్

కళాశాల విద్య, సాంకేతిక విద్యా కమిషనర్‌గా నియమితులైన నవీన్‌మిట్టల్ పదవి బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ హోదాలో సోమవారం జరిగిన ఉన్నత విద్యా మండలి పాలకమండలి సమావేశంలో పాల్గొన్నారు.

✦ లెఫ్ట్, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఏకం కావాలి

సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో పార్టీ కార్యదర్శి సురవరం



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ రాజకీయ, ఆర్థిక విధానాలను ఎదుర్కొనేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఏకం కావాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు విజయవాడలో జరిగే పార్టీ జాతీయ సమితి సమావేశాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళితులు, కమ్యూనిస్టులు కలసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తోందన్నారు. మతం పేరిట దళితులు, మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. అంతకుముందు పార్టీ సీనియర్ నేత షమీమ్ ఫైజ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యదర్శి నివేదికను, రాజకీయ ముసాయిదాను సురవరం ప్రవేశ పెట్టారు. రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో పార్టీ జాతీయ నేతలు డి.రాజా, అతుల్ కుమార్ అంజన్, కె.నారాయణ, పన్నీర్ రవీంద్రన్, రామేంద్ర, నాగేంద్రనాథ్ ఝా తదితరులు పాల్గొన్నారు.

✦ ఫీజు నియంత్రణ నివేదికను వెల్లడించాలి



సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం నియమించిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ ఫీజులను నియంత్రించకపోగా పెంచాలని సిఫారసు చేయడం అన్యాయమని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ప్రైవేటు స్కూళ్ల ఫీజులు రాష్ట్రంలోనే అత్యధికంగా ఉన్నాయని, తక్షణమే కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని సోమవారం డిమాండ్ చేశారు. అధిక ఫీజులు అరికట్టాలని సాగిన ఉద్యమాల వల్లే కమిటీని ప్రభుత్వం నియమించిందని గుర్తుచేశారు. మేనేజ్‌మెంట్ల సహాయ నిరాకరణ వల్ల ఏప్రిల్‌లో ఇవ్వాల్సిన నివేదిక 10 నెలలు ఆలస్యంగా ఇచ్చినట్లు తెలుస్తోందని అన్నారు. నివేదికలో ఫీజుల భారం తగ్గించాలని ప్రతిపాదించకపోగా.. మరింత పెంచేలా సూచనలు చేసినట్లు తమకు సమాచారం ఉందని తెలిపారు. విద్యారంగాన్ని పట్టిపీడిస్తున్న కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల సమస్యపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

✦ విప్‌ల సదస్సు సిఫారసుల అమల్లో రాష్ట్రం ఫస్ట్

మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గోవా, విశాఖపట్నం నగరాల్లో 2014, 2015లో జరిగిన ఆలిండియా విప్‌ల సదస్సుల్లో చేసిన సిఫారసులను అమలు చేయడంలో తెలంగాణ శాసన సభ, శాసన మండలి ముందంజలో ఉన్నాయని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో సోమవారం ప్రారంభమైన 18వ ఆలిండియా విప్‌ల సదస్సులో పాల్గొన్న పల్లా గత సదస్సుల్లో చేసిన తీర్మానాలు, తెలంగాణలో అమలవుతున్న తీరును వివరించారని టీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. సిఫారసుల అమలులో తెలంగాణ ప్రభుత్వం ఫలవంతమైన కృషి చేస్తోందని, శాసన సభ, మండలి సమావేశాలను స్ఫూర్తిదాయకంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. శీతాకాల సమావేశాలను 20 రోజుల పాటు నడపడం ద్వారా దేశానికే స్ఫూర్తిని ఇచ్చామన్నారు. సదస్సు సందర్భంగా రాజస్తాన్ సీఎం వసుంధరా రాజే, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్, కేంద్ర మంత్రి విజయ్ గోయెల్‌ను కలసి పలు అంశాలపై చర్చించామని తెలిపారు. ఉదయ్‌పూర్ సదస్సులో మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉభయ సభల విప్‌లు బోడకుంటి వెంకటేశ్వర్లు, గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, గంప గోవర్ధన్, శాసన సభా కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారని వెల్లడించారు.

✦ పంచాయతీరాజ్ చట్ట సవరణను అడ్డుకుంటాం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేసేం దుకు యత్నిస్తే, సుప్రీంకోర్టును ఆశ్రయించైనా సరే సవరణను అడ్డుకుంటామని బీజేపీ ప్రకటించింది. గ్రామ స్వరాజ్య స్ఫూర్తిని ఛిన్నాభిన్నం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ చట్ట సవరణను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు సోమవారం పేర్కొన్నారు. సర్పంచుల హక్కులను హరించేలా సీఎం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి తీరును అడ్డుకునేందుకు సర్పంచులు ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

✦ సామ్రాజ్యవాద భావజాలాన్ని అడ్డుకోవాలి

విరసం నేత వరవరరావు



హైదరాబాద్: బ్రాహ్మణీయ, సామ్రాజ్యవాద భావజాలాన్ని అడ్డుకోవాలని విరసం నేత వరవరరావు అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విప్లవ రచయితల సంఘం (విరసం) 26వ మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. నేరెళ్ల ఘటన, మందకృష్ణ మాదిగ అరెస్టుల నేపథ్యంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందనిపిస్తోందని అన్నారు. రాజ్యం చేతిలో అనేకమంది విప్లవ రచయితలు, ఆదివాసీలు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలు, ఆదివాసీల మధ్య పాలకులు చిచ్చు పెడుతున్నారని విమర్శిం చారు. చివరికి ప్రభుత్వ కార్యాలయాలకూ కాషాయం రంగు వేస్తున్నారన్నారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారిని ప్రపంచ తెలుగు మహాసభలకు దూరం పెట్టారన్నారు. ఈ నెల 13, 14 తేదీల్లో మహబూబ్‌నగర్ క్రౌన్ గార్డెన్‌లో జరిగే విరసం మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విరసం సభ్యులు గీతాంజలి, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

✦ ఎస్సీ, ఎస్టీల కంటే దయనీయం

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: బీసీ కేటగిరీలో కొనసాగుతున్న సంచార జాతుల జీవన స్థితిగతులు ఎస్సీ, ఎస్టీల కంటే దయనీయంగా ఉన్నాయని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎంబీసీ కార్పొరేషన్ కార్యాలయంలో గంగిరెద్దుల కులస్తులు ప్రదర్శనలిచ్చారు. గంగిరెద్దుల కులానికి స్వయం ఉపాధి పథకాలను కేటాయించాలని చైర్మన్ కోరారు. కులవృత్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. కులవృత్తులు సంస్కృతితో పాటు ఆత్మగౌరవాన్ని కాపాడుతాయని, గంగిరెద్దుల కులస్తులు భిక్షాటన చేసేవారు కాదని పేర్కొన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ తరపున వారికి ప్రత్యేక నిధి కేటాయిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

✦ తోటి విద్యార్థుల వేధింపులు భరించలేక..

ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్న బాలిక మృతి

జిన్నారం/గుమ్మడిదల (పటాన్‌చెరు): తోటి విద్యార్థుల వేధింపులకు మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించి చివరికి కన్నుమూసింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో చోటు చేసుకుంది. శ్రీశైలం, పుణ్యవతి దంపతుల కూతురు లావణ్య తోటి విద్యార్థుల వేధింపులతో మనస్తాపానికి గురై వారం క్రితం ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను వెంటనే హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. వారం రోజులు మృత్యువుతో పోరాడిన లావణ్య సోమవారం కన్నుమూసింది. లావణ్య బొంతపల్లి గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమె తరగతికే చెందిన ఇద్దరు విద్యార్థులు నెల రోజులుగా సూటిపోటి మాటలతో వేధించారు. ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోవడంతో చివరికి ఆత్మహత్యకు యత్నించింది. లావణ్య కుటుంబీకులు పాఠశాల యాజమాన్యంతో ఈ విషయమై గొడవకు దిగగా పోలీసులు సర్ది చెప్పారు.

✦ బాలకార్మికులు కాదు.. విద్యార్థులే!

హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పిల్లలు ఇసుక మోత పనులు చేస్తూ కనిపించారు. పాఠశాలలో చదువుకోవాల్సిన చిన్నారులతో ఇసుక మోయిస్తూ బాలకార్మికులుగా మార్చడం దారుణమని పలువురు మండిపడ్డారు. విద్యార్థులతో పనులు చేయించిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.



ఏడాదిలోగా 'పాలమూరు' మొదటి దశ

సాక్షి, నాగర్‌కర్నూల్/గద్వాల

సొరంగ మార్గం పనులను పరిశీలించిన మంత్రి హరీశ్

- ఇది ఆసియాలోనే అతి పొడవైన సొరంగం
- గద్వాలలో 'తుమ్మిళ్ల' ఎత్తిపోతలకు శంకుస్థాపన
- నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో మంత్రి సుడిగాలి పర్యటన
- కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నా వెనక్కి తగ్గేది లేదని స్పష్టీకరణ

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల (పీఆర్ఎల్ఐ) పథకాన్ని దేశం గర్వించే స్థాయిలో తీర్చిదిద్దుతామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం తీగలపల్లిలో నిర్మిస్తున్న 'పాలమూరు'ఎత్తిపోతల పథకం సొరంగం పనులను మంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి తదితరులతో కలసి పరిశీలించారు. పంప్ హౌస్ పనులనూ పర్యవేక్షించారు. అలాగే.. గద్వాల జిల్లాలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఏదుల వద్ద నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు సొరంగం ఆసియాలోనే పెద్దదని చెప్పారు. 145 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల మొత్తం 34 శక్తిమంతమైన పంపుల ద్వారా ఒక్కో పంపు నుంచి 3 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తి పోసేందుకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. మొదటి దశ పనులను సంవత్సరంలోపు పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఏదుల రిజర్వాయర్ సమీపంలోని బండరాయిపాకుల, పొంకలపల్లి గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమకు పుట్టగతులు ఉండవన్న ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకులు కోర్టు కేసుల ద్వారా పనులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆరునూరైనా ఈ ప్రాజెక్టు పూర్తి చేసి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు.



కొడేరు మండలం తీగలపల్లి వద్ద టన్నెల్‌ను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఆరు నెలల్లో 'తుమ్మిళ్ల' పూర్తి




తుమ్మిళ్ల ఎత్తిపోతల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు తదితరులు

ఆరు నెలల్లో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని హరీశ్‌రావు అన్నారు. తాను నెలనెలా వచ్చి పనులను పరిశీలిస్తానని చెప్పారు. వచ్చే వర్షాకాలం నాటికి ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా సాగు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఆనాటి ఉద్యమ నాయకుడు, నేటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదే ఆర్డీఎస్ కోసం 2002 జూలై 23న పాదయాత్ర చేశారని, ఆరోజు ఆయన వెంట తాము కూడా పాదయాత్ర చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం నీళ్ల మంత్రిగా తాను తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరిగిందనడానికి ఆర్డీఎస్ సజీవసాక్ష్యమని పేర్కొన్నారు. 1944లో హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్న సందర్భంలో మద్రాస్ రాష్ట్రానికి హైదరాబాద్ రాష్ట్రానికి మధ్య తుంగభద్ర నీళ్ల ఏ విధంగా వాడుకోవాలనే అంశంపై ఒప్పందం జరిగిందని, ఆర్డీఎస్‌కు తుంగభద్రకు 65 టీఎంసీల చొప్పున వాడుకోవాలని అప్పట్లో ఒప్పందం జరిగిందన్నారు. దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్‌లో కలవడం వల్ల కృష్ణా నీళ్ల పంచేందుకు ఏర్పాటు చేసిన బచావత్ ట్రిబ్యునల్ ఆర్డీఎస్‌కు కేవలం 16.5 టీఎంసీలు అడిగారని, చివరికి 15.9 టీఎంసీలు మాత్రమే కేటాయించారని, అవి కూడా గత 15 ఏళ్లుగా 5 టీఎంసీలకు మించి వాడుకోలేదని మంత్రి వివరించారు. గత ప్రభుత్వాల వైఫల్యం వల్లనే ఈ ప్రాంత ప్రజలు అన్యాయానికి గురయ్యారని చెప్పారు. రూ.783 కోట్లతో తుమ్మిళ్లకు శంకుస్థాపన చేశామంటే అందుకు తెలంగాణ రావడం, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం వల్లనే సాధ్యమైందని హరీశ్‌రావు తెలిపారు.

అనుమానాలుంటే తీరుస్తాం

'సాక్షి'తో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు

- విద్యుత్ కొనుగోళ్లపై నిరాధార ఆరోపణలు
- డాక్యుమెంట్లు చూపిస్తాం.. పారదర్శకంగా విద్యుత్ కొనుగోలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిరంతర విద్యుత్, సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిపట్ల ఎవరికైనా అనుమానాలుంటే, ఏ వేదిక నుంచైనా నివృత్తి చేసేందుకు సిద్ధమని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. డాక్యుమెంట్లను ఆధారంగా చూపి స్పష్టత ఇస్తామని చెప్పారు. నిరంతర విద్యుత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీలేదని, దేశవ్యాప్తంగా పెద్దమొత్తంలో మిగులు విద్యుత్ లభ్యత ఉండడంతో సాధ్యమైందని కాంగ్రెస్, టీజేఏసీ నేతలు చేసిన ఆరోపణలపై స్పందించేందుకు నిరాకరించారు. పూర్తి సమాచారం తెలియకుండానే కొందరు అలా మాట్లాడుతున్నారని అన్నారు. సోమవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. పవర్ ఎక్స్ఛేంజీల్లో చౌకగా విద్యుత్ లభ్యత ఉన్నా అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చారు. తాత్కాలిక ఒప్పందాల ద్వారా వ్యయసగటు యూనిట్‌కు రూ.3.87 అయితే, పవర్ ఎక్స్ఛేంజీల్లో రూ.3.98 ఉందన్నారు. కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో తాత్కాలిక విద్యుత్ కొనుగోళ్లను పారదర్శకంగా జరుపుతున్నామని పేర్కొన్నారు.

24 గంటలపై పునరాలోచన లేదు..

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాపై పునరాలోచన లేదని ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచిస్తోందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిశోర్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నుంచి తమకు అలాంటి సూచనల్లేవన్నారు. మోటార్ల ఆటోస్టార్టర్లను తొలగించాలని రైతులకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని, ఎక్కడా బలవంతం పెట్టడం లేదని చెప్పారు. ఆటోస్టార్టర్ల నష్టాలను వివరిస్తున్నామన్నారు. వాటి తొలగింపుపై సీఎం త్వరలో రైతులకు విజ్ఞప్తి చేయనున్నారని తెలిపారు. వ్యవసాయానికి 2016-17లో 14,300 మిలియన్ యూనిట్లు, 2017-18లో 15,600 ఎంయూ విద్యుత్ సరఫరా చేయగా, 2018-19లో 16,853 ఎంయూలను సరఫరా చేయాల్సి ఉంటుందని అంచనా వేశామన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాతో పెరిగే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించనుందని చెప్పారు. అందుకే రాష్ట్రం లో విద్యుత్ చార్జీలను పెంచడం లేదన్నారు. విద్యుత్ సబ్సిడీని రూ.5,400 కోట్లకు పెంచుతామని సీఎం హామీ ఇచ్చారన్నారు. నిరంతర విద్యుత్‌తో గ్రామీణ ప్రాంతాలకు కొత్త పరిశ్రమలు వచ్చే అవకాశముందన్నారు. సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై ఇతర రాష్ట్రాల అధికారులు తనకు ఫోన్ చేసి వివరాలు సేకరించారని వెల్లడించారు.

ఏఈ సిలబస్‌లో మార్పులుండవు

ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం కొత్త సిలబస్‌తోనే రాతపరీక్ష నిర్వహిస్తామని ప్రభాకర్‌రావు తెలిపారు. అభ్యర్థులు కోరుకున్న సిలబస్ ప్రకారం పరీక్ష నిర్వహించడం సరికాదన్నారు. గేట్ సిలబస్ ఆధారంగానే రాత పరీక్ష ఉంటుందన్నారు.

బీజేపీకి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రాజీనామా



హైదరాబాద్: బీజేపీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేశారు. జనగామ ప్రజలు, అభిమానుల ఒత్తిడి మేరకే తానీ నిర్ణయం తీసుకున్నానని ఆయన ప్రకటించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన రాజీనామా పత్రాన్ని ప్రదర్శించారు. పార్టీలో క్రమశిక్షణ లోపించడం వల్ల బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు కొమ్మూరి తెలిపారు. అన్ని మండలాల ముఖ్య నాయకులూ తన బాటలోనే నడవనున్నట్లు తెలిపారు. ఏ పార్టీలో చేరుతారని విలేకరులు అడిగిన ప్రశ్నకు.. ప్రజల అభీష్టం మేరకే నడుచుకుంటానని బదులిచ్చారు. మంత్రి హరీశ్‌ను కేవలం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకే కలిశానని, రాజకీయ చర్చ జరగలేదని పేర్కొన్నారు.

విత్తన కంపెనీల బాగోతం

భారీగా పన్ను ఎగవేత

- టర్నోవర్‌కు, పన్ను చెల్లింపునకు భారీ తేడాను కనుగొన్న ఐటీ శాఖ

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేని విత్తనాలు అమ్మడమే కాదు, నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకుని దానికి లెక్క చూపించకుండా పన్ను ఎగవేతలోనూ విత్తన కంపెనీలు పోటీ పడుతున్నాయి. తెలంగాణ, ఏపీ, కర్ణాటకతో పాటు గుజరాత్‌లో ఇటీవల ఆదాయపన్ను శాఖ నిర్వహించిన దాడులలో ఇది తేటతెల్లమైంది. రైతులకు విక్రయించిన విత్తనాలకు లావాదేవీల సొమ్మును డీలర్లు నగదు రూపంలో తీసుకున్నా, కంపెనీకి చెల్లించేటప్పుడు రూ.2 లక్షలు దాటితే చెక్కు రూపంలో చెల్లించాలి. కానీ, విత్తన కంపెనీలు కోట్ల రూపాయలను అక్రమంగా తీసుకుంటున్నాయి. రైతాంగం నుంచి తక్కువ మొత్తంలో వచ్చిన మొత్తం డీలర్ల దగ్గరకు వచ్చేసరికి లక్షల్లో అవుతుంది. కానీ, విత్తన కంపెనీల యాజమాన్యాలు ఇచ్చే పారితోషకాలను దృష్టిలో ఉంచుకుని విత్తన వ్యాపారులు, ఆథరైజ్డ్ డీలర్లు 70 నుంచి 80 శాతం మొత్తంను నగదు రూపంలో చెల్లిస్తున్నట్లు తాజా దాడులలో వెల్లడైంది. తెలుగు రాష్ట్రాలతోపాటు దక్షిణాదిన బీటీ పత్తి విత్తనాలు విక్రయించడంలో నంబర్-1గా నిలిచిన ఓ కంపెనీ ఏకంగా రూ.330 కోట్ల మేర నగదు స్వీకరించినట్లు తెలిసింది. దాదాపు నాలుగు రోజులపాటు ఈ కంపెనీ డాక్యుమెంట్లు పరిశీలించిన ఆదాయపన్ను శాఖ బృందం ఈ మేరకు అంచనా వేసినట్లు అత్యున్నత అధికార వర్గాలు తెలియజేశాయి. గ్రామాలవారీగా విత్తనాలు అమ్మి రైతుల నుంచి సేకరించిన నగదు మొత్తాన్ని విత్తన వ్యాపారులు లేదా డీలర్లు బ్యాంక్‌లలో డీడీ తీయడమో లేదా చెక్కు రూపంలో ఆయా కంపెనీలకు జమ చేయాలి. అలాకాకుండా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో విత్తనాలు విక్రయించిన వ్యాపారులు, డీలర్లు రూ.2 లక్షలు దాటిన లావాదేవీలను కూడా నగదు రూపంలో తీసుకున్నట్లు తెలిసింది.

సీఎం కేసీఆర్ మాదిగల వ్యతిరేకి: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ మాదిగల వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ మాజీ విప్ టి.జగ్గారెడ్డి సోమవారం మండిపడ్డారు. మాదిగల హక్కుల కోసం పోరాడుతున్న మంద కృష్ణపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. దీనిపై టీఆర్ఎస్ మాదిగ నేతలెందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మంద కృష్ణను జైల్లో పెట్టడమంటే మాదిగ జాతిని జైల్లో పెట్టినట్టేనన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తమ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న పోలీసుల సంగతి తేలుస్తామని హెచ్చరించారు. గవర్నర్ సైతం రాజ్యాంగ పరిరక్షకుడిగా వ్యవహరించడం లేదన్నారు. మూడేళ్లుగా ప్రకటనలకే పరిమితమైన సీఎం ఎన్నికలు సమీపిస్తుండటంతో రైతుల జపం చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రానికి నిధులు రాబట్టాలి

- ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల సదస్సులో సీఎస్
- కేంద్ర ఆర్థిక సంఘం నిధులకు వ్యూహరచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి అత్యధిక నిధులు వచ్చేలా కేంద్ర ఆర్థిక సంఘానికి నివేదికలు అందజేయాలని ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించింది. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన సమాచారంతో నివేదికలను తయారు చేయాలని, నిధులు రాబట్టేందుకు అధికారులు సమర్పించే నివేదికలే కీలకమని అప్రమత్తం చేసింది. కేంద్ర ఆర్థిక సంఘం మొదటిసారిగా రాష్ట్రాల పురోగతిని దృష్టిలో పెట్టుకొని ప్రోత్సాహక గ్రాంట్లు ఇవ్వాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో అత్యధిక నిధులు రాబట్టే వ్యూహంతో నివేదికలు సిద్ధం చేయాలని చీఫ్ సెక్రటరీ ఎస్పీ సింగ్ అన్ని శాఖల అధికారులకు సూచించారు. సోమవారం సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ భేటీ అయ్యారు. స్థానిక సంస్థలకు గ్రాంట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా, జిల్లాల వారీగా అభివృద్ధి, వివిధ అంశాల్లో సాధించిన ప్రగతి, స్ట్రాటజీ డెవలప్‌మెంట్ గోల్స్, ఆదాయ-వ్యయాలు, పన్నుల వసూలు వివరాలన్నీ ఆర్థిక సంఘానికి పంపించాలి. వీటన్నింటిపైనా సీఎస్ చర్చించారు. ఈ నివేదికలకు ఆర్థిక శాఖలో ప్రత్యేక టీం, నోడల్ అధికారిని నియమించినట్లు సీఎస్ తెలిపారు. 2019 అక్టోబర్ 30న ఆర్థిక సంఘం కేంద్రానికి నివేదిక సమర్పిస్తుందని, ఏప్రిల్ 2018 నుంచి వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తుందన్నారు. అందుకే అన్ని శాఖలు 2018 ఫిబ్రవరి 7 నాటికి తమ శాఖల్లో చేపడుతున్న పనులు వాటి ప్రగతి, లక్ష్యాలు తదితర వివరాలు సమర్పించాలన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు ఈ నెల 15 నాటికి సమర్పించాలని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను కోరారు.

'పెట్టుబడి'పై 5 ప్రతిపాదనలు

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాకు ఒక గ్రామంలో రైతు సభలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించనుంది. హైదరాబాద్ మినహా మిగిలిన 30 జిల్లాల్లోని 30 గ్రామాల్లో ఈ ప్రతిపాదనలపై రైతుల అభిప్రాయం సేకరించి ఏ అభిప్రాయానికి ఎంత శాతం రైతుల మద్దతు ఉందో పరిగణనలోకి తీసుకోనుంది. ఆ ప్రకారం వ్యవసాయశాఖ నివేదిక తయారు చేయనుంది. అలాగే ప్రజాప్రతినిధులు, రైతు నేతలతో మంత్రులు మేధోమథనం చేయనున్నారు. ఉపసంఘంలోని మంత్రులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతోనూ చర్చించనున్నారు. ఐదు ప్రతిపాదనల్లో ఏ ప్రతిపాదనకు రైతులు, ప్రజాప్రతినిధులు మొగ్గుచూపారో దాని ప్రకారం నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఉపసంఘం బుధవారం మరోసారి సమావేశం కానుంది. ఆ రోజు కూడా స్పష్టత రాకుంటే మూడోసారి కూడా ఉపసంఘం సమావేశమయ్యే అవకాశముంది. సోమవారం జరిగిన సమావేశంలో మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, టి. హరీశ్‌రావు, కె.తారక రామారావు, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు రాజీవ్‌శర్మ, వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయశాఖ కమిషనర్ ఎం.జగన్మోహన్, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ప్రతినిధులు పాల్గొన్నారు.



సోమవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం భేటీలో మంత్రులు కేటీఆర్, పోచారం, జూపల్లి, తుమ్మల, హరీశ్, ఈటల రాజేందర్

నేరుగా డబ్బు వద్దంటున్న వ్యవసాయశాఖ...

71.75 లక్షల వ్యవసాయ ఖాతాల్లోని రైతులకు చెందిన 1.42 కోట్ల ఎకరాల భూమికి ప్రభుత్వం ఈ పథకం కింద ఒక సీజన్‌కు దాదాపు రూ. 5,680 కోట్లు అందించాల్సి రానుంది. అయితే అంత సొమ్ము నేరుగా ఇవ్వడం అసాధ్యమని ఆర్థిక, వ్యవసాయశాఖ వర్గాలు ఉపసంఘం భేటీలో స్పష్టం చేసినట్లు తెలిసింది. ఒకేసారి అంత సొమ్మును జమ చేయడం కష్టమని ఆర్థికశాఖ స్పష్టం చేయగా, గ్రామాల్లో అంత డబ్బు పంపిణీ చేస్తే అక్రమాలు జరిగే అవకాశముందని, దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొన్నట్లు సమాచారం. నేరుగా డబ్బు పంపిణీ చేసే ప్రక్రియను కోర్టులో సవాల్ చేసే అవకాశాలున్నాయని కూడా కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇక రైతు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేయడం వల్ల వారి అప్పులను బ్యాంకులు తీర్చేసుకుంటాయన్న అనుమానాలున్నాయి. అలా చేయబోమని బ్యాంకర్లు గ్యారంటీ ఇస్తే ఆలోచించాలన్న చర్చ జరిగింది. ఈ అంశంపై ఎస్ఎల్‌బీసీ మంగళవారం బ్యాంకర్లతో అత్యవసర సమావేశానికి పిలుపునిచ్చింది. ఆ సమావేశంలో తీసుకునే నిర్ణయం కూడా కీలకం కానుంది. వ్యవసాయ రుణమాఫీ విషయంలో రైతుల నుంచి వడ్డీ వసూలు చేయకూడదని రెండేళ్లుగా ఎస్ఎల్‌బీసీ సమావేశాల్లో మంత్రులు కోరినా బ్యాంకులు పట్టించుకోకపోవడం విదితమే. కాబట్టి బ్యాంకుల హామీని నమ్మి ముందుకెళ్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేయకుండా సంబంధిత అన్ని బ్యాంకుల్లో చెల్లుబాటయ్యేలా చెక్కులు ఇవ్వడమే మేలని వ్యవసాయశాఖ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఆయా చెక్కులను గ్రామ సభల్లో రైతులకు పంపిణీ చేస్తే ఏ సమస్యా రాదని అంటున్నారు. మే 15వ తేదీ నాటికి రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉండగా ఆ సమయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో రైతు చైతన్య సభలు జరగనున్నాయి. దీంతో అప్పుడే గ్రామ సభలు నిర్వహించి పెట్టుబడి పథకం చెక్కులను రైతులకు ఇస్తే బాగుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. రెండ్రోజుల క్రితం మంత్రి పోచారం నల్లగొండ జిల్లాలోని పెద్దకాపర్తి గ్రామంలో రైతు సభ నిర్వహించగా అందులో ఎక్కువ మంది రైతులు పోస్టల్ ఖాతాల ద్వారా పెట్టుబడి సాయం నగదును పంపిణీ చేయాలని కోరారు. రైతులు బ్యాంకులను నమ్మట్లేదనేందుకు ఇదో నిదర్శనమని అధికారులు చెబుతున్నారు.

దేశం చూపు రాష్ట్రం వైపు: పోచారం

పెట్టుబడి పథకంపై దేశమంతా తెలంగాణ వైపు ఆసక్తిగా చూస్తోందని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో ఉపసంఘం భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ''మొదటి సమావేశంలో అందరి అభిప్రాయాలు తీసుకున్నాం. గ్రామాల్లో సభలు, సమావేశాల ద్వారా రైతులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకుంటాం. బుధవారం మరోసారి సమావేశమవుతాం. పెట్టుబడి పథకం నగదు నేరుగా రైతులకు చేరాలన్నదే మా అభిమతం. రైతులకు ప్రస్తుతమున్న ఖాతాల్లోనే నగదును జమ చేస్తే పాత బకాయిల కింద జమకడతారని రైతులు అనుమానం వ్యక్తం చేయడం సహజం. దీనికి సంబంధించి ఎస్ఎల్‌బీసీ అత్యవసర సమావేశం మంగళవారం జరగనుంది'' అని మంత్రి చెప్పారు. ఆ సమావేశంలో వారు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూస్తున్నామని, అందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని పోచారం తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం, 9-1-2018



ఆరాధ్య, ఐశ్వర్య

విశేషం

కూతురు కూచి

ఎక్కడైనా 'అమ్మకూచి' ఉంటుంది. కూతురు కూచి ఉంటుందా? ఉంటుంది! చూస్తూనే ఉన్నారుగా. ఐశ్వర్యారాయ్! ఎప్పుడూ కూతురు చెయ్యి పట్టుకుని తిరగాల్సిందే. కాన్స్ ఫెస్టివల్‌లో రెడ్ కార్పెట్‌పై నడిచేటప్పుడు.. పక్కన కూతురు. ఆస్ట్రేలియాలో ఇండియా జెండాని ఆవిష్కరిస్తున్నప్పుడు.. పక్కన కూతురు. ఎవరి పెళ్లికైనా వెళితే.. పక్కన కూతురు. దుర్గా పూజ చేస్తుంటే.. పక్కన కూతురు. ఇప్పుడు చెప్పండి.. ఐశ్వర్యారాయ్ కూతురు కూచీనే కదా. నవంబర్ 16న ఆరాధ్య బర్త్‌డే సెలబ్రేషన్స్‌లో చూడాల్సింది. కూతురెవరో, తల్లెవరో తెలియలేదు. ఇద్దరూ ఒకటే డ్రెస్ వేసుకున్నారు. టూల్ గౌన్లు! ఆ లైట్ పింక్ కలర్ టూల్ గౌన్‌లలో ఐశ్వర్య చిన్నపిల్ల అయిపోయిందా, ఆరాధ్య.. అమ్మలా కనిపించిందా.. ఏమో కన్‌ఫ్యూజన్. నిన్న మళ్లీ ముంబై పోర్ట్‌లో ఇద్దరూ ట్విన్స్‌లా ప్రత్యక్షం అయ్యారు. బ్లూ షర్ట్, బ్లాక్ ప్యాంట్. మీరు చూస్తున్న ఫొటో అదే. ఆరాధ్యకు ఆరేళ్లు. తెలిసినవాళ్లంతా.. 'స్కూల్‌కి పోదా మీ అమ్మాయి' అని ఐశ్వర్యను, అభిషేక్‌ను పీక్కుతింటున్నారు. మమ్మీ డాడీలు నవ్వి ఊరుకుంటున్నారు. 'సరోగేట్ మదర్'గా ఐశ్వర్య ఓ సినిమాలో నటించబోతున్నారు. అందులో బిజీ అయిపోయాక, ఈ కూతురు కూచి ఆరాధ్యపై బెంగపెట్టుకుంటారో ఏమో!

నేడు ఎన్నారై డే



'దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు గుర్తేమిటంటే.. స్త్రీలు స్వేచ్ఛగా బయట కూడా మసలగలగడం' అని గాంధీజీ అన్నారు. కొంచెం కొంచెం పరిస్థితి మారుతోంది. సీసీ కెమెరాలు పెడుతున్నారు కదా! కానీ భార్యల్ని భర్తలు పెట్టే చిత్రహింసల్ని ఏ కెమెరాలు కనిపెడతాయి? కన్నవాళ్లకు, ఉన్న ఊరికి, ఆఖరికి దేశానికి కూడా దూరమై భర్తతో పాటు పరాయి తీరాలకు చేరిన బాధిత మహిళలను కనిపెట్టుకుని ఉండేదెవరు? భర్తే దగా చేస్తే, భర్తే దూరం చేస్తే, భర్తే మోసం చేస్తే.. ఆ స్త్రీకి దిక్కెవరు? ఇవాళ ఎన్నారై డే. ప్రవాసీ భారతీయ దివస్. 2003 నుంచి యేటా జరుపుకుంటున్నాం. జనవరి 9నే ఎందుకు? దక్షిణాఫ్రికాలో ఎన్నారైగా ఉన్న గాంధీజీ 1915లో ఇదే రోజున ఇండియాకు తిరిగొచ్చారు. అందుకు. ఈ సందర్భంగా మాట్లాడుకోవలసిన మంచి విషయాలు చాలా ఉన్నాయి. అన్నిటికన్నా మంచి విషయం.. ఎన్నారై బాధిత భార్యల కోసం మన దేశం ఓ వెబ్‌సైట్‌ను రెడీ చేస్తోంది. అది మొదలైతే.. మన సిస్టర్స్ విదేశాల్లోనూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఉండగలరు.



● ఎస్కేప్ అయ్యే ఎన్నారై భర్తల కోసం ప్రత్యేక బృందాలు. ● సైట్‌లో కంప్లైంట్ పడితే చాలు.. హబ్బీలు వెబ్‌లో పడ్డట్లే!

ముగ్గురమ్మల కూతురు

మూడు ముళ్ల బంధానికి మూడు శాఖల కాపలా!

● స్త్రీ శిశు సంక్షేమ శాఖ ● విదేశీ వ్యవహారాల శాఖ ● న్యాయ శాఖ



ఎన్నారై వధువుల సంక్షేమం, సంరక్షణల కోసం భారత ప్రభుత్వం ఒక వెబ్‌సైట్ ప్రారంభించబోతోంది. కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ దీనిని నిర్వహిస్తుంది.

భార్యను వెళ్లగొట్టినవారిని ఈ సైట్ గుర్తిస్తుంది. భార్యను మోసం చేసి పరారైనవారిని పట్టితెస్తుంది. భార్యపై గృహహింసకు పాల్పడుతున్నవారిని చట్టానికి పట్టిస్తుంది.

దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నారై పెళ్లి జరిగినా అక్కడి రిజిస్ట్రార్ వరుడి పూర్తి వివరాలను ఈ వెబ్‌సైట్‌కు అప్‌లోడ్ చేస్తే తప్ప మ్యారేజ్ సర్టిఫికెట్ బయటికి వచ్చేందుకు వీలు లేకుండా ఇప్పటికే ఒక సాఫ్ట్‌వేర్ కూడా సిద్ధం అయింది!

పూర్తి వివరాలు.. అంటే.. వరుడి వృత్తి, ఉద్యోగం, చిరునామాలు, ఆ ఫోన్ నెంబర్లు, కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఫోన్ నెంబర్లు, మెయిల్ ఐడీలు, బ్యాంక్ అకౌంట్‌లు, ఇతర సోషల్ మీడియా అకౌంట్‌లు.. ఇలా కీలకమైనవన్నీ.

బాధితురాలు ఈ సైట్‌లో ఫిర్యాదు ఇవ్వగానే ఆ వివరాల ఆధారంగా నిందితుడు ఎక్కడున్నా ప్రత్యేక బృందాలు గాలించి పట్టుకుంటాయి.

ఇందుకోసం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, విదేశీ వ్యవహారాల శాఖ సమన్వయంతో పనిచేస్తాయి. ఆ శాఖకు (మేనకా గాంధీ), ఈ శాఖకు (సుష్మా స్వరాజ్) ఇద్దరూ మహిళా మంత్రులే కాబట్టి బాధితురాలికి న్యాయం జరిగే విషయంలో అలసత్వానికి, జాప్యానికి అవకాశమే ఉండదు. ఈ రెండు శాఖలకు న్యాయ శాఖ సహకారం ఉంటుంది.

3,328

(2015 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు వివిధ దేశాలలోని భారత రాయబార కార్యాలయాలకు అందిన ఎన్నారై భార్యల ఫిర్యాదులు మొత్తం. వీటిల్లో భార్యలపై భర్తలు ఇచ్చినవీ ఒకటీ అరా ఉన్నాయి.)

3,268

(పరిష్కారం అయిన ఫిర్యాదుల సంఖ్య)

పరిష్కార విధానాలు

- కౌన్సెలింగ్
- గైడెన్స్
- న్యాయపరమైన సలహాలు
- ఎన్నారై భర్తలకు సమన్లు

(విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి వి.కె.సింగ్ పార్లమెంటుకు ఇచ్చిన సమాచారం అధారంగా)

ఎన్నారై భార్యల నుంచి తరచూ వచ్చే ఫిర్యాదులు



- ఇండియాలో పెళ్లి జరిగిన వెంటనే వరుడు అదృశ్యమైపోవడం
- పెళ్లి చేసుకుని తీసుకెళ్లాక, భార్యను ఇండియా రానివ్వకపోవడం.
- భార్య పాస్‌పోర్ట్‌ను ఆమెకు అందుబాటులో లేకుండా చేయడం.
- భార్యను ఆ పరాయి దేశంలోనే వదిలేసి భర్త వెళ్లిపోవడం.
- భార్యను ఇండియా పంపించి, పిల్లల్ని తనతోనే ఉంచేసుకోవడం.

(ఇవి కాక.. లైంగిక చిత్రహింసలు, అదనపు కట్నం కోసం వేధింపులు)

ఎవిడెన్స్ యాక్టులో మార్పులు!



- ఎన్నారై బాధిత భార్యల కోసం అందుబాటులోకి తెస్తున్న వెబ్‌సైట్‌లో.. భర్తలకు ఇచ్చే కోర్టు సమన్ల కాపీలను కూడా అప్‌లోడ్ చెయ్యాలని సుష్మా స్వరాజ్ ఆలోచిస్తున్నారు.
- అందుకు వీలుగా 'ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు'లో సవరణలు చేయాలని సుష్మ నేతృత్వంలోని నిపుణుల బృందం న్యాయ శాఖను కూడా సంప్రదించింది.
- సవరణకు న్యాయ శాఖ ఒప్పుకుంటే.. ఫారిన్‌లో ఉన్న ఎన్నారై భర్తలను లీగల్‌గా డీల్ చెయ్యడం మన అధికారులకు మరింత సులభం అవుతుంది. (రెండు దేశాలు న్యాయ సహకారాన్ని ఇచ్చిపుచ్చుకుంటాయి కనుక).
- దీంతో న్యాయశాఖకు ఇంకో ఆలోచన వచ్చింది. 'మేమెలాగూ దేశంలోని ప్రతి పెళ్లినీ తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలని చట్టాన్ని తెచ్చే యోచనలో ఉన్నాం కనుక, పనిలో పనిగా ప్రతి ఎన్నారై మ్యారేజీని కచ్చితంగా వారం లోపు రిజిస్టర్ చేయాలన్న నిబంధనను చేరిస్తే బాగుంటుందన్న ప్రతిపాదనను మీరు మాకు పంపవచ్చు కదా' అని స్త్రీ,శిశు సంక్షేమ శాఖకు సలహా ఇచ్చింది. అదొకటి డిస్కషన్‌లో ఉంది.

చెట్టు నీడ

చుక్కలకు చెయ్యి చూద్దాం

ఒక ఊళ్లో ఒక 'కాలజ్ఞాని' ఉండేవాడు. పగలంతా ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. రాత్రంతా ఆకాశంలో చుక్కల్ని చూస్తూ ఉండేవాడు. ఏవో లెక్కల్ని వేస్తూ ఉండేవాడు. ఎప్పుడూ విచారంగా ఉండేవాడు. ఈ లోకానికి ఏదో జరగబోతోందని నిరంతరం ఆందోళన చెందుతూ ఉండేవాడు. అప్పుడప్పుడు ఊళ్లోని వాళ్లు వచ్చి, భవిష్యత్తులో తమకేం జరగబోతోందో చెప్పమని ఆయనను అడిగేవారు. చెప్పేవాడు! ఆయన చెప్పిన విషయాన్ని బట్టి ఆ వచ్చినవాళ్లు సంతోషంతోనో, విచారంతోనో వెళ్లిపోయేవారు. ఆ కాలజ్ఞాని నిజంగా కాలజ్ఞానో కాదో ఎవ్వరికీ తెలియదు. ఆయన మాత్రం తనని తాను కాలజ్ఞానిని అనుకునేవాడు.



ఎప్పటిలాగే ఓ రోజు రాత్రి మసక చీకట్లో ఆ కాలజ్ఞాని ఆకాశంలో చుక్కల్ని చూస్తూ, లెక్కల్ని వేసుకుంటూ ఊరి శివార్ల నుంచి నడుచుకుంటూ వస్తున్నాడు. పైన చూస్తూ, కింద చూసుకోకపోవడంతో ఒక గొయ్యిలో పడిపోయాడు. పైకి వచ్చేందుకు ప్రయత్నించాడు కానీ పట్టు దొరకలేదు. 'ఎవరైనా ఉన్నారా? నన్ను పైకి లాగండి' అని కేకలు వేస్తూ గొయ్యిలోనే ఉండిపోయాడు. కొంతసేపటి తర్వాత, అటుగా వస్తున్న గ్రామస్థులు కేకలు విని, కాలజ్ఞానిని బయటికి లాగి, తమ దారిన తాము వెళ్లిపోయారు. వెళుతూ వెళుతూ అనుకున్నారు.. 'చుక్కల్లో భవిష్యత్తుని చూడగలిగాడు కానీ, కాళ్ల కింద ఉన్న వర్తమానాన్ని కనుక్కోలేకపోయాడు'.. అని!

రేపటి గురించిన ఆలోచన, రేపేం జరగబోతోందీ అన్న ఆలోచన రెండూ ఒకటి కాదు. రేపటి గురించిన ఆలోచనలో 'ముందు జాగ్రత్త' ఉంటుంది. రేపేం జరగబోతోంది అన్న ఆలోచనలో కేవలం 'ఊహ' మాత్రమే ఉంటుంది. అది మంచిది కాదు. రేపటిని ఊహిస్తూ, నేడు చేయవలసిన పనుల్ని అలక్ష్యం చేస్తాం మనం. ఈలోపు ఆ రేపు.. నేడై వచ్చేస్తోంది.. తెల్లారే వాకిట్లోకి! అప్పుడు మళ్లీ నేటి గురించి పట్టించుకోకుండా రేపటిలోకి వెళ్లిపోతాం. అంటే ఎప్పుడూ మనం రేపటిలోనే ఉండిపోతున్నాం. నేటిని చేజార్చుకుంటున్నాం. 'రేపు' ఎలాగూ వస్తుంది. 'నేడు' చేజారి 'నిన్న' అయిపోయాక మళ్లీ వస్తుందా?!

నిన్న అయినా, నేడు అయినా, రేపు అయినా ఎప్పటికప్పుడు జీవితం మెరుగవుతూ ఉండాలి. అంతవరకే ఆలోచన చెయ్యాలి. నిన్నటిని ఒక అనుభవంగా తీసుకుని, ఆ అనుభవంతో రేపటిని మరింత మెరుగ్గా మలుచుకోడానికి ఇవాళ మనం మన పనిలో శ్రద్ధపెట్టాలి. సవ్యంగా పూర్తి చెయ్యాలి. అప్పుడు చుక్కలే కిందికి చెయ్యి చాపుతాయేమో.. 'గురూ.. కొంచెం మా ఫ్యూచర్ చూసి చెప్పు. ఎలా ఉండబోతోందో?' అని!

మన పని మనం సక్రమంగా చేసుకుంటూ పోతుంటే 'రేపు' అనే గొయ్యిలో పడే ప్రమాదం ఉండదు. ●

నిర్లక్ష్యం

సెక్యూరిటీ ప్రాబ్లం!



రోమీ, సాహా

రోహిత్, రితిక

రాధిక, రహానే



నికిత, మురళీ విజయ్



నుపుర్, భువనేశ్వర్

వీళ్లైదుగురూ ప్రస్తుతం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో ఉన్నారు. భర్తలు టెస్ట్ మ్యాచ్ ఆడుతుంటే తోడుగా ఉండేందుకు వచ్చారు. ఇండియా–దక్షిణాఫ్రికా తొలి మ్యాచ్ నిన్నటితో ముగిసింది. ఆ తర్వాత జనవరి 13 నుంచి సెంచ్యూరియన్‌లో రెండో మ్యాచ్ మొదలౌతుంది. అయితే రెండో మ్యాచ్‌కు కూడా వీళ్లను భర్తలతో ఉండేందుకు అనుమతిస్తారా అన్నది చివరి నిమిషం వరకు తేలలేదు! ఇంకొకటి కూడా తేలలేదు... దక్షిణాఫ్రికాలో భారతీయ క్రికెటర్ల భార్యల బాగోగులు ఎవరు చూడాలన్నది. వీళ్లకు సంరక్షణగా మయాంక్ పారిఖ్ అనే ఆయన్ని పంపాలని తొలి మ్యాచ్‌కు రెండు రోజుల ముందు ముంబైలో జరిగిన బీసీసీఐ సమావేశంలో అనుకున్నారు. ''అబ్బెబ్బే.. ఎందుకు?! ఆల్రెడీ అక్కడ రిషికేశ్ ఉపాధ్యాయ అనే ఆయన ఉన్నాడు కదా' అని అందులోనే కొందరు అన్నారు. చివరికి ఈయనా వెళ్లలేదు. అక్కడున్న ఆయనకూ విషయం తెలీదు. ఇలా ఉంటారు మనవాళ్లు! భార్యను వెనక వదిలేసి, ముందు నడుస్తుంటారు కొంతమంది భర్తలు. అలా, బీసీసీఐ క్రికెటర్‌లకు సెక్యూరిటీ ఇచ్చి, 'వారి భార్యలకు సెక్యూరిటీ అవసరమా..' అన్నట్లు వెనకా ముందూ ఆలోచిస్తోంది.

నిరసన

బ్లాక్ డ్రెస్‌కు రెడ్ కార్పెట్



యు.ఎస్.లోని బివర్లీహిల్స్‌లో జరిగిన గోల్డెన్ గ్లోబ్ వేడుకల్లో 'బ్లాక్' ప్రొటెస్ట్

'మీ టూ' హాష్ ట్యాగ్ ఉద్యమం వృథా కాలేదు. గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ప్రదానోత్సవంలో ఫలితం కనిపించింది. రెడ్ కార్పెట్ ఆహ్వానాన్ని నలుపు దుస్తుల వస్త్రధారణ నిరసనగా మార్చింది. ప్రపంచాన్ని మొత్తం తనవైపు తిప్పుకునే సినిమా అవార్డులు రెండే రెండు. ఒకటి ఆస్కార్, రెండు గోల్డెన్ గ్లోబ్! ప్రసిద్ధ హాలీవుడ్ నిర్మాత హార్వీ వైన్‌స్టీన్ లైంగిక వేధింపుల గురించి మొదట ఓ బాధితురాలు 'మీ టూ' ఆన్‌లైన్ ఉద్యమంలో వెళ్లబోసుకుంది. అప్పటి నుంచి అతని మీదా, హాలీవుడ్ పరిశ్రమలో ఉన్న ఇలాంటి వేధింపుల మీదా మాట్లాడే ధైర్యాన్ని తెచ్చుకున్నారు బాధితులు. ఈ అరాచకాలను ఖండించడానికి, అణచివేయడానికి ఎలాంటి అవకాశం దొరికినా జారవిడుచుకోకూడదని ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమలోని మహిళలు ఒక ప్రమాణం చేసుకున్నట్టుంది! అందుకే హాలీవుడ్‌తో పాటు మొత్తం ఎంటర్‌టైన్‌మెంట్ మీడియాలో జరుగుతున్న ఈ అకృత్యాలకు.. హార్వీ వైన్‌స్టీన్, ఇంకా హాలీవుడ్‌లోని అలాంటి ప్రబుద్ధులకు వ్యతిరేకంగా గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ప్రదానోత్సవానికి విచ్చేసిన ప్రముఖులంతా నల్ల దుస్తుల్లో దర్శనమిచ్చారు. ఇది మంచి పరిణామం! 'మీ టూ' ఉద్యమం బలహీనపడకుండా ఊపిరిపోసే శుభ సంకేతం.


విమర్శ

అనుదినం ఆలయ దర్శనం



కొత్త పది రూపాయల నోటు వచ్చేస్తోంది! ప్చ్.. పాత న్యూసే. అవునా? కొత్త న్యూస్ కూడా ఉంది. కొత్త పది రూపాయల నోటు ఇప్పటికే విపరీతంగా సర్క్యులేట్ అవుతోంది. నిజమా! నిజమే. కానీ సర్క్యులేట్ అవుతున్నది మార్కెట్‌లో కాదు. సోషల్ మీడియాలో. నోటు కలర్ మీద ట్విట్టర్‌లో, ఫేస్‌బుక్‌లో ఎక్కడ పడితే అక్కడ దుమ్మెత్తి పోస్తున్నారు. కళ్లకద్దుకోవాల్సిన కరెన్సీ మీద దుమ్మా?! అవును. నోటు కలర్ బాగోలేదని, నోటు మీద దేవాలయం బొమ్మ ఉండడం అస్సలు బాగోలేదని కామెంట్లు వస్తున్నాయి. ఆర్బీఐ రిలీజ్ చేసిన నమూనాలో టెన్ రుపీస్ నోటు చాక్లెట్ బ్రౌన్ కలర్‌లో ఉంది. అది అగ్లీగా ఉందని అంటున్నారు. ఇక టెంపుల్ పిక్చర్ ఉన్న నోటును బ్యాక్ ప్యాకెట్‌లో ఎలా పెట్టుకోగలం అని ఇంకో కామెంట్. నోటు కింద పడితే, పొరపాటున ఆ నోటు మీద కాలు పడితే అపచారం కదా అని ఆస్తికుల ఆవేదన. కలర్‌ని వదిలేస్తే, రెండో పాయింట్ కరెక్టే. మామూలుగానే కిందపడిన నోటును కళ్లకద్దుకుంటాం. దేవాలయం ఉన్న నోటును ఎన్నిసార్లు కళ్లకు అద్దుకుంటే మనసు కుదుటపడుతుంది?

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్, నేను ఒక అమ్మాయిని లవ్ చేస్తున్నా. వన్ సైడ్ లవ్. వన్‌డే ఆమెకు ప్రపోజ్ చేశాను. ఆమె 'పెళ్లి ఫిక్స్ అయ్యింది' అని చెప్పింది. ఆ తరువాత 'నాకు బాయ్ ఫ్రెండ్ ఉన్నాడు' అంది. ఆ తరువాత 'నన్ను ఎందుకు లవ్ చేస్తున్నావ్?' అని అడిగింది. నేను రీజన్ చెప్పాను. దాంతో 'నాకు పెళ్లి ఫిక్స్ కాలేదు, బాయ్ ఫ్రెండ్ కూడా లేదు' అంది. తను ముస్లిం, నేను హిందు. ఆ అమ్మాయి వాళ్ల ఇంట్లో ఒప్పుకోరు అంటోంది. ఒప్పుకోవాలంటే ఏం చెయ్యాలి అని అడిగాను. 'గవర్నమెంట్ జాబ్ ఉండాలి' అంది. జాబ్ ఉంటే చాలా? ఒప్పుకుంటారా? అని అడిగితే... 'ఏమో ఒప్పుకోకపోవచ్చు.. తెలీదు..!' అంటోంది. అసలు.. ఆ అమ్మాయి... నన్ను లవ్ చేస్తుందా? లేదా? ఒక వేళ చేస్తే ఒప్పుకుంటారా? లేదా? ఇది నా డౌట్! మీరే చెప్పాలి బ్రదర్, ప్లీజ్.

– శ్రీకాంత్



అన్నా.... అమ్మాయి లవ్ చెయ్యడం లేదు!

'పాషాణ హృదయులు సార్ మీరు!'

నిజం చెబితే ఉలుకెందుకు?

'అయినా అంత కఠోరంగా చెబుతారా సార్?'

ఇడ్లీలో గుంత చేసి, దాంట్లో నెయ్యి పోసి చెప్పాలా??

'వడలో ఆల్‌రెడీ హోల్ ఉంటుంది కదా సార్.. దాంట్లో నెయ్యి వేసి ఇవ్వచ్చు కదా సార్? ఇడ్లీ ఎందుకు సార్????'

చూశావా? ఇడ్లీ ఉడకపెడతారు.. వడ వేయిస్తారు..!!

'అయితే ఏంటి సార్??'

మనమిద్దరం ఏమి మాట్లాడుతున్నామో శ్రీకాంత్‌కి అర్థం కావడం లేదు!

'శ్రీకాంత్‌కి ఏంటి సార్.. నాకే అర్థం కావడం లేదు. నాకు డౌట్.. మీకు కూడా అర్థం కావడం లేదు అని సార్??'

కరెక్టుగా చెప్పావు నీలాంబరీ.. ఆమెది ఇడ్లీ లాంటి లవ్.. శ్రీకాంత్‌ది వడ లాంటి లవ్. అమ్మాయి ఎన్నో రకాలుగా మనకు వర్కౌట్ కాదని చెబుతూనే ఉంది.. కానీ...

'కానీ ఏంటి సార్??'

శ్రీకాంత్ ఇడ్లీని నూనెలో వేయించి.. వడని నీళ్లల్లో ఉడక బెట్టమంటున్నాడు.

'అన్యాయం సార్...! మతాలు వేరు అయితే.. ప్రేమలు ఉండకూడదా సార్??'

ఇక్కడ మతాలతో సంబంధం లేదు. అమ్మాయికి ఇడ్లీ ఇష్టం. మనోడికి వడ కావాలి. సేమ్ కిచెన్ వర్కౌట్ కాదని అమ్మాయి సున్నితంగా చెబుతోంది. కానీ, శ్రీకాంత్ తన వేగుతున్న వడ సౌండ్‌లో విషయం వినిపించుకోవడం లేదు.

'ఓకే సార్.. అట్లా అయితే శ్రీకాంత్ అమ్మాయిని ఇక ఇబ్బంది పెట్టడు...! మీకు అరటిపండు వేయించుకుని తెస్తా...' అంటూ నవ్వింది నీలాంబరి.



ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

పాశుర ప్రభాతం

25వ పాశురం

ఒరుత్తి మగనాయ్ పిఱన్దు, ఓరిరవిల్
ఒఱుత్తిమగనాయ్ ఒళిత్తు వళర,
తరిక్కిలానాగి త్తాన్ తీంగు నినైన్ద,
కరుత్తై పిళైప్పిత్తు కఞ్జన్ వయిత్తిల్,
నెరుప్పెన్ననిన్ఱ నెడుమాలే! ఉన్నై
అరుత్తిత్తు వన్దోమ్ పఱై తరుదియాగిల్,
తిరుత్తక్క శెల్వముమ్ శేవగముమ్ యాంపాడి,
వరుత్తముం తీర్‌న్దు మకిళిన్దేలో రెమ్బావాయ్.

భావం



పరమాత్మయే తనకు కుమారుడుగా కావలయును అని కోరుకొని, శంఖచక్రగదాధారియైన భగవంతుణ్ణి కుమారుడిగా పొందగల్గిన సాటిలేని దేవకిదేవికి కుమారుడిగా జన్మించిన ఓ కృష్ణా! నీ లీలలను పరిపూర్ణంగా అనుభవించుటకు, కట్టివేయుటకు, కొట్టుటకు కూడా తగిన స్వాతంత్ర్యము కలిగిన రీతిలో నిన్ను వశపరచుకొనిన, అద్భుత వైభవము కలిగిన యశోదాదేవికి, నీవు జన్మించిననాటి రాత్రియే కుమారుడిగా చేరి దాగి పెరిగినవాడా! రహస్యంగా పెరుగుచున్న నిన్ను చూసి ఓర్వలేక, నిన్ను చంపాలనే దుష్టభావంతో నున్న కంసుని అభిప్రాయమును వ్యర్థము చేసి అతని కడుపులో చిచ్చువై నిలిచి అతణ్ణి చంపినట్టి ఆశ్రితవ్యామోహశాలీ! నిన్నే కోరి వచ్చినాము. మాకు పర అనే వ్రతసాధనమును ఇవ్వుము. లక్ష్మీదేవికి తగినట్టి నీ ఐశ్వర్యమును, వీరచరిత్రమును మేము గానము చేసి, అలసట తీరినవారై ఆనందించునట్లు చేయుము.

– ఎస్. శ్రీప్రియ

కాసుకో సుడోకు

7			5			4		
1	6	3		4			7	
	4	2	7	9				6
4		8	6	2	9		1	
	1		3	5	8	2		4
8				3	7	6	5	
	9			1		8	2	7
		1			5			3

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	1	4	6	3	2	9	8	7
7	9	8	5	1	4	2	3	6
6	2	3	7	9	8	5	1	4
3	4	2	1	7	5	6	9	8
9	8	5	2	4	6	3	7	1
1	6	7	3	8	9	4	5	2
2	5	1	9	6	7	8	4	3
8	3	9	4	2	1	7	6	5
4	7	6	8	5	3	1	2	9

రోహింగ్యాలు

అమ్మా వెళుతున్నా

ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు 'అమ్మా వెళ్లొస్తా' అంటాం.
దేశం విడిచి వెళుతున్నప్పుడు 'అమ్మా వెళుతున్నా' అని మాత్రమే అనగలం!
మయన్మార్‌ను రాత్రికి రాత్రి సైన్యం తుపాకీ మొనల మీద విడిచిపెట్టిన ఏడు లక్షలమంది రోహింగ్యాలు రుధిరాశ్రువుల మధ్య బంగ్లాదేశ్‌లో ఆశ్రయం పొందుతున్నారు.
సెల్‌ఫోన్లలో షూట్ చేసుకుని వచ్చిన తమ ఇళ్లను, ఊరిని చూసుకుంటూ అదే పెద్ద ఊరటగా బతుకు ఈడుస్తున్నారు.

పట్టెడు మెతుకుల కోసం శరణార్థి శిబిరాలలో రోహింగ్యాలు



కడసారిది వీడ్కోలు
కన్నీటితో మా చేవ్రాలు
జననానికి ఇది మా దేశం
మరణానికి మరి ఏ దేశం...

గడపలో నాటుకున్న మొక్కను వదిలిపెట్టాలి. గంప కింద పెట్టి పొదువుకున్న కోడిపిల్లలను వదిలిపెట్టాలి. నాన్న గతంలో కొనిచ్చిన పాత సైకిల్‌ను వదిలిపెట్టాలి. అమ్మ ఆ అరుగు మీదే కూర్చుని కబుర్లు చెప్పేదనే జ్ఞాపకం వదిలిపెట్టాలి. ఇంటిని, ఇరుగూ పొరుగును, మామా బాబాయ్ పిలుపులను, తెలిసినవారి నుంచి అడక్కుండానే వచ్చే కూర సువాసనను, శుక్రవారం పూట కలిసి నడిచి పంచుకున్న అత్తరు పరిమళాన్ని, అంత వరకూ బతికిన బతుకును, అంతవరకూ పెంచుకున్న పాశాన్ని, అంత వరకూ ముద్దాడిన మట్టిని, అంతవరకూ నీడనిచ్చిన మబ్బు తుంటని వదిలి పెట్టి కదలాలి.

ఎక్కడికి?

ఆశలు సమాధి చేస్తూ బంధాలను బలి చేస్తూ అగమ్యంగా అగోచరంగా పర దేశానికి.


తల్లి తండ్రులు లేనివాడు అనాథే. కాని మాతృదేశం కోల్పోయినవాడు నిజమైన అనాథ. ఇవాళ ఏడు లక్షల మంది రోహింగ్యాలు అనాథలయ్యారు. నేలను రుద్ది రుద్ది వేసే అడుగులు, ఛాతీలోకి పీల్చి పీల్చి అందుకునే శ్వాస, అశ్రువులను జార్చి జార్చి కార్చే కన్నీరు, వెనక్కు తిరిగి తిరిగి చూసే ఆఖరి చూపులు... వీటితో వాళ్లు బిడారులుగా నడిచి, కఠినమైన నీటి కత్తుల మీద నడిచి, ఛిద్రం చేసే బుల్లెట్ల వానకు దడిచి, దురదృష్టవశాత్తు బతికి, అంతం లేని వేదనను భుజాన మూటగా మోస్తూ తమ పొరుగు దేశం బంగ్లాదేశ్ చేరుకున్నారు. ఆగస్టు 2017 నుంచి సాగుతున్న ఈ ఉప్పు కన్నీటి వలస సాగుతోంది సాగుతూనే ఉంది... బహుశా మయన్మార్ తన సైనిక హింసను చివరి రోహింగ్యాను మట్టుపెట్టేంత వరకూ కొనసాగిస్తే సాగుతూనే ఉంటుంది.

కంచె చేను మేసింది...

ప్రజలను కాపాడటం ప్రభుత్వాల పని. ప్రజలను రక్షించడం సైనికుల విధి. కాని మయన్మార్‌లో ప్రభుత్వం, సైనికులు రోహింగ్యాలపై పగ పెంచుకున్నాయి. వీరు తమ దేశంవారు, తమ మతం వారు కాదన్న నెపంతో జాతి హననానికి తుపాకులు ఎక్కు పెట్టాయి. ఆడవాళ్లని, పిల్లలని చూడకుండా శవాల వరుసను పరిచాయి. వాన కురుస్తున్నా, రాత్రి మంచు పళ్లతో కరుస్తున్నా, ఎండ మింగుతున్నా ఎక్కడా వాళ్లను నిలువనీయకుండా సరిహద్దులు దాటేంతవరకూ నిర్దాక్షిణ్యంగా నిర్దయగా విష పడగలతో తరిమిపెట్టాయి. కాని ప్రతి మనిషీ జ్ఞాపకాల బందీ. ముఖ్యంగా తన జన్మస్థలానికి, జన్మించిన దేశానికి బందీ. వాటిని తనతో పాటు దాచుకోవాలని ప్రయత్నిస్తాడు. రోహింగ్యాలు కూడా ప్రయత్నించారు. వాళ్లను ఆ సమయంలో ఆదుకన్న ఒకే ఒక్క వస్తువు– సెల్‌ఫోన్.

ఫోన్‌లో అపురూపం

రోహింగ్యాలు తీరిగ్గా వలసకు బయల్దేరిన కాందిశీకులు కాదు. అప్పటికప్పుడు, రాత్రికి రాత్రి, ఎక్కడో పేలిన ఒక తుపాకీ చప్పుడుకు ఉలికి పడి, సైన్యం ఊడిపడి ఇళ్లు తగలబడుతుండగా ఆ మంటల్లో చెల్లాచెదురవుతున్న నల్లటి నీడల మధ్యన చేతికందిన వస్తువు తీసుకుని దేశం విడిచిపెట్టారు. అయితే ఎవరు ఏ వస్తువును మర్చిపోయినా ఎక్కువమంది మర్చిపోని వస్తువు సెల్‌ఫోనే. ఎందుకంటే దేశం విడిచిపెట్టే ముందు ఆఖరుసారిగా వారు తమ ఇంటిని, పరిసరాలను, ఊరిని సెల్‌లో బంధించుకుని అదే పెద్ద పెన్నిధిగా దేశం విడిచారు. ఎన్నో కష్టాలు పడి దేశం దాటారు. బంగ్లాదేశ్‌లో వారికి ఆసరా దొరికింది. కాందిశీకుల శిబిరాల్లో పట్టెడు అన్నం, పీడకలల నిద్ర మధ్య వారికి కాసింత సెల్‌ఫోనే ఊరట అయ్యింది. చాలామంది ఆ సెల్‌ఫోన్‌లో తమ సొంత ఇంటిని చూసుకుని గాఢమైన ఆలోచనలలో మునిగిపోతుంటారు. కొందరి కంట ఆ సమయంలో ధారాపాతం సంభవిస్తూ ఉంటుంది. ఎవరైనా విషాదంగా ఏదైనా పాట అందుకుంటారా? ఏమో. ఒక మనిషికి ఇంతకు మించిన శాపం వద్దు. ఇంత నాగరిక లోకం అని చెప్పుకుంటున్న ఈ ప్రపంచంలో ఒక జాతి జాతంతా చిన్నబుచ్చుకున్న ముఖాలతో మసలడం ఏం శోభ?



బంగ్లాదేశ్ సహాయ శిబిరంలో సెల్‌ఫోన్‌లో తన మయన్మార్ ఇంటిని చూసుకుంటున్న రోహింగ్యా



రోహింగ్యా స్త్రీలు తమ దగ్గర ఉంచుకుంటున్న 'రేప్ డివైజ్'. ఎవరైనా అత్యాచారం చేయబోయినప్పుడు దీన్ని నొక్కితే సైరన్ లాగా మోగి నలుగురికీ తెలియజేస్తుంది.

కష్టాల దేగలు

దేశం దాటాక కూడా రోహింగ్యాల కష్టాలు తీరలేదు. శిశు జనానాలూ వారి ఆయుష్షు పెద్ద ప్రశ్నార్థకం. వైద్య సహాయం పెద్ద ప్రశ్నార్థకం. మూడు పూటలా కడుపు నిండిందనిపించే తిండి ప్రశ్నార్థకం. ఆ తాత్కాలిక గుడారాలూ ఏ ఎండకూ వానకూ పనికి రావు. ఆకలి వారిలోని కొందరిని నిస్సహాయమైన రాక్షసత్వంలోకి, మోసంలోకి, వంచనలోకి, ఏం చేసైనా సరే మనుగడ కాపాడుకోవాలనే అధోస్థితిలోకి జార్చేసింది. దాంతో దొంగలుగా, మోసగాళ్లుగా, తార్పుడుగాళ్లుగా, కాసిన్ని చిల్లర పైసల కోసం మాదకద్రవ్యాలను చేరవేసే ఏజెంట్లుగా మారిపోయారు. ఆడవాళ్లు అనుక్షణం తమను తాము కాపాడుకోవడానికి 'రేప్ డివైస్'లను దగ్గర పెట్టుకోవాల్సి వస్తోంది. ఇంకా మానవ ఊహకు అందని నైచ్యాలు ఎన్ని జరుగుతున్నాయో ఎవరూ చెప్పలేరు.

దారి తప్పినవారు ఏదో ఒకరోజు బాగుపడొచ్చు.

దేశం తప్పినవారు ఎప్పటికీ మానవ విషాదాన్ని గొంతు నుంచి ఉమ్ముతూనే ఉంటారు.

ఆ ఉమ్ము ఒకోసారి నీరు. మరోసారి రక్తం.

గ్రీన్ కాఫీతో స్థూలకాయానికి చెక్



గ్రీన్ టీ వాడకం మొదలై చాలా ఏళ్లే అయ్యింది. ఇటీవలి కాలంలో నెమ్మదిగా గ్రీన్ కాఫీ వాడకం ప్రపంచ వ్యాప్తంగా పుంజుకుంటోంది. గ్రీన్ కాఫీ తాగడం ఫ్యాషన్ మాత్రమే కాదు, దీన్ని తాగడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. గ్రీన్ కాఫీ జుట్టును, చర్మాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతుందని, అంతేకాకుండా, స్థూలకాయాన్ని అదుపు చేసేందుకు బాగా దోహదపడుతుందని చెబుతున్నారు. గ్రీన్ కాఫీ గింజల్లో 'కెల్ప్' అనే రసాయనం అధిక మోతాదులో ఉంటుంది. 'కెల్ప్' శరీరంలోని అదనపు కొవ్వును త్వరగా కరిగించగలదని ఇప్పటికే పలు పరిశోధనల్లో తేలింది. సాధారణంగా 'కెల్ప్' అనే ఈ పదార్థం సముద్రపు నాచులో ఎక్కువగా ఉంటుంది. ఇది గ్రీన్ కాఫీ గింజల్లో కూడా ఉండటంతో, దీనిని వినియోగించడం తేలికని నిపుణులు అంటున్నారు. అయితే, దీనికి ఆకలిని తగ్గించే లక్షణం కూడా ఉంది. అందువల్ల అతిగా వాడకుండా జాగ్రత్తపడాలని కూడా నిపుణులు సూచిస్తున్నారు.


నిద్రలేని రాత్రి ఒక్కటైనా హానికరమే



నిద్రలేమి దీర్ఘకాలికంగా కొనసాగితే రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిసిందే. కొందరిలో నిద్రలేమి మానసిక, శారీరక సమస్యల వల్ల తలెత్తే సమస్య. అయితే, ఇంకొందరు తాము నిర్వర్తించే విధుల కారణంగా అనివార్యంగా నిద్రకు దూరమవుతుంటారు. కారణాలు ఏవైనా, తగిన నిద్ర లేకుండా ఒక్క రాత్రి గడిపినా, దాని ప్రభావం మెదడుపై పడుతుందని అమెరికన్ వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్క రాత్రి నిద్రలేమితో గడిపినా, అది అల్జీమర్స్‌తో పాటు పదిరకాల దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే అవకాశాలను పెంచుతుందని వాషింగ్టన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. నిద్రలేమి ఫలితంగా మెదడులో అమిలాయిడ్ బీటా ప్రొటీన్లు సహా నానా వ్యర్థాలు నిండిపోతాయని, ఇవి మెదడులోని కణజాలాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని తమ పరిశోధనల్లో గుర్తించినట్లు వారు చెబుతున్నారు.

పీడియాట్రిక్ కౌన్సెలింగ్

బాబుకు మాటిమాటికీ జ్వరం... తగ్గేదెలా?



మా బాబుకు నాలుగేళ్లు. ఇటీవల వాడికి చాలా సార్లు జ్వరం వస్తోంది. మందులు వాడుతున్నంత సేపు తగ్గి మళ్లీ వస్తోంది. ఇలా వాడికి మాటిమాటికీ జ్వరం రావడంతో నాకు చాలా ఆందోళనగా ఉంది. మాకు తగిన సలహా ఇవ్వండి.

– మాధవి, కరీంనగర్

చిన్నపిల్లలు తరచూ సూక్ష్మక్రిములు, వైరస్, బ్యాక్టీరియాకు ఎక్స్‌పోజ్ అవుతుండటం వల్ల వాళ్లకిలా జ్వరం రావడం చాలా సాధారణం. అందునా కాలం మారినప్పుడు (సీజనల్ వేరియేషన్స్) ఇన్ఫెక్షన్స్‌ఎక్కువగా రావచ్చు. గడ్డలు, బ్రుసెల్లోసిస్, డెంటల్ యాబ్సెస్, దీర్ఘకాలికమైన జబ్బులు, క్రిప్టోకోకస్, సిస్టైటిస్, ఫెమీలియల్ ఫీవర్ సిండ్రోమ్ వంటి అనేక సాధారణ సమస్యలు మొదలుకొని కొన్ని తీవ్రమైన సమస్యల వరకు ఇలా జ్వరం రావచ్చు. మీరు ఇచ్చిన కొద్దిపాటి సమాచారంతో మీ బాబుకు జ్వరం ఎందుకు వస్తోందనేది నిర్దిష్టంగా చెప్పడం సాధ్యం కాదు. అయితే ఒకసారి యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన పరీక్షలతో పాటు దీర్ఘకాలికమైన జబ్బులకు ఏమైనా అంతర్గతంగా ఉన్నాయేమో అని వాటి నిర్ధారణకు అవసరమైన పరీక్షలు చేయించడం చాలా అవసరం. జ్వరం వచ్చిన ప్రతీసారీ కారణం తెలుసుకోకుండా మందులు – మరీ ముఖ్యంగా యాంటీబయాటిక్స్, ఎన్‌ఎస్ఏఐడీ వంటివి చాలాకాలం పాటు వాడుతూ పోవడం చాలా అపాయకరం. అది సరైనదీ కాదు. మీరు మరొకసారి మీ పిల్లల వైద్య నిపుణుడిని సంప్రదించి ఈ అంశాలన్నీ చర్చించి, తగిన చికిత్స తీసుకోండి.

కనుగుడ్లు ఆగకుండా తిరుగుతున్నాయి...

మా బాబుకి పన్నెండేళ్లు. అతడి కనుగుడ్లు తిరుగుతూ ఉంటాయి. ఈ సమస్యతో సరిగా చదవలేకపోతున్నాడు. ఈ సమస్యకు కారణాలు, చికిత్సను సూచించండి.

– సుందరరావు, ఒంగోలు

ఈ లక్షణాలను బట్టి చూస్తుంటే మీ బాబుకి కళ్ల పొజిషన్, కదలికలో తేడా ఉన్నట్టు అనిపిస్తుంది. వీటిలో చాలా రకాలుంటాయి. వాటిలో మీ అబ్బాయికున్న సమస్య నిస్టాగ్మస్ లేదా ఆప్సోక్లోనస్ అనే రెండు సమస్యలలో ఏదో ఒకటై ఉండవచ్చు. నిస్టాగ్మస్ అనేది వ్యాధి కాదు. బాబులోని రుగ్మతకు ఒక సంకేతం మాత్రమే. నిస్టాగ్మస్ ఉన్న వారి కళ్లు రిథమిక్‌గా కదులుతూ (రిథమిక్ ఆసిలేషన్ మూవ్‌మెంట్స్) ఉంటాయి. ఇది ఒకటి లేదా రెండు కళ్లకు ఉండవచ్చు. పుట్టుక నుండి ఉండవచ్చు లేదా ఆ తర్వాత అయినా ఇది రావచ్చు. ఈ పరిస్థితికి అనేక కారణాలుంటాయి. ఉదా. కంటి సమస్యలు, చెవి సమస్యలు (లాబ్రెంతైటిస్), ఆల్బెనిజం, మెదడు సమస్యలు, కొన్ని సార్లు కొన్ని మందుల వల్ల కూడా ఈ విధమైన లోపాలు ఏర్పడుతుంటాయి. ఇక ఆప్సోక్లోనస్ అనే సమస్యలో కళ్లు నాన్ రిథమిక్‌గా, అనేక డైరెక్షన్స్‌లో తిరుగుతుంటాయి. కళ్లను చూస్తే ఏదో కలవరంతోనో, కోపంతో (ఆజిటేటెడ్‌గా) ఉన్నట్లు అనిపిస్తాయి. కొన్నిసార్లు ఈ స్థితి న్యూరోబ్లాస్టోమా అనే తీవ్రమైన మెదడు జబ్బుకి తొలి సూచన కావచ్చు. మీ అబ్బాయి విషయంలో సమస్య పరిష్కారం కోసం పూర్తి స్థాయిలో కంటి పరీక్షలు చేయించడంతో పాటు ఒకసారి బ్రెయిన్ స్కాన్ కూడా చేయించడం మేలు. మీవాడి సమస్యకు అసలు కారణం తెలిస్తేనే పరిష్కారం చెప్పడం వీలవుతుంది. మీరు ఒకసారి మీ కంటి వైద్య నిపుణుడిని సంప్రదించండి.

ఫ్యామిలీ డాక్టర్

పాపకు మెడలో గడ్డ... ఏమిటది?

మా అమ్మాయికి ఏడేళ్లు. ఆమె మెడలో ఒక గడ్డ లాగా కనిపిస్తోంది. ఇది కనీసం ఐదారు నెలల నుంచి ఉంది. డాక్టర్‌కు చూపించాం. ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. ఇటీవల అది కాస్త పెద్దదైందేమోనని అనుమానంగా ఉంది. ఈ గడ్డ ఏమిటి? మేం చికిత్స కోసం ఎవరిని కలవాలో చెప్పండి.

– నీరజ, కొత్తగూడెం

మీరు చెప్పిన సమాచారాన్ని బట్టి మెడ భాగంలో గడ్డలుగా ఉన్నవి లింఫ్‌నోడ్స్ అయి ఉండవచ్చు. ఈ కండిషన్‌ను సర్వైకల్ లింఫెడినోపతి అంటారు. పిల్లల్లో మెడ భాగంలో లింఫ్ గ్రంథులు పెద్దవిగా (వివిధ సైజుల్లో) ఉండటాన్ని చాలా సాధారణంగా చూస్తుంటాం.

లింఫ్‌నోడ్స్ ఇలా పెద్దవి అవడానికి చాలా రకాల కారణాలు ఉన్నాయి. సాధారణ ఇన్‌ఫెక్షన్, ఇన్‌ఫ్లమేషన్‌తో పాటు తీవ్రమైన క్యాన్సరస్ పెరుగుదల వంటి ప్రమాదకరమైన కండిషన్స్‌కూ ఇదో సూచన కావచ్చు. ఇక సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్, టీబీ లేదా టీబీ కాని బ్యాక్టీరియాలు, లింఫోమా (క్యాన్సర్) వంటి పెద్ద కారణాలతో పాటు, కొన్నిసార్లు కనెక్టివ్ టిష్యూ డిసీజ్, చెవికి ఏదైనా గాయం కావడం (చెవి కుట్టించినప్పుడు కూడా), రకరకాల గొంతు ఇన్ఫెక్షన్స్ వంటి అతి మామూలు కారణాల వల్ల కూడా ఈ గ్లాండ్స్ పెద్దవి కావడం జరుగుతుంది. కాబట్టి ఈ గ్లాండ్స్ ఎంత పరిమాణంలో పెరిగాయన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. అయితే ఇలా పెరగడం అన్నది చాలా సందర్భాల్లో చాలా సాధారణమైన వైరల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వల్లనే ఎక్కువగా జరుగుతుంది కాబట్టి వారం నుంచి రెండు వారాల పాటు యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేసి చూస్తాం. అప్పటికీ ఇవి తగ్గకుండా ఉండటంతో పాటు, వీటి పరిమాణం 2.5 సెం.మీ. కంటే పెద్దవిగా ఉంటే తప్పనిసరిగా కొన్ని రక్తపరీక్షలతో పాటు, బయాప్సీ కూడా చేయించాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఒకే నోడ్ పెద్దగా అయి ఇబ్బంది పెడుతుంది. అప్పుడు కూడా బయాప్సీ చేయించాల్సిన అవసరం ఉంటుంది.



ఇక మీ పాప విషయంలో ఇతర లక్షణాలూ ఏమీ కనిపించడం లేదు కాబట్టి, పాప సాధారణ ఆరోగ్యం కూడా బాగానే ఉంది కాబట్టి మీరు చింతించాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ గ్లాండ్ పెరుగుతున్నట్లుగా అనుమానిస్తున్నారు కాబట్టి తప్పనిసరిగా తదుపరి అంశాల నిర్ధారణ కోసం ఒకసారి బయాప్సీ చేయించాల్సిన అవసరం ఉంది. మీరు మీ పిల్లల వైద్య నిపుణుడితో చర్చించి, తగిన తదుపరి చర్యలు తీసుకోండి.



డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్,
రోహన్ హాస్పిటల్స్,
విజయనగర్ కాలనీ, హైదరాబాద్

పరి పరిశోధన

భూమి ధ్రువాలు ఉల్టా పల్టా..!

ఎక్కడో అంటార్కిటికాలోని పక్షులు... ఉత్తరాన సైబీరియాకు వలస వెళుతూంటాయి. ఎలా? వాటిల్లో భూ అయస్కాంత క్షేత్రాన్ని గుర్తించే కంపాస్ లాంటిది ఉంటుంది కాబట్టి! మరి.. ఈ అయస్కాంత క్షేత్ర ధ్రువాలు తిరగబడితే? అలా ఎందుకు అవుతుందనుకోవద్దు. త్వరలోనే ఇది జరగబోతోంది. కొంచెం గందరగోళంగా అనిపిస్తోందా...? వివరంగా అర్థం చేసుకుందాం. భూగర్భంలో కుతకుత ఉడికే ఇనుము ఉంటుంది. ఇది అటు ఇటు ప్రవహించే క్రమంలో భూమి చుట్టూ ఒక అయస్కాంత



క్షేత్రం ఏర్పడుతుంది. సజాతి ధ్రువాలు వికర్షించుకుంటాయి కాబట్టే.. మన కంపాస్‌లలో చూపే ఉత్తరం.. అయస్కాంత క్షేత్రం తాలూకు దక్షిణ ధ్రువమై ఉంటుంది. త్వరలో ఉత్తరం.. దక్షిణంగా మారనుంది. అలాగే దక్షిణ ధ్రువం కాస్తా ఉత్తరంగా మారనుంది. ఇంకోలా చెప్పాలంటే ఆర్కిటిక్ ప్రాంతం అయస్కాంతక్షేత్ర దక్షిణ ధ్రువంగా మారితే.. అంటార్కిటికా కాస్తా ఉత్తర ధ్రువ ప్రాంతంగా మారుతుందన్నమాట. గత శతాబ్ద కాలంలో అయస్కాంత ధ్రువం ఏటా దాదాపు 64 కిలోమీటర్ల చొప్పున స్థానభ్రంశం చెందుతూ వస్తోందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. అయితే దీనివల్ల మనకేమీ ప్రమాదం లేదని శాస్త్రవేత్తలు భరోసా ఇస్తున్నారు. ఎందుకంటే దాదాపు రెండు మూడు లక్షల ఏళ్ల క్రితం కూడా ధ్రువాలు తారుమారైనప్పుడు ఎలాంటి విపత్తూ జరగలేదని శిలాజాల ద్వారా తెలుస్తోందని శాస్త్రవేత్తలు అంటున్నారు. కాకపోతే మెదడులోనే కంపాస్‌లు కలిగి ఉండే వలస పక్షులపై ఈ మార్పు ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాల్సి ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

పిలిస్తే పలికే అలెక్సా చేతుల్లోకి వచ్చేస్తోంది..


అమెజాన్ అలెక్సా గురించి మీరు వినే ఉంటారు. కృత్రిమ మేధ సాయంతో నిర్మాణమైన ఈ ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ మీరు ఏ ప్రశ్న అడిగినా ఠకీమని సమాధానమిస్తుంది. ఇదంతా ఇప్పుడెందుకూ అంటే.. త్వరలోనే ఇది వాచీల్లోకి ఇమిడిపోనుంది కాబట్టి! ప్రస్తుతం అమెజాన్‌లో అందుబాటులో ఉండే అలెక్సా – ఎకో చిన్న డబ్బా సైజులో ఉంది. దీన్ని ఇంట్లో ఉంచుకుని.. తగిన నెట్‌వర్కింగ్ చేసుకుంటే..



అన్ని రకాల ఎలక్ట్రానిక్ ఉపకరణాలనూ దీని సాయంతోనే నియంత్రించవచ్చు. ''అలెక్సా.. ఏసీ ఆఫ్ చేసేయ్'' అంటే వెంటనే కట్టేస్తుందన్న మాట. ఇంతటి శక్తిమంతమైన సాఫ్ట్‌వేర్‌ను త్వరలో లాస్‌వెగాస్‌లో ప్రదర్శనకు ఉంచనున్నారని సమాచారం. ఇప్పటికే అందుబాటులో ఉన్న అలెక్సా మొబైల్ యాక్సెసరీ కిట్ సాయంతో డెవలపర్లు దాదాపు అన్ని రకాల వేరబుల్స్ (ధరించగలిగేవి)లోకి అలెక్సాను జొప్పించవచ్చునని అమెజాన్ అంటోంది. ఆడియో పరికరాల తయారీ సంస్థ బోస్ అలెక్సా సాయంతో అత్యాధునిక ఇయర్‌ఫోన్లను తయారుచేసేందుకు రెడీ అవుతూంటే మొబైల్ ద్వారా కూడా అలెక్సా సేవలు అందించేందుకు కొన్ని కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. మొబైల్ యాక్సెసరీ కిట్‌ను అందుబాటులోకి తేవడం వల్ల హార్డ్‌వేర్ కంపెనీలు సాఫ్ట్‌వేర్ కోడింగ్‌కు సంబంధించిన వ్యవహారాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం లేదని అమెజాన్ ప్రతినిధి గగన్ లూథ్రా తెలిపారు.

కళ్లలోకి చూస్తే... జబ్బులేమిటో తెలుస్తాయా?

కళ్లు మన మనసులోని భావాలను ప్రదర్శించేందుకు కొద్దోగొప్పో ఉపయోగపడతాయిగానీ.. బబ్బుల వివరాలు ఎలా తెలుస్తాయి అని ఆశ్చర్యపోనవసరం లేదు. అంతా డీప్ లెర్నింగ్ టెక్నాలజీ మహిమ. విషయం ఏమిటంటే.. గూగుల్‌కు చెందిన పరిశోధన విభాగం కేవలం కళ్లలోని భాగాల తాలూకూ ఫొటోల (ఫండూస్ ఇమేజెస్ అని పేరు)



ద్వారా వారి వయసుతో పాటు రక్తంలోని చక్కెర శాతం (హెచ్‌బీఏ 1సీ), రక్తపోటు, గుండెజబ్బులు వచ్చే అవకాశాలు వంటి వివరాలన్నింటినీ సేకరించవచ్చునని ప్రకటించారు. ఇందుకోసం గూగుల్ రీసెర్చ్ విభాగపు శాస్త్రవేత్తలతోపాటు స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు దాదాపు 2.8 లక్షల మంది కనుగుడ్డు తాలూకు చిత్రాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా పరిశీలించారు. టెన్సర్‌ఫ్లో అనే కృత్రిమ మేధ ఆధారిత సాఫ్ట్‌వేర్ సాయంతో జరిపిన ఈ పరిశీలన ద్వారా చెప్పుకోదగ్గ కచ్చితత్వంతో ఫలితాలు వచ్చాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఫిలిప్ నీల్సన్ తెలిపారు. డీప్ లెర్నింగ్, మెషీన్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాఫ్ట్‌వేర్లు కనుగుడ్లను మాత్రమే కాదు... అతిసూక్ష్మమైన కణాల ఛాయాచిత్రాలతోనూ మనుపు ఎన్నడూ సాధ్యం కాని పనులు చేయగలుగుతున్నామని ఆయన అన్నారు. అయితే ప్రస్తుతం తాము ఉపయోగించిన సమాచారం చాలా చిన్నదని, మరింత ఎక్కువ సంఖ్యలో చిత్రాలను విశ్లేషించడం ద్వారా ఈ పద్ధతులకు పదును పెట్టవచ్చునని వివరించారు.

ఇది భాగమతి అడ్డా.. లెక్కలు తేలాలి



➤ అనుష్క

'ఎవడు పడితే వాడు రావడానికి.. ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమైనా పశువుల దొడ్డా.. భాగమతి అడ్డా.. లెక్కలు తేలాలి.. ఒక్కడ్నీ పోనివ్వను' అంటూ అనుష్క చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్‌తో రిలీజైంది 'భాగమతి'ట్రైలర్. అనుష్క టైటిల్ రోల్‌లో 'పిల్ల జమీందార్' ఫేమ్ జి.అశోక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భాగమతి'. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ–ప్రమోద్ నిర్మించిన ఈ సినిమా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సోమవారం 'భాగమతి' ట్రైలర్ రిలీజ్ చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ– ''బాహుబలి' సినిమాతో సూపర్ ఫామ్‌లో ఉన్న అనుష్కతో 'భాగమతి' చిత్రం నిర్మించినందుకు గర్వంగా ఉంది. అనుష్క నటన ఈ సినిమాకు హైలైట్. ట్రైలర్‌కు అనూహ్యమైన స్పందన వస్తోంది. ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. అద్భుతమైన కథని అంతే అద్భుతంగా అశోక్ తెరకెక్కించారు. 'భాగమతి' కథ, కథనం తెలుగు ప్రేక్షకుల్ని తప్పకుండా ఎంటర్‌టైన్ చేస్తాయి. కథకు తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించాం. తమన్ పాటలు, నేపథ్య సంగీతం సూపర్బ్'' అన్నారు. ఉన్ని ముకుందన్, జయరామ్, ఆశా శరత్, మురళీ శర్మ, ధన్‌రాజ్, ప్రభాస్ శ్రీను, విద్యుల్లేఖా రామన్ తదితరులు నటించిన ఈ సినిమాకి కెమెరా: మధి.




➤ త్రిష

త్రిష ఉన్నారు సామీ

... అంటున్నారు డైరెక్టర్ హరి. ఇంతకీ త్రిష ఎక్కడ ఉన్నారు? ఉన్న సంగతిని హరి ఎందుకు కన్ఫార్మ్ చేస్తున్నారనే విషయానికి వస్తే.. విక్రమ్, త్రిష జంటగా 2003లో వచ్చిన సూపర్ డూపర్ హిట్ మూవీ 'సామీ'కి సీక్వెల్ ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. ఇందులోనూ కథానాయికగా త్రిషను తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇది జరిగి చాలా రోజులైంది. ఆ తర్వాత మరో కథానాయికగా కీర్తీ సురేష్‌ని తీసుకోవడం, తన పాత్ర నిడివి తక్కువగా ఉందని త్రిష ఫీలై సినిమా నుంచి తప్పుకోవడం జరిగిందనే వార్తలు వచ్చాయి. ''క్రియేటివ్ డిఫరెన్సెస్ వల్ల ఈ చిత్రం నుంచి తప్పుకుంటున్నా'' అని సోషల్ మీడియా ద్వారా త్రిష స్వయంగా చెప్పారు కూడా. అయితే.. ''ఈ సినిమాలో త్రిష ఉన్నారు'' అని తాజాగా ఓ ప్రెస్‌మీట్‌లో హరి స్పష్టం చేశారు. మరి.. కీర్తీ సురేష్ లేరా? అంటే ఆమె కూడా ఉన్నారు. ముందు కాదన్న త్రిష తర్వాత ఒప్పుకున్నారంటే.. హరి ఆమెను కన్విన్స్ చేసి ఉంటారనేగా అర్థం. త్వరలో షూటింగ్ స్టార్ట్ చేసి, జూన్‌లో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.

ఫస్ట్ లవ్‌ని మరచిపోలేను!



● రజనీకాంత్

''మీ ఫస్ట్ లవ్ గురించి చెబుతారా?''... రజనీకాంత్‌ని అడిగారు సీనియర్ నటి లత. అంతే.. ఒక్కసారిగా నిశ్శబ్దం. రజనీ ఏం చెబుతారో వినాలని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. రజనీ నోరు విప్పారు. ''అవును. నాకు ఫస్ట్ లవ్ ఉంది. హైస్కూల్‌లో చదివేటప్పుడు ఓ అమ్మాయితో ప్రేమలో పడ్డాను. కానీ నా లవ్ సక్సెస్ కాలేదు'' అని సూపర్ స్టార్ అన్నారు. 'ఆ అమ్మాయి పేరు గుర్తుందా? చెబుతారా?' అని లత అడిగితే – ''ఫస్ట్ లవ్‌ని ఎవరూ మరచిపోలేరు'' అంటూ పేరు చెప్పడానికి మాత్రం నిరాకరించారు. ఇదంతా జరిగింది ఎక్కడ అంటే మలేసియాలో జరిగిన 'నట్చత్తిర విళా'లో. అంటే.. కళాకారుల వేడుక అని అర్థం. ఆ వేడుకలో రజనీ ఎవర్ గ్రీన్ స్టైల్ గురించి నటుడు వివేక్ ఓ ప్రశ్న అడిగారు. దానికి రజనీ తనదైన స్టైల్‌లో సమాధానం చెప్పడం అందర్నీ ఆకట్టుకుంది. ''నేను కండక్టర్‌గా చేస్తున్నప్పుడు అమ్మాయిలను ఆకట్టుకోవడానికి స్టైల్ మెయిన్‌టైన్ చేసేవాణ్ణి. అప్పుడు దర్శకుడు కె. బాలచందర్‌గారు నా బాడీ లాంగ్వేజ్, మేనరిజమ్స్‌ని చూశారు. ఈ స్టైల్ ఎప్పటికీ ఇలానే ఉండేలా చూసుకో అని ఆయన సూచించారు'' అని రజనీకాంత్ అన్నారు. గతంలో ఒక బెడ్‌రూమ్ ఉన్న ఫ్లాట్, ఓ స్కూటర్ ఉంటే చాలనుకునేవాణ్ణని పాత రోజులను గుర్తు చేసుకున్నారాయన. కానీ అంతకుమించి సంపాదించేశారు. అయినా రజనీ సింపుల్‌గానే ఉంటారు. దటీజ్ సూపర్ స్టార్.

బెస్ట్ చాయిస్



➤ శివాని

''మంచి సినిమాతో పరిచయం చేయాలని ఉంది. సరైన కథ కోసం చూస్తున్నాం'' అని రెండు మూడు నెలల క్రితం జీవిత 'సాక్షి'తో అన్నారు. పెద్ద కుమార్తె శివానీ సినీ రంగ ప్రవేశం గురించి మాట్లాడినప్పుడు ఆమె అలా అన్నారు. ఆ టైమ్ వచ్చేసింది. రాజశేఖర్–జీవితలకు మంచి కథ దొరికింది. కూతురి సిల్వర్ స్క్రీన్ ఎంట్రీకి ఇది కరెక్ట్ మూవీ అని ఫిక్స్ అయ్యారు. యస్.. శివానీ ఎంట్రీ షురూ అయింది. హిందీ హిట్ మూవీ '2 స్టేట్స్' రీమేక్ ద్వారా శివానీ తెలుగు తెరపై మెరవనుంది. అర్జున్ కపూర్, ఆలియా భట్ జంటగా నటించిన '2 స్టేట్స్' సూపర్ హిట్ అయిన విషయం తెలిసిందే. అడవి శేష్ హీరోగా నటించనున్న ఈ చిత్రం తెలుగు రీమేక్‌లో శివానీ హీరోయిన్‌గా దాదాపు ఫిక్స్ అయింది. అఫీషియల్ ఎనౌన్స్‌మెంట్ రావడమే ఆలస్యం. నూతన దర్శకుడు వెంకట్ రెడ్డి దర్శకత్వం వహించనున్నారు. '2 స్టేట్స్' కథ విషయానికొస్తే.. ఓ తమిళ బ్రాహ్మణ యువతి, పంజాబీ యువకుడు ప్రేమలో పడతారు. రెండు రాష్ట్రాలకు చెందిన ఈ ఇద్దరూ పెద్దల్ని ఒప్పించి, ఎలా పెళ్లి చేసుకున్నారు? అనేది కథ. లైన్ సింపుల్ అయినా తీసిన విధానం బాగుంటుంది. అందుకే కుమార్తె ఎంట్రీకి ఇదే 'బెస్ట్ చాయిస్' అని రాజశేఖర్ దంపతులు అనుకుని ఉంటారు.

ఎగిసే తారాజువ్వ

రంజిత్, పాలక్ లాల్వానీ హీరో హీరోయిన్లుగా 'దిక్కులు చూడకు రామయ్య' ఫేమ్ త్రికోటి పేట దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'జువ్వ'. ఎస్వీ రమణ సమర్పణలో సొమ్మి ఫిలింస్‌పై భరత్ సొమ్మి నిర్మించారు. హైదరాబాద్, వైజాగ్‌లో కొన్ని కీలక సన్నివేశాలు, బెంగళూర్‌లో కార్ ఛేజ్, మలేసియాలో రెండు పాటలు చిత్రీకరించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. త్వరలో మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా సినిమా ఫస్ట్ లుక్ మరియు ట్రైలర్‌ను రిలీజ్ చేయనున్నట్టు చిత్రబృందం తెలిపింది. జనవరి మూడో వారంలో ఆడియోను, ఫిబ్రవరి మొదటి వారంలో సినిమాని రిలీజ్ చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. అలీ, పోసాని కృష్ణ మురళి, మురళీ శర్మ, లత, తులసి, రఘుబాబు, ఏడిద శ్రీరామ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ–మాటలు: ఎమ్.రత్నం, సాహిత్యం: అనంత్ శ్రీ రామ్, వశిష్ఠ, కెమెరా: సురేష్, సంగీతం: యం.యం.కీరవాణి.



➤ రంజిత్

వేలంటైన్స్ డేకి ప్రేమకథ


''నాగార్జునగారు 'ఇది నా లవ్‌స్టోరీ' సినిమా టీజర్ రిలీజ్ చేసి మమ్మల్ని ఆశీర్వదించారు. టీజర్ పెద్ద హిట్ అయింది. నా పుట్టినరోజున (08.01.) ట్రైలర్ విడుదల కావడం సంతోషంగా ఉంది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో తరుణ్ అన్నారు. తరుణ్, ఓవియా జంటగా రమేష్–గోపీ దర్శకత్వంలో ఎస్.వి.ప్రకాష్ నిర్మించిన చిత్రం 'ఇది నా లవ్‌స్టోరీ'. తరుణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని సోమవారం విడుదల చేశారు. తరుణ్ మాట్లాడుతూ– ''ఇది రెగ్యులర్ ప్రేమకథ కాదు. ఇందులో మూడు గెటప్స్‌లో కనిపిస్తా. ట్రిపుల్ రోల్ చేశానా? మూడు షేడ్స్ ఉన్న పాత్ర చేశానా? అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. డైలాగ్స్, స్క్రీన్‌ప్లే, సినిమాటోగ్రఫీ, మ్యూజిక్,



➤ గోపి, ఎస్.వి. ప్రకాశ్, తరుణ్, రమేశ్

బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అన్నీ చక్కగా కుదిరాయి'' అన్నారు. రమేష్–గోపీ మాట్లాడుతూ– ''తెలుగు సినిమాల్లో ఇదొక డిఫరెంట్ లవ్‌స్టోరీ. తరుణ్ నటించిన 'నువ్వే కావాలి, నువ్వే నువ్వే' సినిమాలకంటే ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుంది. లవర్స్‌కు మంచి ట్రీట్ అవుతుంది'' అన్నారు. ''ఫిబ్రవరి 14న సినిమాను రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు ఎస్.వి.ప్రకాష్. సంగీత దర్శకుడు శ్రీనాథ్ విజయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మధు తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: జగదీశ్.ఎస్, అరుణ్ అజాద్, కో–ప్రొడ్యూసర్: ఎ.గణేశ్.

25న 'పద్మావత్' అయ్యారే.. వెనక్కి తగ్గారే!



అనుకున్నదే జరిగింది. 'పద్మావత్' ముందుకొస్తే.. కొన్ని సినిమాలు వెనక్కి తగ్గుతాయని చాలామంది అనుకున్నారు. అదే జరిగింది. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో దీపికా పదుకోన్, రణ్‌వీర్ సింగ్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'పద్మావత్'. పలుమార్లు వాయిదా పడుతూ, ఆదివారం వరకూ ఈ చిత్రం విడుదల అయోమయ పరిస్థితిలోనే ఉంది. ఈ నెల 25న విడుదల చేయాలని సోమవారం చిత్రబృందం నిర్ణయించుకుంది. అదే సమయానికి అక్షయ్‌కుమార్ 'ప్యాడ్‌మ్యాన్', 'అయ్యారీ' రిలీజ్‌కు రెడీ అయ్యాయి. 'పద్మావత్'లాంటి భారీ చిత్రం వచ్చినప్పుడు తాము రావడం శ్రేయస్కరం కాదు అనుకున్నారో ఏమో 'అయ్యారే' దర్శకుడు నీరజ్ పాండే తమ చిత్రం విడుదలను ఫిబ్రవరి 9కి వాయిదా వేశారు. బాలీవుడ్ కథనం ప్రకారం 'ప్యాడ్‌మ్యాన్' వెనకడుగు వేయాలనుకోవడంలేదట. ఈ నెల 25న వచ్చేయాల్సిందేనని చిత్రబృందం అనుకుంటోందట.

ముగ్గు-ముచ్చట



బొడ్డుపల్లి కవిత
అప్పాజిపేట, నల్గొండ జిల్లా
23 చుక్కలు
11 వచ్చే వరకు
మధ్య చుక్కలు



స్వరూప
హైదరాబాద్
15 చుక్కలు
1 వచ్చేవరకు



భానుప్రియ, హైదరాబాద్
18 చుక్కలు
10 వరకు
10 వచ్చేవరకు

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com; మరిన్ని ముగ్గులకు ... sakshi.com చూడండి.

స్క్రీన్ టెస్ట్

01. ఎన్టీఆర్–జయప్రద ఫేమస్ సాంగ్ 'ఓలమ్మి తిక్క రేగిందా..' పాటను ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వం వహించిన 'యమదొంగ' చిత్రంలో రీమిక్స్ చేశారు. ఆ పాటలోని 'మేల్ వాయిస్' ఎవరిదో తెలుసా?
ఎ) యం.యం. కీరవాణి బి) ఎస్.ఎస్.రాజమౌళి సి) జూ. యన్టీఆర్ డి) యస్పీ బాలసుబ్రహ్మణ్యం

02. 'డాడీస్ లిల్ గాళ్' అనే టాటూ ఏ ప్రముఖ బాలీవుడ్ నటి చేతిపై ఉంటుంది?
ఎ) ప్రియాంకా చోప్రా బి) దీపికా పదుకోన్ సి) విద్యాబాలన్ డి) కరీనాకపూర్

03. సమయం లేదు మిత్రమా! శరణమా? రణమా? ఈ డైలాగ్‌ను రాసిన రచయిత ఎవరో తెలుసా?
ఎ) జనార్ధన మహర్షి బి) సాయిమాధవ్ బుర్రా సి) క్రిష్ డి) పరుచూరి బ్రదర్స్

04. నాకు ఓల్డ్ స్టైల్ రొమాన్స్ (1990ల్లో) ఇష్టం అని చెప్పే హీరోయిన్ ఎవరు? ఈ హీరోయిన్ తండ్రి కూడా పెద్ద హీరోనే. తండ్రి తనకు రొమాంటిక్ స్టోరీలు చెప్పేవారని ఆమే చెప్పారు.
ఎ) శ్రుతీహాసన్ బి) కీర్తి సురేష్ సి) కార్తీక డి) వరలక్ష్మి

05. మరియప్పన్ అనే క్రీడాకారుని జీవితం ఆధారంగా ఓ చిత్రం (బయోపిక్) తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తానని ప్రకటించారు. మరియప్పన్ ఏ క్రీడకు చెందినవాడు?
ఎ) క్రికెట్ బి) బాక్సింగ్ సి) లాంగ్ జంప్ డి) హై జంప్

06. ప్రభాస్ నటిస్తున్న 'సాహో' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న భామ ఎవరో కనుక్కోండి?
ఎ) శ్రద్ధా కపూర్ బి) కంగనా రనౌత్ సి) ఇలియానా డి) రకుల్ ప్రీత్

07. 'దేవదాసు' చిత్రానికి మొదట అనుకొన్న హీరోయిన్ సావిత్రి కాదు. మరి ఎవరై ఉంటారో కనుక్కోండి?
ఎ) భానుమతి బి) యస్. వరలక్ష్మి సి) అంజలీదేవి డి) 'షావుకారు' జానకి

08. 'శంకరాభరణం' చిత్రంలో మంజు భార్గవి కొడుకు పాత్రలో నటించింది ఓ అమ్మాయి. తర్వాత కాలంలో ఆమె నటిగా చాలా పాత్రలు పోషించారు. ఆమె పేరేంటి?
ఎ) శ్రీలక్ష్మి బి) తులసి సి) ప్రగతి డి) రజిత

09. యలవర్తి నాయుడమ్మ భారతదేశంలోనే ప్రసిద్ధి గాంచిన శాస్త్రవేత్త. ఆయన మనవరాలిని ప్రేమించి పెళ్లి చేసుకున్న టాలీవుడ్ నటుడెవరు?
ఎ) నాని బి) రామ్‌చరణ్ సి) కల్యాణ్‌రామ్ డి) ఆది

10. 'మనం దేన్నైతే అసహ్యించుకుంటామో దేవుడు అందులోంచి ముంచి లేపుతాడు' అనేది 'మహానుభావుడు' సినిమాలో డైలాగ్. సినిమాలో ఈ డైలాగ్‌ను ఏ కమెడియన్ చెప్తాడు?
ఎ) భద్రం బి) 'వెన్నెల' కిశోర్ సి) టిల్లు వేణు డి) రఘుబాబు

11. 'దాన వీర శూర కర్ణ' సినిమా దర్శకుడెవరు?
ఎ) కమలాకర కామేశ్వరరావు బి) కె.వి. రెడ్డి సి) విఠలాచార్య డి) ఎన్టీ రామారావు

12. ప్రభాస్ తన మొదటి చిత్రం 'ఈశ్వర్'తో మొదలుకొని 'బాహుబలి' రెండు పార్టులతో కలిపి ఇప్పటివరకు ఎన్ని సినిమాల్లో నటించారో తెలుసా?
ఎ) 18 బి) 21 సి) 14 డి) 25

నిర్వహణ: **శివ మల్లాల**

13. 'ఆకలేస్తే అన్నం పెడతా మూడొస్తే ముద్దుల్ పెడతా చిన్నోడా..' అనే పాటను పాడింది ఎవరు?
ఎ) శ్రేయా ఘోషల్ బి) గీతా మాధురి సి) మమతా మోహన్‌దాస్ డి) దామిని

14. యస్.యస్. రాజమౌళి పుట్టినరోజు అక్టోబర్ 10న. అదే రోజు పుట్టిన టాప్ హీరోయిన్ ఎవరు?
ఎ) రాశీఖన్నా బి) కాజల్ అగర్వాల్ సి) శ్రియ డి) రకుల్‌ప్రీత్ సింగ్

15. కమల్‌హాసన్ నటించిన 'దశావతారం' సినిమా దర్శకుడెవరు?
ఎ) కె.యస్. రవికుమార్ బి) పి.వాసు సి) సురేశ్‌కృష్ణ డి) లింగుస్వామి

16. 'అబ్బ దబ్బ జబ్బ..' అనే డైలాగ్ చాలా పాపులర్. ఈ డైలాగ్‌లో నటించిన లేడీ కమెడియన్ శ్రీలక్ష్మి. ఆమెకు జోడీగా నటించిందెవరు?
ఎ) ఏవీయస్ బి) బ్రహ్మానందం సి) ధర్మవరపు డి) సుధాకర్

17. 2017లో రిలీజైన సినిమాకు 2016వ సంవత్సరానికి నేషనల్ అవార్డు లభించింది. ఆ సినిమా పేరేంటి?
ఎ) ఖైదీ నం 150 బి) గౌతమిపుత్ర శాతకర్ణి సి) బాహుబలి డి) శతమానం భవతి

18. నటుడు వెంకటేశ్ ఎవరి సిద్ధాంతాలను నమ్ముతారో తెలుసా?
ఎ) స్వామి వివేకానంద బి) రమణ మహర్షి సి) రామకృష్ణ పరమహంస డి) స్వామి పరిపూర్ణానంద



19. 19. ఈ ఫొటోలోని లక్ష్మణుని పాత్రలో నటించిన నటుడెవరో గుర్తుపట్టండి?
ఎ) కాంతారావు బి) హరనాథ్‌బాబు సి) శోభన్‌బాబు డి) చలం



20. ఈ ఫొటోలోని ప్రముఖ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టండి?
ఎ) నిత్యామీనన్ బి) అనుష్క సి) భావన డి) కాజల్ అగర్వాల్

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకు చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకు చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

సమాధానాలు
1) సి 2) ఎ 3) బి 4) ఎ 5) డి 6) ఎ 7) డి 8) బి 9) ఎ 10) బి 11) డి 12) ఎ 13) సి 14) డి 15) ఎ 16) బి 17) బి 18) బి 19) ఎ 20) ఎ

ఇక గ్యాప్ ఉండదు గురూ


వెంకటేశ్

'గురు' సినిమా రిలీజై దాదాపు పది నెలలు కావొస్తోంది. వెంకటేశ్ ఇంకా కొత్త సినిమా షూటింగ్ మొదలుపెట్టలేదు. తేజ దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేశ్ ప్రొడక్షన్స్ నిర్మించనున్న ఓ సినిమాను ఓకే చేసి, మూహూర్తం కూడా జరిపారు. కానీ... ఆ సినిమా ఇంకా సెట్స్ పైకి వెళ్లలేదు. మరి గురు షూటింగ్‌లోకి ఎంటరయ్యేదెప్పుడు అంటే.. వచ్చే నెలలో. "ఫిబ్రవరిలో షూటింగ్ మొదలుపెడుతున్నాం. సినిమాకు సంబంధించిన తారాగణం కూడా త్వరలో వెల్లడిస్తాం" అని పేర్కొన్నారు దర్శకుడు తేజ. ఈ సినిమాలో వెంకీ సరసన 'చెలియా' భామ అదితీరావ్ హైదరీ పేరును ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు ఫిల్మ్‌నగర్ సమాచారం. ఇదిలా ఉంటే 'గురు' సినిమా తర్వాత పది నెలలు గ్యాప్ తీసుకున్న వెంకీ ఇక నుంచి గ్యాప్ వచ్చే ప్రసక్తే లేదంటున్నారు. తేజ సినిమా చేస్తూనే.. రానాతో కలిసి రాజీవ్ గాంధీ హత్య ఆధారంగా ఓ వెబ్ సిరీస్‌లో యాక్ట్ చేయనున్నారు వెంకీ. అలాగే అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ యంగ్ హీరోతో మల్టీ స్టారర్ మూవీ కూడా ఒప్పుకున్నారు. వీటితోపాటు త్రివిక్రమ్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నట్టు ప్రకటించేశారు. సో.. గత ఏడాది వచ్చిన గ్యాప్‌ను మళ్లీ రాకుండా వరుసగా సినిమాలు ఒప్పుకుంటున్నారు వెంకటేశ్.

తమన్నా.. పూజ... ఓ సారీ


తమన్నా
పూజా హెగ్డే

మిల్కీ బ్యూటీ తమన్నా, గ్లామర్ గర్ల్ పూజా హెగ్డే సారీ చెప్పారు. సారీ చెప్పేటంత తప్పు వీరేం చేశారు? ఎవరికి క్షమాపణ చెప్పారు? అనేగా మీ డౌట్. అసలు సంగతి ఏంటంటే.. జాన్ అబ్రహాం, మనోజ్ బాజ్‌పేయి ముఖ్య పాత్రల్లో 'రాక్' అనే సినిమా తెరకెక్కనుంది. మిలాప్ ఝవేరి దర్శకత్వంలో నిఖిల్ అద్వానీ అంతర్జాతీయ ప్రమాణాలతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కించనున్నారట. ఇందులో కథానాయిక చాన్స్‌కి అటు తమన్నా ఇటు పూజా హెగ్డే 'సారీ.. కుదరదు' అన్నారని బాలీవుడ్ టాక్. 'రాక్' చిత్రంలో జాన్ అబ్రహాంతో జోడీ కోసం తొలుత తమన్నాను సంప్రదించారట చిత్రబృందం. మొదట సరే అన్న మిల్కీబ్యూటీ తర్వాత 'సారీ నేను చేయలేను' అంటూ తప్పుకున్నారట. ఆ పాత్రకు ఎవరైతే బాగుంటారా? అని సెర్చ్ చేసిన చిత్రబృందం 'మొహెంజొదారో'తో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన పూజా హెగ్డే కరెక్ట్ అనుకున్నారట. ఆమెను సంప్రదించగా సింపుల్‌గా 'సారీ' అన్నారట. తమన్నా ఎందుకు తప్పుకున్నారు? ఇటువంటి మంచి అవకాశాన్ని పూజా హెగ్డే వదులుకోవడానికి కారణం ఏంటి? అన్నది తాజా బాలీవుడ్ టాక్. అబ్రహాంకి మంచి హిట్లు లేకపోవడం వల్లే అని కొందరు అంటుంటే.. కాదు.. కాదు.. 'రాక్'లో కొన్ని బోల్డ్ సన్నివేశాలు ఉండటం వల్లే తప్పుకున్నారంటున్నారు మరి కొందరు గాసిప్‌రాయుళ్లు. మరి.. జాన్‌కి జోడీగా ఎవరు 'యస్' అంటారో?

అభిషేక్‌తో ఢీ


శివాజీ

'బ్యాచిలర్స్, మిస్సమ్మ, అమ్మాయి బాగుంది, అదిరిందయ్యా చంద్రం' వంటి పలు చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు శివాజీ. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, హీరోగా ఒకప్పుడు వరుస చిత్రాలు చేసిన ఆయన 2014లో వచ్చిన 'బూచమ్మ బూచోడు' తర్వాత వెండితెరకు దూరమై, రాజకీయాల వైపు అడుగులు వేశారు. అయితే శివాజీ తాజాగా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. అది కూడా ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కావడం విశేషం. అభిషేక్ బచ్చన్ హీరోగా ప్రియాంక చోప్రా, దీపికా పదుకోన్ హీరోయిన్లుగా నూతన దర్శకుడు ఆసిఫ్ ఓ సినిమా తెరకెక్కించనున్నారు. ముంబైలో వాస్తవంగా జరిగిన గ్యాంగ్ వార్ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ సినిమాలో నెగటివ్ టచ్ ఉన్న పోలీస్ అధికారి పాత్రలో శివాజీ కనిపించబోతున్నారు. ఏప్రిల్‌లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. శివాజీ తెలుగు తెరపై కనిపించడంలో లేటైనా లేటెస్ట్‌గా బాలీవుడ్‌లో అడుగుపెడుతుండటం విశేషమే. చిత్రబృందం ఇప్పటికే శివాజీతో కథా చర్చలు జరిపారు. జస్ట్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే ఆలస్యం.



స్విట్జర్లాండ్‌లోని బెర్నిస్ ఓబర్లాండ్‌లో ఉన్న ఓయిస్చెనిన్ సరస్సు వద్ద గడ్డకట్టిన నీటిపై స్కేటింగ్ చేస్తున్న ప్రజలు

పాక్‌లో వేళ్లూనుతున్న ఐఎస్

ఇస్లామాబాద్: కిరాతకమైన ఐఎస్ ఉగ్రవాదం పాకిస్తాన్‌లో చాలా వేగంగా విస్తరిస్తోందని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పీస్ స్టడీస్ (పీఐపీఎస్) సంస్థ తాజా గణాంకాలు విడుదల చేసింది. పాక్‌లో ఐఎస్ ప్రభావం ఉత్తర సింధ్, బలూచిస్తాన్ ప్రాంతాల్లో విస్తృతంగా ఉందని పిప్స్ పేర్కొంది. ఇటీవల బలూచిస్తాన్‌లో ఇద్దరు చైనీయుల హత్యకు పాల్పడింది ఈ ఉగ్రవాద సంస్థేనని తెలిపింది. 'స్పెషల్ రిపోర్ట్ 2017' పేరుతో విడుదల చేసిన సర్వేలో పాకిస్తాన్ ఎదుర్కొంటున్న భద్రతాపరమైన సవాళ్లను పిప్స్ నిర్వాహకులు పేర్కొన్నారు. బలూచిస్తాన్ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న సంస్థల కన్నా తెహ్రిక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్, జమాతుల్ అహ్రార్ సంస్థలు పాక్ అంతర్గత భద్రతకు ప్రమాదకరంగా మారుతున్నాయని పేర్కొంది. 2016తో పోలిస్తే 2017లో పాకిస్తాన్‌పై సీమాంతర దాడులు 131 శాతం పెరిగాయని తెలిపింది.

'అగస్టా' కేసులో ఫిన్‌మెకానికా చీఫ్‌కు క్లీన్‌చిట్



మిలన్: అగస్టావెస్ట్‌లాండ్ కుంభకోణం కేసులో హెలికాప్టర్ తయారీ సంస్థ ఫిన్‌మెకానికా సంస్థ మాజీ సీఈఓను ఇటలీ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. భారత ప్రభుత్వంతో కుదిరిన రూ.3,600 కోట్ల విలువైన వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణంతో ఫిన్‌మెకానికా మాజీ సీఈవో గుసెప్పె ఒర్సికి సంబంధం లేదని ఇటలీ అప్పీల్ కోర్టు సోమవారం తేల్చింది. ఫిన్‌మెకానికా సోదర సంస్థ అయిన అగస్టావెస్ట్‌లాండ్ సీఈఓ బ్రూనో స్పాగ్నోలినీని నిర్దోషిగా పేర్కొంది. 12 వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోలుకు భారత రక్షణ శాఖ, అగస్టా కంపెనీకి మధ్య ఒప్పందం కుదిరిన సమయంలో (2010 ఫిబ్రవరిలో) ఒర్సి సంస్థలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. తప్పుడు లెక్కలు చూపడంతోపాటు అవినీతికి పాల్పడ్డారనే కారణంతో 2014లో ఆయన్ను అరెస్టు చేశారు.

కళ్లల్లో యాసిడ్ పోద్దాం!

శ్రీనగర్: కశ్మీర్‌లో ఫిబ్రవరిలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కళ్లల్లో యాసిడ్ పోయాలంటూ హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులు మాట్లాడుకుంటున్నట్లుగా విడుదలైన ఓ ఆడియో క్లిప్ కలకలం రేపుతోంది. దీన్ని హిజ్బుల్ కమాండర్ రియాజ్ నైకూ, సమీర్ టైగర్ అనే మరో మిలిటెంట్ మధ్య జరుగుతున్న సంభాషణగా గుర్తించారు. 'పంచాయతీ ఎన్నికల్లో పోటీచేస్తే వారిని మనం చంపొద్దు. కళ్లల్లో గాఢమైన సల్ఫ్యూరిక్ యాసిడ్ లేదా హైడ్రోక్లోరిక్ యాసిడ్ పోద్దాం. 28 ఏళ్లుగా బెదిరిస్తున్నా వారు భయపడటం లేదు. ఆయా కుటుంబాలు పనికిరారని అనుకున్న వాళ్లే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. మన చేతిలో చస్తే రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని కుటుంబీకులు భావిస్తున్నారు. అలాంటి వారి కళ్లల్లో యాసిడ్ పోస్తే కుటుంబాలకు భారమవుతారు' అని ఆ ఆడియో క్లిప్‌లో ఉంది.

త్వరలో ఫేక్ న్యూస్ అవార్డ్స్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్కడి ప్రధాన మీడియాకు 'ఫేక్ న్యూస్ అవార్డులు' ప్రకటించే తేదీని జనవరి 17కు వాయిదా వేశారు. 'మోసపూరిత, చెడు వార్తలు' రాస్తున్నందుకు అక్కడి మీడియాకు అవార్డులు ఇస్తానని ట్రంప్ చాన్నాళ్లుగా అంటున్నారు. అమెరికాలోని సీఎన్ఎన్, ఏబీసీ న్యూస్, ది న్యూయార్క్ టైమ్స్, ది వాషింగ్టన్ పోస్ట్ వంటి ప్రధాన మీడియా, ట్రంప్ మధ్య కొంతకాలంగా పోరు సాగుతోంది. ఈ సంస్థలను 'ఫేక్ మీడియా'గా ట్రంప్ అభివర్ణిస్తుంటారు. 'అవినీతి, పక్షపాత ప్రధాన మీడియాకు అవార్డులను 17న ప్రకటిస్తాం' అని ట్వీటర్‌లో చెప్పారు.

ఇప్పట్లో పార్టీ ప్రకటన లేదు



సాక్షి, చెన్నై: రాజకీయ పార్టీ ప్రకటన ఇప్పట్లో ఉండబోదని సినీ నటుడు రజనీకాంత్ చెప్పారు. నాలుగు రోజుల పాటు మలేసియాలో పర్యటించిన ఆయన ఆదివారం రాత్రి చెన్నై చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ఆయనను చుట్టుముట్టి ప్రశ్నల వర్షం కురిపించారు. పార్టీ ప్రకటన ఎప్పుడు చేస్తారని ప్రశ్నించగా.. ఇప్పట్లో అలాంటి ప్రకటన ఏదీ లేదని రజనీకాంత్ స్పష్టం చేశారు.

గాంధీని గాడ్సేనే చంపాడు

న్యూఢిల్లీ: గాంధీజీ హత్య కేసును తిరిగి విచారించాల్సిన అవసరం లేదని ఈ కేసులో అమికస్ క్యూరీగా(న్యాయ సహాయకుడు) వ్యవహరిస్తోన్న సీనియర్ న్యాయవాది అమరేందర్ సుప్రీంకోర్టుకు తెలిపారు. గాంధీపై నాథూరాం గాడ్సేనే కాల్పులు జరిపాడని, ఈ కేసులో బ్రిటిష్ ప్రత్యేక నిఘా విభాగం పాత్ర ఉందన్న ఆరోపణలు నిరూపితం కాలేదని కోర్టుకు ఆయన నివేదిక సమర్పించారు. నివేదికను పరిశీలించిన జస్టిస్ బాబ్డే నేతృత్వంలోని బెంచ్ విచారణను వాయిదా వేసింది. నాథూరాం గాడ్సే తుపాకీతో కాల్చి గాంధీజీని హత్య చేయగా.. గాడ్సేతో పాటు కేసుతో ప్రమేయమున్న నారాయణ్ ఆప్టేకు కోర్టు ఉరిశిక్ష విధించింది. 1949 నవంబర్‌లో వారిద్దరిని ఉరి తీశారు. గాంధీ హత్యలో వేరే వ్యక్తి ప్రమేయం ఉందని ఆరోపిస్తూ.. ముంబై పరిశోధకుడు పంకజ్ ఫడ్నీస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై విచారణ చేపట్టిన కోర్టు కేసులో న్యాయ సలహా కోరుతూ అమరేందర్ శరణ్‌ను అమికస్ క్యూరీగా నియమించింది.

'స్వలింగ సంపర్కం' నేరమా?

- ఐపీసీ సెక్షన్ 377ను పునఃపరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు
- విస్తృత ధర్మాసనానికి సంబంధిత పిటిషన్





న్యూఢిల్లీ: స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి సుప్రీంకోర్టు సిఫార్సు చేసింది. స్వలింగ సంపర్కాన్ని నేరంగా పేర్కొంటోన్న భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ)లోని సెక్షన్ 377పై అభ్యంతరాల్ని విస్తృత ధర్మాసనం చర్చించాల్సిన అవసరముందని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఖాన్విల్కర్, జస్టిస్ చంద్రచూడ్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. పరస్పర అంగీకారంతో స్వలింగ సంపర్కంలో పాల్గొనే వయోధికుల్ని శిక్షించేందుకు అనుమతిస్తున్న సెక్షన్ 377ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలంటూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అసహజ నేరాల్ని పేర్కొంటున్న సెక్షన్ 377 ప్రకారం 'ప్రకృతికి విరుద్ధంగా పురుషుడు, స్త్రీ లేదా జంతువుతో ఉద్దేశపూర్వకంగా ఎవరైనా లైంగిక చర్యకు పాల్పడితే వారు శిక్షార్హులు. నేరం రుజువైతే వారికి జీవిత ఖైదు, జరిమానాతో పాటు అవసరమైతే శిక్షను గరిష్టంగా పదేళ్ల వరకూ పొడిగించవచ్చు.' ఐపీసీ 377 సెక్షన్‌ను సవాలు చేస్తూ నవ్‌తేజ్ సింగ్ జోహర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారిస్తూ '377 సెక్షన్‌ను సమర్థిస్తూ 2013 నాటి సుప్రీం తీర్పుపై క్యూరేటివ్ పిటిషన్ ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉంది. ఈ పిటిషన్‌ను అదే ధర్మాసనం విచారిస్తుంది' అని స్పష్టం చేసింది. జోహర్ తరఫున సీనియర్ న్యాయవాది అర్వింద్ దతర్ వాదిస్తూ.. ఈ నేర నిబంధన రాజ్యాంగ విరుద్ధమని, పరస్పర అంగీకారంతో వయోధికులు స్వలింగ సంపర్కంలో పాల్గొంటే వారిని నేరస్తులుగా పరిగణించడంతో పాటు జైలు శిక్ష విధించేందుకు ఈ సెక్షన్ అవకాశం కల్పిస్తోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యక్తిగత గోప్యత అంశంపై ఇటీవల బెంచ్ ఇచ్చిన తీర్పును దతర్ ఉటంకించారు. 'లైంగిక భాగస్వామిని ఎంచుకునే హక్కు ప్రాథమిక హక్కే'నన్న కోర్టు గత తీర్పుతో పాటు, 2009లో నాజ్ ఫౌండేషన్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్ వర్గానికి చెందిన సభ్యులు వేసిన పిటిషన్ కాపీని న్యాయశాఖకు అందచేయాలని కోర్టు సూచించింది.


ఒకరికి సహజం.. మరొకరికి కాదు: కోర్టు

'ప్రకృతి నియమాలు స్థిరంగా ఉండవు. సామాజిక నైతిక విలువలు మారుతాయి. ఒకరికి సహజం అనిపించేది మరొకరికి కాకపోవచ్చు. ఒక వర్గం ప్రజలు లేక వ్యక్తులు తమ స్వేచ్ఛను ఎన్నుకునే క్రమంలో ఎప్పుడూ భయంతో కూడిన స్థితిలో ఉండకూడదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఒక వ్యక్తికి సంక్రమించే హక్కుల్లో చట్టపరంగా ఉన్న పరిధులు జోక్యం చేసుకోలేవు. రాజ్యాంగ పరిమితులకు లోబడి చట్టం వ్యవహరించాలి' అని కోర్టు వ్యాఖ్యానించింది.

1861నుంచి నేరంగా...

ఐపీసీ సెక్షన్ 377 ప్రకారం స్వలింగ సంపర్కం నేరం. 1861లో ఈ సెక్షన్‌ను అప్పటి బ్రిటిష్ పాలకులు భారత శిక్షా స్మృతిలో ప్రవేశపెట్టారు. ఈ సెక్షన్‌ను సవాలు చేస్తూ 2001లో నాజ్ ఫౌండేషన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ హైకోర్టు ఇద్దరు వయోధికుల మధ్య పరస్పర అంగీకారంతో జరిగే స్వలింగ సంపర్కం నేరం కాదని తేల్చింది. రాజ్యాంగంలోని 14, 15, 21ల అధికరణాల్ని 377 సెక్షన్ ఉల్లంఘిస్తోందని పేర్కొంది. ఈతీర్పును కొందరు సుప్రీంకోర్టులో సవాలు చేయడంతో తీర్పుపై అభిప్రాయాన్ని వెల్లడించాలని కేంద్రాన్ని సుప్రీం ఆదేశించింది. డిసెంబర్ 11, 2013న ఢిల్లీ హైకోర్టు తీర్పును సుప్రీం కొట్టివేస్తూ 377 సెక్షన్ రాజ్యాంగ విరుద్ధం కాదంది. అనంతరం తీర్పును సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వం, గే హక్కుల కార్యకర్తలు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అనంతరం పలువురు క్యూరేటివ్ పిటిషన్లు దాఖలు చేయడంతో.. ఫిబ్రవరి 2, 2016న వాటిని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మసనానికి సిఫార్సు చేసింది. దాదాపు 26కు పైగా దేశాలు ఇప్పటికే స్వలింగ సంపర్కం నేరం కాదంటూ చట్టం చేశాయి.

సముద్ర మార్గంలో హజ్ యాత్రకు సౌదీ అంగీకారం



న్యూఢిల్లీ: హజ్ యాత్రను తక్కువ ఖర్చులో పూర్తి చేసేందుకు మార్గం సుగమమైంది. హజ్ యాత్రికులు జెడ్డాకు చేరుకునేందుకు 23 ఏళ్ల క్రితం మూసివేసిన సముద్ర మార్గాన్ని పునరుద్ధరించాలన్న భారత్ విజ్ఞప్తిని సౌదీ ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు ఇరు దేశాల మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందంపై సౌదీ హజ్, ఉమ్రా మంత్రి మహ్మద్ బిన్ ఆదివారం సంతకం చేసినట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ చెప్పారు. అయితే సముద్ర మార్గం ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందన్న విషయంపై పూర్తి సమాచారం తెలియలేదు. 1995 వరకు హజ్ యాత్రికులు ముంబైలోని మజ్‌గావ్ (ఎల్లో గేట్) నుంచి సౌదీలోని జెడ్డాకు ఈ మార్గం ద్వారానే ప్రయాణించేవారు. అప్పట్లో ఈ ప్రయాణానికి సుమారు 12 నుంచి 15 రోజుల సమయం పట్టేది. అయితే ప్రస్తుతం అత్యాధునిక ఓడలు అందుబాటులో ఉండటంతో యాత్రకు 4 రోజులు సమయం మాత్రమే పట్టనుంది.

మెహ్రం, లాటరీ లేకుండానే హజ్‌కు..

2018లో దాదాపు 1300 మంది భారతీయ మహిళలు పురుషుల తోడు లేకుండానే హజ్ యాత్రకు వెళ్లనున్నారని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ పేర్కొన్నారు. వీరందరినీ లాటరీ విధానం నుంచి తప్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

'క్యాట్' ఫలితాల వెల్లడి

100 పర్సెంటైల్ సాధించిన 20 మందిలో అనంతపురం విద్యార్థి



న్యూఢిల్లీ: ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్)లతోపాటు దేశంలోని ప్రతిష్టాత్మక బిజినెస్ స్కూళ్లలో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)లో అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థి సాయిప్రణీత్ రెడ్డి 100 పర్సెంటైల్ సాధించాడు. 2018 ఏడాదిలో ప్రవేశాల కోసం ఐఐఎం–లక్నో ఆధ్వర్యంలో గతేడాది నవంబరులో దేశవ్యాప్తంగా 140 పట్టణాల్లో జరిగిన క్యాట్‌కు దాదాపు 2 లక్షల మంది హాజరయ్యారు. సోమవారం ఫలితాలు విడుదలవగా మొత్తం 20 మంది విద్యార్థులు 100 పర్సెంటైల్ సాధించారు. గతేడాది క్యాట్ పరీక్షలోనూ 20 మంది 100 పర్సెంటైల్ సాధించగా వారందరూ అబ్బాయిలు, ఇంజినీరింగ్ నేపథ్యం ఉన్నవారే. ఈ ఏడాది అందుకు భిన్నంగా ఇద్దరు అమ్మాయిలు, ముగ్గురు నాన్–ఇంజినీర్లు కూడా 100 పర్సెంటైల్‌ను సొంతం చేసుకున్నారని క్యాట్ కన్వీనర్ నీరజా ద్వివేది చెప్పారు. క్యాట్‌కు రెండు లక్షల మంది హాజరవ్వడం గత మూడేళ్లలో ఇదే తొలిసారని ఆమె తెలిపారు. క్యాట్ స్కోర్‌ను అనుసరించి దేశంలోని 20 ఐఐఎంలలో దాదాపు 4,000 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐఎం అహ్మదాబాద్‌లో చేరతా: సాయి ప్రణీత్

అనంతపురం జిల్లాకు చెందిన, ఐఐటీ మద్రాస్‌లో చదువుతున్న సాయి ప్రణీత్ రెడ్డి 100 పర్సెంటైల్ సాధించాడు. ఐఐఎం అహ్మదాబాద్‌లో ఎంబీయే చదవాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. 'టెక్నికల్ రంగంలోనూ నేను రాణించగలను. కానీ కొన్నిసార్లు మన పనిని ఇతరులతో చేయించుకోవాల్సిన అవసరం ఉంటుందని నేను గుర్తించాను. అందుకోసం నిర్వహణా నైపుణ్యాలు కావాలి. అవి నేర్చుకోవడానికి మన దేశంలో ఐఐఎంలే అత్యుత్తమం' అని సాయి ప్రణీత్ వివరించాడు.

నాలుగోసారి 100 పర్సెంటైల్

ముంబైలో క్యాట్ కోచింగ్ సెంటర్ నిర్వహించే ప్యాట్రిక్ డిసౌజా 100 పర్సెంటైల్ సాధించడం ఇది నాలుగోసారి. కోచింగ్ సెంటర్ నడుపుతున్నందున క్యాట్‌లో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను తెలుసుకునేందుకు ఇప్పటికి 14 సార్లు పరీక్ష రాశాననీ, ప్రతీసారి కనీసం 99 పర్సెంటైల్ సాధించానని ఆయన చెప్పారు. కోల్‌కతా విద్యార్థి విశాల్ వోహ్రా, సూరత్ నుంచి మీత్ అగర్వాల్, ఢిల్లీ అమ్మాయి చావీ గుప్తా తదితరులు 100 పర్సెంటైల్ సాధించారు.

సైబర్ నేరాలు పెరుగుతున్నాయ్!

రాష్ట్రాల మధ్య సమన్వయం ముఖ్యం • పోలీసు ఉన్నతాధికారుల సదస్సులో మోదీ

టెకాన్‌పూర్: పెరుగుతున్న సోషల్ మీడియా వినియోగం కారణంగా తలెత్తుతున్న సమస్యలు, సైబర్ నేరాలపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని ప్రధాని మోదీ సూచించారు. వీటి పరిష్కారాన్ని ప్రాధాన్య అంశంగా గుర్తించాలన్నారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ సమీపంలో జరుగుతున్న జాతీయ డీజీపీ, ఐజీపీల సదస్సు ముగింపు సందర్భంగా మోదీ మాట్లాడారు. అక్రమ ఆర్థిక వ్యవహారాల సమాచార మార్పిడిపై అంతర్జాతీయంగా ఏకాభిప్రాయం వ్యక్తమవుతోందని.. దీంట్లో భారత్ కీలక భూమిక పోషించే అవకాశం ఉందన్నారు. అక్రమ ఆర్థిక లావాదేవీల విషయంలో రాష్ట్రపోలీసు ఉన్నతాధికారులు పక్క రాష్ట్రాల పోలీసు అధికారులతో సమాచారాన్ని పంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా 'భారత్ సహజసిద్ధ సమాఖ్య' అని ఆయన అభివర్ణించారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో సోషల్ మీడియా ప్రాముఖ్యతను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్థానిక భాషల్లో సందేశాలు పంపటం ప్రభావవంతంగా ఉంటుందని సూచించారు. యువత తీవ్రవాద భావాలవైపు ఆకర్షితులవుతున్న నేపథ్యంలో సాంకేతికత ద్వారా సమస్యాత్మక అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు, కేంద్ర బలగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి

ప్రపంచవ్యాప్తంగా పలు అంశాలపై ఏకాభిప్రాయం పెరుగుతున్న సమయంలో రాష్ట్రాల మధ్య భద్రత విషయంలో ఇలాంటి బంధాలు బలపడాలన్నారు. ప్రతీ రాష్ట్రం సమాచారాన్ని మార్పిడి చేసుకోవటం ద్వారానే ఇది సాధ్యమవుతుందన్నారు. మార్పుకోసం ప్రయత్నిస్తున్న పోలీసు ఉన్నతాధికారులను ఈ సందర్భంగా ప్రధాని ప్రశంసించారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, పోలీసుల బాధ్యతల వంటి అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు పాత్ర మరింత క్రియాశీలకంగా మారిందన్నారు. దేశ భద్రత కోసం రూపొందించిన వివిధ కార్యక్రమాల అమలులో పరస్పర సహకారం అవసరాన్ని ఈ సదస్సులు గుర్తుచేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. ఈ సదస్సును మరింత ప్రభావశీలంగా మార్చేందుకు ఏడాది వ్యాప్తంగా నిర్ణయించుకున్న కార్యక్రమాల సమీక్ష జరగాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులకు రాష్ట్రపతి పోలీసు మెడల్స్‌ను కూడా మోదీ అందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోదీ

బహ్రెయిన్ క్రౌన్ ప్రిన్స్‌తో రాహుల్ భేటీ

మనామా: కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి విదేశాల్లో పర్యటిస్తోన్న రాహుల్ గాంధీ సోమవారం బహ్రైన్ క్రౌన్ ప్రిన్స్ షేక్ సల్మాన్ బిన్ హమద్ అల్ ఖలీఫాతో భేటీ అయ్యారు. పలు ద్వైపాక్షిక అంశాలపై వారిద్దరూ చర్చించారు. ప్రభుత్వ అతిథిగా ఆ దేశంలో పర్యటిస్తోన్న రాహుల్.. రాజు హమాస్ బిన్ అల్ ఖలీఫాను కూడా కలవనున్నారు. క్రౌన్ ప్రిన్స్‌తో భేటీ అనంతరం రాహుల్ ట్వీట్ చేస్తూ.. 'భారత్, బహ్రైన్‌లకు సంబంధించి పరస్పర ఆసక్తులపై ఇద్దరం చర్చించాం' అని పేర్కొన్నారు. 'గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ పీపుల్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్' (గోపియో) నిర్వహించిన ప్రవాసీ సమ్మేళనంలోనూ పాల్గొన్నారు. గల్ఫ్‌లో 10 లక్షల మంది తెలంగాణ వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలంగాణ పీసీసీ గల్ఫ్ ఎన్నారై విభాగం అధ్యక్షుడు నంగి దేవేందర్ రెడ్డి రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ గల్ఫ్ వలసలపై నివేదికను అందజేశారు. ఎన్ఆర్ఐలతో రాహుల్ మాట్లాడుతూ.. 'నేను కూడా తప్పులు చేశా.. అయితే నేనూ మానవ మాత్రుడినే. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో అనుభవం, యువతరం మధ్య మంచి సమన్వయం ఉంది. కొత్త కాంగ్రెస్ పార్టీని మీకు అందిస్తాం' అని పేర్కొన్నారు.



గోపియో సదస్సులో మాట్లాడుతున్న రాహుల్

బార్‌లో అగ్ని ప్రమాదం; ఐదుగురి మృతి

సాక్షి, బెంగళూరు: ముంబైలో పబ్‌లో అగ్నిప్రమాదం జరిగి 14 మంది మృతి చెంది పదిరోజులైనా కాకముందే మరో మహానగరంలోనూ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు కలాసిపాళ్యలోని కైలాస్ బార్ అండ్ రెస్టారెంట్‌లో సోమవారం తెల్లవారుజామున చెలరేగిన మంటల కారణంగా అందులో పనిచేసే ఐదుగురు కార్మికులు దుర్మరణం చెందారు. మృతులను తుమకూరుకు చెందిన స్వామి, ప్రసాద్, మహేష్, హాసన్‌కు చెందిన మంజునాథ్, మండ్యకు చెందిన కీర్తిగా గుర్తించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో, ఇరుకైన ద్వారంతో ఈ బార్ ఉంది. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో మంటలు చెలరేగగా అక్కడే నిద్రిస్తున్న ఐదుగురు బయటకు వెళ్లలేక బాత్‌రూమ్‌లో దాక్కున్నారు. పొగకు ఊపిరాడక వారంతా ప్రాణాలు విడిచినట్లుగా భావిస్తున్నామనీ, పోస్ట్‌మార్టమ్ నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు. షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. ప్రమాదం జరిగిన వెంటనే బార్ యజమాని వీఆర్ దయాశంకర్‌ను అరెస్టు చేశారు.

'ట్రంప'రితనం... మానసిక వ్యాధా?

'ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ చెబుతున్నాడు...తన డెస్క్‌పై న్యూక్లియర్ బటన్ ఎప్పుడూ ఉంటుందని. ఆకలితో అల్లాడుతున్న ఆ దేశపు వాళ్లెవరైనా ఆయనకు చెప్పండి...నా దగ్గరా అంత కన్నా పెద్దది, శక్తిమంతమైన బటన్ ఉందని'... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ట్వీట్ ఇది. చూసిన వెంటనే 'నా చాక్లెట్ నీ కంటే పెద్దది' అంటూ గొప్పలు పోయే చిన్న పిల్లల పోరుగుర్తుకు తెప్పిస్తుంది కదూ! అగ్రదేశాధినేత ఈ రకమైన ట్వీట్లు పెట్టడం ఆయన మానసిక స్థితిపై సందేహాలు రేకెత్తిస్తోంది. పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఇలాంటి వైఖరే. ఈ నేపథ్యంలో అమెరికాలోని ప్రతిష్టాత్మక యేల్ విశ్వవిద్యాలయం సైకియాట్రీ అధ్యాపకురాలు బ్రాండీ ఎక్స్ లీ... ట్రంప్ పరిస్థితి ఏమాత్రం బాగా లేదనీ, ఆయన అధ్యక్షుడిగా కొనసాగడం మంచిది కాదంటూ అమెరికా ఎంపీలకు ఓ ప్రెజంటేషన్ ఇచ్చారు. ట్రంప్ ట్వీట్లు చెప్పే ఆయన మానసిక పరిస్థితిపై ప్రత్యేక కథనమిది. *- సాక్షి నాలెడ్జ్ సెంటర్*

అవునంటున్న సైకియాట్రిస్టులు • ఆయన ట్వీట్లపై ఓ పుస్తకం రాసి విశ్లేషించిన రాచెల్



నన్ను మించిన వాడు లేడు...

నేనే అందరికంటే గొప్పవాణ్ని...ఎలాంటి సమస్యనైనా నేను ఒక్కడినే సరిచేయగలను... డొనాల్డ్ ట్రంప్ ట్వీట్లు చూస్తే ఈ లక్షణాలు మెండుగా కనిపిస్తాయి అంటారు రాచెల్ మోంటగోమరి. అధ్యక్షుడిగా ట్రంప్ చేసిన దాదాపు 34 వేల ట్వీట్ల ఆధారంగా ఆయన మానసిక స్థితిని విశ్లేషిస్తూ రాచెల్ ఓ పుస్తకం రాశారు. ఈ భూమ్మీద తనకు తెలియని విషయమే లేదని ట్రంప్ నమ్ముతారు. నడత, చదువు, వ్యవహారశైలి వంటి విషయాలపై ఈయన పెట్టే శ్రద్ధ తదితర లక్షణాలను పరిశీలిస్తే వాస్తవం ఆయన నమ్మకానికి భిన్నమ ని ఇట్టే అర్థమైపోతుంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఓ వీడియోలో... ట్రంప్ మూడంటే మూడే నిమిషాల వ్యవధిలో తనకు 20 సబ్జెక్టుల్లో గొప్ప జ్ఞానముందని డబ్బా కొట్టుకోవడాన్ని రాచెల్ ప్రస్తావించారు. అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న సందర్భం లోనూ విదేశీ వ్యవహారాలపై మీరు ఎవరి సలహాలు తీసుకుంటారు? అన్న ప్రశ్న వేస్తే ట్రంప్ ఇచ్చిన సమాధానం.. ''నాతో నేనే మాట్లాడుకుంటా. ఎందుకంటే నా బుర్ర బాగా పనిచేస్తోంది కాబట్టి'' అని!

సంఘ వ్యతిరేక లక్షణాలు..

పొలిటీఫ్యాక్ట్ అని ఓ వెబ్‌సైట్ ఉంది. అమెరికా నేతలు చేసే కామెంట్లు.. అందులోని వాస్తవికతలను ప్రజల ముందు పెట్టే వెబ్‌సైట్ ఇది. దీని అంచనా ప్రకారం.. అధ్యక్షుడు ట్రంప్ స్టేట్‌మెంట్లలో 76 శాతం అబద్ధాలే. ఇంకా ఈ వెబ్‌సైట్ ఏం చెప్పిందంటే.. ప్రతి మూడు నిమిషాల 15 సెకన్లకు ట్రంప్ ఓ అబద్ధం చెబుతున్నాడట. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తుంది అంటే.. అబద్ధాలు చెప్పడం... ఇతరులను వాడుకోవడం, ఇతరుల హక్కులను ఏమాత్రం ఖాతరు చేయకపోవడం.. తన వల్ల ఇతరులకు హాని కలిగినా కాసింత కూడా పశ్చాత్తాపం, సానుభూతి చూపకపోవడం వంటి లక్షణాలన్నీ సంఘ వ్యతిరేక వ్యక్తిత్వ లక్షణాలుగా మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు కాబట్టి! న్యూయార్క్‌టైమ్స్ కథనం ప్రకారం ఫ్రాంక్ లంట్జ్ అనే వ్యక్తి ట్రంప్‌ను 'మీరెపుడైనా తన తప్పులకు మన్నించమని దేవుడిని అడిగారా?' అని అడిగితే లేదని సమాధానమివ్వడాన్ని బట్టి ట్రంప్ వ్యక్తిత్వం ఏమిటో తెలిసిపోతోంది!

నిత్య శంకితుడు..

ప్రతిదాన్నీ అనుమానపు దృష్టితో చూడటం...ప్రపంచం మొత్తం తనకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతోందని నమ్మే రకాల్లో డొనాల్డ్ ట్రంప్ ఒకరు. ఎన్నికలప్పుడు ట్రంప్ చేసిన ప్రకటనలు చూస్తే ఈ విషయం తెలిసిపోతుంది. అమెరికా ఎన్నికల్లో రష్యా పరోక్షంగా వేలు పెట్టిందని నిఘా వర్గాలు కోడై కూస్తే.. దాన్ని కొట్టిపారేయడం వీటిల్లో ఒకటి మాత్రమే. మొత్తమ్మీద ఎన్నికల సమయంలో ఈయనగారు ఇలాంటి కుట్ర కథనాలు దాదాపు 48 వరకూ ప్రకటించారని అంచనా. అధ్యక్షుడయ్యాక ఇవి ఏమైనా తగ్గాయా? అంటే.. ఇంకా పెరిగాయనే చెప్పాలి. ఒబామా అధ్యక్షుడిగా ఉండగా.. తన ట్రంప్ టవర్‌లోని ఫోన్లు ట్యాప్ చేశాడన్న ఆరోపణ కూడా చేశారు. నిజానిజాలతో సంబంధం లేకుండా ప్రతిదాన్ని అనుమానపు దృష్టితో చూస్తారనేందుకు ఇంత కంటే వేరే నిదర్శనాలు అవసరం లేదేమో!

శాడిజం పాళ్లూ ఎక్కువే...

ట్రంప్ ట్వీట్ల ద్వారా ఆయన వ్యక్తిత్వాన్ని విశ్లేషించిన రాచెల్ అంచనా ప్రకారం..ట్రంప్‌లో శాడిజం పాళ్లూ ఎక్కువే. తనతో ఏకీభవించని వారిని ట్వీట్లలో హేళన చేస్తూ మాట్లాడటం ట్రంప్‌కు అధ్యక్షుడు కాకముందు నుంచీ అలవాటే. తన కార్యక్రమంలో నిరసన వ్యక్తం చేసిన పౌరుడిని ఉద్దేశించి..'వాడి మొహం మీద గుద్దు గుద్దాలని ఉంది' గతంలో ట్రంప్ అన్నారనీ, తన వైఖరిపై నిరసన తెలిపేవారిని సూట్ లాగేసి చల్లటి వాతావరణంలోకి వదిలేయాలనడం, 'మా చిన్నప్పుడు ఇలా చేసేవాళ్లం' అని పళ్లు ఇకిలించడం ట్రంప్‌కే చెల్లిందని రాచెల్ అన్నారు. ట్రంప్ ఎదుటివారి బాధలో తన ఆనందాన్ని వెతుక్కుంటాడని ఆమె చెప్పారు. సీఎన్ఎన్ న్యూస్‌తోపాటు చాలామందిని బాక్సింగ్ గ్లోవ్స్‌తో పంచ్ చేస్తున్న ఫొటోలు పెట్టే తత్వం ఇంతకంటే భిన్నంగా ఉంటుందని అనుకోలేం కదా?

పోలవరానికి అడ్డంకులు తొలిగాయి: సీఎం




సాక్షి ప్రతినిధి, ఏలూరు/పోలవరం రూరల్/ఏలూరు మెట్రో/అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు అన్ని అడ్డంకులు తొలిగిపోయాయని, పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని సీఎం చంద్రబాబు చెప్పారు. త్వరలో జరగబోయే పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుందన్నారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ఆయన ఎగువ కాఫర్ డ్యాం పనులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణానికి పూర్తి స్థాయిలో క్లియరెన్స్ లభించిందని చెప్పారు. త్వరలోనే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రాజెక్టు సందర్శనకు వస్తారని చెప్పారు. గోదావరితో పాటు పెన్నా, కృష్ణా, నాగావళి, వంశధార నదులను అనుసంధానం చేసి ఐదు దశల్లో పనులు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీని వల్ల తొమ్మిది జిల్లాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు.

మళ్లీ గెలిపించాల్సిన బాధ్యత మీదే!

అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నందున వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉన్నదని సీఎం చంద్రబాబు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో సోమవారం జరిగిన జన్మభూమి–మా ఊరు గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాధికార మిత్రల గురించి మాట్లాడుతూ.. ప్రతి 35 కుటుంబాలకు ఒక సాధికార మిత్రను నియమిస్తున్నామని చెప్పారు. వీరు ఆ 35 కుటుంబాల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఎర్రకాల్వ ప్రాజెక్టును మార్చి, ఏప్రిల్‌లోగా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా జలసిరికి హారతి కార్యక్రమం చేపట్టి మన సంస్కృతిని చాటిచెబుతామన్నారు. ఆధునిక వ్యవసాయ విధానాలు అమలు చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పశ్చిమగోదావరిని ఆదర్శ జిల్లాగా ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలకూ సిమెంట్ రోడ్లు వేసేందుకు రూ.200 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.

టీటీడీతో భాగస్వామ్యం గొప్పవరం: రతన్ టాటా



సాక్షి, తిరుమల: కేన్సర్ ఆస్పత్రి నిర్మాణంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)తో భాగస్వామ్యం కావటం గొప్పవరమని టాటా సంస్థల మాజీ చైర్మన్ రతన్ టాటా అన్నారు. సోమవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవటం మహదానందంగా ఉందన్నారు. కాగా, రతన్‌టాటా, టాటా సంస్థల ప్రస్తుత చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌కు తిరుమల జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు ప్రత్యేక దర్శనం కల్పించారు. పండితులు వేద ఆశీర్వాదంతో పాటు శ్రీవారి పట్టువస్త్రంతో సత్కరించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట విజయవాడ ఎంపీ కేశినేని నాని కూడా ఉన్నారు.

కోడి పందేలపై సుప్రీంలో పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: కోడి పందేలు నిర్వహించొద్దన్న తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ బీజేపీ నేత రఘురామకృష్ణంరాజు సుప్రీంకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. సాంప్రదాయబద్ధంగా వస్తోన్న ఈ పందేలను నిర్వహించుకునేందుకు అనుమతినివ్వాలని పిటిషన్‌లో కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి కుంభా రవిబాబు



సాక్షి ప్రతినిధి, తిరుపతి : శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే కుంభా రవిబాబు సహా విశాఖ జిల్లాకు చెందిన 326 మంది జిల్లా, మండల, గ్రామ స్థాయి టీడీపీ నేతలు సోమవారం మధ్యాహ్నం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రజా సంకల్ప యాత్రలో ఉన్న వైఎస్ జగన్ కుంభా రవిబాబుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బాదుడే.. బాదుడు..

చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ ఇక్కట్లే

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజం

మూడు సార్లు పెరిగిన విద్యుత్, బస్సు చార్జీలు

ఏ రాష్ట్రంలో లేని విధంగా పెట్రో ధరలు భగ్గుమంటున్నాయి..



పూతలపట్టులో జరిగిన బహిరంగ సభలో అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి :

'ఇవాళ సామాన్యులు వారి మోటారు సైకిళ్లకు, చిన్న కార్లకు పెట్రోలు పట్టించుకోవాలంటే భయపడిపోతున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ అధిక ధర ఉంది. ఈ పెద్దమనిషి (చంద్రబాబు) అధికారంలోకి రాకముందు కరెంటు చార్జీలు షాక్ కొడుతున్నాయన్నాడు. అధికారంలోకి రాగానే కరెంటు చార్జీలు తగ్గిస్తానన్నాడు. తీరా తగ్గించడం అటుంచి మూడు సార్లు పెంచాడు. ఆర్టీసీ బస్సు చార్జీలు కూడా మూడు సార్లు పెంచారు. ఇలా ఒక్కటి కాదు.. అన్నింటా బాదుడే బాదుడు..' అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 56వ రోజు సోమవారం చిత్తూరు జిల్లా పూతలపట్టులో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాక ముందు కరెంటు బిల్లులు రూ.30, రూ.40, రూ.50 వచ్చేవని, ఇవాళ రూ.500 నుంచి రూ.2 వేలకుపైగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పన్నులనూ వదిలి పెట్టలేదని మండిపడ్డారు. సహకార రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేట్ రంగంలో ఉన్న హెరిటేజ్ సంస్థను లాభాల బాట పట్టించడానికి రైతులను దగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఉద్యోగం లేదు.. ఉపాధి లేదు..

చంద్రబాబు ఇంటికో ఉద్యోగం అంటూ నిరుద్యోగులను ముంచాడు. వారికి రూ.2 వేలు నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదు. రైతులకు రూ.87,612 కోట్ల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి నిండా ముంచాడు. ఇపుడు ఆయన ఇస్తున్న సొమ్ము ఈ అప్పులకు అయిన వడ్డీకి కూడా సరిపోవడం లేదు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలనూ మోసం చేశాడు. రేషన్‌కార్డు, పింఛన్, మరుగుదొడ్డి.. ఇలా ఏది కావాలన్నా ఇవాళ జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి. చంద్రబాబు ముఖ్యమంత్రికాక మునుపు రేషన్‌షాపులో బియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు, పామాయిల్, గోధుమలు, కారం, పసుపు, ఉప్పు, చింతపండు, కిరోసిన్ దొరికేవి. అవునా కాదా? (అవును.. అవును అని జనం స్పందన) అన్నీ కలిపి రూ.185కు ఇచ్చేవాళ్లు. ఇవాళ బియ్యం తప్ప ఏమైనా దొరుకుతున్నాయా? పైగా చంద్రన్న మాల్స్ అంటూ తీసుకొచ్చాడు. ఈ మాల్స్‌లో అన్ని సరుకుల ధరలూ ఎక్కువే. బయటి మార్కెట్‌లో చక్కెర కిలో రూ.35 ఉంటే చంద్రన్న మాల్స్‌లో రూ.48. చింతపండు బయట రూ.145 అయితే చంద్రన్న మాల్స్‌లో రూ.290. అన్ని వస్తువులూ ఇంతే. ఇది మోసం కాదా? పక్కన బోర్డరులోని తమిళనాడు, కర్ణాటకల్లో మన రాష్ట్రంలో కంటే తక్కువ ధరకు పెట్రోలు దొరుకుతుంది. అధిక పన్నులు వేసి ఎక్కడా లేని రీతిలో పెట్రోలు ధర పెంచారు. ఈ నాలుగేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు అయినా కట్టించారా? ఇసుక, మట్టి, మద్యం, అమరావతి భూములు, దేవుడి భూములు.. అంతటా అవినీతే. ఇలాంటి ఆయనకు ఓటు వేయకపోతే సిగ్గు పడాలట. అన్ని వర్గాల వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు నిజంగా సిగ్గు పడాల్సింది చంద్రబాబే.

మీ అందరి ఆశీస్సులు కావాలి

మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మనం ఏం చేయబోతున్నామనేది నవరత్నాల ద్వారా ఇప్పటికే చెప్పాను. పేద విద్యార్థులను ఇంజనీరింగ్, డాక్టర్.. ఇతర పెద్ద చదువులు చదివిస్తాను. ఇందుకోసం ఎంత ఖర్చు అయినా భరిస్తాం. హాస్టల్ ఖర్చుల కోసం ఏటా రూ.20 వేలు ఇస్తాం. చిన్న పిల్లలను బడికి పంపిస్తే తల్లి ఖాతాలో ఏటా రూ.15 వేలు వేస్తాం. పేదల కోసం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవ తీసుకుని ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ అమలు చేశారు. ఆయన కుమారునిగా నేనే రెండు అడుగులు ముందుకు వేస్తాను. ఎక్కడైనా సరే ఆరోగ్య శ్రీ కింద వైద్యం పొందేలా చర్యలు తీసుకుంటాం. రూ.వెయ్యి ఖర్చు దాటితే ఈ పథకాన్ని వర్తింప చేస్తాం. అవ్వాతాతల పింఛన్‌ను రూ.2 వేలు చేస్తాం. ప్రతి పేద వాడికి ఇల్లు కట్టించి.. అక్క,చెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తాం. ఎన్నికల నాటికి డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలు ఎంత ఉంటే అంత మొత్తాన్ని వారి చేతికే నాలుగు విడతల్లో ఇస్తాం. చెడిపోయిన ఈ రాజకీయ వ్యవస్థలోకి విశ్వసనీయత, నిజాయితీ అన్న పదాలు రావాలి. ఇదే చంద్రబాబును మనం క్షమిస్తే ఏం జరుగుతుందో తెలుసా. మళ్లీ రేపొద్దున్న వస్తాడు. ప్రతీ ఇంటికీ కేజీ బంగారం, కారు ఇస్తానంటాడు. ఈ రాజకీయ వ్యవస్థ మారాలి. ఏదైనా రాజకీయ నాయకుడు ఇది చేస్తానని చెప్పి.. చెప్పిన పని చేయకపోతే తన పదవికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి తీసుకు రావాలి. ఇది ఒక్క జగన్ వల్లనే సాధ్యం కాదు. మీ అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు కావాల''ని వైఎస్ జగన్ కోరారు.

ఆదాయ వనరులైనందునే అపచారాలు

సీఎం చంద్రబాబుకు మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు లేఖ



సాక్షి, అమరావతి: ప్రభుత్వాలు ఆలయాలను ఆదాయ వనరులుగా భావిస్తున్నాయని, ఆదాయ మార్గాల అన్వేషణలో ఆలయాల్లో అనేక అపచారాలు జరుగుతున్నాయని రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అభిప్రాయపడ్డారు. విజయవాడ తాంత్రిక పూజల నేపథ్యంలో ఆయన సోమవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఆదాయం కోసం వివిధ రకాల పూజల పేరుతో ఎక్కువ ధరలు వసూలు చేస్తుండటంతో సాధారణ భక్తులు అసంతృప్తికి లోనవుతున్నారని పేర్కొన్నారు. ఆలయాల నిర్వహణలో రాజకీయ జోక్యం పెరిగిపోవడం వల్ల హిందూ ధార్మిక సంస్థల సంప్రదాయాలు, సంస్కృతి దెబ్బతింటోందని లేఖలో పేర్కొన్నారు. ఇసుక కాంట్రాక్టర్ శేఖర్‌రెడ్డి వంటి వారు టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమితులయ్యాడని, అలాంటి వ్యక్తులు పలువురు టీటీడీ చైర్మన్లుగా ఉన్నారని చెప్పారు. ఏపీపీఎస్సీ ద్వారా దేవాదాయ శాఖలో సిబ్బందిని నియమిస్తుడటం వల్ల ఇతర మతస్తులు కూడా ఈ శాఖలో ఉద్యోగం పొందుతున్నారని ఐవైఆర్ పేర్కొన్నారు. దేవాదాయ శాఖ, ఆలయాల్లో పనిచేసే సిబ్బంది నియామకానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీ ఎంసెట్ ఏప్రిల్ 22 నుంచి 26 వరకు

అన్ని సెట్‌లూ ఆన్‌లైన్‌లో

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి ఏపీ ఎంసెట్ షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఎంసెట్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 22 నుంచి 26 వరకు నిర్వహించనున్నారు. ఎంసెట్‌తో సహా 8 సెట్ల షెడ్యూళ్లను తాడేపల్లిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం విడుదల చేశారు. అన్ని సెట్లనూ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు మంత్రి గంటా పేర్కొన్నారు. ముందుగా ఎడ్‌సెట్, లాసెట్‌ను ఏప్రిల్ 19న నిర్వహిస్తామని, మే 4న జరిగే పీఈసెట్‌తో సెట్స్ ముగుస్తాయని తెలిపారు. ఎంసెట్ కోసం 115 నుంచి 150 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కొత్త ఏడాదిలోనూ అబద్ధాలేనా!

సీఎంపై మండిపడ్డ బొత్స



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త సంవత్సరంలో కూడా అబద్ధాలే చెబుతున్నారని, ఆయనలో ఏమాత్రం మార్పు రాలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టులపై రూ.50 వేల కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. రాజధాని నిర్మాణం విషయంలోనూ అసత్యాలే చెబుతున్నారని మండిపడ్డారు. పెన్షన్ల మంజూరీలో వాస్తవాలు వెల్లడించేందుకు ముందుకొచ్చిన అంబటి రాంబాబును గృహ నిర్బంధం చేయడమేమిటని నిలదీశారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో వైఎస్సార్ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గడచిన నాలుగేళ్లలో ఈ ప్రభుత్వం రూ.లక్షా 20 వేల కోట్లు అప్పు చేసిందని, అందులో కనీసం రూ. 20 వేల కోట్లు కూడా సాగునీటి ప్రాజెక్టులపై ఖర్చు చేయలేదని బొత్స తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.50 వేల కోట్లు ఖర్చుపెట్టినట్టు సీఎం కర్నూలు సభలో డాంబికాలు పలకడం సత్యదూరమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత అంబటి రాంబాబును అక్రమంగా గృహ నిర్బంధం చేయడాన్ని బొత్స తీవ్రంగా ఖండించారు. నిజమైన లబ్ధిదారులకు పెన్షన్ అందడం లేదని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నతో బహిరంగ చర్చకు సిద్ధమైన అంబటిని నిర్బంధంలోకి తీసుకోవడం సరైన చర్య కాదన్నారు.


వందలు ఎరవేసి..

25 లక్షల ఆభరణాలు చోరీ

ఖమ్మం క్రైం: కొన్ని రూ. 50 నోట్లను ఎరగా వేసి కారు డ్రైవర్ దృష్టి మళ్లించి.. రూ. 25 లక్షల విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన ఖమ్మంలో సోమవారం జరిగింది. నగరానికి చెందిన గుర్రం రాధిక, ఆమె కోడలు వనజ ఓ బ్యాంక్ లాకర్‌లో ఉన్న తమ బంగారు ఆభరణాలను ఓ సూట్‌కేస్‌లో భద్రపరిచి కారు సీటు కింద పెట్టి.. గాంధీచౌక్‌లోని ఓ బంగారం షాపులోనికి వెళ్లారు. డ్రైవర్‌ను కారు పార్కింగ్ చేయాలని సూచించి, బంగారం భద్రపరిచిన సూట్‌కేసును అతడికి అప్పగించారు. ఈలోపు గుర్తు తెలియని ఆగంతకుడు కారు వద్దకు వచ్చి 'కింద రూ.50 నోట్లు పడి ఉన్నాయి.. అవి మీవేనా..?' అంటూ అడగడంతో అతను కిందకు దిగి వరుసగా పడి ఉన్న నోట్లను ఏరుకుంటుండగా.. గుర్తు తెలియని వ్యక్తి కారులోని సూట్‌కేసుతో పరారయ్యాడు. నోట్లు తీసుకున్నాక డ్రైవర్.. కారులో కూర్చొని సీట్ కింద ఉన్న సూట్ కేసును చూసుకోగా.. అది కనిపించలేదు. వెంట కారుదిగి చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. డ్రైవర్ వెంటనే వెళ్లి తన యజమానురాలికి విషయం చెప్పగా.. వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఖమ్మం రూరల్ ఏసీపీ పింగళి నరేశ్‌రెడ్డి సందర్శించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చోరీ అయిన సూట్‌కేసులో బంగారం, వజ్రాల నగలు ఉన్నాయని బాధితులు తెలిపారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఈ దృశ్యాలు సరిగా లేకపోవటంతో దొంగలను గుర్తు పట్టే పరిస్థితి లేదని తెలుస్తోంది.

రాజన్న అన్నీ ఇచ్చిండు

ప్రజావాణిలో వైఎస్సార్‌ను తలచుకున్న వృద్ధుడు



పెద్దపల్లిఅర్బన్: ముఖ్యమంత్రిగా పాలనలో తనదైన ముద్రను వేసుకున్న దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి ప్రజల్లో ఆదరణ తగ్గలేదు. ఆయన సేవల్ని ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణికి వచ్చిన పెద్దపల్లి మండలం రాగినేడుకు చెందిన యేల్పుల ఎల్లయ్య(80) దివంగత రాజశేఖరరెడ్డి పేదలకు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. వృద్ధాప్య పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరిగి వేసారి కలెక్టర్‌కు మొర పెట్టుకుందామని వచ్చాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్నీ ఇచ్చిండు.. అడుగుడు ఆలస్యంలేదు పని చేసి పెట్టిండు..దొర ఎక్కడున్న సల్లంగుండాలే.. మల్ల గసొంటోడు రావాలె.. నాడు నెలనెలా ఠంచన్‌గా పింఛన్ అచ్చేది'అని దివంగత నేతను తలచుకుని కన్నీరుపెట్టుకున్నాడు. 'కేసీఆర్ అచ్చి ఏం చేయలేదు.. బ్యాంకుల ఖాతా కావాలంటే తెరిచినా..అయినా పింఛన్ రాలే.. తెలంగాణ అచ్చిన మొదటి నుంచి న్యాయం జరగలేదు'అని అక్కసును వెల్లగక్కాడు.. అనంతరం కలెక్టర్ శ్రీదేవసేనకు వినతిపత్రం అందించాడు.

'కాళేశ్వరం'ను పరిశీలించిన సీడబ్ల్యూసీ బృందం

కాళేశ్వరం (మంథని): 'కాళేశ్వరం'బ్యారేజీని కేంద్ర జలవనరుల కమిషన్ (సీడబ్ల్యూసీ) బృందం సోమవారం పరిశీలించింది. కమిషన్ చీఫ్ ఇంజనీర్ సీకేఎల్.దాస్, డైరెక్టర్లు ఎన్ఎన్.రాజ్, రాజీవ్‌కుమార్, ఎన్.ముఖర్జీ ఈ బృందంలో ఉన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మిస్తున్న మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లి పంప్‌హౌస్ పనులను వారు పరిశీలించారు. కేంద్ర బృందానికి ఈఎన్‌సీ మురళీధర్‌రావు, సీఈలు హరిరామ్, నల్లా వెంకటేశ్వర్లు బ్యారేజీ వివరాలను వివరించారు.బ్యారేజీల్లో టీఎంసీల సామర్థ్యం, పంప్‌హౌస్‌ల ఆవశ్యకతను తెలియజేశారు. నీటి లభ్యత ఎంత వరకు ఉంది అనే అంశంపై ఇరిగేషన్ అధికారులను బృందానికి వివరించారు. జూన్ వరకు ట్రయల్ రన్ నిర్వహించాలనే ఉద్దేశంతో శరవేగంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. బృందం వెంట ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ మల్లికార్జున్ ప్రసాద్, డీఈఈలు ప్రకాశ్, సూర్యప్రకాశ్, యాదగిరి, మెగా సంస్థ సీజీఎం వేణుమాధవ్, పీఎం వినోద్, అఫ్కాన్ కంపెనీ పీఎం శేఖర్‌దాస్ ఉన్నారు.

తెలంగాణ

తెల్లారిన కూలీల బతుకులు

- రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం
- మరో 28 మందికి గాయాలు



సాక్షి, గద్వాల: రోడ్డు ప్రమాదంలో ఐదుగురు కూలీలు దుర్మరణం పాలయ్యారు. మరో 28 మంది గాయపడ్డారు. పత్తి జిన్నింగ్ మిల్లులో రాత్రి షిఫ్టులో పనిచేసి వస్తున్న కూలీల బొలెరో వాహనం బోల్తా పడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం పారుచర్ల వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గద్వాల పట్టణంలోని శ్రీ విజయలక్ష్మి మిల్లులో ధరూరు మండలం చిన్నపాడు, యములోనిపల్లి గ్రామాలకు చెందిన 35 మంది కూలీలు పనులకు వెళ్లారు. ఆదివారం నైట్ షిఫ్ట్‌లో పనిచేసి సోమవారం తెల్లవారుజామున బొలెరో వాహనంలో తిరుగు పయనమయ్యారు. యాజమాన్యమే వాహనం సమకూర్చగా.. ఒకేసారి అందరినీ పంపించాలనే ఉద్దేశంతో 35 మందిని ఎక్కించారు. ఇక 10 నిమిషాలు అయితే సొంతూరుకు చేరుకునే క్రమంలో గద్వాల మండలం గోనుపాడు శివారులోని పారుచర్ల స్టేజీ సమీపంలో తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో వాహనం బోల్తా పడింది. డ్రైవర్ సైతం కూలీలతో పాటే రాత్రి పనిచేసి ఉండటం.. ఆయన డ్రైవింగ్ చేసే క్రమంలో అలసటకు గురై నిద్రలోకి జారుకోవడంతో మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడిందని కూలీలు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో చిన్నపాడు గ్రామానికి చెందిన కమ్మరి లోహిత్(35), కమ్మరి గీతమ్మ (35), కోట్ల వెంకటన్న (40), కొత్తబావి వెంకటన్న(35) యమ్మినోనిపల్లికి చెందిన అరుణ(18) అక్కడికక్కడే మృతి చెందారు. 28 మందికి గాయాలయ్యాయి. వీరిలో 14 మందిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలం వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. ఎస్పీ విజయ్‌కుమార్, డీఎస్పీ సురేందర్‌రావు ఘటనా స్థలం వద్ద పరిస్థితిని సమీక్షించారు. కాగా, మిల్లు యజమాని నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని, పరిహారం చెల్లించే వరకు మృతదేహాలను కదిలించమని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఎస్పీ నచ్చజెప్పడంతో వారు శాంతించారు.

మహిళా సర్పంచ్ గ్రామ బహిష్కరణ

- నిజామాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి..
- కుటుంబంతో సహా కలెక్టరేట్‌కు వచ్చిన బాధితురాలు



ఇందూరు (నిజామాబాద్ అర్బన్): వ్యవసాయ భూమి విషయంలో చెప్పినట్లుగా వినడం లేదనే కక్షతో కొందరు ఓ దళిత మహిళా సర్పంచ్‌నే కుల, గ్రామ బహిష్కరణ చేసిన ఘనట నిజామాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఊరికి సమస్యలు వస్తే సర్పంచ్‌గా పరిష్కరించే తనకు ఊరి నుంచే కొందరి వల్ల సమస్య ఎదురు కావడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆ సర్పంచ్ సోమవారం కుటుంబీకులతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వచ్చి న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకుంది. జిల్లాలోని మెండోర మండలం బుస్సాపూర్ సర్పంచ్ జక్కుల మమత, ఆమె కుటుంబం తాతల కాలం నాటి నుంచి ఉన్న 20 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గ్రామంలోని కొందరు అగ్ర కులాల వారు ఆ భూమిని గతంలోనే తమకు విక్రయించారని, కాగితాలపై సంతకాలు చేయాలని సర్పంచ్ మమత, ఆమె భర్త శ్రీనివాస్‌పై ఒత్తిడి చేశారు. ఈ విషయంలో ఇరువర్గాలకు చాలాసార్లు వాగ్వాదం జరిగింది. సంతకం పెట్టనందుకు మొదటగా కుల బహిష్కరణ, ఆ వెంటనే గ్రామ బహిష్కరణ చేశారని బాధిత సర్పంచ్ మమత కలెక్టర్ రామ్మోహన్‌రావుకు ఫిర్యాదు చేసింది. తనతో తన కుటుంబ సభ్యులతో ఎవరైనా మాట్లాడినా.. పొలాల్లో పనులకు వచ్చినా.. వారికి రూ.5 వేల జరిమానా విధిస్తామని చాటింపు వేశారని వివరించారు.

భూ రికార్డుల బూమ్.. బూమ్..!

ప్రక్షాళన తర్వాత పెరిగిన భూమి 11 లక్షల ఎకరాలు

- 2.3 లక్షల సర్వే నంబర్లు, 6.9 లక్షల ఖాతాలు కూడా..
- గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం భూమి సుమారు 2.52 కోట్ల ఎకరాలు
- 25 నాటికి ప్రక్షాళన పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: భూ రికార్డుల ప్రక్షాళన గణాంకాలు ఓ కొలిక్కి వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 30 జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతంలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఉన్న భూముల వివరాలు, రికార్డుల వివరాల్లో భారీ ఎత్తునే మార్పులు జరగనున్నాయి. ఇప్పటికి పూర్తయిన భూ రికార్డుల ప్రక్షాళన గణాంకాలను పరిశీలిస్తే భూముల విస్తీర్ణం, సర్వే నంబర్లు, ఖాతాల వివరాల్లో లక్షల సంఖ్యలో మార్పులొచ్చాయి. రాష్ట్రంలో గతంలో అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణం 2.4 కోట్లకు పైగా ఎకరాలుండగా, ఇప్పుడు అది 2.51 కోట్లకు చేరింది. అదేవిధంగా 2.3 లక్షల సర్వే నంబర్లు, 6.9 లక్షల మంది రైతుల ఖాతాలు కూడా పెరగడం గమనార్హం.

నల్లగొండలో అత్యధిక భూములు

రాష్ట్రంలోని 30 జిల్లాల్లో నల్లగొండ జిల్లాలో ఎక్కువ భూములున్నట్టు తేలింది. ఈ జిల్లాలో 18,66,481 ఎకరాలు ఉన్నట్టు నిర్ధారణ అయింది. ఆ తర్వాత పాలమూరు జిల్లాలో 13.50 లక్షల ఎకరాలు ఉంది. టాప్–2లో ఉన్న ఈ రెండు జిల్లాల మధ్య వ్యత్యాసమే 5 లక్షల ఎకరాలు దాటడం విశేషం. ఈ రెండు జిల్లాలకు తోడు మరో 8 జిల్లాల్లో 10 లక్షలకు పైగా ఎకరాల భూమి తేలింది. అయిదు లక్షల కన్నా తక్కువ భూములన్న జిల్లాలు కూడా నమోదయ్యాయి. మొత్తం 5 జిల్లాల్లో అత్యల్పంగా మేడ్చల్–మల్కాజ్‌గిరిలో 2,63,582 ఎకరాలు నమోదయ్యాయి. ఈ జిల్లాలో ఇంకా రికార్డుల పరిశీలన పూర్తికాలేదు. ఆ తర్వాత వరంగల్ అర్బన్లో తక్కువగా 3,17,500 ఎకరాలు నమోదయ్యాయి. అయితే, మొత్తం 10,874 రెవెన్యూ గ్రామాల్లోని 10,774 గ్రామాల్లో భూ రికార్డుల ప్రక్షాళన జరగ్గా.. అందులో 50–100 గ్రామాలు మినహా అన్నిచోట్లా రికార్డుల పరిశీలన పూర్తయిందని రెవెన్యూ వర్గాలంటున్నాయి. మిగతా గ్రామాల్లో కూడా ఈ నెల 25 కల్లా ప్రక్షాళన కార్యక్రమాన్ని సంపూర్ణం చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినట్టు సమాచారం.



భూ రికార్డుల ప్రక్షాళన గణాంకాలివే

రాష్ట్రంలో మొత్తం రెవెన్యూ గ్రామాలు:	10,874
రికార్డుల ప్రక్షాళన జరిగింది:	10,774
గతంలో రికార్డుల్లో ఉన్న సర్వే నంబర్లు:	1,78,97,491
పూర్తయిన తర్వాత తేలిన సర్వే నంబర్ల సంఖ్య:	1,81,28,304
సక్రమంగా తేలిన, సరిచేసిన సర్వే నంబర్లు:	1,66,85,548 (92.04%)
ఇంకా సరిచేయాల్సిన సర్వే నంబర్లు:	14,42,756
గతంలో రికార్డుల్లో ఉన్న భూ విస్తీర్ణం:	2,40,71,495 ఎకరాలు
ప్రక్షాళన తర్వాత తేలిన భూ విస్తీర్ణం:	2,51,73,574 ఎకరాలు
సక్రమంగా తేలిన, సరిచేసిన భూ విస్తీర్ణం:	2,24,86,579 ఎకరాలు
ఇంకా సరిచేయాల్సిన భూ విస్తీర్ణం:	26,86,994 ఎకరాలు
గతంలో రికార్డుల్లో ఉన్న ఖాతాల సంఖ్య:	75,71,475
ప్రక్షాళన తర్వాత తేలిన ఖాతాలు:	82,66,136
సక్రమంగా ఉన్న ఖాతాలు:	73,46,910 (88.88%)
సరిచేయాల్సిన ఖాతాలు:	9,19,226

పది లక్షల ఎకరాల కన్నా ఎక్కువ భూములున్న జిల్లాలు

జిల్లా	విస్తీర్ణం (ఎకరాల్లో)
రంగారెడ్డి	12,95,469
సంగారెడ్డి	11,19,415
నల్లగొండ	18,66,481
మహబూబ్‌నగర్	13,50,768
కామారెడ్డి	10,92,213
నిజామాబాద్	10,54,428
మంచిర్యాల	11,58,309
ఖమ్మం	10,08,509
నాగర్‌కర్నూల్	12,17,332
సూర్యాపేట	10,38,987

5 లక్షల ఎకరాల లోపు భూములున్న జిల్లాలు

జిల్లా	విస్తీర్ణం (ఎకరాల్లో)
వరంగల్ అర్బన్	3,17,500
మేడ్చల్–మల్కాజ్‌గిరి	2,63,582
రాజన్న సిరిసిల్ల	4,52,386
కరీంనగర్	4,90,933
పెద్దపల్లి	4,90,433

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబర్-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్

sakshieducation@gmail.com

బులెటిన్ బోర్డ్

ఉద్యోగాలు

ఎస్వీఎన్ఐటీలో 19 ఖాళీలు

గుజరాత్‌లోని సూరత్‌లో ఉన్న సర్దార్ వల్లభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్వీఎన్ ఐటీ).. 19 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


- **పోస్టు:** ప్రొఫెసర్.
- **విభాగాల వారీ ఖాళీలు:** మెకానికల్ ఇంజనీరింగ్–3, కంప్యూటర్ ఇంజనీరింగ్–2, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్–5, కెమికల్ ఇంజనీరింగ్–1, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–5, అప్లైడ్ ఫిజిక్స్–1, అప్లైడ్ మ్యాథమెటిక్స్ అండ్ హ్యుమానిటీస్–2.
- **అర్హతలు:** సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీతోపాటు ఉద్యోగానుభవం.
- **దరఖాస్తు రుసుం:** రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 16, 2018.
- **వెబ్‌సైట్:** www.svnit.ac.in

ఫెలోషిప్స్

ఐహెచ్‌బీటీలో 45 ఖాళీలు

సీఎస్ఐఆర్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ బయోరీసోర్స్ టెక్నాలజీ (ఐహెచ్‌బీటీ).. 45 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు–ఖాళీలు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్ లెవెల్–ఐ (పీఏ–ఐ)–14; ప్రాజెక్ట్ అసిస్టెంట్ లెవెల్–ఐఐ (పీఏ–ఐఐ))–30; జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)–1.
- **స్టైపెండ్:** పీఏ–ఐకు రూ.15,000; పీఏ– ఐఐకు రూ.25,000; జేఆర్ఎఫ్‌కు రూ.25,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ ఎంఎస్సీ+ నెట్–ఎల్ఎస్/ జీప్యాట్/ బ్యాచిలర్ డిగ్రీ.
- **వయసు:** ఇంటర్వ్యూ తేదీ నాటికి పీఏ–ఐ, జేఆర్ఎఫ్‌కు 28 ఏళ్లు; పీఏ–ఐఐకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** వాకిన్ ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి నేరుగా వాకిన్ ఇంటర్వ్యూకు నేరుగా వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
- **వాకిన్ ఇంటర్వ్యూ తేదీలు:** జేఆర్ఎఫ్‌కు జనవరి 17, 2018; పీఏ–ఐఐ (ప్రాజెక్టును బట్టి)కు జనవరి 17, 18, 2018; పీఏ–ఐకు జనవరి 19, 2018.
- **వాకిన్ వేదిక:** సీఎస్ఐఆర్–ఐహెచ్‌బీటీ, పాలంపూర్, కాంగ్రా డిస్ట్రిక్ట్, హిమాచల్ ప్రదేశ్.
- **వెబ్‌సైట్:** www.ihbt.res.in



ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ (టీఎస్ ట్రాన్స్‌కో).. 174 సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్); 330 అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్, సివిల్, టెలికం) ఉద్యోగాలకు ప్రకటనలు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో అర్హతలు, ఎంపిక విధానం, విజయానికి సూచనలు..

టీఎస్ ట్రాన్స్‌కో.. ఇంజనీర్ కొలువుకు గెలుపు మెట్లు..

సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)

అర్హతలు

- ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్/డిప్లొమా లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత. 2017, జులై 1 నాటికి 18–44 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్లు; పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

- మొత్తం 100 మార్కుల ఆధారంగా సబ్ ఇంజనీర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాత పరీక్షకు 80 మార్కులు కేటాయించారు. ఇందులో అర్హత సాధించిన ఇన్‌సర్వీస్ అవుట్‌సోర్స్ ఉద్యోగులకు గరిష్ఠంగా 20 మార్కుల వెయిటేజీ ఉంటుంది. రాత పరీక్ష, సర్వీస్ వెయిటేజీ మార్కులను కలిపి మెరిట్ జాబితా రూపొందిస్తారు.
- రాత పరీక్షలో 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. రుణాత్మక మార్కులుండవు. ప్రశ్నపత్రంలో రెండు సెక్షన్లుంటాయి. సెక్షన్ ఏలో డిప్లొమా ఎలక్ట్రికల్ సబ్జెక్టుకు సంబంధించి 65 ప్రశ్నలుంటాయి. సెక్షన్ బీలో జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 15 ప్రశ్నలు ఇస్తారు. రెండు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు.
- **రాత పరీక్షలో అర్హత మార్కులు:** ఓసీ–40%, బీసీ–35 శాతం; ఎస్సీ/ఎస్టీ– 30%; పీహెచ్–30 శాతం.

సన్నద్ధత

- ఎలక్ట్రికల్ మెషీన్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్, డీసీ జనరేటర్ అండ్ మోటార్, త్రీపేజ్ ఇండక్షన్ మోటార్, సింగిల్ పేజ్ ఇండక్షన్ మోటార్, కమ్యుటేటర్ మోటార్ అంశాలపై దృష్టిసారించాలి. ఆర్మేచర్ రియాక్షన్, టార్క్ స్పీడ్ ఈక్వేషన్, టెస్టింగ్ మెథడ్ ముఖ్యమైనవి.
- ట్రాన్స్‌ఫార్మర్ అంశంలో కన్‌స్ట్రక్షన్ ఆపరేషన్స్, టెస్ట్స్, ఫార్ములాలకు సంబంధించి చిన్నపాటి సమస్యల సాధనను ప్రాక్టీస్ చేయాలి.
- ఇండక్షన్ మోటార్, కమ్యుటేటర్ మోటార్ చాప్టర్లలో టార్క్ ఈక్వేషన్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఆపరేషన్, ఈఎంఎఫ్ ఈక్వేషన్ ఆఫ్ ఆల్టర్నేటర్ తదితర అంశాలకు సంబంధించిన సమస్యలపై దృష్టిసారించాలి.
- మెషీన్స్‌లో వచ్చే చిన్న ఈక్వేషన్ ఫార్ములాలను ప్రత్యేకంగా నోట్ చేసుకొని, వీలైనప్పుడు చదువుతుండాలి. దీన్నుంచి దాదాపు 20 మార్కులకు ప్రశ్నలు వచ్చే అవకాశముంది.
- స్విచ్‌గేర్, ప్రొటెక్షన్ నుంచి 8–10 ప్రశ్నలు రావొచ్చు. ఫ్యూజులు, ఐసోలేటర్లు, సర్క్యూట్ బ్రేకర్స్ రకాలు, సెలెక్షన్ ఆఫ్ లొకేషన్ అంశాలు ముఖ్యమైనవి.
- ప్రొటెక్టివ్ రిలేయింగ్‌లో టైప్స్ ఆఫ్ రిలేస్, వాటి అప్లికేషన్స్; **buchholz relay**, మెర్జ్ ప్రైస్ ప్రొటెక్షన్, బస్‌బార్ ప్రొటెక్షన్ తదితర అంశాలను అధ్యయనం చేయాలి.
- ట్రాన్స్‌మిషన్‌లో sag calculationకు సంబంధించిన సమస్యలు, టైప్స్ ఆఫ్ సపోర్ట్స్, కండక్టర్, డిఫరెన్షియల్ వోల్టేజ్, లెవెల్ రేటింగ్స్‌పై దృష్టిసారించాలి. వీటినుంచి దాదాపు 18 మార్కులకు ప్రశ్నలు రావొచ్చు.
- ట్రాన్స్‌మిషన్ లైన్ పెరామీటర్స్ సబ్జెక్టులో సిమెట్రిక్, అసిమెట్రిక్ టైప్స్; వోల్టేజ్ క్యాలిక్యులేషన్‌పై సమస్యలను ప్రాక్టీస్ చేయాలి. నామినల్, నామినల్ టి–మెథడ్స్; క్రిటికల్ వోల్టేజ్, కరోనా ఫ్యాక్టర్స్ తదితర అంశాలు ముఖ్యమైనవి. వీటినుంచి 12–15 మార్కులకు ప్రశ్నలు వచ్చేందుకు అవకాశముంది.
- జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ ప్రిపరేషన్‌కు రోజులో కొద్ది సమయాన్ని కేటాయించాలి. పత్రికలు చదవడం ద్వారా కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. తెలంగాణ సంస్కృతి, ఉద్యమ అంశాలపై పాఠశాల స్థాయి పాఠ్యపుస్తకాల ఆధారంగా అవగాహన పెంపొందించుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 5, 2018.
- **పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 25, 2018.

అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్, సివిల్, టెలికం)

అర్హతలు

- ఎలక్ట్రికల్/సివిల్/టెలీకమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత. 2017, జులై 1 నాటికి 18–44 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్లు; పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.


పరీక్ష విధానం

- ప్రశ్నపత్రంలో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 100 మార్కులకు ఉంటాయి. సెక్షన్–ఏలో ఆయా పోస్టులకు సంబంధించిన టెక్నికల్ సబ్జెక్టు (ఎలక్ట్రికల్/ సివిల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) నుంచి 80 ప్రశ్నలు; సెక్షన్–బీలో జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల వ్యవధిలో సమాధానాలు గుర్తించాలి.

సన్నద్ధత

ఎలక్ట్రికల్

- ఎలక్ట్రికల్ మెషీన్స్, ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, కంట్రోల్ సిస్టమ్స్, మెజర్‌మెంట్స్; మ్యాథమెటిక్స్, సిగ్నల్ సిస్టమ్స్, ఈఎంఎఫ్ అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలి.



- ఎలక్ట్రికల్ మెషీన్స్ నుంచి దాదాపు 15 మార్కులకు, ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్ నుంచి దాదాపు 25 మార్కులకు ప్రశ్నలు వచ్చే అవకాశముంది. కంట్రోల్ సిస్టమ్స్, మెజర్‌మెంట్స్ నుంచి 10 మార్కులకు ప్రశ్నలు ఉండొచ్చు. అదే విధంగా డిజిటల్ ఎలక్ట్రానిక్స్, అనలాగ్ ఎలక్ట్రానిక్స్ నుంచి 12, మ్యాథమెటిక్స్ నుంచి 8, ఈఎంఎఫ్ నుంచి 3 ప్రశ్నలు వచ్చేందుకు అవకాశముంది. బి.ఎల్.థెరాజా, పి.ఎస్.బింబ్రా తదితర పుస్తకాలను ప్రిపరేషన్‌కు ఉపయోగించుకోవచ్చు.

ఉదా:

Damping ratio of second order systems whose characteristics equation is $s^2+3s+100$ is?

1) 0.15 2) 0.25
3) 0.35 4) 0.45

సమాధానం: 1

సివిల్

- ఆర్‌సీసీ, కాంక్రీట్ టెక్నాలజీ, బిల్డింగ్ మెటీరియల్స్ అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలి.
- గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం తప్పనిసరి. ఈ విభాగం వారు ప్రత్యేకంగా మ్యాథమెటిక్స్‌పై దృష్టిసారించాల్సి ఉంటుంది. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్), ఐఈఎస్‌కు సంబంధించిన పేపర్లను ప్రాక్టీస్ చేయాలి. ఆర్.ఎస్.ఖుర్మి, ఇతర ప్రామాణిక పుస్తకాలను ఉపయోగించుకోవచ్చు.

ఉదా:

The water content of soil can..

1) be less than zero percent
2) be greter than 100 percent
3) Never be greter than 100 percent
4) None

సమాధానం: 2

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్

- ముఖ్యంగా సిగ్నల్ సిస్టమ్, కమ్యూనికేషన్, నెట్‌వర్క్ థియరీ, కంట్రోల్ థియరీ; ఎలక్ట్రో మ్యాగ్నటిక్ వేవ్స్ అండ్ ట్రాన్స్‌మిషన్ లైన్స్ (ఈఎంటీఎల్) అంశాలపై దృష్టిసారించాలి. మ్యాథమెటిక్స్, ఆప్టిట్యూడ్ అంశాలను కూడా అధ్యయనం చేయాలి.

ఉదా:

Which of the following is faster A/D convertor?

1) Ramp type
2) Successive approximation
3) Flash type
4) Dual stop

సమాధానం: 3

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 16, 2018.
- **పరీక్ష తేదీ:** మార్చి 11, 2018.
- **వెబ్‌సైట్:** tstransco.cgg.gov.in



– డా. జి.రమణ
డైరెక్టర్, సాయిమేధ ఇన్‌స్టిట్యూషన్స్.

● ఎంసెట్-2018

విజయానికి ప్రణాళిక..

తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్ కోర్సుల ప్రవేశ పరీక్ష ఎంసెట్‌కు లక్షల్లో హాజరవుతుంటారు. తెలంగాణ, ఏపీ ఎంసెట్-2018 తేదీలు ఇప్పటికే వెలువడ్డాయి. మరోవైపు ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో ఇంటర్ ఫైనలియర్ విద్యార్థుల ఏకైక లక్ష్యం.. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించడంతోపాటు ఎంసెట్‌లో టాప్ ర్యాంక్ కైవసం చేసుకోవడమే! ఈ లక్ష్యాన్ని సాధించాలంటే విద్యార్థులు ఎలాంటి వ్యూహాన్ని అనుసరించాలి? ప్రిపరేషన్ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటో తెలుసుకుందాం..

తెలంగాణలో మే మొదటి వారంలో, ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ చివరి వారంలో ఆన్‌లైన్ విధానంలో ఎంసెట్‌ను నిర్వహించనున్నారు. ఇక ఇంటర్మీడియెట్ పరీక్షలు రెండు రాష్ట్రాల్లోనూ ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభంకానున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు నిర్వహించనున్నారు.

ఇంటర్‌కు ప్రాధాన్యం

ప్రస్తుతం ఎంసెట్ ఔత్సాహిక విద్యార్థులు పూర్తిగా ఇంటర్ పరీక్షలపైనే దృష్టిపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. వాస్తవానికి ఎంసెట్ లక్ష్యంగా ఉన్న అభ్యర్థులు ఇప్పటికే ప్రిపరేషన్ పూర్తిచేసి ఉంటారు. ఒకట్రెండు అంశాల ప్రిపరేషన్ మిగిలుంటే.. జనవరి చివరివారంలోపు పూర్తి చేసుకోవాలి. ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండటంతో ఎంసెట్ గురించి ఆలోచించకుండా ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపడంపైనే దృష్టిసారించాలి.

పరీక్షలు పూర్తయ్యాక?


ఇంటర్ పరీక్షలు పూర్తయిన తర్వాత విద్యార్థులు ఎంసెట్ కోణంలో ప్రిపరేషన్‌కు పదునుపెట్టాలి. ప్రిపరేషన్ పూర్తిచేసినవారు రివిజన్‌కి సమయం వెచ్చించాలి. ప్రిపరేషన్ సమయంలో సొంతంగా రాసుకున్న నోట్స్, షార్ట్‌కట్స్‌ను అనుసరిస్తూ రివిజన్ చేయాలి. తద్వారా సమయం ఆదా అవడంతోపాటు ఎంసెట్ సిలబస్‌లో పేర్కొన్న అన్ని అంశాలను అధ్యయనం చేయొచ్చు. ఎంసెట్ ర్యాంకులకు సంబంధించి ఇంటర్ మార్కుల (వెయిటేజీ)తోపాటు ఎంసెట్‌లో చూపిన ప్రతిభా కీలకమే. రెండిట్లో ప్రతిభ కనబరిస్తేనే కోరుకున్న కాలేజీలో సీటు లభిస్తుంది. అయినప్పటికీ ప్రస్తుతం మాత్రం ఎంసెట్ గురించి ఆలోచించి.. అనవసర ఒత్తిడికి గురికాకుండా ఇంటర్ పరీక్షలపైనే దృష్టిపెట్టడం ఉత్తమం.

జేఈఈ, నీట్

ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు జేఈఈకి, బైపీసీ విద్యార్థులు నీట్‌కు సన్నద్ధం అవడం సహజం. జేఈఈ మెయిన్–2018ను ఆఫ్‌లైన్ విధానంలో ఏప్రిల్ 8న, ఆన్‌లైన్ విధానంలో ఏప్రిల్ 15, 16 తేదీల్లో నిర్వహించనున్నారు. మెడికల్ కోర్సులకు ఉద్దేశించిన నీట్ (యూజీ)–2018ను సీబీఎస్ఈ మే 10న నిర్వహించనుంది. ఈ తేదీలను పరిగణనలోకి తీసుకుని.. ఇంటర్ పరీక్షల అనంతరం విద్యార్థులు జేఈఈ/నీట్ దృక్పథంతో ప్రిపరేషన్ సాగించాలి. ఇలా చేస్తే ఒకే సమయంలో జేఈఈ/నీట్, ఎంసెట్‌లకు సన్నద్ధత లభిస్తుంది. జేఈఈ మెయిన్ పరీక్షలు ఏప్రిల్ 16న ముగుస్తాయి. జేఈఈ మెయిన్ తర్వాత అందుబాటులో ఉండే సమయాన్ని ఎంసెట్‌కు కేటాయించడం ఉత్తమం. జేఈఈ మెయిన్ బాగా రాసిన అభ్యర్థులు.. జేఈఈ అడ్వాన్స్‌డ్ కోణంలో ప్రిపరేషన్ కొనసాగిస్తే ఎంసెట్‌లో మెరుగ్గా రాణించొచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను మే 20న ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. బైపీసీ విద్యార్థులు నీట్, ఎంసెట్‌ల ప్రిపరేషన్‌ను ఏకకాలంలో సాగించొచ్చు. రెండు పరీక్షల మధ్య వ్యవధి తక్కువగా ఉంది. కాబట్టి రెండిటి సిలబస్‌లను దగ్గరపెట్టుకొని ప్రిపరేషన్ సాగించాలి.

కాన్సెప్ట్ ఆధారంగా!

జేఈఈ/ఎంసెట్/నీట్‌లకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు కాన్సెప్ట్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. జేఈఈ, నీట్ గత ప్రశ్నపత్రాల్లో అప్లికేషన్ ఆధారిత ప్రశ్నలకు ప్రాధాన్యం దక్కింది. కాబట్టి ప్రిపరేషన్ దశ నుంచే కాన్సెప్ట్ ఆధారంగా ముందుకెళ్లాలి. దీనివల్ల ఎంసెట్‌లోనూ ప్రయోజనం ఉంటుంది. ఎంసెట్‌లో అడిగే ప్రశ్నలు ఎక్కువగా డైరెక్ట్‌గా ఉంటాయి. జేఈఈ స్థాయిని దృష్టిలో పెట్టుకుని విషయావగాహనతో ప్రిపరేషన్ సాగిస్తే ఎంసెట్‌లో విజయాన్ని అందుకోవచ్చు.



ఆన్‌లైన్ నైపుణ్యం

ప్రస్తుతం ప్రవేశ పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. విద్యార్థులు దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆన్‌లైన్ పరీక్షా విధానంపై అవగాహన పెంచుకోవాలి. ఈ సంవత్సరం రెండు రాష్ట్రాల ఎంసెట్‌లతోపాటు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆన్‌లైన్‌లో జరగనుంది. జేఈఈ మెయిన్‌ను మాత్రం అన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ నిర్వహిస్తున్నారు. కాబట్టి ఇంటర్ పరీక్షల అనంతరం సబ్జెక్టు ప్రిపరేషన్‌తోపాటు ఆన్‌లైన్ విధానంలో మాక్‌టెస్ట్‌లకు హాజరైతే ప్రయోజనం ఉంటుంది.

సబ్జెక్టుకు మూడు గంటలు!

ఎంసెట్ ఔత్సాహిక విద్యార్థులు ఇంటర్ పరీక్షల అనంతరం ప్రతి సబ్జెక్టుకు మూడు గంటలు చొప్పున కేటాయించాలి. ఇలా నిర్దేశించుకున్న వ్యవధిలో మొదటి 15 నిమిషాలను అంతకుముందు రోజు చదివిన అంశాల పునశ్చరణకు వెచ్చించాలి. ఈ సమయంలో షార్ట్ నోట్స్ రూపొందించుకుంటే.. పరీక్షకు వారం ముందు క్విక్ రివిజన్‌కు ఉపయోగపడుతుంది.

సబ్జెక్టుల వారీగా ముఖ్యాంశాలు

- **మ్యాథమెటిక్స్:** మీన్, వేరియన్స్, స్టాండర్డ్ డీవియేషన్, మీన్ వాల్యూ థీరమ్, వెక్టార్ అల్జీబ్రా, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, బైనామియల్ థీరమ్, మ్యాట్రిసెస్, సర్కిల్స్, పెయిర్ ఆఫ్ స్ట్రెయిట్ లైన్స్, ఇంటిగ్రల్ క్యాలిక్యులేషన్.
- **ఫిజిక్స్:** హీట్, న్యూక్లియర్ ఎలక్ట్రోమ్యాగ్నటిజం, మ్యాగ్నటిజం, వేవ్‌మోషన్, అటామిక్ ఫిజిక్స్, సెమీ కండక్టర్ డివైజెస్.
- **కెమిస్ట్రీ:** ఆర్గానిక్ కెమిస్ట్రీలో కెమికల్ బాండింగ్, పిరియాడిక్ టేబుల్స్, ఫిజికల్ కెమిస్ట్రీలో సొల్యూషన్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్, స్టేట్ ఆఫ్ మ్యాటర్స్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలో మూలకాలు– వాటి ధర్మాలు..
- **బయాలజీ:** సూక్ష్మ జీవశాస్త్రం, కేంద్రక పూర్వ జీవులు, బ్యాక్టీరియా, వైరస్, మానవ సంక్షేమంలో సూక్ష్మ జీవుల పాత్ర, ఖనిజ మూలకాల ఆవశ్యకత. జువాలజీలో కాలేయం, వానపాము, బొద్దింకల జీవవ్యవస్థ, ప్రొటీన్లు, ఎంజైమ్‌లు, క్షీర గ్రంథులు, నాడీ వ్యవస్థ, నేత్ర పటలం, జీవావరణం–పర్యావరణం, జన్యుశాస్త్రం, జీవ పరిమాణం, అనువర్తిత జీవశాస్త్రం.

ఎంసెట్-2018 సక్సెస్ టిప్స్

- ప్రాక్టీస్, మాక్ టెస్ట్‌లకు హాజరుకావాలి.
- గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి.
- టాపిక్ వైజ్ వెయిటేజీని పరిగణనలోకి తీసుకుని.. సమయం కేటాయించాలి.
- జేఈఈ–ఎంసెట్, నీట్–ఎంసెట్‌లను అనుసంధానం చేసుకుంటూ చదవాలి.
- స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలు, ఏఆర్ టైప్ క్వశ్చన్స్ పాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి.

అప్లికేషన్ ఓరియెంటేషన్ ముఖ్యం

ఎంసెట్ ప్రిపరేషన్ పరంగా విద్యార్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే ప్రశ్న ఎలా అడిగినా సమాధానం ఇవ్వగల సన్నద్ధత లభిస్తుంది. ఈ తరహా ప్రిపరేషన్ జేఈఈ–మెయిన్, అడ్వాన్స్‌డ్‌లకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– **ఎం.ఎన్.రావు**, శ్రీచైతన్య విద్యా సంస్థలు.

మ్యాథ్స్‌పై పట్టుతోనే వందకు వంద!



కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్) 2017 ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. సుమారు రెండు లక్షల మంది అభ్యర్థులు హాజరైన ఈ పరీక్షలో తెలుగు విద్యార్థి సాయి ప్రణీత్ మెరిశాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన క్యాట్‌లో 100 పర్సంటైల్ సాధించాడు. ఒకవైపు ఇంజనీరింగ్ చదువుతూనే టాపర్‌గా నిలిచాడు. చిన్ననాటి నుంచి మ్యాథ్స్ అంటే ఇష్టం ఉండటం వల్లే విజయం వరించింది అంటున్న సాయి ప్రణీత్ రెడ్డి.. సక్సెస్ స్పీక్స్ అతని మాటల్లోనే..

మాది అనంతపురం జిల్లాలోని కనెకల్ మండలం బ్రహ్మసముద్రం గ్రామం. నాన్న చెన్నారెడ్డి సురేంద్రనాథ్ రెడ్డి ఎరువుల వ్యాపారంతో పాటు బైక్ షోరూం నిర్వహిస్తున్నారు. అమ్మ సంధ్య గృహిణి. నా విద్యాభ్యాసం అంతా నెల్లూరులో వివిధ స్కూళ్లలో జరిగింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో పూర్తిచేశాను. ప్రస్తుతం ఐఐటీ మద్రాసులో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాను.

మొదటి ప్రయత్నంలోనే..

ఇంజనీరింగ్ రెండో ఏడాదిలోనే క్యాట్ రాయాలని నిర్ణయించుకున్నా. మూడో ఏడాదిలో క్యాట్ కోచింగ్ తీసుకున్నా. కోచింగ్ క్లాసులు శనివారం మాత్రమే ఉండటంతో అకడమిక్‌గా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. 2017లో క్యాట్‌కు దరఖాస్తు చేసి మొదటి ప్రయత్నంలోనే 100 పర్సంటైల్ సాధించా.

ఆ ఐఐఎంల్లో వస్తేనే

మన దేశంలో మేనేజ్‌మెంట్ విద్యకు ప్రసిద్ధి చెందాయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లు. వీటిలో టాప్‌లో ఉండే ఐఐఎం అహ్మదాబాద్‌లో చేరాలనుకుంటున్నాను. ఇందులో ప్రవేశ ప్రక్రియ భిన్నంగా ఉంటుంది. పలు అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రవేశం కల్పిస్తారు. ఐఐఎం అహ్మదాబాద్ తర్వాత ఐఐఎం బెంగళూరు, కోల్‌కతాలో చేరేందుకు ప్రాధాన్యం ఇస్తాను. ఒకవేళ వీటిలో సీటు రాకుంటే ఉద్యోగంలో చేరి పని అనుభవం తర్వాత ఐఐఎంల్లోగానీ, విదేశాల్లోగానీ ఎంబీఏ కోసం ప్రయత్నిస్తా. నాకు ఇప్పటికే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో రూ.20 లక్షల ప్యాకేజీతో సిస్కో సిస్టమ్స్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆఫర్ లభించింది.

ఇంగ్లిష్‌పైనే నా దృష్టి

నేను పరీక్షకు ఒక నెల ముందు నుంచే సీరియస్‌గా సన్నద్ధమవ్వడం ప్రారంభించా. నాకు చిన్ననాటి నుంచి మ్యాథ్స్ అంటే చాలా ఇష్టం. ఎలాంటి సమస్య అయినా సులువుగా పరిష్కరించగలననే నమ్మకం నాకుంది. దీంతో క్యాట్ ప్రిపరేషన్‌లో డేటా ఇంటర్‌ప్రిటేషన్–లాజికల్ రీజనింగ్; క్వాంటిటేటివ్ ఎబిలిటీ విభాగాల ప్రిపరేషన్‌పై పెద్దగా దృష్టిపెట్టలేదు. ఇంగ్లిష్‌పైనే ఎక్కువ శ్రద్ధ పెట్టా.

మాక్‌టెస్టుతో విజయం

క్యాట్ లాంటి పోటీ పరీక్షలకు విజయ రహస్యం ప్రాక్టీస్. మాక్ టెస్ట్‌లు రాసి ఎప్పటికప్పుడు వాటిని సమీక్షించుకోవడం ముఖ్యం. నా ప్రిపరేషన్‌లో మాక్‌టెస్టులు చాలా మేలు చేశాయి. ఈసారి క్యాట్ ఎగ్జామ్‌లో ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ విభాగాలు సులువుగా వచ్చాయి. లాజికల్ రీజనింగ్ అత్యంత కఠినంగా వచ్చింది. ఇక పరీక్షలో సమయపాలన చాలా ముఖ్యం. నాకు ఇంగ్లిష్, లాజికల్ రీజనింగ్ సెక్షన్లకు సమయం సరిపోలేదు. ఇంగ్లిష్ సెక్షన్‌లో 3, లాజికల్ రీజనింగ్‌లో 4 ప్రశ్నలు వదిలేశాను. సమయపాలన కూడా మాక్‌టెస్టులతోనే సాధ్యపడుతుంది. నేను పరీక్షకు వారం ముందు క్యాట్‌పరీక్ష టైమింగ్‌ను దృష్టిలో పెట్టుకొని రోజూ ఉదయం 9–12 గంటల వరకు మాక్‌టెస్టులు రాశాను.

నిర్వహణ నైపుణ్యాల కోసమే

నాకున్న ఇంజనీరింగ్ అర్హతకు తోడుగా ఎంబీఏ చేయడం వల్ల నిర్వహణ నైపుణ్యాలు లభిస్తాయి. ఇది కెరీర్ ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరాలనేదే నా లక్ష్యం.

అకడమిక్ ప్రొఫైల్

- **పదో తరగతి:** 9.3 జీపీఏ (2011–2012).
- **ఇంటర్మీడియట్:** 973 మార్కులు (2012 – 2014)
- **జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు:** 452
- **ఎంసెట్ ర్యాంకు:** 206
- **బీటెక్:** 7.4 సీజీపీఏ (ఇప్పటి వరకు).

సాక్షి బిజినెస్
మంగళవారం 9-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
199 ▲	65 ▲
34,353	10,624

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,150	▲	14
డోజోన్స్	25,266	▼	30
ఎఫ్‌టీఎస్ఈ 100	7,697	▼	28
డాక్స్	13,368	▲	48
షాంఘై	3,410	▲	18
నికాయ్ (శుక్రవారం ముగింపు)	23,715	▲	208

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	57.61	66.81
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	78.18	90.66
€	యూరో	థామస్‌కుక్	69.33	80.40
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	50.91	59.04
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	45.22	52.32
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	43.36	51.36
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.32	18.16
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.68	18.33
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.91	11.20

ఇండిగో న్యూ ఇయర్ సేల్ ఆఫర్

న్యూఢిల్లీ: 'ఇండిగో' 'న్యూ ఇయర్ సేల్' ఆఫర్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా సంస్థ రూ.899 ప్రారంభ ధరతో విమాన టికెట్లను ఆఫర్ చేస్తోంది. ఈ సేల్ జనవరి 10 వరకు అందుబాటులో ఉంటుంది.



ఆఫర్‌లో భాగంగా టికెట్లు బుక్ చేసుకున్న వారు ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు ఎప్పుడైనా ప్రయాణించొచ్చు. కస్టమర్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు ద్వారా టికెట్లను బుకింగ్ చేసుకుంటే అదనంగా 10% డిస్కౌంట్‌ను, రూ.600 వరకు విలువైన ఇండిగో స్పెషల్ సర్వీస్ వోచర్లను పొందొచ్చు. అయితే వీటికి షరతులు వర్తిస్తాయి. ఈ ఆఫర్ ఎంపిక చేసిన ఫ్లైట్స్‌కు, పరిమిత సంఖ్యలోని సీట్లకు మాత్రమే వరిస్తుంది.

ప్రీమియం ప్రయాణికులకు ల్యాప్‌టాప్‌లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ రూట్లలో బిజినెస్ తరగతి ప్రయాణికులను ఆకర్షించేందుకు ప్రభుత్వ రంగ విమానయాన దిగ్గజం ఎయిరిండియా కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రీమియం ప్రయాణికులకు ల్యాప్‌టాప్‌లు కూడా అందించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సంస్థ సీఎండీ ప్రదీప్ సింగ్ ఖరోలా తెలియజేశారు. దీనివల్ల బిజినెస్ తరగతిలో ప్రయాణికుల సంఖ్యను పెంచుకునే అవకాశం ఉందన్నారు. సాధారణంగా ఈ తరగతిలో సగానికి సగం సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. 'దూర ప్రాంతాలకు వెళ్లే ఫ్లయిట్స్‌లో బిజినెస్ తరగతి సీట్లు.. కంపెనీకి మంచి ఆదాయం తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇందులో సుమారు యాభై శాతం సీట్లు మాత్రమే భర్తీ అవుతున్నాయి. మెరుగైన సేవలు అందించడం ద్వారా దీన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. ఒకవేళ ఆన్-ఫ్లయిట్ ఎంటర్‌టైన్‌మెంట్ అంశం సరిగ్గా లేని పక్షంలో... దానికి ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నాం. ఇందులో భాగంగా బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు ల్యాప్‌టాప్‌లు అందించే అవకాశాలు కూడా ఉన్నాయి' అని ఖరోలా తెలిపారు. అయితే, ఇన్-బిల్ట్ వీడియో స్క్రీన్‌లు పనిచేయనప్పుడు మాత్రమే ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలా? లేక ప్రీమియం ప్రయాణికులందరికీ అదనపు సౌకర్యం కింద వీటిని అందించాలా? అన్న అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారాయన.



బిజినెస్ క్లాస్‌పై ఎయిరిండియా కసరత్తు

ఫిబ్రవరిలో మూడు కొత్త విమానాలు..

అమెరికాలోని లాస్ ఏంజెలిస్‌కి నేరుగా ఫ్లయిట్ సర్వీసులు ప్రారంభించడంపై ప్రయత్నాలు జరుగుతున్నాయని, అమెరికాతో పాటు ఆస్ట్రేలియాలోని దూర ప్రాంతాలకు మరిన్ని సర్వీసులు నడిపే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు. అటు ఫిబ్రవరి నాటికి మూడు కొత్త బోయింగ్ 777 విమానాలు అందుకుంటామన్నారు.

రూ.1,099కే విస్తారా టికెట్!

ముంబై: విమానయాన సంస్థ 'విస్తారా' తాజాగా 3వ వార్షికోత్సవం సందర్భంగా పరిమితకాల టికెట్ ధరల డిస్కౌంట్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.1,099 ప్రారంభ ధరతో విమాన



టికెట్లను (ఎకానమీ క్లాస్) ఆఫర్ చేస్తోంది. ఇక ప్రీమియం ఎకానమీ క్లాస్ టికెట్ ధర రూ.2,599 నుంచి, బిజినెస్ క్లాస్ టికెట్ ధర రూ.7,499 నుంచి ప్రారంభమౌతుంది. మంగళవారం ఒక్కరోజు మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్‌లో భాగంగా టికెట్లను బుక్ చేసుకున్న వారు ఈ ఏడాది జనవరి 17 నుంచి ఏప్రిల్ 18 వరకు ఎప్పుడైనా ప్రయాణించొచ్చు.

ఆధార్-పొదుపు.. లింక్‌కు గడువు పెంపు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆధార్, చిన్న మొత్తాల పొదుపు పథకాల అనుసంధాన గడువును మూడు నెలలపాటు పొడిగించింది. దీంతో 2018 మార్చి 31 వరకు రెండింటినీ అనుసంధానం చేసుకోవచ్చు. ఆధార్ నంబర్‌ను అందించేందుకు నిర్దేశించిన 2017 డిసెంబర్ 31 గడువును ఇప్పుడు 2018 మార్చి 31 వరకు పొడిగిస్తున్నామని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో పోస్ట్ ఆఫీస్ డిపాజిట్స్, పీపీఎఫ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్, కిసాన్ వికాస్ పత్రాలు వంటి చిన్న మొత్తాల పొదుపు పథకాలను ఆధార్‌ను తప్పనిసరి చేస్తున్నట్లు ప్రకటించింది. అప్పటికన్నా ముందు నుంచి ఉన్న డిపాజిటర్లకు ఆధార్ నంబర్ అనుసంధానానికి డిసెంబర్ 31ని గడువుగా నిర్దేశించింది.

డిసెంబర్‌కల్లా భారత్ నెట్ రెండో దశ పూర్తి



న్యూఢిల్లీ: దాదాపు 1.5 లక్షల గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం కల్పించే దిశగా తలపెట్టిన భారత్ నెట్ ప్రాజెక్ట్ రెండో దశ.. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తవుతుందని భావిస్తున్నట్లు కేంద్ర టెలికం మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. వాస్తవానికి దీని గడువు 2019 మార్చి దాకా ఉన్నప్పటికీ.. అంతకన్నా ముందే పూర్తి కావొచ్చని తెలిపారు. భారత్ నెట్ ప్రాజెక్ట్ తొలి దశ పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ఈ విషయాలు తెలిపారు. రెండో దశను వేగవంతం చేసే దిశగా సకాలంలో పూర్తి చేస్తే ప్రోత్సాహకాలు ఇవ్వడం... లేకపోతే జరిమానా విధించడం మొదలైన నిబంధనలు కాంట్రాక్టుల్లో చేర్చాల్సి ఉందని ఆయన చెప్పారు. తొలి దశలో లక్ష గ్రామ పంచాయతీలకు హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. మరో 1.5 లక్షల గ్రామ పంచాయతీలకు కూడా బ్రాడ్‌బ్యాండ్‌ని అందుబాటులోకి తెచ్చేలా రెండో దశ ప్రక్రియ ప్రారంభమైందని, క్యాబినెట్ దీనికి ఆమోదముద్ర వేసిందని టెలికం శాఖ కార్యదర్శి అరుణ సుందరరాజన్ తెలిపారు. రాష్ట్రాల ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగం భాగస్వామ్యంతో గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు అందుబాటు ధరల్లో బ్రాడ్‌బ్యాండ్ సేవల విస్తరణ ఈ భారీ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.

విదేశీ బాండ్ల ద్వారా రూ.12,600 కోట్లు



న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) విదేశీ బాండ్ల ద్వారా రూ.12,600 కోట్లకు (200 కోట్ల డాలర్లు) పైగా నిధులు సమీకరించనుంది. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో డాలర్లు, ఇతర కన్వర్టబుల్ కరెన్సీల్లో బాండ్ల జారీ ద్వారా ఈ స్థాయిలో నిధులు సమీకరించనున్నామని ఎస్‌బీఐ తెలిపింది. ఒకే దఫా గానీ, దశలవారీగా గానీ ఈ నిధులు సమీకరిస్తామని, ఈ నిధులను విదేశాల్లో కార్యకలాపాల విస్తరణ కోసం వినియోగిస్తామని పేర్కొంది. పబ్లిక్ ఆఫర్ లేదా ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా ఈ నిధులు సమీకరిస్తామని వివరించింది. మసాలా బాండ్ల జారీతో సహా వివిధ మార్గాల ద్వారా రూ.8,000 కోట్ల సమీకరణకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డ్ గత నెలలోనే ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. బాసిల్-త్రీ మూలధన నిబంధనలను అందుకోవడానికి ఈ ఏడాది మార్చి కల్లా ఈ నిధులు సమీకరించనున్నామని ఎస్‌బీఐ తెలిపింది.

ప్రపంచ సోలార్ దిగ్గజాల్లో అదానీ



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సోలార్ విద్యుదుత్పత్తి సంస్థల్లో అదానీ గ్రూపు స్థానం సంపాదించుకుంది. ప్రపంచంలో యుటిలిటీ సోలార్ పవర్ ప్రాజెక్టుల అభివృద్ధి పరంగా టాప్-15 జాబితాలో చేరిన అదానీ గ్రూపు 12వ స్థానం దక్కించుకుంది. గ్రీన్‌టెక్ మీడియా రూపొందించిన ఈ జాబితాలో ఉన్న ఏకైన భారతీయ కంపెనీ అదానీ ఒక్కటే. గ్రీన్‌టెక్ మీడియా రూపొందించిన జాబితాలో ఫస్ట్ సోలార్ కంపెనీ మొదటి స్థానంలో నిలిచింది. ఈ కంపెనీ 4,619 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పాదన చేస్తుండగా, దీనికి అదనంగా 4,802 మెగావాట్ల సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తోంది. అదానీ గ్రూపు 788 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది.

నేటి నుంచి ఎన్‌ఎమ్‌డీసీ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ఎన్‌ఎమ్‌డీసీలో ప్రభుత్వ వాటా విక్రయం మంగళవారం నుంచి ప్రారంభమవుతోంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) విధానంలో 1.5 శాతం వాటాను ప్రభుత్వం విక్రయిస్తోంది. ఈ ఓఎఫ్‌ఎస్‌కు ఫ్లోర్ ధరను రూ.153.5గా ప్రభుత్వం నిర్ణయించింది. ఇది సోమవారం ముగింపు ధర రూ.161.85తో పోలిస్తే 5 శాతం తక్కువ. మంగళవారంనాడు సంస్థాగత ఇన్వెస్టర్లకు, బుధవారం రిటైల్ ఇన్వెస్టర్లకు... మొత్తం రెండు రోజుల పాటు ఈ ఓఎఫ్‌ఎస్‌లో వాటా విక్రయం జరుగుతుంది. ఎన్‌ఎమ్‌డీసీలో 1.5 శాతం వాటా విక్రయం ద్వారా రూ.750 కోట్ల నిధులు ప్రభుత్వానికి వస్తాయని అంచనా. ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా విక్రయం, ప్రభుత్వ రంగ బీమా సంస్థలను, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌లను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయడం ద్వారా ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.52,500 కోట్లు సమీకరించింది. మొత్తం మీద ఈ ఆర్థిక సంవత్సరంలో డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ.72,500 కోట్లు.

పాతదే.. అయినా కొత్తగా!

- కొత్తవాటిని మించిన పాత కార్ల విక్రయాలు
- 65 శాతం మందికి తొలిసారి పాత వాహనమే
- వార్షిక అమ్మకాలు 37 లక్షల యూనిట్లకు చేరిక
- వేగంగా వృద్ధి చెందుతున్న వ్యవస్థీకృత రంగం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో



రోజుకో కొత్త మోడల్ కారు.. ఆకట్టుకునే టెక్నాలజీ.. అబ్బురపరిచే డిజైన్.. ఇలాంటివి చూస్తే సహజంగానే కుర్రకారు ఏం చేస్తారు? తమ చేతుల్లోకీ ఆ కారు రావాలని కోరుకుంటారు. ఈ కారణంగానే తక్కువ కాలం వినియోగానికే కార్లు చేతులు మారుతున్నాయి. ఈ ట్రెండ్ కొత్తగా కారు కొనేవారికి కలిసివస్తోంది. ఎంచక్కా తక్కువ ధరకే కారును సొంతం చేసుకుంటున్నారు. కొత్త కార్లు ఏటా 30 లక్షల యూనిట్లు రోడ్డెక్కితే, పాతవి ఏకంగా 37 లక్షల యూనిట్లు అమ్ముడవుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

కొత్తవారే ఎక్కువ..

పాత కార్లను కొంటున్న వారిలో 65 శాతం మంది కొత్త కస్టమర్లే. కొత్తగా డ్రైవింగ్ నేర్చుకోవడం, తక్కువ ధరలో వాహనం రావడంతోపాటు తమ బడ్జెట్‌లో మరింత మెరుగైన మోడల్, పెద్ద కారు వస్తుందని కస్టమర్లు భావిస్తున్నారు. ప్యాసింజర్ వాహన విపణిలో 70-75 శాతం మంది ఫైనాన్స్ ద్వారానే కొనుగోళ్లు జరుపుతున్నారు. అవ్యవస్థీకృత రంగంలో సెకండ్ హ్యాండ్ కారుకు రుణం రావడం చాలా క్లిష్టమైంది. అదే బ్రాండెడ్ ప్రీ-ఓన్డ్ షోరూంలలో రుణం చాలా సులువు. అలాగే పాత కారుకు 100-120 రకాల నాణ్యతా పరీక్షలు చేసి కొత్త రూపు తీసుకొస్తారు. ఆర్గనైజ్డ్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందడానికి ఈ అంశాలే కారణం.

త్వరగా మార్చేస్తున్నారు..

నాలుగైదేళ్ల క్రితం వరకు సగటున ఆరేళ్లకు వాహనాన్ని మార్చేసి కొత్తది తీసుకునేవారు. ఇప్పుడు నాలుగు/నాలుగున్నరేళ్లకే మారుస్తున్నారని మహీంద్రా ఫస్ట్‌చాయిస్ ఎండీ నాగేంద్ర పల్లె సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. ప్రీమియం కార్ల విషయంలో ఇంకా తక్కువ కాలానికే కారుకు గుడ్‌బై చెప్పేస్తున్నారని అన్నారు. అమ్ముడవుతున్న 10 పాత కార్లలో ఏడు రూ.4 లక్షల లోపు ధరవే ఉంటే, కొత్త కార్ల విషయంలో 10లో ఎనిమిది రూ.8 లక్షలలోపు ధరలో ఉంటున్నాయట. పెద్ద, ఖరీదైన కార్లవైపు కస్టమర్లకు ఆసక్తి పెరిగిందని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ అరుణ్ మల్హోత్రా తెలిపారు. వీరిని కొత్త టెక్నాలజీ ఊరిస్తోందని, నూతనతరం మోడళ్ల ప్రయోజనాలను అందుకోవాలన్న ఆసక్తి ఉంటోందని గుర్తుచేశారు.

హైస్ట్రీట్‌లో సైతం..

ఒకప్పుడు గల్లీలు, చిన్నరోడ్లలో పాత కార్ల విక్రయ కేంద్రాలు, పార్కింగ్ సెంటర్లు ఉండేవి. ఇప్పుడు బ్రాండెడ్ కార్ల షోరూంలకు దీటుగా అద్దెలు అధికంగా ఉండే హైస్ట్రీట్‌లకూ ఇవి విస్తరించాయి. హైదరాబాద్‌లో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో కొత్త కొత్త కేంద్రాలు వెలుస్తుండటం ఇందుకు నిదర్శనం. కస్టమర్‌తో నేరుగా బేరమాడేందుకు వీలవడం, ఎక్కువ ధర వచ్చే అవకాశం ఉండటంతో పార్కింగ్‌కు మొగ్గుచూపేవారూ ఉన్నారు.

ఇదీ వాహన మార్కెట్..

దేశవ్యాప్తంగా ఏటా 30 లక్షల కొత్త కార్లు అమ్ముడవుతున్నాయి. పాత కార్ల విక్రయాలు 37 లక్షల యూనిట్లు దాటాయి. అయిదేళ్లలో ప్రీ-ఓన్డ్ మార్కెట్ 70 లక్షల యూనిట్లకు చేరుకుంటుందని మహీంద్రా ఫస్ట్ చాయిస్ చెబుతోంది. యూజ్‌డ్ కార్ల విపణిలోకి దాదాపు అన్ని వాహన తయారీ కంపెనీలు ప్రవేశించాయి. వ్యవస్థీకృత రంగం వాటా 15 శాతం ఉంది. మొత్తం పరిశ్రమ వృద్ధి 15 శాతం ఉంటే, ఆర్గనైజ్డ్ మార్కెట్ ఏకంగా 25-30 శాతం వృద్ధి చెందుతోంది. వారంటీ, ఉత్తమ సర్వీస్ ఉన్న కారణంగా కస్టమర్లు బ్రాండెడ్ యూజ్డ్ కార్ల షోరూంలకు రావడం పెరిగిందని వరుణ్ మోటార్స్ ఎండీ వరుణ్‌దేవ్ తెలిపారు.

వ్యవస్థీకృత రంగానికి జీఎస్టీ దెబ్బ..

పాత కారు చేయి మారితే ఎటువంటి పన్ను పడటం లేదు. ఇది అవ్యవస్థీకృత రంగంలో ఉన్న విక్రేతలకు కలిసి వస్తోంది. అదే బ్రాండెడ్ ప్రీ-ఓన్డ్ కార్ల వ్యాపారంలో ఉన్న కంపెనీలు మాత్రం వాహనాన్నిబట్టి మార్జిన్ మీద 29-51 శాతం జీఎస్టీ కట్టాల్సి వస్తోంది. జీఎస్టీకి పూర్వం ఉన్నట్టుగానే మార్జిన్ మీద 10-12 శాతం మాత్రమే పన్ను వ్యాట్ ఉండాలని పరిశ్రమ ప్రభుత్వాన్ని కోరుతోంది.

ఇకపై 'చౌక గృహ' రుణాల భారం!

మూడీస్-ఇక్రా నివేదిక



ముంబై: చౌక గృహ నిర్మాణాలు, వీటికి రుణాలు సంబంధిత అంశాలకు కేంద్రం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో... ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీస్, ఆ సంస్థ దేశీయ అనుబంధ సంస్థ ఇక్రాలు తాజాగా ఈ ధోరణికి 'రెడ్ ఫ్లాగ్' ఊపాయి. చౌక గృహ రుణాలే బ్యాంకులకు తదుపరి ముప్పుగా వాటిల్లే అవకాశం ఉందని మూడీస్-ఇక్రా తాజా నివేదిక అంచనా వేసింది. ఈ విభాగంలో కొన్ని ప్రతికూల అంశాలు ఆందోళనకు గురిచేస్తున్నాయని, ఇవే అంశాలు 2018లోనూ కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది.

నివేదికలో ముఖ్యాంశాలు చూస్తే...

- చౌక గృహ నిర్మాణ రుణ మంజూరీలో నెలకొన్న పోటీ- రుణ ప్రమాణాలు తగ్గిపోవడానికి కారణమవుతోంది. ఇక స్వయం ఉపాధిలో ఉన్న వారికి చౌక గృహ రుణ సదుపాయం వల్ల బకాయిల పరిమాణం పెరిగే అవకాశం ఉంది.
- సాంప్రదాయక గృహ విభాగంలో రుణనాణ్యత స్థిరంగా కొనసాగేవీలుంది. అయితే చౌక గృహరుణ విభాగంలో మాత్రం ఇందుకు సంబంధించి కొంత ఆందోళన పరిస్థితి కొనసాగవచ్చని ఇక్రా హెడ్ (స్ట్రక్చర్డ్ ఫైనాన్స్) మిట్టల్ పేర్కొన్నారు.
- చౌక గృహ రుణ విభాగంలో స్థూల నిరర్థక ఆస్తులు 2017 సెప్టెంబర్ నాటికి 1.8 శాతానికి చేరాయి. సాంప్రదాయక గృహ రుణ విభాగంతో పోల్చిచూస్తే 90 రోజులు పైబడిన రుణ బకాయిల సగటు స్థాయి చౌక గృహ రుణాల విషయంలో దాదాపు ఏడు రెట్లు అధికంగా ఉంది.
- 2020 నాటికి అందరికీ గృహం లక్ష్యం నెరవేరాలన్న మోదీ ప్రభుత్వ నిర్ణయం, ఇందుకు సంబంధించి చౌక గృహ నిర్మాణ రంగంలో భారీ ప్రోత్సాహకాలు, దీని ప్రాధాన్యతా విభాగంగా బ్యాంకింగ్ పరిగణించడం, వడ్డీ రాయితీలు, ప్రత్యక్ష నగదు సబ్సిడీ వంటి అంశాలను నివేదిక ప్రస్తావిస్తూ, రుణ నాణ్యతాంశాలపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించింది.
- అయితే మొత్తంగా హౌసింగ్ రుణ విభాగం రిటైల్ రుణాలకు సంబంధించి అత్యుత్తమమైనదిగా కొనసాగుతోంది. రుణ హామీలు పటిష్టంగా ఉండడం, రుణం తీసుకునే వ్యక్తి సొంత ఆస్తిగా రుణ హామీ ఉండడం, ఆస్తి ధరల్లో భారీ తగ్గుదల లేకపోవడం, రుణానికి తగిన ఆస్తి విలువల వంటి అంశాలు ఇక్కడ ప్రస్తావనార్హం.
- ఇక 2017 జూలై ప్రవేశపెట్టిన వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ), అంతక్రితం డీమోనిటైజేషన్ చిన్న తరహా పరిశ్రమలపై భారాన్ని మోపాయని ఇక్రా అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ రస్తోగీ పేర్కొన్నారు.

తగ్గిన గోల్డ్ ఫండ్స్ మెరుపు!

2017లో రూ.730 కోట్లు అవుట్ ◆ ఐదేళ్లనుంచీ ఇదే ధోరణి

న్యూఢిల్లీ: గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) నుంచి నిధులు వెనక్కుమళ్లడం కొనసాగుతోంది. 2017లో గోల్డ్ ఫండ్స్ నుంచి రూ.730 కోట్ల ఉపసంహరణలు జరిగాయి. ఇలాంటి ధోరణి వరుసగా ఇది ఐదవ సంవత్సరం. భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) తాజా నివేదికలో ముఖ్యాంశాలు చూస్తే...

- 2016తో పోలిస్తే 2017లో గోల్డ్ ఫండ్స్ నిర్వహణలోని (ఏయూఎం-అసెట్ అండర్ మేనేజ్‌మెంట్) నిధులు 12 శాతం క్షీణించి రూ.4,855కు తగ్గాయి.
- మంచి రాబడులు వస్తున్న నేపథ్యంలో గడచిన ఐదేళ్లలో రిటైల్ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను అధికంగా ఈక్విటీల్లో పెడుతున్నారు. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు తగ్గాయి.
- ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లోకి గత ఏడాది రూ.1.5 లక్షల కోట్ల మొత్తంరాగా, మ్యూచువల్ ఫండ్‌స్కీమ్‌ల్లోకి మొత్తంగా రూ.2.4 లక్షల కోట్లు వచ్చాయి.
- 2016లో ఈటీఎఫ్‌ల నుంచి బయటకు వెళ్లిన మొత్తం రూ.942 కోట్లు. 2017లో ఇలా బయటకు వెళ్లిపోయిన మొత్తం రూ.730 కోట్లు. 2015 (రూ.891 కోట్లు), 2014 (రూ.1,651 కోట్లు), 2013 (రూ.1,815 కోట్లు)లలో కూడా నిధులు ఈటీఎఫ్‌ల నుంచి బయటకు వెళ్లాయి. అయితే ఇలా బయటకు వెళుతున్న నిధుల పరిమాణం తగ్గుకుంటూ రావడం ఇక్కడ గమనార్హం.
- 2012లో ఈటీఎఫ్‌ల్లోకి రూ.1,826 కోట్లు వచ్చాయి. అటు తర్వాత నుంచి నికరంగా బయటకు నిధుల ప్రవాహం కొనసాగింది.

ఈక్విటీల ఆకర్షణ...



రియల్టీ, బంగారం అంత ఆకర్షణీయంగా కనిపించడం లేదు. సాంప్రదాయక పొదుపు పథకాల్లో కూడా వడ్డీరేట్లు తగ్గాయి. దీనితో ఇన్వెస్టర్లు ఈక్విటీలవైపునకు మొగ్గుచూపుతున్నారు.

– రాహుల్ పరేఖ్,
సీఈఓ, బజాజ్ క్యాపిటల్

ఆన్‌లైన్ మార్కెట్‌పై పతంజలి దృష్టి

ఎనిమిది ఈ-కామర్స్ కంపెనీలతో జట్టు! ● లిస్టులో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, బిగ్‌బాస్కెట్

న్యూఢిల్లీ: యోగా గురువు బాబా రాందేవ్‌కి చెందిన ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థ పతంజలి... తాజాగా ఆన్‌లైన్ మార్కెట్‌పై మరింతగా దృష్టి పెడుతోంది. సంస్థకు ఇప్పటికే పతంజలి ఆయుర్వేద్‌డాట్‌నెట్ పేరిట సొంత పోర్టల్ ఉన్నప్పటికీ.. మరిన్ని ఈ-కామర్స్ సంస్థలతో చేతులు కలపడం ద్వారా కార్యకలాపాలు మరింత విస్తరించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా 8 ఈ-కామర్స్ సంస్థలతో జట్టు కట్టేందుకు కసరత్తు మొదలెట్టింది. స్వదేశీ ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల విక్రయాల కోసం ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, పేటీఎం మాల్, బిగ్‌బాస్కెట్, గ్రోఫర్స్, షాప్‌క్లూస్, స్నాప్‌డీల్, 1ఎంజీ వంటి సంస్థలతో త్వరలో ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పతంజలి ప్రతినిధి ఎస్.కె.తిజారావాలా ఇటీవలే మైక్రోబ్లాగింగ్ సైట్ ట్వీటర్‌లో చేసిన ట్వీట్ ఇందుకు ఊతమిస్తోంది. ఆన్‌లైన్‌లో భారీగా విస్తరించే దిశగా ప్రపంచంలోనే అతిపెద్ద ఈ-కామర్స్ కంపెనీలతో త్వరలో జట్టు కట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో అనేక పోర్టల్స్‌లో పతంజలి ఉత్పత్తులు లభ్యం కాగలవని, కంపెనీ చరిత్రలో ఇది కొత్త అధ్యాయం కాగలదని తిజారావాలా తెలిపారు. ఈ భాగస్వామ్యాలతో తమ ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులోకి రాగలవన్నారు. ఆన్‌లైన్ కంపెనీలన్నింటితో భేటీ అయ్యే దిశగా పతంజలి ఈ నెల 16న భారీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోంది. దీనికి సంస్థ వ్యవస్థాపకుడు, ఎండీ ఆచార్య బాలకృష్ణ కూడా హాజరుకానున్నారు.



కొంగొత్త వ్యూహాలతో వృద్ధి..


బ్రోకింగ్ సంస్థల అంచనాల ప్రకారం.. పతంజలి బ్రాండ్ ఆహారోత్పత్తులు ప్రస్తుతం 26 శాతం కుటుంబాలకు, వ్యక్తిగత సౌందర్య సాధనాల ఉత్పత్తులు 53 శాతం కుటుంబాలకు చేరుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇది వంద శాతం వృద్ధి. కార్యకలాపాల విస్తరణ కోసం పతంజలి ఆయుర్వేద సంస్థ కొన్నాళ్లుగా వ్యాపార వ్యూహాలకు మరింత పదును పెడుతూ వస్తోంది. ప్రారంభం నుంచి అనుసరిస్తూ వస్తున్న బ్రాండెడ్ ఫ్రాంచైజీ విధానం నుంచి.. ఎఫ్‌ఎంజీసీ కంపెనీలు అనుసరించే చానల్ డిస్ట్రిబ్యూషన్ మార్గానికి కూడా మళ్లింది. 2020 నాటికల్లా రూ. 1 లక్ష కోట్ల వార్షిక అమ్మకాలు సాధించాలని పతంజలి నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా 2019 నాటికల్లా పంపిణీదారుల సంఖ్యను ప్రస్తుతమున్న 5,000 నుంచి 25,000కు పెంచుకోవాలని పతంజలి భావిస్తోంది. అలాగే, ఆన్‌లైన్ వ్యాపార ప్రణాళికలు సైతం వ్యాపార వృద్ధికి గణనీయంగా తోడ్పడనున్నాయి. ప్రస్తుతం ఎఫ్‌ఎంసీజీ రంగంలో ఏడో స్థానంలో ఉన్న పతంజలి.. తాజా వ్యూహాలతో మరింత భారీ మార్కెట్ వాటాను దక్కించుకునేందుకు.. ఈ ఆర్థిక సంవత్సరం రూ. 20,000 కోట్ల టర్నోవరు లక్ష్యాన్ని సాధించేందుకు ఆన్‌లైన్ ప్రణాళికలు దోహదపడే అవకాశాలు ఉన్నాయి.

ఎగవేత కంపెనీలకు నిబంధనలు కఠినం!

న్యూఢిల్లీ: బ్యాంకులకు రుణాలు బాకీ పడిన కంపెనీల నిబంధనలను కేంద్రం మరింత కఠినతరం చేసింది. దీంతో కార్యనిర్వహణ సిబ్బంది (మేనేజీరియల్) జీతభత్యాలు పరిమిత స్థాయి దాటిన పక్షంలో ఆయా బ్యాంకుల అనుమతి కూడా తీసుకోవాల్సి రానుంది. ప్రభుత్వ ఆర్థిక సంస్థలు, నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ (ఎన్‌సీడీ) హోల్డర్లు, ఇతరత్రా రుణదాతలకు బాకీపడిన సంస్థలకు కూడా ఇది వర్తిస్తుంది. కంపెనీల చట్టంలో ఈ మేరకు చేసే కొన్ని సవరణలకు పార్లమెంటు ఇటీవల ఆమోదముద్ర వేసింది. జనవరి 3న నోటిఫై చేసిన ఈ నిబంధనలు .. దివాలా చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు దోహదపడగలవని కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. కంపెనీల చట్టం, 2013 ప్రకారం మేనేజీరియల్ వేతనాలు .. నికర లాభంలో 11 శాతానికి మించిన పక్షంలో కంపెనీలు తప్పనిసరిగా సర్వసభ్య సమావేశాల్లో వాటాదారుల ఆమోదముద్ర పొందాలి. తాజా సవరణ ప్రకారం బ్యాంకులు లేదా ప్రభుత్వ ఆర్థిక సంస్థలు మొదలైన వాటికి బాకీ పడిన పక్షంలో వాటి అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుంది.


నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
--	--	రూ. 4,428 (కనిష్టం)	రూ.1,700 (కనిష్టం)	రూ.3,650	-- (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--
--	--	రూ. 7,125 (గరిష్టం)	రూ.3,950 (గరిష్టం)					

10,600 పాయింట్లపైకి నిఫ్టీ..

వరుసగా రెండో రోజు స్టాక్ సూచీల రికార్డులు

- ఇంట్రాడే, ముగింపులో ఆల్‌టైమ్ హైకి ఇండెక్స్‌లు
- 199 పాయింట్ల లాభంతో 34,353కు సెన్సెక్స్
- 65 పాయింట్లు పెరిగి 10,624కు నిఫ్టీ

స్టాక్ మార్కెట్ సోమవారం మళ్లీ రికార్డులు సృష్టించింది. నిఫ్టీ తొలిసారిగా 10,600 పాయింట్లపైకి ఎగిసింది. కంపెనీల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాలు, రానున్న బడ్జెట్‌పై ఆశల కారణంగా స్టాక్ సూచీలు ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ జీవిత కాల గరిష్ట స్థాయి రికార్డులను సాధించాయి. అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా ఉండడం కూడా కలసివచ్చింది. బీఎస్ఈ సెన్సెక్స్ 199 పాయింట్లు లాభపడి 34,353 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 65 పాయింట్ల లాభంతో 10,624 పాయింట్ల వద్ద ముగిశాయి.

కొత్త ఏడాది ఐదు ట్రేడింగ్ సెషన్లలోనే రూ.1,700 కోట్ల మేర విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం, గ్రామీణ ప్రాంతాల్లో కొనగోళ్లు పుంజుకునేలా, ద్రవ్య స్థిరీకరణకు తోడ్పడేలా కేంద్ర బడ్జెట్ ఉండగలదన్న ఆశలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయి. లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్ ఆద్యంతం అదే జోరు చూపించింది. ఇంట్రాడేలో 231 పాయింట్ల లాభంతో 34,386 పాయింట్ల జీవిత కాల గరిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత కొంత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 199 పాయింట్ల లాభంతో ముగిసింది. ఇక నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 72 పాయింట్ల లాభంతో 10,631 పాయింట్ల ఆల్‌టైమ్‌హైని తాకింది. స్టాక్ సూచీలతో పాటే పలు షేర్లు జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకాయి. సీఈఎస్‌సీ, బయోకాన్, డాబర్ ఇండియా, హావెల్స్ ఇండియా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్ అండ్ టీ, రేమండ్, టైటాన్ ఈ జాబితాలో ఉన్నాయి.



ఫిలిప్స్ కార్బన్.. 5 రోజుల్లో 60% అప్

ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ షేర్ 20 % లాభంతో రూ.1,522 వద్ద ముగిసింది. వరుస ఐదు ట్రేడింగ్ సెషన్లలో 60 % లాభపడింది. ఈ నెల 1న రూ.975గా ఉన్న ఈ షేర్ సోమవారం జీవిత కాల గరిష్ట స్థాయి. రూ.1,528ను తాకింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,008
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	37,694
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	3,94,141
ఎఫ్ఐఐ	693
డీఐఐ	- 206

సూచీల రికార్డులు

సూచీ	ఇంట్రాడే	ముగింపు
సెన్సెక్స్	34,386	34,353
నిఫ్టీ	10,631	10,624

జెబి డేటా 'సెక్యూరిటీ సొల్యూషన్'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్లాక్‌చైన్ ఆధారిత బిగ్‌డేటా పరిష్కారాలు అందిస్తున్న 'జెబి డేటా ఇండియా' తాజాగా జెబి చైన్ సెక్యూరిటీ సొల్యూషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ల్యాండ్ రికార్డులు, ఉద్యోగుల జీత భత్యాలు, పెన్షన్లు, విద్యార్థతల డాక్యుమెంట్లు, సర్టిఫికెట్ల వంటి అధిక విలువైన, కీలకమైన సమాచారాన్ని భద్రంగా దాచుకునేందుకు ఈ సొల్యూషన్ ఉపకరిస్తుంది. నకిలీ లావాదేవీలు, నకిలీ డాక్యుమెంట్ల తయారీకి ఆస్కారం లేదని జెబి వ్యవస్థాపకుడు బాబు మునగాల సోమవారమిక్కడ మీడియాకు తెలిపారు. సమాచారం పూర్తి భద్రంగా ఉంటుందని చెప్పారు. ఏపీ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీకి (ఏపీసీఆర్‌డీఏ) తాము సేవలందిస్తున్నామని, క్యూఆర్ కోడ్‌తో ల్యాండ్ రికార్డుల సర్టిఫికెట్ ఉంటుందని వివరించారు. బిగ్‌డేటాను ఆధారంగా చేసుకుని సొంతగా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే ఒక పేటెంటు దాఖలు చేశామని, మరో రెండు త్వరలో దరఖాస్తు చేస్తామని వెల్లడించారు.

క్యాండీ పరిశ్రమలోకి ఎవరెడీ!!

కోల్‌కతా: డ్రై సెల్ బ్యాటరీల తయారీ కంపెనీ 'ఎవరెడీ ఇండస్ట్రీస్ ఇండియా' తాజాగా క్యాండీ/స్వీట్స్ పరిశ్రమలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. జొల్లీస్ ప్రొడక్టు ఆవిష్కరణతో ఎఫ్ఎంసీజీ పోర్ట్ ఫోలియోను విస్తరిస్తామని సంస్థ ఎండీ అమృతన్షు ఖైతాన్ తెలిపారు. ఫ్రూట్ చ్యూ విభాగంలో వీటిని మార్కెట్‌లోకి తీసుకువస్తామని, వీటి ధర రూ.1 గా ఉంటుందన్నారు.

అపీస్ నూతన శ్రేణి ఉత్పత్తులు

హైదరాబాద్: నాణ్యమైన తేనె ఉత్పత్తిదారు, డిస్ట్రిబ్యూటర్ అయిన అపీస్ ఇండియా విపణిలోకి నూతన శ్రేణి ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. ఫ్రూటీలీసియస్ పేరిట ఫ్రూట్ జామ్, ఫైవ్ సీజన్స్ పేరిట గ్రీన్ టీ, స్పెషీలీసియస్ మిక్స్‌డ్ వెజ్జీస్ పేరిట పచ్చళ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

యూనికెమ్ ల్యాబ్స్ లాభం రూ.2,507 కోట్లు

రూ.886 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేయనున్న కంపెనీ



న్యూఢిల్లీ: యూనికెమ్ ల్యాబొరేటరీస్ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.2,507 కోట్ల నికర లాభం సాధించింది. భారత్, నేపాల్‌లోని ఫార్మా వ్యాపారాన్ని టొరెంట్ ఫార్మా కంపెనీకి విక్రయించడం వల్ల ఈ స్థాయి లాభాలు వచ్చాయని యూనికెమ్ ల్యాబ్స్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.26 కోట్ల నికర లాభం సాధించినట్లు సంస్థ తెలియజేసింది. గత క్యూ3లో రూ.160 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం (స్టాండోలోన్) ఈ క్యూ3లో రూ.166 కోట్లకు ఎగిసిందని తెలిపింది. 2.06 కోట్ల ఈక్విటీ షేర్లను రూ.886 కోట్లకు మించకుండా బైబ్యాక్ చేయడానికి తమ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది. ఈ ప్రతిపాదిత బైబ్యాక్‌లో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ పాల్గొంటాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో బీఎస్ఈలో యూనికెమ్ షేర్ 5 శాతం లాభంతో రూ.369 వద్ద ముగిసింది.

వీడియోకాన్ నష్టాలు రూ.1,034 కోట్లు

68 శాతం తగ్గిన మొత్తం ఆదాయం



న్యూఢిల్లీ: భారీ రుణ భారంతో కుదేలైన వీడియోకాన్ నష్టాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్లో మరింతగా పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం జూలై–సెప్టెంబర్ క్వార్టర్లో రూ.404 కోట్లుగా ఉన్న నికర నష్టాలు ఈ ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్లో రూ.1,034 కోట్లకు పెరిగాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వీడియోకాన్ తెలియజేసింది. మొత్తం ఆదాయం రూ.2,700 కోట్ల నుంచి 68 శాతం క్షీణించి రూ.856 కోట్లకు తగ్గిందని పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ.1,997 కోట్ల నుంచి రూ.3,212 కోట్లకు పెరిగాయి. కన్సూమర్ ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయెన్సెస్ సెగ్మెంట్ ఆదాయం రూ.2,544 కోట్ల నుంచి 72 శాతం తగ్గి రూ.714 కోట్లకు చేరగా... ముడి చమురు, నేచురల్ గ్యాస్ సెగ్మెంట్ 2 శాతం వృద్ధితో రూ.102 కోట్ల నుంచి రూ.104 కోట్లకు పెరిగింది. ఇక ఆరు నెలల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో రూ.772 కోట్ల నష్టాలు రాగా, ఈ ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి రూ.1,920 కోట్ల నష్టాలు వచ్చాయి. మొత్తం ఆదాయం రూ.5,589 కోట్ల నుంచి రూ.2,498 కోట్లకు క్షీణించింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో దివాలా కేసులు ఎదుర్కొంటున్న వీడియోకాన్ వంటి కంపెనీ షేర్లలో గత కొంత కాలంగా కొనుగోళ్లు జోరుగా జరుగుతున్నాయి. ఈ క్యూ2లో నష్టాలు బాగా పెరిగినప్పటికీ, వీడియోకాన్ షేర్ బీఎస్ఈలో 5 శాతం లాభంతో రూ.26 వద్ద ముగిసింది.

సిడ్కోతో జీవీకే కన్సెషన్ ఒప్పందం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు అభివృద్ధికై స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు సిడ్కోతో కన్సెషన్ ఒప్పందం కుదుర్చుకున్నట్టు జీవీకే పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సోమవారం వెల్లడించింది. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ సమక్షంలో ఎంఐఏఎల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జీవీకే రెడ్డి, సిడ్కో ఎండీ భూషన్ గగ్రాణి ముంబైలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఎస్‌పీవీ అయిన నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో జీవీకే అనుబంధ కంపెనీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు (ఎంఐఏఎల్) 74 శాతం, సిడ్కోకు 26 శాతం వాటా ఉంటుంది. కన్సెషన్ పీరియడ్ 30 ఏళ్లు. రూ.16,000 కోట్లతో 1,160 హెక్టార్లలో పీపీపీ విధానంలో నూతనంగా నవీ ముంబై ఎయిర్‌పోర్ట్‌ను నిర్మిస్తున్నారు. తొలి రన్‌వే 2019 డిసెంబరు నాటికి, రెండో రన్‌వే 2020 మధ్య కాలానికి అందుబాటులోకి తేవాలన్నది తమ లక్ష్యమని సిడ్కో ఎండీ తెలిపారు. తొలి దశలో ఏటా ఒక కోటి మంది ప్రయాణికులకు కొత్త విమానాశ్రయం సేవలు అందిస్తుందని అంచనా. 2030 నాటికి ఏటా 6 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే స్థాయికి చేరనుంది. కాగా, క్రితం ముగింపుతో పోలిస్తే సోమవారం బీఎస్ఈలో జీవీకే పవర్, ఇన్‌ఫ్రా షేరు 4.98 శాతం పెరిగి రూ.21.10 వద్ద క్లోజయ్యింది.

'మెర్సిడెస్'దే లగ్జరీ కార్ మార్కెట్..

2017లో 15,330 యూనిట్ల విక్రయం

వరుసగా మూడోసారి అగ్రస్థానం

న్యూఢిల్లీ: దేశీ లగ్జరీ కార్ మార్కెట్‌లో మెర్సిడెస్ బెంజ్ తన హవా కొనసాగిస్తోంది. వరుసగా మూడోసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. పలు సవాళ్లను అధిగమించి మరీ 2017లో ఏకంగా 15,330 కార్లు, ఎస్‌యూవీలను విక్రయించింది. కంపెనీ కార్ల విక్రయాలు 2016లో 13,231 యూనిట్లుగా ఉన్నాయి. అంటే వార్షిక ప్రాతిపదికన 15.86 శాతం వృద్ధి నమోదయ్యింది. దీనికి కొత్త ప్రొడక్టుల ఆవిష్కరణ బాగా దోహదపడింది. మెర్సిడెస్ ప్రత్యర్థులైన బీఎండబ్ల్యూ, ఆడి కార్ల విక్రయాలను ఒకసారి పరిశీలిస్తే... 2017లో బీఎండబ్ల్యూ గ్రూప్ విక్రయాలు 9,800 యూనిట్లుగా ఉన్నాయి. కంపెనీ 2016లో 7,861 యూనిట్లను మాత్రమే విక్రయించింది. ఇక ఆడి కార్ల అమ్మకాలు 2 శాతం వృద్ధితో 7,720 యూనిట్ల నుంచి 7,876 యూనిట్లకు పెరిగాయి. టాటా మోటార్స్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) విక్రయాలు 3,954 యూనిట్లుగా ఉన్నాయి. 2016లో దీని అమ్మకాలు 2,653 యూనిట్లు. అంటే 49 శాతం వృద్ధి నమోదయ్యింది. 'గతేడాదిలో పరిశ్రమ పలు సవాళ్లను ఎదుర్కొంది. అయినా మేం రికార్డ్ స్థాయిలో 15,330 యూనిట్లను విక్రయించాం' అని మెర్సిడెస్ బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో రోనాల్డ్ ఫోల్గర్ చెప్పారు. జీఎస్‌టీ అమలు తర్వాత పన్ను రేట్లలో మార్పులు చేయడం వల్ల లగ్జరీ విభాగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడిందని పేర్కొన్నారు. దేశీ లగ్జరీ కార్ల విభాగంలో దాదాపు 40 శాతం మార్కెట్ వాటాను తాము సాధించినట్లు ఆయన తెలియజేశారు.



కంపెనీ	విక్రయాలు		
	2017	2016	వృద్ధి
మెర్సిడెస్ బెంజ్	15,330	13,231	16
బీఎండబ్ల్యూ	9,800	7861	25
ఆడి	7,876	7,720	2
జేఎల్ఆర్	3,954	2,653	49

హైదరాబాద్‌లో పేటీఎం మాల్!

- 17 వరకూ షాపింగ్ ఫెస్టివల్
- 12న నిజాం గ్రౌండ్స్‌లో కార్నివాల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రముఖ ఈ–కామర్స్ సంస్థ పేటీఎం.. హైదరాబాద్‌లో పేటీఎం మాల్ ప్రచారం కోసం రూ.50 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం నగరంలో వెయ్యి బ్రాండ్లతో ఒప్పందం చేసుకున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. బజాజ్ ఎలక్ట్రానిక్స్, సెంట్రో, చందనా బ్రదర్స్ వంటివి ఇందులో ఉన్నాయి. ఈనెల 5–17 వరకు షాపింగ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. అప్లయెన్స్, స్మార్ట్‌ఫోన్లు, అపెరల్స్ వంటి ఉత్పత్తులపై 80 శాతం డిస్కౌంట్స్, 100 శాతం క్యాష్ బ్యాక్ ఇస్తున్నట్లు ప్రకటనలో పేర్కొంది. ఈనెల 12న నిజాం గ్రౌండ్స్‌లో హైదరాబాద్ కార్నివాల్‌ను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇందులో 30కి పైగా టాప్ బ్రాండ్స్ పాల్గొంటాయని పేర్కొంది.

వృద్ధి 7.6 శాతమే: క్రిసిల్

2018–19 సంవత్సరానికి అంచనాల కొనసాగింపు

ముంబై: రానున్న ఆర్థిక సంవత్సరాని(2018–19)కి దేశ జీడీపీ వృద్ధి రేటు 7.6 శాతంగా ఉంటుందన్న అంచనాలను ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ మరోసారి పునరుద్ఘాటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి మందగించడానికి డీమోనిటైజేషన్, జీఎస్టీ వల్ల స్వల్ప కాలంలో ఎదురైన ప్రతికూలతలు, వ్యవసాయ వృద్ధి బలహీనంగా ఉండడమే కారణాలుగా పేర్కొంది. జీఎస్టీ ప్రతికూల ప్రభావం కొనసాగుతుందన్న అంచనాలతోనే రానున్న ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు అంచనాను 7.6 శాతంగా పేర్కొంటున్నట్టు వివరించింది. ప్రైవేటు వినియోగం 2017 ఆర్థిక సంవత్సరంలో 8.7 శాతంగా ఉండగా, అది 2018 ఆర్థిక సంవత్సరంలో 6.3 శాతం ఉండొచ్చని అభిప్రాయపడింది. అయినప్పటికీ జీడీపీలో 55.7 శాతంతో ఇదే అతిపెద్ద వాటాదారు అని తెలిపింది.

పన్ను చెల్లింపుదారులను పెంచాలి

ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరేందుకు ఎస్‌బీఐ సూచన

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరేందుకు వెంటనే పన్ను పరిధి పెంచాలని ఎస్‌బీఐ తన నివేదికలో సూచించింది. దేశ జీడీపీలో స్థూల ద్రవ్యలోటు శాతం అన్నది 2008 ఆర్థిక సంవత్సరం తర్వాత పెరగడం మొదలైందని తెలిపింది. ఈ మేరకు 'భారత ప్రభుత్వ ఆర్థిక ధోరణులు' అనే పేరుతో నివేదిక విడుదల చేసింది. ''ద్రవ్యలోటు స్థాయి పెరిగింది. కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి ద్రవ్యలోటు లక్ష్యమైన 6 శాతాన్ని చేరుకునేందుకు పాలసీలను ఒకే విధంగా మార్చాల్సిన అవసరం ఉంది. దేశంలో పన్ను చెల్లించే వారు 4 శాతంగానే ఉన్నారు. ఈ సంఖ్యను సత్వరమే పెంచాలి. దాంతో ద్రవ్య స్థిరీకరణకు పొదుపు చర్యలను పాటించాల్సిన అవసరం ఉండదు'' అని ఎస్‌బీఐ తన నివేదికలో సూచించింది.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	422.9	423.8
AMBUJA C	274.6	273.9
ASIAN PA	1182	1185.25
AXIS BAN	565.45	563.25
BAJAJ AU	3275.75	3279.85
BAJAJ FI	1836.85	1814.5
BHARTI A	516.35	540
BOSCH LI	19998.35	19693.15
BHARAT P	497.2	487.7
CIPLA LT	615.05	615.15
COAL IND	287.45	278.75
EICHER M	29197.4	29237
GAIL (IN	497.4	494.4
HCL TECH	900.5	900.05
HDFC LTD	1740.95	1725.2
HDFC BAN	1860.6	1863.6
HERO MOT	3786.75	3744.65
HINDALCO	276.15	276.4
HIND.petrol	421.15	415
HIND.unilever	1368.4	1356.55
INDIABUL	1225.3	1198.95
ICICI BA	314.15	312.9
INDUSIND	1719.9	1698.2
BHARTI I	374.4	372.6
INFOSYS	1036.05	1012
INDIAN O	388.55	383.85
ITC LTD	265.6	262.9
KOTAK MA	1006.1	1003.05
LARSEN &	1338.25	1314.9
LUPIN LI	923.3	900.15
MAHINDRA	759.9	756.35
MARUTI S	9448.95	9433.85
NTPC LTD	177.65	177.5
OIL AND	197.4	198.45
POWER GR	200.55	201.25
RELIANCE	928.55	923.25
STATE BA	305.8	306.35
SUN PHAR	591.6	578.75
TATA MOT	433.55	431.6
TATA STE	768.75	770.7
TATA CON	2714.4	2689.2
TECH MAH	536.3	525.45
ULTRATEC	4425.3	4395.8
UPL LIMI	784.35	774.2
VEDANTA	340.25	339.55
WIPRO LT	311.15	309.55
YES BANK	333.6	332.85
ZEE ENTE	593.9	586.85

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDI	1437.6	1435.1
ACC LIMI	1825	1809.95
ASHOK LE	128.45	127.45
BAJAJ FI	5221.25	5127.2
BANK OF	161.65	161.8
BHARAT E	184.05	182.3
BHEL	101.95	102.35
BRITANNI	4693.75	4644.1
CADILA H	452	440.2
COLGATE	1117.7	1100.7
CONTAINE	1379.95	1379.3
CUMMINS	957.55	957.2
DABUR IN	361.35	358.2
DLF LIMI	260.25	259.95
AVENUE S	1226.8	1243.4
EMAMI LI	1336.25	1327.95
GLAXOSMI	2509.55	2488.2
GLENMARK	600.4	591.6
GODREJ C	994.7	990.05
GLAXOSMI	6358.8	6398.45
HAVELLS	563.1	566.05
HIND.zinc	318	313.8
ICICI PR	411.8	394.15
IDEA CEL	109.05	115.8
INTERGLO	1225.2	1198.6
JSW STEE	286	285.1
LIC HOUS	583.9	571.25
MARICO L	323.15	326.95
UNITED S	3923.5	3953.25
MOTHERSO	383.75	381
MRF LTD	72610.5	72905.9
NHPC LTD	33.15	33.55
NMDC LTD	161.85	158.55
ORACLE F	4110.3	4101.65
OIL INDI	379.75	380.5
PIRAMAL	2909.55	2853.5
PETRONET	254.7	252.15
POWER FI	126.7	125.05
P&G HYGI	9299.5	9326.25
PIDILITE	912.15	910.2
PUNJAB N	175.7	176
RURAL EL	163.95	161.45
STEEL AU	98.8	97.4
SHREE CE	19374.35	18964.5
SIEMENS	1293.45	1286.7
SHRIRAM	1509.9	1480.05
SUN TV N	1044.45	1037.95
TATA POW	99.85	99.55
TITAN CO	926.1	909.7
TORRENT	1433.85	1420.75

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.51	8.31
Alphageo	935.05	931.9
Alu Flouride	143	140.7
Amar Raja Bat	864.35	862.3
And Bank	58.55	58.65
And Cemen	15.26	14.54
And Paper	351.1	346.55
And Petro	67.45	64.25
Anjani Portl	261.65	266.05
Aries Agro Ltd	245	246.45
Aurobindo Ph	677.95	671.1
Avantel Soft	548.9	530
Avanti Feeds	2678.7	2694.1
AvonOrg	17	17.1
BN Rathi Sec	52.25	53
Balaji Amin	752.8	660.45
Bambino Agro	327.35	321.5
Baron Info	0.32	0.32
Bartronics	16.68	16.71
Bhagira Chem	362.3	357.85
Bhagya Nag	51.25	50.7
Bhagya Wood	30.9	30
Brilliant Sec	14.13	13.46
CIL Securi	38	39.45
Cannan Intl	15	15.55
Color Chip	48	49.3
Combat Drugs	22.07	21.02
Cont Coffee	303.9	302.75
CoroFert	582	568
Cosboard Ind	45.95	44.55
Country Club	18.5	19.05
Cubex Tub	29.15	28.8
Cybermate	3.52	3.62
DR Reddy	2465.8	2467.35
Danlaw Tec	88.85	84.65
DecCement	651	644.45
Divi's Lab	1114.15	1105.15
Divya Granit	117	111.45
Dolphin Medi	2	2
Dredgin Corp	886.7	871.05
Empee Sugars	5.33	5.4
Everest Org	151.65	149.1
Fortune Info	118	123.55
Four Soft	92.5	91.5
Fourth Gen	1.71	1.7
Frontier Inf	1.96	1.87
GMR Ferro	3.49	3.54
GMR Infra	22	21.25
GVK Power	21.1	20.1
Gati Corpn	141.45	138.85
Gayatri Proj	213.2	214.95
Gayatri Sugrs	12.25	11.93
Gennex Lab	6.16	6.1
GodavDru	43.25	43.4
Goldstn Tele	229.95	209.05
Goldstone Tech	14.8	14.1
Granules (I)	140.15	139.35
HBL Nife Pow	73.45	73.5
HYDIndus	1595	1608.05
Heritage Food	837	830.95
Hifco Marwel	38.95	37.2
HindFlurocarb	12.76	12.16
ICSA Ltd	5.22	4.98
IDL Industrs	602.15	587.75
IQMS Soft	15.3	15.35
IVRCL Infras	6.45	6.19
Incap	123	128.95
IndoNationl	1040.55	1098.95
Infotech En	582.6	576.4
Innaredy Com	5.22	4.98
Invinex Lab	92.8	91
JSTL	57.55	54.85
KCP LTD	156.65	157.95
KNR Constructio	315.15	313.3
Kabsons Indu	9.03	8.86
KakatiCem	412.95	413.25
Kallam Spg	25.05	26.15
Kernex Micro	48.25	46
Krebs Bio	162.75	157
LGS Global	6.68	5.99
LancoIndus	402.6	401.3
Lokesh Mach	78.5	78.7
Lotus Choc	22.05	21
MIC Elec	9.49	9.38
Madhucon Proje	38.45	36.85
Maytas Infra	54	55.5
Mold-tek	76.7	76.65
Moldtek Plastic	335	327.5
Moschip Semi	44.15	42.2
NCLInd	268	278
NETTLINX	89.2	88.55
NMDC Ltd	161.85	158.5
NagarAgrich	67.1	63.9
NagarAgrite	7.51	7.9
NagarConst	134.3	131.9
Natco Pharma	1003.4	998.9
Nava Bh Ventur	173.15	172.8
Neha Inter	10.28	10.56
Neocure Ther	4.05	4.09
Neuland Lab	851.7	845.4
Nihar Info Glo	14.01	13.6
Nile	925.9	927.95
Oil Country	61.45	62.25
Ortin labs	27.35	27.05
Pankaj Poly	23.05	24.1
Panyam Cemen	66.55	65.6
PennInd	76.3	76.7
Phytochem I	73.75	73.75
Pitti Lamin	103.1	103.75
Pokarna	258.2	247.6
Prajay Engs	18.46	17.59
PremiExpl	511.6	446.9
Prism Cement	135.65	135.4
Rain Industries	461.35	421.2
Raj Packagin	39.7	39
Ram Informat	37	38.3
RavilFin	15.5	16.03
Reg.Ceramic	8.5	8.93
Restile Cer	10.3	10.4
Roopa Indus	13.7	13.05
Sagar Cem	1108.25	1095.8
Sai Wires(I)	2.33	2.37
Samkrg Pist	350	354.1
Sampre Nutri	88.95	87.6
SangInd	140.5	138.75
Satvah. Ispat	37.55	37.25
Saven Techno	25	24
Softpro Sys	6.07	5.79
South Bio Tech	3.95	3.52
South Magnes	35.8	34.1
SrRayAlk	86.4	82.45
Srinivasa Ship	98.5	92.5
Starchik Sp	25.5	25
Sujana Metal	1.7	1.69
Sujana Towers	5.63	5.37
Sujana Univers	0.97	0.93
Surana Strip	2.72	2.86
Surana Tele	6.75	6.43
Suryachakra Pow	1.56	1.49
Suryalata Sp	170.75	165.8
Suryava Spin	9.31	8.91
SuvarCem	177.05	180
Suven Pharma	218.15	215.1
TCI Finance	32.25	29.8
Taj Gvk Hotel	186.9	181.35
Tanla Solutions	40.25	41.2
Trans Biotek	2.41	2.44
Transport Co	297.85	294.55
Trendy Knit	0.22	0.21
Ushakiran Fi	4.75	5
Usher Agro	8.7	8.75
V&K Soft	4.75	4.99
VBC Ferro	47.2	45.05
VST Indus	3157.55	3177.55
Vamshi Rubb	54	52.35
Viceroy Hotels	21.2	20.4
VijayGrowth	15	15
VijayTextil	43.65	44.8
Vimta Labs	170.95	173.25
Virat Crane	47.6	47.4
Virinchi Con	146.2	139.25
VisakaInd	770.05	755.7
Vision Tech	2.1	2
Vista Pharma	47.95	45.7
Vivimed Labs	108.25	105.95
Vjil Consult	18.05	19
ZenoTech Lab	50.95	51.25

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	29,580
బంగారం (99.5, 10గ్రా)	29,430
వెండి (కిలో)	38,705
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	- -
బంగారం (22 క్యారెట్లు)	28,140
వెండి (కిలో)	- -
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	30,150
బంగారం (22 క్యారెట్లు)	28,200
వెండి(కిలో)	39,355
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	30,400
బంగారం (22 క్యారెట్లు)	28,150
వెండి(కిలో)	40,000
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	30,090
బంగారం (22 క్యారెట్లు)	27,980
వెండి(కిలో)	39,900
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	30,550
బంగారం (22 క్యారెట్లు)	28,250
వెండి(కిలో)	40,000
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	30,450
బంగారం (22 క్యారెట్లు)	28,140
వెండి(కిలో)	40,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

వడ్డీ రేట్లు

బేస్‌రేట్ రేంజ్	8.85 – 9.45
డిపాజిట్ రేట్ రేంజ్ (ఏడాది)	6.00 – 6.75
డాలర్ లిబార్ (6 నెలలు)	1.86

అంకెలు శాతాల్లో

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.53 (రాత్రి 11.30కు)	$61.44 (శుక్రవారం ముగింపు)
బ్రెంట్	67.69 (రాత్రి 11.30కు)	$67.62 (శుక్రవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 9-1-2018

విశాఖ	400-00
చిత్తూరు	398-00
వరంగల్	404-00
ముంబై	444-00
చెన్నై	405-00
విజయవాడ	400-00
గోదావరి	400-00
నమక్కల్	395-00
8-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	402-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	405-00
ఢిల్లీ	443-00
కోల్‌కతా	440-00

ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయంలో రసాయనాలపై ఆధారపడటం మానాలి
ప్రకృతి వ్యవస్థలను సుసంపన్నం చేసుకోవడం మేలని గ్రహించాలి
- విలియం ముర్రే, ఆహార-వ్యవసాయ సంస్థ(ఎఫ్.ఏ.ఓ.)

సాగుబడి

'సాక్షి' అందిస్తున్న 'సాగుబడి' కథనాలపై స్పందించదలచారా? అయితే, ఫేస్‌బుక్‌లో sakshi sagubadi గ్రూప్‌ను చూడండి.

ఉత్తరాషాడ కార్తె : జనవరి 17 నుంచి



● సేంద్రియ ఉత్పత్తులపై 'జైవిక్ భారత్' ముద్ర తప్పనిసరి ● నిబంధనావళిని ప్రకటించిన భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ● దేశవ్యాప్తంగా జూలై నుంచి అమలు ● నేరుగా వినియోగదారులకు ఆహారోత్పత్తులను అమ్ముకునే చిన్న, సన్నకారు రైతులు / రైతు బృందాలకు మినహాయింపు

సేంద్రియ ఆహారంపై జైవిక్ ముద్ర!

సేంద్రియ వ్యవసాయ/ఆహార ఉత్పత్తుల ప్యాకెట్‌ను షాపు/మాల్‌లో చేతిలోకి తీసుకునే వినియోగదారులకు 'ఇది నిజంగా సేంద్రియ పద్ధతుల్లో పండించినదేనా?' అన్న సందేహం కలగడం సహజం. ఈ గందరగోళానికి ఒక ప్రధాన కారణం.. ప్యాకెట్‌పై ఒక్కో కంపెనీ వారు ఒక్కో రకంగా ఉండే సేంద్రియ లోగోను ప్రచురించడమే. సేంద్రియ ఉత్పత్తుల వినియోగదారులకు వచ్చే జూలై నుంచి ఈ ఇబ్బంది ఉండదు.

ఎందుకంటే.. కేంద్ర ప్రభుత్వం 'జైవిక్ భారత్' అనే లోగోను విధిగా ప్యాకెట్‌పై ముద్రించాలని నిర్దేశించింది. జూలై నుంచి ఈ లోగో ముద్రించకుండా సేంద్రియ ఉత్పత్తులను విక్రయించే వ్యాపారులు శిక్షార్హులని భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ప్రకటించింది. సేంద్రియ/ప్రకృతి వ్యవసాయదారులు లేదా రైతు బృందాలు(ఎఫ్.పి.ఓ.లు) తాము పండించిన ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్మేటప్పుడు ఈ నిబంధన వర్తించదు! రైతుల నుంచి కొని వినియోగదారులకు అమ్మే దుకాణదారులకు మాత్రమే ఇది వర్తిస్తుంది.

అయితే, దేశ విదేశాల్లో తమ ఉత్పత్తులను విక్రయించదలచుకునే సేంద్రియ/ప్రకృతి వ్యవసాయదారులు పి.జి.ఎస్. లేదా థర్డ్ పార్టీ సర్టిఫికేషన్‌ను పొందాల్సి ఉంటుంది.

మన దేశంలో సేంద్రియ ఆహార నాణ్యతా ప్రమాణాల నియంత్రణకు రంగం సిద్ధమైంది. దుకాణాలు, మాల్స్‌లో విక్రయించే సేంద్రియ వ్యవసాయోత్పత్తుల ప్యాకెట్లపై ఉత్పత్తిదారులు 'జైవిక్ భారత్' లోగోను జూలై నుంచి విధిగా ముద్రించాల్సి ఉంటుంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని 'భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ.)' సేంద్రియ ఆహారానికి సంబంధించి రూపొందించిన నియమావళిని ప్రకటించింది. ఈ మేరకు ఈ నెల 2న గెజెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ముసాయిదా ప్రకటించిన ఏడాది తర్వాత గత ఏడాది నవంబర్ 9న ప్రపంచ సేంద్రియ మహాసభల సందర్భంగా విడుదలైన ఈ నియమావళి.. ఈ ఏడాది జూలై నుంచి చట్టబద్ధంగా అమల్లోకి వస్తుంది.

దేశవ్యాప్తంగా సేంద్రియ ఆహారోత్పత్తి, అమ్మకం, పంపిణీలతోపాటు విదేశాల నుంచి సేంద్రియ ఆహారోత్పత్తుల దిగుమతికి కూడా ఈ నియమావళి వర్తిస్తుంది. ఇప్పటి వరకు విదేశాలకు ఎగుమతి అయ్యే సేంద్రియ ఆహారోత్పత్తులకు మాత్రమే సేంద్రియ ఉత్పత్తి కార్యక్రమం (ఎన్.పి.ఓ.పి.) నిబంధనల ప్రకారం థర్డ్ పార్టీ సేంద్రియ ధ్రువీకరణ పత్రం పొందేవారు. ఇప్పుడు దేశీయంగా అమ్మే సేంద్రియ ఉత్పత్తులకు కూడా కంపెనీలు ఎన్.పి.ఓ.పి. ధృవీకరణ పొందవచ్చు. ఎన్.పి.ఓ.పి. ధృవీకరణ వ్యవస్థ 2001 నుంచి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖకు అనుబంధంగా.. 'అపెడా' ఆధ్వర్యంలో పనిచేస్తున్నది. ఈ సర్టిఫికేషన్ ప్రక్రియ క్లిష్టమైనదే కాక, అత్యంత ఖరీదైనది కూడా.

కొత్త నియమావళి ప్రకారం.. మన దేశంలోని దుకాణాల్లో/ షాపింగ్ మాల్స్‌లో అమ్మకానికి పెట్టే సేంద్రియ ఉత్పత్తులేవైనా సరే విధిగా అందుబాటులో ఉన్న రెండు ధృవీకరణ వ్యవస్థల్లో(ఎన్.పి.ఓ.పి./ పి.జి.ఎస్. ఇండియా) ఏదో ఒక దాని నుంచి ధ్రువీకరణ పొందాల్సి ఉంటుంది.

పార్టిసిపేటరీ గ్యారంటీ సిస్టం (పి.జి.ఎస్.) ఇండియా అనేది కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖకు చెందిన జాతీయ సేంద్రియ వ్యవసాయ కేంద్రం(ఎన్.సి.ఓ.ఎఫ్.), ఘజియాబాద్‌కు అనుబంధంగా పనిచేస్తున్న సేంద్రియ ధ్రువీకరణ వ్యవస్థ. 2011 నుంచి ఉంది. ఆన్‌లైన్ ద్వారా రైతుల రిజిస్ట్రేషన్ సదుపాయం 2015 జూలై నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇందులో సేంద్రియ రైతులే బృందంగా ఏర్పడి సర్టిఫికేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తారు. ఈ ధ్రువీకరణకు రైతులు ఎటువంటి ఫీజునూ చెల్లించనక్కరలేదు.

ఎన్.పి.ఓ.పి./ పి.జి.ఎస్. ఇండియా సర్టిఫికేషన్ వ్యవస్థలు అందుబాటులోకి వచ్చి అనేక ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఐచ్ఛికంగానే ఉన్నాయి. అయితే, 'జూలై నుంచి సేంద్రియ ఆహారోత్పత్తులను అమ్మే ఏ కంపెనీ అయినా ఇప్పుడు మేం ప్రకటించిన ప్రమాణాలను విధిగా పాటించకపోతే ప్రాసిక్యూట్ చేస్తాం' అని ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ. సీఈఓ పవన్ అగర్వాల్ హెచ్చరిస్తున్నారు.

సేంద్రియ ఆహారోత్పత్తులను వినియోగదారులకు నేరుగా అమ్మే చిన్న, సన్నకారు రైతులు లేదా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్(ఎఫ్.పి.ఓ.లు) ఎటువంటి ధ్రువీకరణనూ విధిగా పొందాలన్న నిబంధనేదీ లేకపోవడం విశేషం. సేంద్రియ ఆహారోత్పత్తుల ప్యాకెట్లపై ఆయా ఉత్పత్తుల సేంద్రియ స్థితిగతులకు సంబంధించి పూర్తి వివరాలను పొందుపరచాలి. ఎన్.పి.ఓ.పి. ప్రకారం థర్డ్ పార్టీ సర్టిఫికేషన్ లోగో లేదా పి.జి.ఎస్. ఇండియా ధ్రువీకరణ లోగోలలో ఏదో ఒకదానితో పాటుగా.. **జైవిక్ భారత్** లోగోను కూడా తప్పనిసరిగా ముద్రించాల్సి ఉంటుంది. ఆ ప్యాకెట్‌లో ఉన్న సేంద్రియ ఉత్పత్తిని పండించిన రైతు ఎవరో ఏమిటో తెలిపే వివరాలు వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చే ఏర్పాటు ఉండాలి.

- పంతంగి రాంబాబు,
సాగుబడి డెస్క్

ఎన్.పి.ఓ.పి. థర్డ్ పార్టీ సర్టిఫికేషన్ ముద్ర

దేశీయ మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులపై ముద్రించే 'పి.జి.ఎస్. ఇండియా' ముద్రలు

భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ విడుదల చేసిన ముద్ర



పి.జి.ఎస్. ఇండియా ధ్రువీకరణతో విశ్వసనీయత!

వివిధ సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండించే రైతుల బృందాలు పి.జి.ఎస్. ఇండియా ధ్రువీకరణ పొందితే వారి ఉత్పత్తులకు మార్కెట్‌లో విశ్వసనీయత, రైతుల నికరాదాయం పెరుగుతుంది. 100కు పైగా రైతు బృందాల బ్రాండ్స్ పి.జి.ఎస్. ఇండియా ద్వారా మార్కెట్‌లోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా రీజినల్ కౌన్సిళ్ల ద్వారా రైతులు రిజిస్టర్ చేసుకోవచ్చు. వివరాలకు ఈ వెబ్‌సైట్ చూడండి: pgsindia-ncof.gov.in ఘజియాబాద్(ఉ.ప్ర.)లోని మా కార్యాలయాన్ని సంప్రదించండి: 0120 2764906, 2764212

- డా. కృషన్ చంద్ర, సంచాలకులు, జాతీయ సేంద్రియ వ్యవసాయ కేంద్రం, ఘజియాబాద్(ఉత్తరప్రదేశ్)





సేంద్రియ పశు, ఆక్వా ఉత్పత్తులకూ ధ్రువీకరణ!

● **జడ్.బి.ఎన్.ఎఫ్. రైతులకూ పి.కె.వి.వై.!**

పార్టిసిపేటరీ గ్యారంటీ సిస్టం(పి.జి.ఎస్.) ఇండియా ద్వారా సేంద్రియ ధ్రువీకరణను సంపూర్ణంగా సేంద్రియ/ప్రకృతి పద్ధతులను అనుసరించే రైతులందరూ ఉచితంగా పొందవచ్చు. కనీసం ఐదుగురు రైతులు బృందంగా ఏర్పడి, అధీకృత రీజినల్ కౌన్సిళ్ల ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకొని పీజీఎస్ ఇండియా సేంద్రియ ధ్రువీకరణను పొందవచ్చు. విదేశాలకు ఎగుమతి చేయడానికైతే ఒక రైతు లేదా కనీసం 50 మంది గల రైతు బృందాలు ఎన్.పి.ఓ.పి. థర్డ్ పార్టీ ధ్రువీకరణను పొందవచ్చు. సేంద్రియ పశుపోషణ పద్ధతులను అనుసరిస్తున్న రైతులు 'అపెడా' ద్వారా థర్డ్ పార్టీ ధ్రువీకరణ పొందవచ్చు. ఆహార ధాన్యాలు, కూరగాయ పంటలను పూర్తిగా సేంద్రియ/పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసే రైతులతో పాటు.. ఆక్వా సాగులో పూర్తి సేంద్రియ పద్ధతులను పాటించే రైతులు సైతం ఉచితంగా పి.జి.ఎస్. ఇండియా ద్వారా సేంద్రియ ధ్రువీకరణ పొందవచ్చు. దేశవ్యాప్తంగా 722 సంస్థలు(రీజినల్ కౌన్సిల్స్) పి.జి.ఎస్. ధ్రువీకరణ సదుపాయాన్ని అందిస్తున్నాయి. ఇప్పటికే 2.5 లక్షల మంది రైతులు పి.జి.ఎస్. ఇండియా ధ్రువీకరణ పొందారు. వీరు జూలై నుంచి తమ రైతు బృందం సొంత లోగోతో పాటు.. పి.జి.ఎస్. ఇండియా లోగో, జైవిక్ భారత్ లోగోలను ప్యాకెట్లపై ముద్రించాల్సి ఉంటుంది.

- డాక్టర్ టి. కె. ఘోష్, ప్రాంతీయ సంచాలకులు, జాతీయ సేంద్రియ వ్యవసాయ కేంద్రం, ఘజియాబాద్.





పి.జి.ఎస్. ఇండియా, జైవిక్ భారత్ ముద్రలు ముద్రించిన త్రిపుర ప్రభుత్వ సేంద్రియ ఉత్పత్తి

సొంత బ్రాండ్‌తో అమ్ముకోవచ్చు

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయదారులు పి.జి.ఎస్. ఇండియా వ్యవస్థ ద్వారా ఉచిత సేంద్రియ ధ్రువీకరణ పొందవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో జె.డి.ఎ.ల ద్వారా లేదా ఎన్.సి.ఓ.ఎఫ్. వద్ద రీజినల్ కౌన్సిళ్లుగా నమోదైన ప్రైవేటు సంస్థల ద్వారా రైతులు ధ్రువీకరణ పొందవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో పి.కె.వి.వై. పథకం అమలు ప్రారంభం కానందున జె.డి.ఎ.ల ద్వారా రైతులు ధ్రువీకరణ పొందలేరు. అయితే, ప్రైవేటు రీజినల్ కౌన్సిళ్ల ద్వారా ఆంధ్రా రైతులు పి.జి.ఎస్. ధ్రువీకరణ పొందే వీలుంది. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం చేసే రైతులైనా కనీసం ఐదుగురు బృందంగా ఏర్పడి ధ్రువీకరణ పొందవచ్చు. దుకాణంలో అమ్మినప్పుడు మాత్రం తప్పనిసరిగా సేంద్రియ ధ్రువీకరణ లోగోతో పాటు, జైవిక్ భారత్ లోగోనూ ముద్రించాలి.

- డాక్టర్ వి. ప్రవీణ్‌కుమార్ (092478 09764), శాస్త్రవేత్త, ఎన్.సి.ఓ.ఎఫ్. ఘజియాబాద్




సేంద్రియ/ప్రకృతి సేద్యంపై దృష్టి!

పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం (జడ్.బి.ఎన్.ఎఫ్.), ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల్లోని సేంద్రియ వ్యవసాయ నమూనాలు ప్రాచుర్యం పొందుతున్న నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయం – ధ్రువీకరణ సంబంధిత అంశాలపై రెండేళ్లుగా దృష్టిని కేంద్రీకరిస్తున్నాం. ఘజియాబాద్‌లోని జాతీయ సేంద్రియ వ్యవసాయ కేంద్రం నిపుణులతో వివిధ రాష్ట్రాల ఆత్మా పీడీలు, శాస్త్రవేత్తలు, మత్స్య, పశుసంవర్థక శాఖల అధికారులకు పి.జి.ఎస్. ధ్రువీకరణ పద్ధతిపై శిక్షణ ఇప్పించాం. రెండో విడతగా ఇటీవల 3 రోజుల పాటు శిక్షణ ఇప్పించాం. వేస్ట్ డీ కంపోజర్‌తో సులభంగా సేంద్రియ సేద్యాన్ని చేపట్టే పద్ధతులను అధ్యయనం చేస్తున్నాం. రైతుకు భవితపై ఆశ కల్పించాలన్న లక్ష్యంతో లాభనష్టాలు చూసుకొని తగిన సేద్య పద్ధతులను అనుసరించాలని చెబుతున్నాం. విస్తరణ వ్యవస్థలో లోపాలను సరిదిద్దేందుకు రాష్ట్రాల వారీగా వర్కింగ్ పేపర్లు తయారు చేసి, రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తున్నాం. 2019 మార్చి నాటికి అన్ని రాష్ట్రాల వర్కింగ్ పేపర్లూ సిద్ధం చేస్తాం.

- వి. ఉషారాణి, డైరెక్టర్ జనరల్, జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ(మేనేజ్), రాజేంద్రనగర్, హైదరాబాద్





అతి తక్కువ అవశేషాల పరిమితి!

రసాయనిక ఆహారోత్పత్తుల్లో చట్టబద్ధంగా అనుమతించదగిన రసాయనిక పురుగుమందుల అవశేషాల స్థాయిలో 5%కు మించి సేంద్రియ ఆహారోత్పత్తుల్లో ఉండకూడదని 'భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ.) తాజా నిబంధనావళి నిర్దేశిస్తోంది. ఉదాహరణకు.. రసాయనిక వ్యవసాయ పద్ధతిలో సాగైన బియ్యంలో కార్బరిల్ అనే పురుగుల మందు అవశేషాలు 2.5 పార్ట్ పర్ మిలియన్ (పీపీఎం)కు మించి ఉండకూడదన్నది నిబంధన.

ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ. తాజా నిబంధనావళి ప్రకారం.. సేంద్రియ బియ్యంలో ఈ అవశేషం 0.125 పీపీఎంకు మించి ఉండకూడదు. ప్రపంచస్థాయి అత్యున్నత సేంద్రియ సేద్య ప్రమాణాలకు అనుగుణంగా ఇంత తక్కువ అవశేషాల మోతాదును నిర్దేశించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

ఆదర్శవంతం.. టెర్రస్ ఉద్యానవనం!

● మేడపైన వెయ్యి చదరపు అడుగుల్లో 200కు పైగా కుండీలు ● పుష్కలంగా ఆకుకూరలు, కూరగాయలు, రకరకాల పండ్ల సాగు

సేంద్రియ ఇంటిపంటల సాగుపై మక్కువ పెంచుకుంటే ఆయురారోగ్యాలు, ఆనందోత్సాహాలను పొందడంతోపాటు.. మహానగరంలో సొంత ఇల్లున్న బాధ్యతాయుతమైన పౌరులుగా విశ్రాంత జీవితాన్ని అర్థవంతంగా గడపవచ్చని నిరూపిస్తున్నారు.. పిన్నాక శ్రీనివాస్, పద్మ దంపతులు. హైదరాబాద్ మియాపూర్‌లోని దీప్తిశ్రీనగర్ వాసులైన ఈ ఆదర్శ దంపతులు తమ సొంత ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇద్దరు కుమారులు అమెరికాలో స్థిరపడ్డారు. దుబాయ్‌లో ఉద్యోగ విరమణ అనంతరం నగరంలో పద్మ, శ్రీనివాస్ స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. విశ్రాంత జీవితంలో ఇంటిపంటల సాగును ప్రధాన వ్యాపకంగా మార్చుకున్నారు.

ఇంటిపైన గల వెయ్యి చదరపు అడుగుల స్థలాన్ని పూల మొక్కలు, సుసంపన్నమైన ఉద్యాన పంటల జీవవైవిధ్యానికి చిరునామాగా రూపుదిద్దారు. వంటింటి వ్యర్థాలు, ఆకులు అలములను తగుల బెట్టకుండా.. బయట పడేయకుండా.. ఇంట్లోనే కంపోస్టు తయారు చేసుకుంటూ ఆరోగ్యదాయకమైన, రుచికరమైన సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఏడాది పొడవునా పండించుకొని తింటున్నారు. వీరి కృషికి మెచ్చిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 'టెర్రస్ హార్టికల్చర్' విభాగంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఇటీవల సత్కరించడం విశేషం.

బోన్సాయ్, పూల మొక్కలపై ఉన్న ఆసక్తిని పద్మ, శ్రీనివాస్ దంపతులు మూడేళ్ల క్రితం నుంచి టెర్రస్‌పై సేంద్రియ ఇంటిపంటల వైపు మళ్లించారు. దాదాపుగా ఏమీ కొనడం లేదు. ఎక్కువ దిగుబడి ఉన్నప్పుడు ఇరుగుపొరుగు వారికి పంచిపెడుతున్నారు.

సాక్షిలో ఇంటిపంట, సాగుబడి కథనాలు, ఇతర పుస్తకాలు చదువుతూ.. యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ ఎప్పటికప్పుడు పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నామని పద్మ తెలిపారు.

ఎక్కువ అవసరం అనుకున్న ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలను రకానికి ఐదేసి కుండీల్లో పెంచుకోవడం ద్వారా ఏడాది పొడవునా దిగుబడి వచ్చేలా ప్రణాళికాబద్ధంగా ఇంటిపంటలను సాగు చేస్తున్నారు. అన్ని రకాల ఆకుకూరలు, వంగ, టమాటా, దొండ, దోస, కాకర.. తదితర కూరగాయలు.. బొప్పాయి, అంజూర, కమలాలు, నారింజ, నిమ్మ, స్టార్ ఫ్రూట్, స్ట్రాబెర్రీ, యాపిల్ బెర్ తదితర పండ్ల చెట్లు పెంచుతున్నారు.. ఇక పూల చెట్లకు లెక్కే లేదు. వెలగ, రావి, జువ్వి.. వంటి ఇతర చెట్లూ ఉన్నాయి. చీడపీడలు చాలా తక్కువ. ఏదైనా పురుగు కనిపిస్తే చేతులతోనే తీసేస్తున్నారు. అపుడప్పుడూ వేపనూనె, గంజి ద్రావణం వాడుతున్నారు.

సొంత విత్తనాలనే వాడుతున్నారు. ఇతరులకూ పంచుతున్నారు. లిచీ, యాపిల్ పండ్ల నుంచి విత్తనాలు తీసి.. మొక్కలు పెంచుతున్నారు. నిమ్మకాయలతో ఊరగాయ పచ్చడి పెట్టుకుంటున్నారు. ఎండాకాలంలోనూ షేడ్‌నెట్ అవసరం లేదని, రోజుకు 3 సార్లు నీరు ఇస్తే చాలన్నారు.

- పట్లోళ్ల గోవర్ధన్‌రెడ్డి,
సాక్షి, మియాపూర్, హైదరాబాద్



సేంద్రియ ఫలం రుచే వేరు..!

మా ఇంటి మీద పండిన పండ్లు, కూరగాయలు, ఆకుకూరల రుచి చాలా బాగుంటుంది. తింటేనే ఆ తేడా తెలుస్తుంది. ముఖ్యంగా బొప్పాయిని రుచి చూస్తే.. సేంద్రియ ఫలం గొప్పతనం తెలుస్తుంది. ఉదయం, సాయంత్రం చెట్లను కనిపెట్టుకొని ఉంటున్నాం. విశ్రాంత జీవితంలో ఇంటిపంటలే మా లోకం, ఆనందం, ఆరోగ్యం కూడా. ఇంటిపంటల సాగును ఉచితంగా నేర్పిస్తాం. ఎప్పుడైనా ఫోన్ చేయవచ్చు. ముందుగా చెప్పి.. స్వయంగా వచ్చి చూడొచ్చు.

- పిన్నాక శ్రీనివాస్ (87900 73518), **పద్మ**(94406 43065), దీప్తిశ్రీనగర్, మియాపూర్, హైదరాబాద్





శ్రీనివాస్, పద్మ దంపతులు అందుకున్న జ్ఞాపిక

ఆశాజనకంగా డ్రాగన్ ఫ్రూట్ సాగు

● తక్కువ నీటితో చక్కని పండ్ల దిగుబడి ● దేశీయ మార్కెట్లలోను, అంతర్జాతీయంగానూ గిరాకీ

కాక్టస్ కుటుంబానికి చెందిన డ్రాగన్ ఫ్రూట్ విదేశాల్లో విరివిగా సాగవుతున్నది. ఔషధ గుణాలు కలిగిన పండు కావడంతో దీనికి అంతర్జాతీయంగా మంచి గిరాకీ ఉంది. దీంతో తెలుగు రైతులు కూడా డ్రాగన్ ఫ్రూట్ పండ్ల తోటల సాగు వైపు దృష్టి మళ్లిస్తున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడెంకు చెందిన వ్యాపారి కొంపల్లి యాదగిరి థాయిలాండ్ పర్యటనకు వెళ్లినప్పుడు డ్రాగన్ ఫ్రూట్ తోటలను చూసి ఉత్తేజితులయ్యారు. మిర్యాలగూడెం సమీపంలోని మొల్కపట్నం వద్ద తన క్షేత్రంలో ఏడాది క్రితం నుంచి సాగు చేస్తున్నారు. ఆయన అందించిన వివరాలు..

ఇది ఎడారి జాతికి చెందిన మొక్క కావడంతో పెద్దగా నీటి అవసరం వుండదు. ఏడాదిలో 50 సెంటీమీటర్ల వర్షం సరిపోతుంది. సేంద్రియ ఎరువులు వేస్తే మంచి దిగుబడి వస్తుంది. ఒక్కసారి నాటితే 30 ఏళ్ల పాటు దిగుబడి లభిస్తుంది. కోల్‌కతా నర్సరీల నుండి నాణ్యమైన డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను రూ.50ల చొప్పున కొనుగోలు చేశారు. 10x10 అడుగుల దూరంలో 5 అడుగుల ఎత్తు కలిగిన సిమెంట్ స్తంభాలను పాతారు. స్తంభానికి 8 కేజీల వర్మీకంపోస్టు వేశారు. స్తంభానికి తూర్పు వైపు 2 మొక్కలు, పడమర వైపు 2 మొక్కలు.. ఎకరానికి 400 మొక్కలు నాటారు.

15 రోజులకొకసారి తేలికపాటిగా నీటి తడిని డ్రిప్ ద్వారా అందించాల్సి వుంటుంది. నీరు నిలిచే బంక నేలలు మినహా అన్ని నేలలూ డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అనుకూలంగా ఉంటాయి. పూత వచ్చిన 45 రోజుల్లో పండు తయారవుతుంది. నాటిన ఏడాదిలోనే దిగుబడి ప్రారంభమవుతుంది. జూన్ నుండి పూత రావడం ప్రారంభమవుతుంది. శ్రద్ధవహిస్తే 3వ సంవత్సరంలో ఆరు టన్నుల దిగుబడి లభిస్తుంది. పిలకలను కత్తిరించి నర్సరీలో మొక్కలు పెంచి రైతు అమ్ముకోవచ్చు. లేదంటే మరింత విస్తీర్ణంలో నాటుకోవచ్చు. టన్ను ధర రూ. లక్షా 50 వేలు వుంటుంది. సాధారణ సస్యరక్షణ మినహా పెద్దగా ఖర్చులు ఉండవు. 30 సంవత్సరాల పాటు దిగుబడి వస్తుందని చెబుతున్నారు. మార్కెటింగ్‌కు ఎలాంటి సమస్య వుండదని చెబుతున్నారు.

– కుంభం వెంకటేశ్వర్లు, సాక్షి, నల్లగొండ రూరల్



డ్రాగన్ ఫ్రూట్‌ను చూపిస్తున్న రైతు యాదగిరి, ఉద్యాన శాఖ ఎ.డి. అరుణ

అంటు మొక్కలను ఉచితంగా ఇస్తా..!

వ్యాపార రీత్యా థాయిలాండ్, వియత్నాం లాంటి దేశాలకు వెళ్లినప్పుడు డ్రాగన్ పండ్ల తోటల సాగును పరిశీలించాను. 15 ఎకరాల బత్తాయి తోట సాగు అనుభవం ఉంది. కొత్త రకం పండ్ల తోటల సాగు చేపట్టే ఉద్దేశంతో డ్రాగన్ ఫ్రూట్ సాగుపై ఏడాదిగా అవగాహన పెంచుకున్నాను. కోల్‌కతా నుంచి మొక్కలు తెప్పించి.. సిమెంట్ కడీల(స్తంభాల)ను, వాటిపైన రింగ్‌లను తయారు చేయించి ఎకరన్నరలో నాటాను. రూ.5 లక్షల వరకు ఖర్చు పెట్టాను. తొలి ఏడాది టన్నున్నర దిగుబడి వచ్చింది. రెండో ఏడాది 6 టన్నుల దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాను. బత్తాయి తోటలో డ్రాగన్ ఫ్రూట్ సాగును 15 ఎకరాలకు విస్తరింప జేయడానికి ఏర్పాట్లు చేస్తున్నా. మార్కెటింగ్‌కు ఎలాంటి ఇబ్బందీ లేదు. ఆసక్తి ఉన్న రైతులకు ఉచితంగా కొన్ని అంటు మొక్కలను ఇస్తాను.

- కె.యాదగిరి, డ్రాగన్ ఫ్రూట్ రైతు, మొలకపట్నం, నల్లగొండ జిల్లా
(వివరాలకు.. డి. రవి: 99896 50429)

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం 9-1-2018

"తొలి ఇన్నింగ్స్‌లో మాకు దక్కిన అవకాశాలను సరిగ్గా ఉపయోగించుకొని వారిని 220కే పరిమితం చేస్తే ఫలితం మరోలా ఉండేది. వరుసగా వికెట్లు కోల్పోవడం దెబ్బ తీసింది. మూడు రోజులు కూడా మేం సమఉజ్జీలుగానే ఉన్నాం. 208 లక్ష్యం అనేది ఎలా చూసినా కష్టమైంది కాదు. అయితే మాలో ఒకరు 20-30 పరుగులు కాకుండా కనీసం 70-80 చేయాల్సింది. ఒక బౌలర్ తగ్గినా వారు చాలా అద్భుతంగా బౌలింగ్ చేశారు. బ్యాటింగ్‌లో భాగస్వామ్యాలు నెలకొల్పడంపై మేం దృష్టి పెట్టాల్సి ఉంది. మేం కూడా వారిని తక్కువ స్కోర్లకే పరిమితం చేశాం కాబట్టి పూర్తి వైఫల్యంగా కూడా చెప్పలేం. నిజానికి మా బౌలర్లు సర్వశక్తులూ ఒడ్డారు. వారికి నా సానుభూతి. ఇలాంటి పిచ్ ఎదురైతే మళ్లీ అవకాశం వస్తే దానిని వదులుకోం. బౌలర్లు ప్రత్యర్థిని కుప్పకూలిస్తే బ్యాటింగ్‌లో మరింత మెరుగ్గా ఆడి ఫలితం రాబడతాం."

- కోహ్లి, భారత కెప్టెన్

సమర్పించేశారు


కోహ్లి

కొత్త చరిత్ర సృష్టించేందుకు అవకాశం లభించింది. కానీ చివరకు చరిత్ర మారలేదు. అదే పాత కథ పునరావృతమైంది. విదేశీ గడ్డపై భారత బౌలర్లు విజయావకాశాలు సృష్టిస్తే, వాటిని ఉపయోగించుకోలేక బ్యాట్స్‌మెన్ నేలపాలు చేసిన టెస్టుల జాబితాలో మరొకటి చేరింది. దక్షిణాఫ్రికా పర్యటనలో తొలి టెస్టు విజయంతో అద్భుత ఆరంభాన్ని అందుకునే అవకాశాన్ని కోహ్లి సేన కోల్పోయింది. సొంత మైదానాల్లో వరుస విజయాల తర్వాత ఆశలతో, అంచనాలతో సఫారీ గడ్డపై అడుగు పెట్టిన టీమిండియాకు విదేశాల్లో మ్యాచ్ గెలవాలంటే అంత సులువు కాదని మళ్లీ అర్థమైంది.

208 పరుగుల విజయలక్ష్యం. పేస్ బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై కాస్త కష్టమే అయినా అసాధ్యం మాత్రం కాదు. కానీ మన స్టార్ బ్యాట్స్‌మెన్ నిలవలేకపోయారు. పరిస్థితికి అనుగుణంగా ఆడలేక ఒకరిని అనుసరిస్తూ మరొకరు వేగంగా పెవిలియన్ చేరారు. మ్యాచ్‌కు ముందు భారత్ ఆటపై పెద్దగా అంచనాల్లేవంటూ వ్యంగ్య బాణాలు విసిరిన ఫిలాండర్ నిజంగానే పదునైన బంతులతో మన పని పట్టాడు. ప్రధాన బ్యాట్స్‌మెన్‌కు పాఠాలు నేర్పేలా అశ్విన్, భువనేశ్వర్ కొంత పోరాడినా లాభం లేకపోయింది. 'యోయో టెస్టు'ల్లో పాస్ అయిన మన ఆటగాళ్లు, అసలు ఆటలో మాత్రం ఫెయిలయ్యారు.

ఈ టెస్టు నుంచి భారత్ ఊరట చెందే అంశం ఏదైనా ఉందంటే అది మన పేస్ బౌలర్ల ప్రదర్శనే. తొలి రోజు శుభారంభంతో ఒక దశలో మ్యాచ్‌పై పట్టు చిక్కేలా చేసినా... రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 130కే ప్రత్యర్థి ఆలౌట్ చేయగలిగినా అది వారి గొప్పతనమే. ఇదే జోరు కొనసాగితే తర్వాతి మ్యాచుల్లోనైనా మన జట్టు గెలుపును ఆశించవచ్చేమో!

తొలి టెస్టులో భారత్‌కు తప్పని ఓటమి

- 72 పరుగులతో దక్షిణాఫ్రికా ఘన విజయం
- 208 పరుగుల ఛేదనలో టీమిండియా 135కే ఆలౌట్
- 6 వికెట్లతో చెలరేగిన ఫిలాండర్
- 13 నుంచి సెంచూరియన్‌లో రెండో టెస్టు


సహచరులతో ఫిలాండర్ సంబరం

కేప్‌టౌన్: సఫారీ పర్యటనను భారత్ పరాజయంతో ప్రారంభించింది. వర్షార్పణం అయిన రోజును మినహాయిస్తే... మూడు రోజుల్లోపే ముగిసిన తొలి టెస్టులో భారత్ 72 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయం పాలైంది. న్యూలాండ్స్ మైదానంలో సోమవారం 208 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుప్పకూలింది. అశ్విన్ (53 బంతుల్లో 37; 5 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' వెర్నాన్ ఫిలాండర్ (6/42) తన అత్యుత్తమ ప్రదర్శనతో భారత్‌ను దెబ్బ తీశాడు. అంతకుముందు దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 130 పరుగులకే ఆలౌటైంది. డివిలియర్స్ (50 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఒక్కడే పోరాడాడు. షమీ, బుమ్రా చెరో 3 వికెట్లు పడగొట్టారు. తాజా ఫలితంతో మూడు టెస్టుల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్టు శనివారం నుంచి సెంచూరియన్‌లో జరుగుతుంది.

షమీ, బుమ్రా జోరు...

65/2 స్కోరుతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన దక్షిణాఫ్రికాను భారత పేస్ బౌలర్లు ఓ ఆటాడుకున్నారు. అద్భుతమైన స్వింగ్, అనూహ్య బౌన్స్‌తో చెలరేగి బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు. రెండో ఓవర్లోనే ఆమ్లా (4)ను షమీ అవుట్ చేయడంతో సఫారీల పతనం ప్రారంభమైంది. ఆ తర్వాత కొద్ది సేపటికే రబడ (5)ను కూడా షమీ వెనక్కి పంపాడు. ఈ దశలో ఒక ఎండ్‌లో డివిలియర్స్ ధాటిగా ఆడే ప్రయత్నం చేయగా... భారత్ మరో ఎండ్‌లో వరుసగా వికెట్లు తీసి ప్రత్యర్థి పతనాన్ని శాసించింది. బుమ్రా వేసిన అద్భుత బంతికి డు ప్లెసిస్ (0) వద్ద జవాబు లేకపోగా, అతని తర్వాతి ఓవర్లో డి కాక్ (8) కూడా చేతులెత్తేశాడు. ఫిలాండర్ (0)ను అవుట్ చేసి షమీ తన జోరు కొనసాగించగా, మహరాజ్ (15)ను అవుట్ చేసి భువనేశ్వర్ తానూ ఈ ఉత్సవంలో భాగమయ్యాడు. మోర్కెల్ (2)ను కూడా భువీ అవుట్ చేయగా... భారీ షాట్‌కు ప్రయత్నించి బుమ్రా బౌలింగ్‌లో డివిలియర్స్ చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. సోమవారం కేవలం 21.1 ఓవర్లు మాత్రమే ఆడిన దక్షిణాఫ్రికా 65 పరుగులకే చివరి 8 వికెట్లు కోల్పోవడం విశేషం.

అంతా విఫలం...

ఊరించే లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ విజయంపై ఆశలు పెట్టుకుంది. తగినన్ని ఓవర్లు కూడా అందుబాటులో ఉండటంతో దానికి అనుగుణంగా జాగ్రత్తగా ఆడితే జట్టు గెలుపు దిశగా సాగేది. అయితే దక్షిణాఫ్రికా పేసర్లు ఆ అవకాశం ఇవ్వలేదు. గాయంతో స్టెయిన్ మ్యాచ్‌కు దూరమైనా... ఫిలాండర్ జట్టు భారాన్ని మోయగా, రబడ, మోర్నీ మోర్కెల్ అండగా నిలిచారు. అయితే మరోసారి ధావన్ (16) పుల్ షాట్ ఆడటంలో విఫలమై అవుట్ కావడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. తర్వాతి ఓవర్లోనే విజయ్ (13) కూడా బంతిని స్లిప్‌లోకి పంపించి వెనుదిరిగాడు. ఈ దశలో కోహ్లి (40 బంతుల్లో 28; 4 ఫోర్లు), రోహిత్ (10) భాగస్వామ్యం ఆశలు చిగురింపజేసింది. అయితే మళ్లీ చెలరేగిన ఫిలాండర్ తన వరుస ఓవర్లలో వీరిద్దరిని పెవిలియన్ పంపించాడు. ఫిలాండర్ అద్భుత బంతికి కోహ్లి వికెట్ల ముందు దొరికిపోయాడు. దీనిపై రివ్యూ చేసినా లాభం లేకపోయింది. రోహిత్ బంతిని వికెట్లపైకి ఆడుకొని తన విఫల టెస్టును ముగించాడు. తొలి ఇన్నింగ్స్ హీరో హార్దిక్ పాండ్యా (1), సాహా (8) రబడ బారిన పడ్డారు.

ఆశలు రేపినా...

82/7తో భారత్ టీ విరామానికి వెళ్లింది. అనంతరం ఇక పరాజయం లాంఛనమే అనిపించిన దశలో అశ్విన్, భువనేశ్వర్ (13 నాటౌట్) పోరాడారు. వీరిద్దరు పట్టుదలగా నిలబడటంతో పాటు చకచకా పరుగులు సాధించడంతో దక్షిణాఫ్రికా జట్టులో అసహనం పెరిగింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా వీరిద్దరు 13 ఓవర్ల పాటు సఫారీలకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. చివరకు కెప్టెన్ మళ్లీ ఫిలాండర్‌నే నమ్ముకున్నాడు. అతని బౌలింగ్‌లో కట్ చేయబోయి డి కాక్ అద్భుత క్యాచ్‌కు అశ్విన్ అవుట్ కావడంతో భారత్ ఓటమికి చేరువైంది. వీరిద్దరు ఎనిమిదో వికెట్‌కు 49 పరుగులు జోడించారు. తర్వాతి మూడు బంతుల్లో ఫిలాండర్... షమీ (4), బుమ్రా (0)లను అవుట్ చేసి భారత్ కథ ముగించాడు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 286; భారత్ తొలి ఇన్నింగ్స్ 209; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మర్‌క్రమ్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్యా 34; ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్యా 25; రబడ (సి) కోహ్లి (బి) షమీ 5; ఆమ్లా (సి) రోహిత్ (బి) షమీ 4; డివిలియర్స్ (సి) భువనేశ్వర్ (బి) బుమ్రా 35; డు ప్లెసిస్ (సి) సాహా (బి) బుమ్రా 0; డి కాక్ (సి) సాహా (బి) బుమ్రా 8; ఫిలాండర్ (ఎల్బీ) (బి) షమీ 0; మహరాజ్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 15; మోర్కెల్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 2; స్టెయిన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (41.2 ఓవర్లలో ఆలౌట్)130.**

వికెట్ల పతనం: 1-52; 2-59; 3-66; 4-73; 5-82; 6-92; 7-95; 8-122; 9-130; 10-130.

బౌలింగ్: భువనేశ్వర్ 11-5-33-2; బుమ్రా 11.2-1-39-3; షమీ 12-3-28-3; పాండ్యా 6-0-27-2; అశ్విన్ 1-0-3-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: విజయ్ (సి) డివిలియర్స్ (బి) ఫిలాండర్ 13; ధావన్ (సి) (సబ్) మోరిస్ (బి) మోర్కెల్ 16; పుజారా (సి) డి కాక్ (బి) మోర్కెల్ 4; కోహ్లి (ఎల్బీ) (బి) ఫిలాండర్ 28; రోహిత్ (బి) ఫిలాండర్ 10; సాహా (ఎల్బీ) (బి) రబడ 8; పాండ్యా (సి) డివిలియర్స్ (బి) రబడ 1; అశ్విన్ (సి) డి కాక్ (బి) ఫిలాండర్ 37; భువనేశ్వర్ (నాటౌట్) 13; షమీ (సి) డు ప్లెసిస్ (బి) ఫిలాండర్ 4; బుమ్రా (సి) డు ప్లెసిస్ (బి) ఫిలాండర్ 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (42.4 ఓవర్లలో ఆలౌట్) 135.**

వికెట్లపతనం: 1-30; 2-30; 3-39; 4-71; 5-76; 6-77; 7-82; 8-131; 9-135; 10-135. **బౌలింగ్:** ఫిలాండర్ 15.4-4-42-6; మోర్కెల్ 11-1-39-2; రబడ 12-2-41-2; మహరాజ్ 4-1-12-0.

10 ఈ టెస్టులో భారత కీపర్ సాహా 10 మంది బ్యాట్స్‌మెన్‌ను అవుట్ చేయడంలో భాగమై గతంలో ధోని (9) పేరిట ఉన్న రికార్డును సవరించాడు. రెండు ఇన్నింగ్స్‌లలో అతను ఐదేసి క్యాచ్‌లు పట్టాడు.

ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడకుంటే...

సునీల్ గావస్కర్

వర్షం కారణంగా మూడో రోజు ఆట తుడిచి పెట్టుకుపోయింది. పిచ్‌ను పూర్తిగా కవర్లతో కప్పి ఉంచి, గడ్డి కూడా తొలగించలేదు. కొద్దిగా మేఘావృతంగా ఉన్న కేప్‌టౌన్ వాతావరణంలో భారత కొత్త బంతి బౌలర్లు అద్భుతంగా బంతులేశారు. స్వింగ్ చేయగలిగారు. క్లాస్ బ్యాట్స్‌మన్ అయిన డివిలియర్స్ తప్ప మిగతా ప్రొటీస్ బ్యాట్స్‌మెన్ ఇబ్బంది పడ్డారు. భారత క్యాచింగ్, కోహ్లి ఫీల్డింగ్ ప్లేస్‌మెంట్స్ బాగున్నాయి. లంచ్ అనంతరం ఎండ మొదలై... పిచ్ పొడిబారడం ప్రారంభించింది. అయినప్పటికీ భారీకాయులు, పొడగరులైన దక్షిణాఫ్రికా బౌలర్లకు అదనపు బౌన్స్ రాబట్టడం కష్టమైంది. ఆస్ట్రేలియాలోలానే ఇక్కడా ధావన్ షార్ట్ బంతులకు ఇబ్బంది పడుతున్నాడు. కొంత తప్పించుకుంటూ పుల్ షాట్ ఆడే యత్నంలో అతడు అవుటయ్యాడు. ఊహించిన దానికంటే ఎక్కువ ఎత్తులో వచ్చిన బంతికి పుజారా వెనుదిరిగాడు. బౌన్సీ పిచ్‌లపై బ్యాట్స్‌మన్ బ్యాక్‌ఫుట్ సరిగా లేకుంటే రాణించడం కష్టం. సన్నాహక మ్యాచ్ ఆడి... స్థానిక బౌలర్లను ఎదుర్కొని ఉంటే, దక్షిణాఫ్రికా పొడగరి బౌలర్లతో ఇబ్బంది ఎదురై ఉండేది కాదు. వేగం, పదునుతో షమీ పాత ఫామ్‌ను అందుకున్నాడు. బుమ్రా, భువనేశ్వర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. హార్దిక్ పాండ్యా క్రమంగా ఎదగడంతో పాటు మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడుతున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో అతడు బ్యాట్‌తో విఫలమైనా... చివరి వరుస ఆటగాళ్లు కొంత పోరాడగలమని చాటారు. ఆధునిక క్రికెట్ షెడ్యూల్లో సిరీస్ మధ్యలో ప్రాక్టీస్ మ్యాచ్‌లు లేకుండా ఆడటమంటే... గాలిని చేతితో ఒడిసిపట్టడమే.

నిఖత్ ముందంజ



రోహ్‌తక్: జాతీయ మహిళల ఎలైట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ ముందంజ వేసింది. సోమవారం జరిగిన ఫ్లయ్ వెయిట్ కేటగిరి బౌట్‌లో నిఖత్ 5-0తో అంజూ సాబు (కేరళ)పై గెలిచింది. వెల్టర్ వెయిట్ విభాగంలో తెలంగాణకే చెందిన షేక్ రూహి తన ప్రత్యర్థి జాస్మి జోస్ (కేరళ)కు వాకోవర్ ఇచ్చింది. లైట్ వెల్టర్ వెయిట్ బౌట్‌లో జి. షరా (ఆంధ్రప్రదేశ్) 0-5తో చవోబా దేవి (మణిపూర్) చేతిలో పరాజయం పాలైంది.

చెన్నై స్మాషర్స్‌కు మూడో విజయం

చెన్నై: డిఫెండింగ్ చాంపియన్ చెన్నై స్మాషర్స్ జట్టు మూడో విజయం సాధించి ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో తమ సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది. బెంగళూరు బ్లాస్టర్స్‌తో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో చెన్నై స్మాషర్స్ 3-2తో గెలుపొందింది. రెండు 'ట్రంప్' మ్యాచ్‌ల్లోనూ చెన్నై ఆటగాళ్లే నెగ్గడం విశేషం. బెంగళూరు 'ట్రంప్' మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్‌లో సుమీత్ రెడ్డి-లీ యాంగ్ (చెన్నై) జంట 8-15, 15-14, 15-13తో బో మథియాస్-కిమ్ సా రంగ్ జోడీపై గెలిచింది. ఆ తర్వాత చెన్నై 'ట్రంప్' మ్యాచ్‌గా జరిగిన మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు 15-9, 15-14తో కిర్‌స్టీ గిల్మోర్ (బెంగళూరు)పై గెలిచింది. దాంతో చెన్నై 3-(-1)తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత పురుషుల సింగిల్స్‌లో అక్సెల్‌సన్ (బెంగళూరు) 15-11, 6-15, 15-9తో సెన్‌సోమ్‌బున్‌సుక్‌పై... శుభాంకర్ (బెంగళూరు) 15-12, 15-12తో లెవెర్‌డెజ్‌పై... మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి-కిమ్ సా రంగ్ (బెంగళూరు) 15-14, 15-11తో సింధు-క్రిస్ అడ్‌కాక్‌లపై గెలిచినా ఫలితం లేకపోయింది.


సింధు


దినేశ్ కార్తీక్

ఆంధ్ర పరాజయం

ముస్తాక్ అలీ టి20 టోర్నీ

సాక్షి, విశాఖపట్నం: సయ్యద్ ముస్తాక్ అలీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆంధ్ర జట్టు ఓటమితో ప్రారంభించింది. సౌత్‌జోన్‌లో భాగంగా తమిళనాడుతో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర ఏడు వికెట్ల తేడాతో ఓడింది. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 119 పరుగులు చేసింది. రికీ భుయ్ (25; 2 ఫోర్లు, ఒక సిక్స్), రవితేజ (19), ప్రశాంత్ కుమార్ (19), షోయబ్ మొహమ్మద్ ఖాన్ (20 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. తమిళనాడు బౌలర్లలో విఘ్నేశ్‌కు రెండు వికెట్లు లభించాయి. అనంతరం తమిళనాడు 14.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది. దినేశ్ కార్తీక్ (28 బంతుల్లో 57; 9 ఫోర్లు, 2 సిక్సలు) ధాటిగా ఆడాడు. కెప్టెన్ అపరాజిత్ (22 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, ఒక సిక్స్) నాటౌట్‌గా నిలిచాడు. ఈ విజయంతో తమిళనాడుకు నాలుగు పాయింట్లు లభించాయి.

రాణించిన రాయుడు: హైదరాబాద్ గెలుపు

విజయనగరంలో జరిగిన మరో మ్యాచ్‌లో హైదరాబాద్ పది పరుగుల తేడాతో కేరళను ఓడించింది. మొదట హైదరాబాద్ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 168 పరుగులు చేసింది. కెప్టెన్ ఏటీ రాయుడు (31 బంతుల్లో 52 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్సలు) టాప్ స్కోరర్‌గా నిలువగా... అక్షత్ రెడ్డి (30 బంతుల్లో 34; 3 ఫోర్లు), ఆశిష్ రెడ్డి (14 బంతుల్లో 21; 4 ఫోర్లు) రాణించారు. అనంతరం కేరళ 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 158 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ సచిన్ బేబీ (50 బంతుల్లో 79; 7 ఫోర్లు, 2 సిక్సలు) అర్ధ సెంచరీ చేసినా ఫలితం లేకపోయింది. హైదరాబాద్ బౌలర్లలో రవికిరణ్ (3/28), సిరాజ్ (2/28) ఆకట్టుకున్నారు.

శ్రీజేశ్ పునరాగమనం

నాలుగు దేశాల హాకీ టోర్నీకి ఎంపిక



న్యూఢిల్లీ: భారత స్టార్ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేశ్ ఎనిమిది నెలల తర్వాత మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చాడు. న్యూజిలాండ్‌లో జరిగే నాలుగు దేశాల హాకీ టోర్నీలో పాల్గొనే భారత జట్టును హాకీ ఇండియా (హెచ్‌ఐ) సోమవారం ప్రకటించింది. 20 మంది సభ్యులు గల ఈ జట్టుకు మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ సారథ్యం వహిస్తాడు. మోకాలి గాయంతో శ్రీజేశ్ గతేడాది కీలకమైన టోర్నీలకు దూరమయ్యాడు. ఇప్పుడు పూర్తిగా కోలుకోవడంతో మళ్లీ జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. ఈ నెల 17 నుంచి జరిగే టోర్నీలో భారత్, కివీస్‌లతో పాటు బెల్జియం, జపాన్ జట్లు తలపడనున్నాయి.

ఆసీస్ అదరహో...

సిడ్నీ టెస్టులోనూ విజయం • 4-0తో యాషెస్ సిరీస్ సొంతం



సిడ్నీ: ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ మళ్లీ చేతులెత్తేశారు. ఫలితంగా యాషెస్ సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టులోనూ ఆస్ట్రేలియానే విజయం వరించింది. ఇన్నింగ్స్ 123 పరుగుల ఆధిక్యంతో గెలిచిన స్టీవ్ స్మిత్ బృందం 4-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. సిరీస్‌లో నాలుగో టెస్టు 'డ్రా'గా ముగిసింది. ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి ఎదురునిలువలేక ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే పరిమితమైంది. ఓవర్‌నైట్ స్కోరు 93/4తో ఆట చివరి రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లండ్ మరో 87 పరుగులు జోడించి మిగతా వికెట్లను కోల్పోయింది. కమిన్స్ (4/39), లయన్ (3/54) ఇంగ్లండ్‌ను దెబ్బ తీశారు. కడుపు నొప్పితో బాధ పడుతూనే ఆడిన ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్ (58) అర్ధ శతకం అనంతరం రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగి మళ్లీ బ్యాటింగ్‌కు రాలేదు. కమిన్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'... స్మిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' పురస్కారాలు లభించాయి.



మంచు కురిసే వేళలో..

ఆమె వచ్చింది.. ఎడారిలో మంచు కురిసింది.. ఇలాంటి వర్ణనలు కవులకు కామనే.. అయితే.. ఇక్కడ ఆమె రాకుండానే మంచు కురిసింది. అదీ ప్రపంచంలోనే అతి పెద్ద ఎడారిగా పేరొందిన సహారాలో.. గత 40 ఏళ్లలో ఇలా జరగడం ఇది మూడోసారట. అల్జీరియాలోని ఇన్‌సెఫ్రా పట్టణానికి సమీపంలో ఉన్న ఎడారిలో ఆదివారం మంచు కురిసింది. కొన్ని ప్రాంతాల్లో 16 అంగుళాల మందం మేర మంచు పేరుకుందని స్థానికులు చెప్పారు.

మూడోది.. మరింత పవర్‌తో!

సిద్ధమవుతోన్న అణుజలాంతర్గామి • తొలి రెండు సబ్‌మెరైన్‌లకంటే శక్తిమంతం



సాక్షి, విశాఖపట్నం: నావికాదళంలో మూడో అణు జలాంతర్గామి సిద్ధమవుతోంది. అడ్వాన్స్ టెక్నాలజీ వెసల్(ఏటీవీ) ప్రాజెక్టులో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారయ్యే ఐదు అణు జలాంతర్గాముల్లో ఇది మూడోది. విశాఖలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో దీని నిర్మాణం జరుగుతోంది. దీనికి త్వరలో పేరు ఖరారు చేయనున్నారు. ఐఎన్ఎస్ అరిహంత్‌ను 2009లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సతీమణి గురుశరణ్ కౌర్,అరిధామన్‌ను నవంబర్‌లో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. తర్వాత అరిదామన్ పేరును అరిఘాత్‌గా మార్చారు. ఈ సబ్‌మెరైన్‌ను ఈ ఏడాది ఆఖరికల్లా ప్రారంభించనున్నారు. మూడు అణుజలాంతర్గాములు విశాఖ జిల్లా రాంబిల్లి వద్ద ఉన్న నేవల్ ఆల్టర్నేటివ్ బేస్ 'ఐఎన్ఎస్ వర్ష' స్థావరంగా విధులు నిర్వహించనున్నాయి.

అధిక శక్తిశాలి...

ఐఎన్ఎస్ అరిహంత్, అరిఘాత్‌లు 112 మీటర్ల పొడవుంటాయి. ఈ మూడో అణు జలాంతర్గామి ఒకింత పొడవు, వాటికంటే ఎక్కువ శక్తిసామర్థ్యాలను కలిగి ఉంటుంది. అరిహంత్‌లో కె–4 రకం సబ్‌మెరైన్ లాంచ్‌డ్ బాలిస్టిక్ మిసైల్స్(ఎస్ఎల్‌బీఎం) నాలుగు ఉండగా మూడో సబ్‌మెరైన్‌లో ఎనిమిది ఉంటాయి. ఇవి 3,500 కి.మీ దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలుగుతాయి. అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్లు, టార్పెడోలు, టార్పెడో ట్యూబ్‌లు ఉంటాయి. 6,000 టన్నులకు పైగా బరువును మోసుకెళ్లగలుగుతుంది. నీటిపైన గంటకు 15 నాటికల్ మైళ్లు, నీటి అడుగున 24 నాటికల్ మైళ్లకు పైగా వేగంతో పయనిస్తుంది. నీటి కింద 300 మీటర్ల దిగువ వరకు వెళ్లగలుగుతుంది. అరిహంత్‌కంటే మరింత శక్తిమంతమైన ప్రెజరైజ్డ్ వాటర్ రియాక్టర్‌ను రూపొందించనున్నారు. ఇందులోని అణు రియాక్టర్లు బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో డిజైన్ చేశారు. మొత్తం ఈ ఏటీవీ ప్రాజెక్టుకు 2.9 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని తొలుత అంచనా వేశారు. ఇప్పటి వరకు ప్రపంచంలో అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా, ఇంగ్లండ్ దేశాలే అణుజలాంతర్గాములు కలిగి ఉన్నాయి. అరిహంత్ న్యూక్లియర్ సబ్‌మెరైన్ ప్రారంభంతో వీటి సరసన ఆరో దేశంగా భారత్ చేరింది.

లగ్జరీ.. జూబ్లీహిల్సే మరి..

- హై ఎండ్ షోరూమ్‌లు, ప్రముఖుల ఇళ్లకు కేరాఫ్ ప్రాంతం
- 'గ్రేటర్'లో లగ్జరీకి సింబల్‌గా జూబ్లీహిల్స్ రోడ్ నం. 36
- 100 వరకు బహుళ జాతి కంపెనీల స్టోర్లు, మాల్‌లు
- అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్ సర్వేలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: లగ్జరీ నివాసాలు... హై ఎండ్ షోరూమ్‌లు... నిత్యావసర సరుకులు.. గృహోపకరణ వస్తువులు.. బ్రాండెడ్ దుస్తులు... వాహనాలు... గుండు సూది నుంచి బెంజ్ కార్ల వరకు సంపన్నుల చిరునామాగా నిలుస్తోందీ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్. ఇందులోనూ జూబ్లీహిల్స్ రోడ్ నం.36 దేశంలోనే లగ్జరీకి సింబల్‌గా నిలుస్తోంది. దేశంలోని మెట్రో నగరాల్లో హైఫై ప్రాంతాలను గుర్తించేందుకు అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్ సంస్థ తాజాగా ఆన్‌లైన్ సర్వే నిర్వహించింది. ఇందులో ముంబైలోని పోవాయ్, బ్రీచ్ క్యాండీ ప్రాంతాలు తొలిస్థానంలో నిలిచాయి. ఆ తర్వాత ఢిల్లీలోని మెహర్‌చంద్ మార్కెట్.. రెండో, బెంగళూరులోని ఇందిరానగర్.. మూడో, గుర్గావ్‌లోని గలేరియా మార్కెట్.. నాల్గో స్థానంతోపాటు.. జూబ్లీహిల్స్ రోడ్ నం.36 ఐదో స్థానంలో నిలిచింది.

చాలా రిచ్ ఏరియా..

జూబ్లీహిల్స్ రోడ్ నం.36 ప్రాంతం సుమారు 5 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. సుమారు 5,000 లగ్జరీ నివాసాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా సుమారు వందకు పైగా హై ఎండ్ రిటైల్‌స్టోర్లు, షోరూమ్‌లు, మాల్‌లు, పబ్‌లు, స్టోర్లున్నాయి. వీటిలో దుస్తులు, ఫ్యాషన్ వస్త్రాలు, నిత్యావసరాలు, కాఫీ షాప్‌లు, షూజ్, వాచెస్, డైమండ్స్, ఆభరణాలు, బెంజ్‌కార్లు, ర్యాప్టర్ వంటి విదేశీ బైక్ షోరూమ్‌లు సహా దేశంలో అన్ని రకాల లిక్కర్, వైన్, రమ్, జిన్ తదితర బ్రాండ్లు ఇక్కడ లభిస్తాయి. అలాగే విదేశీ మద్యం సైతం లభ్యమయ్యే అతిపెద్దదైన టానిక్ లిక్కర్‌మాల్, అతి పెద్ద జూబ్లీ 800 పబ్ సైతం ఇక్కడే ఉండడం విశేషం. ఈ ప్రాంతంలో ఇండిపెండెంట్ ఇళ్లు కొనుగోలు చేయాలంటే కనీసం రూ.25 కోట్లు వెచ్చించాల్సిందేనని రియల్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ ప్రాంతంలో ఒక ఫ్లాట్ అద్దె నెలవారీగా రూ.లక్షకు పైమాటే. వాణిజ్య స్థలాలకు కూడా నెలకు రూ.లక్షల్లో చెల్లించాల్సిందే. ఇక ఈ ప్రాంతంలో చదరపు గజం స్థలం కొనుగోలు చేయాలంటే రూ.2 లక్షలు వెచ్చించక తప్పదు. హైపర్ మార్కెట్లు, జాయింట్ హైపర్ మార్కెట్లు, ఫ్యాషన్ స్టోర్లు, బోటిక్స్‌కు ఈ ప్రాంతం నిలయంగా మారినట్లు సర్వే వెల్లడించింది. ఈ ప్రాంతంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు సహా ఐటీ, బీపీఓ, కేపీఓ రంగాల్లో పని చేస్తున్న సీఈఓలు, ఉన్నతోద్యోగులు, బడా కాంట్రాక్టర్లు, బహుళ జాతి కంపెనీల సీఈఓలు సైతం ఇక్కడ తమ శాశ్వత చిరునామా ఏర్పాటు చేసుకోవడం విశేషం. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాంతంలో హైఎండ్ రిటైల్ మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోందని అనరాక్ రియల్టీ సంస్థ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఢిల్లీకి వైద్య మంత్రి సి. లక్ష్మారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా సమావేశంలో పాల్గొనేందుకు వైద్యారోగ్య మంత్రి సి.లక్ష్మారెడ్డి సోమవారం ఢిల్లీకి బయలుదేరారు. మంగళవారం ఢిల్లీలోని ఎఫ్‌డీఏ భవన్‌లో ఈ సమావేశం జరగనుంది. కేంద్ర మంత్రి జేపీ నడ్డా నేతృత్వంలో జరగనున్న సమావేశానికి అన్ని రాష్ట్రాల వైద్యారోగ్య మంత్రులు హాజరుకానున్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై కేంద్రం దీనిని ఏర్పాటు చేసింది. ఆహార భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సమావేశంలో మంత్రి వివరించనున్నారు.

'అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలి'

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అమలులో ఉన్న విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను సమీక్షించి అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకు వీలుగా రాజ్యాంగ సవరణ చేయాలని సూచించారు. సోమవారం ఢిల్లీలోని ఫరీదాబాద్‌లో జరిగిన ఆలిండియా యాంటీ రిజర్వేషన్ ఫ్రంట్ నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సామాజిక వివక్ష అంతరించినా ఆర్థిక వివక్ష కొనసాగుతున్న నేపథ్యంలో కుల, మత రిజర్వేషన్లను సమీక్షించాలన్నారు. ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.



తండ్రితో కలసి కౌన్సెలింగ్‌కు హాజరైన యాంకర్ ప్రదీప్

భవిష్యత్తులో ఇలాంటి తప్పు చేయను: ప్రదీప్

హైదరాబాద్: తాగి వాహనాలు నడపడం మంచిది కాదని, భవిష్యత్తులో ఇలాంటి తప్పు చేయనని యాంకర్ ప్రదీప్ అన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడిన ప్రదీప్.. తన తండ్రి పాండురంగతో కలసి సోమవారం గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. పోలీసులు తాగి వాహనం నడపడం వల్ల కలిగే అనర్థాలపై డాక్యుమెంటరీలు ప్రదర్శించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తాను పరారీలో ఉన్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని ప్రదీప్ వివరణ ఇచ్చారు. 8న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పోలీసుల నుంచి సందేశం వచ్చిందని.. నిబంధనల ప్రకారం నడుచుకున్నానన్నారు.

శాతవాహనలో నిర్లక్ష్యపు 'పరీక్ష'

డిగ్రీ పరీక్షల్లో మళ్లీ తప్పిదం • తెలుగులో 50% సిలబస్‌లో లేని ప్రశ్నలు

శాతవాహన యూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీలో సోమవారం జరిగిన తెలుగు పరీక్షలో 50 శాతానికి పైగా మార్కులకు సంబంధించిన ప్రశ్నలు సిలబస్‌లో లేనివి వచ్చాయి. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు జనవరి 2న ప్రారంభమయ్యాయి. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం గ్రూపుల్లో మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థులకు సోమవారం సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష జరిగింది. ప్రశ్నపత్రం 80 మార్కులకు ఉండగా దాదాపు 46 మార్కులకు సిలబస్‌లో లేని ప్రశ్నలే ఉన్నాయి. పరీక్ష కేంద్రాల్లోని సిబ్బందికి సమాచారమివ్వగా వారు వర్సిటీ అధికారులకు వివరించారు. తప్పిదాన్ని గుర్తించిన అధికారులు విద్యార్థులకు న్యాయం చేస్తామన్నారు. సిలబస్‌లో లేని ప్రశ్నలకు పూర్తి మార్కులు కలపాలని విద్యార్థులు కోరుతున్నారు.

పదే పదే తప్పులు..

వర్సిటీ ప్రారంభం నుంచి పరీక్షల నిర్వహణలో తప్పులు దొర్లుతూనే ఉన్నాయి. పరీక్షల విభాగం పటిష్టంగా లేకపోవడమే ప్రధాన కారణమని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రశ్నాపత్రం తయారీ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో తప్పులు దొర్లాయని అధికారులు చెబుతున్నారు. గతంలో డిగ్రీ ఫైనలియర్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ ఇంగ్లిష్ మీడియం ప్రశ్నపత్రం ముద్రణనే మరిచారు. సీబీసీఎస్(చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్) పద్ధతిలో జరిగిన ప్రొఫెషనల్ కమ్యూనికేషన్ పరీక్షలో 40 మార్కులకు ప్రశ్నపత్రంలో 2 గంటలకు బదులు 3 గంటలని ముద్రించారు. బీకాం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 80 మార్కులు, ప్రాక్టికల్ 20 మార్కులుంటాయని సిలబస్‌లో నిర్ణయించారు. కానీ, ప్రశ్నాపత్రం 60మార్కులకే ఇచ్చారు. మార్కులు, మెమోల విషయంలోనూ పలుమార్లు తప్పులు దొర్లడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డ సందర్భాలు అనేకం.

న్యాయం చేస్తాం..

డిగ్రీ మొదటి సెమిస్టర్, సెకండ్ లాంగ్వేజ్ తెలుగు విద్యార్థులకు ఇచ్చిన ప్రశ్నపత్రంలో కొన్ని సిలబస్‌లో లేని ప్రశ్నలు వచ్చాయి. ప్రశ్నపత్రం తయారీలో పొరపాటుతో ఇలా జరిగింది. వీసీ అనుమతి తీసుకొని విద్యార్థులు నష్టపోకుండా న్యాయం చేస్తాం.

– వి.రమేశ్, ఎగ్జామినేషన్ కంట్రోలర్

✦ నేడు శ్రీవారి సేవ 'రథసప్తమి' స్లాట్



సాక్షి, తిరుమల: రథసప్తమినాడు తిరుమలకు వచ్చే భక్తులకు సేవలందించేందుకు శ్రీవారి సేవ ''ప్రత్యేక సందర్భాల'' స్లాట్‌ను మంగళవారం టీటీడీ విడుదల చేయనుంది. వైకుంఠ ఏకాదశి, రథసప్తమి, శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయాల్లో ''ప్రత్యేక సందర్భాల' స్లాట్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని భక్తులకు సేవలందించవచ్చు. మంగళవారం సాయంత్రం 7 గంటలకు ఆన్‌లైన్‌లో స్లాట్‌ను అందుబాటులో ఉంచుతారు. ఆసక్తి గలవారు తమ ఆధార్ కార్డు ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఈ స్లాట్ పొందిన భక్తులు ఈ నెల 22న తిరుమలలోని శ్రీవారి సేవాసదన్‌లో రిపోర్టు చేయాలి. "www.tirumala.org"లో 'శ్రీవారి సేవ సర్వీసెస్'అనే లింక్ క్లిక్ చేసి 'శ్రీవారి సేవ', 'స్పెషల్ సేవ'అనే ఆప్షన్ల ద్వారా ఈ స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు.

✦ పరకామణి సేవలో బ్యాంకు ఉద్యోగులు

సాక్షి, తిరుమల: టీటీడీలో హుండీ కానుకలు లెక్కించే పరకామణి సేవలో ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం 7 నుంచి భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. పరకామణి సేవ చేసేందుకు 18 నుంచి 65 ఏళ్లలోపుగల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్ ఉద్యోగులు, దక్షిణాదికి చెందిన జాతీయ బ్యాంకుల ఉద్యోగులు ఇప్పటి వరకు అర్హులు. తాజాగా 18 నుంచి 60 ఏళ్లలోపు గల ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులకు అవకాశం కల్పించారు. తొలిదశలో 30 మందికి అవకాశం కల్పించారు. 3 రోజుల స్లాట్ బుక్ చేసుకున్నవారు గురువారం తిరుమలలోని శ్రీవారి సేవాసదన్‌లో రిపోర్టు చేయాలి. 4 రోజుల స్లాట్ బుక్ చేసుకున్నవారు ఆదివారం రిపోర్టు చేయాలి. మొదట వీడియో ద్వారా పరకామణి సేవపై అవగాహన కల్పిస్తారు. "www.tirumala.org"లో 'శ్రీవారిసేవ సర్వీసెస్'అనే లింక్‌లో 'పరకామణి సేవ'ను క్లిక్ చేసి బుక్ చేసుకోవచ్చు.

✦ పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్ కుమార్ సోమవారం తెలిపారు. నర్సాపూర్–సికింద్రాబాద్ (82711) ప్రత్యేక రైలు ఈ నెల 17న రాత్రి 9.10కి నర్సాపూర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 8.25కు సికింద్రాబాద్ చేరుతుంది. కాకినాడ–సికింద్రాబాద్ (07459) ప్రత్యేక రైలు ఈ నెల 18న రాత్రి 10.30కు కాకినాడలో బయలుదేరి మర్నాడు ఉదయం 9కి సికింద్రాబాద్ చేరుతుంది.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District.; Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.